

'ప్రాజెక్టులన్నీ పూర్తిచేసి శాశ్వత వనరులతో రాష్ట్రానికి ఉజ్వల భవిష్యత్ నిర్మించాలన్నదే నా స్వప్నం'

సత్యమేవ జయతే

సాక్షి


WWW.SAKSHI.COM

పేజీలు: 14+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 8.00 | సంపుటి: 16 | సంచిక: 308

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

SUNDAY Special

ఆదివారం 21-7-2024



రోబోలతో సర్జరీలు తేలిగ్గా..!

ఇప్పుడు రోబోలు కూడా ఎంతో సమర్థంగా శస్త్రచికిత్సలు చేసేస్తున్నాయి. ప్రస్తుతం ఏయే వైద్య విభాగాల్లో రోబోలు సులభంగా శస్త్రచికిత్సలు చేస్తున్నాయో తెలియజేసే కథనం..

- వివరాలు 11లో..



'హ్యాట్రిక్'పై సింధు గురి

2016, 2020లలో రజతం, కాంస్యం సాధించిన సింధు మరో పతకం గెలిస్తే ఒలింపిక్స్‌లో మూడు పతకాలు సాధించిన తొలి భారత ప్లేయర్‌గా నిలుస్తుంది. ఒలింపిక్స్‌లో భారత బ్యాడ్మింటన్ ఆటగాళ్ల అవకాశాలపై ప్రత్యేక కథనం.

- వివరాలు 12లో..



బంగ్లాదేశ్‌లో కనిపిస్తే కాల్చివేత

బంగ్లాదేశ్‌లో రిజర్వేషన్ల వ్యతిరేక హింసాకాండ నేపథ్యంలో కనిపిస్తే కాల్చివేత ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేసింది.

వివరాలు 6లో ▸



యూపీఎస్సీ చైర్మన్ రాజీనామా

యూపీఎస్సీ చైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేశారు. 15 రోజుల క్రితమే రాజీనామా చేసినా రాష్ట్రపతి ఆమోదించలేదు.

వివరాలు 6లో ▸



ఒకే సెంటర్‌లో 85% మందికి అర్హత

గుజరాత్‌లో ఒకే పరీక్షా కేంద్రంలో నీట్ రాసిన అభ్యర్థుల్లో ఏకంగా 85 శాతం మంది అర్హత సాధించినట్లు తెలిసింది.

వివరాలు 6లో ▸



11 లక్షల కరోనా మరణాలు

కరోనా వల్ల భారత్‌లో 2020లో 11 లక్షల మరణాలు సంభవించినట్లు అంతర్జాతీయ అధ్యయనం తెలపగా కేంద్రం కొట్టిపారేసింది.

వివరాలు 6లో ▸

ఒకే 'క్లౌడ్'ను నమ్ముకుంటే ఇంతే..

- ప్రపంచానికి గుణపాఠం నేర్పిన మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ ఔటేజ్
- ఖర్చుల నియంత్రణకు క్లౌడ్ సర్వీసులపై ఆధారపడుతున్న ఐటీ సంస్థలు
- అజూర్ క్లౌడ్ సర్వీస్‌లో అప్‌డేట్‌తో ప్రపంచవ్యాప్తంగా ఆగిపోయిన పలు సేవలు.. ఇప్పుడు ఇతర క్లౌడ్ సర్వీసులపై కంపెనీల దృష్టి
- మ్యాక్, లీనక్స్ వంటి సేవలపైనా దృష్టి పెట్టాలంటున్న నిపుణులు

2 లో

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు

- 62 మందికి స్థానచలనం కల్పిస్తూ ఆదేశాలు
- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా కేరళ కేడర్‌కు చెందిన కృష్ణతేజ
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీగా ఎంవీ శేషగిరిబాబు

2 లో

యావత్ దేశం దృష్టికి ఆటవిక పాలన

24న ఢిల్లీలో నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిద్దాం : వైఎస్ జగన్

మనతో కలసి వచ్చే పార్టీలన్నింటినీ కలుపుకుని పోరాటం చేద్దాం

రాష్ట్రంలో సాగుతున్న దారుణకాండను వారికి వివరిద్దాం

- ఢిల్లీ ధర్నా తర్వాత పార్లమెంటు ఉభయ సభల్లోనూ గళమెత్తాలి.. రాష్ట్రంలోని ఘటనలతో ప్రజల్లో తీవ్ర ఆగ్రహం.. అందుకే రాష్ట్రపతి పాలన విధించాలని డిమాండ్ చేస్తున్నాం
- అదే విషయంపై పార్లమెంటులో నినదించాలి.. అలా చంద్రబాబుకు గట్టి హెచ్చరికలు పంపాలి
- లేకపోతే ఈ దారుణాలకు అడ్డుకట్ట పడదు
- అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన.. గవర్నర్ ప్రసంగం సమయంలో ప్రభుత్వాన్ని నిలదీద్దాం
- ఈ అరాచకాలు ఒక పార్టీకి పరిమితం కావు.. అవి ప్రజాస్వామ్య మనుగడకే పెద్ద దెబ్బ
- లక్షలాది మంది పార్టీ కార్యకర్తలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది
- వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశంలో ఎంపీలకు పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం



“ ఢిల్లీలో ధర్నా కార్యక్రమానికి అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నాం. ఈ పోరాటంలో మనతో వచ్చే అన్ని పార్టీలను కలుపుకుని పోదాం. ధర్నాలో పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్య నాయకులంతా పాల్గొంటారు. రాష్ట్రంలో కొన సాగుతున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్దాం. రాష్ట్రంలో గత 45 రోజులుగా ఏం జరుగుతోందో వివరిద్దాం. ధర్నా అనంతరం పార్టీ ఎంపీలు పార్లమెంట్‌కు హాజరవ్వాలి. రాష్ట్రంలో జరుగుతున్న హత్యలు, దాడులు, ఆస్తుల విధ్వంసంపై ఉభయ సభల్లో గట్టిగా మాట్లాడాలి. ఇక్కడ కూటమి ప్రభుత్వం సాగిస్తున్న దురాగతాలను అందరి దృష్టికి తీసుకెళ్లాలి.


- వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో హత్యలు, హత్యాయత్నాలు, దాడులు, విధ్వంసాలు సృష్టిస్తూ చంద్రబాబు ప్రభుత్వం సాగిస్తున్న దారుణకాండను యావత్ దేశం దృష్టికి తీసుకెళ్లేందుకు ఢిల్లీలో ఈ నెల 24వ తేదీ బుధవారం నిర్వహించే ధర్నాకు అన్ని పార్టీలను ఆహ్వానిస్తున్నామని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చెప్పారు. గత 45 రోజులుగా రాష్ట్రంలో ఏం జరుగుతోందో వివరించి.. ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం చేస్తున్న పోరాటంలో కలిసి వచ్చే అన్ని పార్టీలనూ కలుపుకుపోదామని ఎంపీలకు సూచించారు. ధర్నా అనంతరం పార్లమెంట్‌కు హాజరై రాష్ట్రంలో సాగుతున్న ఆటవిక పాలనపై గళమెత్తాలని దిశానిర్దేశం చేశారు. చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం కక్షతో చేస్తున్న దురాగతాలను తమ సభల్లోని సభ్యులందరి దృష్టికి తీసుకెళ్లాలని ఉద్బోధించారు. పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్న నేపథ్యంలో శనివారం ఆయన తాడేపల్లిలోని క్యాంప్ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ పార్టీ

మిగతా 2వ పేజీలో ▶

ఫీజులు.. గుండెలు గుభిల్లు

దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న విద్యా వ్యయం



- ఐఐటీల్లో 15 ఏళ్లలో ఏడు సార్లు ఫీజులు పెంపు
- ఐఐఎంలలో ఎనిమిది రెట్లు ఫీజులు పెరిగాయి
- నిట్‌లలో 12 ఏళ్లల్లో మూడున్నర రెట్లు ఫీజుల పెంపు
- 2008లో.. ఐఐటీ బాంబేలో బీటెక్ ఫీజు రూ.1,08,000.. ఇప్పుడు రూ.8,00,000
- 2011–12లో ఎన్ఐటీ తిరుచ్చిలో బీటెక్ ఫీజు రూ.1.42 లక్షలు.. ఇప్పుడు రూ.5,02,800
- 2005లో ఐఐఎం–అహ్మదాబాద్‌లో పీజీడీఎం ఫీజు రూ.3.16 లక్షలు.. ఇప్పుడు రూ.25 లక్షలు
- ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలల్లో 8 సార్లు వడ్డన
- ఎంబీబీఎస్‌కు ప్రైవేటు స్టేట్ యూనివర్సిటీల్లో రూ.80 లక్షల నుంచి రూ.1.25 కోట్లు.. అదే డీమ్డ్ యూనివర్సిటీల్లో రూ.1.25 కోట్ల నుంచి రూ.2 కోట్లు
- ఆ కోర్సు, ఈ కోర్సు అనే తేడా లేకుండా అన్నింటికీ బాదుడే బాదుడు.. ఆకాశాన్ని అంటుతున్న ఫీజులను కట్టలేక భారీగా విద్యార్థుల డ్రాపవుట్లు

14 లో

ఒకే 'క్లౌడ్'ను నమ్ముకుంటే ఇంతే..



ప్రపంచానికి గుణపాఠం నేర్పిన మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ ఔటేజ్

- ఖర్చుల నియంత్రణకు క్లౌడ్ సర్వీసులపై ఆధారపడుతున్న ఐటీ సంస్థలు
- అజూర్ క్లౌడ్ సర్వీస్‌లో చిన్న అప్‌డేట్‌తో ప్రపంచవ్యాప్తంగా ఆగిపోయిన పలు సేవలు
- ఇప్పుడు ఇతర క్లౌడ్ సర్వీసులపై కంపెనీల దృష్టి
- మ్యాక్, లీనక్స్ వంటి సేవలపైనా దృష్టిపెట్టాలంటున్న నిపుణులు

సాక్షి, అమరావతి: ఒక్క 'క్లౌడ్'నే నమ్ముకొంటే ఇంతే.. మైక్రోసాఫ్ట్ అజూర్ క్లౌడ్ ప్రపంచానికి నేర్పిన గుణపాఠమిది. ప్రపంచవ్యాప్తంగా ఎన్నో క్లౌడ్ సర్వీసులు ఉన్నప్పటికీ, మైక్రోసాఫ్ట్ అజూర్ పైనే ఆధారపడిన సంస్థలన్నీ ఇప్పుడు చిక్కుల్లో పడ్డాయి. ఐటీ, ఇతర రంగాలకు చెందిన సంస్థలు ఖర్చుల నియంత్రణ కోసం క్లౌడ్ సర్వీసులపై ఆధారపడుతుంటే ఇప్పుడు వాటి ఉనికే ప్రశ్నార్థకం అవుతోంది. తాజాగా మైక్రోసాఫ్ట్‌కు చెందిన క్లౌడ్ సర్వీసెస్ 'అజూర్' సంక్షోభంతో ఐటీ కంపెనీలు వాటి విధానంపై పునరాలోచనలో పడ్డాయి. అజూర్ సైబర్ సెక్యూరిటీలో ఒక అప్‌డేట్ సందర్భంగా తలెత్తిన సమస్యతో ప్రపంచవ్యాప్తంగా విమాన, బ్యాంకింగ్, స్టాక్ ఎక్స్ఛేంజ్, వైద్యం వంటి పలు రంగాల్లో సేవలకు అంతరాయం ఏర్పడిన సంగతి తెలిసిందే. దీంతో ఇప్పుడు ఐటీ కంపెనీలు దీనిపైనే దృష్టి పెట్టాయి. డేటా బ్యాకప్ కోసం క్లౌడ్ సర్వీసులపై ఆధారపడితే వాటిల్లో అజూర్ లాగా సమస్య తలెత్తితే సాధారణ సేవలకు ఎటువంటి అంతరాయం లేకుండా కొనసాగించే ప్రత్యామ్నాయ మార్గాలపై దృష్టిసారిస్తున్నాయి.

ఒక క్లౌడ్‌పైనే ఆధారపడొద్దు

ఐటీ కంపెనీలు డేటా బ్యాకప్ కోసం కేవలం ఒక క్లౌడ్ సర్వీసుపైనే ఆధారపడకుండా అత్యవసర సమయాల కోసం మరో క్లౌడ్ సర్వీసు కూడా ఉండేలా చూసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. మైక్రోసాఫ్ట్ అజూర్ కాకుండా పదికి పైగా ప్రముఖ క్లౌడ్ సర్వీసు సంస్థలు అందుబాటులో ఉన్నాయి. అమెజాన్ ప్రైమ్ వెబ్ సర్వీసెస్, గూగుల్ క్లౌడ్ ప్లాట్‌ఫాంలతో పాటు ఐబీఎం, ఒరాకిల్, ఆలీబాబా, డిజిటల్ ఓషన్, వీఎంవేర్, రెడ్‌హాట్ వంటి అనేక క్లౌడ్ సర్వీసులు ఉన్నాయి. తాజాగా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా అత్యంత చౌకగా క్లౌడ్ సర్వీసులు అందించే కోర్‌వేవ్ వంటి సంస్థలు కూడా మార్కెట్లోకి వస్తున్నాయి. ఇదే సమయంలో ఐటీ సంస్థలు కేవలం మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్ వంటి ఒక ఐటీ వెండర్‌పైనే ఆధారపడకుండా ఇతర ఆపరేటింగ్ సిస్టమ్స్‌పైనా సేవలంగించడానికి సిద్ధంగా ఉండాలని ప్రముఖ సైబర్ సెక్యూరిటీ నిపుణుడు ప్రొఫెసర్ ఓకు ఇస్కు చెబుతున్నారు. మైక్రోసాఫ్ట్‌తో పాటు మ్యాక్, లీనక్స్ వంటి ఐటీ వెండర్స్‌నూ వినియోగించుకోవాలని సూచిస్తున్నారు. ఈ సంక్షోభానికి ప్రధాన కారణమైన మైక్రోసాఫ్ట్‌కు సైబర్ సెక్యూరిటీ అందిస్తున్న క్రౌడ్‌స్ట్రైక్ చేసిన ప్రకటన దీనికి ఊతమిస్తోంది. సైబర్ సెక్యూరిటీలో అప్‌గ్రేడేషన్ సందర్భంగా తలెత్తిన సంక్షోభం కేవలం విండోస్‌కే పరిమితమైందని ఆ ప్రకటన తెలిపింది. మ్యాక్, లీనక్స్ వంటి వాటిపై ఈ ప్రభావం లేదని క్రౌడ్‌స్ట్రైక్ పేర్కొంది. అందువల్ల ఐటీ, ఇతర సంస్థలు ప్రత్యామ్నాయాలనూ అందుబాటులో ఉంచుకోవాల్సిన అవసరం ఉంది.

తప్పించుకున్న రష్యా

మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడేషన్‌లో తలెత్తిన సమస్యలతో ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లో పలు సేవలకు తీవ్ర అంతరాయం కలిగింది. రష్యాలో మాత్రం ఆ ప్రభావం ఎక్కడా కనిపించలేదు. దీనికి ప్రధాన కారణం ఇతర దేశాలపై రష్యా దాడులు. ఈ యుద్ధం కారణంగా అమెరికాకు చెందిన పలు సంస్థలు రష్యాకు తమ ఉత్పత్తుల విక్రయాలపై నిషేధం విధించాయి. అందుకే మైక్రోసాఫ్ట్ సంస్థ కొన్ని సంవత్సరాలు రష్యాకు ఎటువంటి సహకారం అందించలేదు. ఈ సంక్షోభానికి కారణమైన అమెరికాకు చెందిన క్రౌడ్ స్ట్రైక్ సైబర్ సెక్యూరిటీ సంస్థ ఇంత వరకు రష్యాలో అడుగే పెట్టలేదు. దీంతో రష్యా సొంత సాఫ్ట్‌వేర్ పైనే ఆధారపడుతోంది. కాస్పర్‌స్కై వంటి స్వదేశానికి చెందిన సైబర్ సెక్యూరిటీ సేవలనే వినియోగించుకుంటోంది. మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్ అప్‌గ్రేడేషన్‌తో తలెత్తిన సంక్షోభం తమ దేశంలో ఎక్కడా కనిపించలేదని రష్యా ప్రకటించింది.

యావత్ దేశం దృష్టికి ఆటవిక పాలన

▶ మొదటి పేజీ తరువాయి

సమావేశం నిర్వహించారు. సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై పార్టీ ఎంపీలకు దిశా నిర్దేశం చేశారు. 'ఇప్పటికే రాష్ట్రపతి, ప్రధాన మంత్రి, కేంద్ర హోం మంత్రి అపాయింట్‌మెంట్లు కోరాం. అపాయింట్‌మెంట్లు రాగానే.. వారికీ ఇక్కడి పరిస్థితిని వివరిస్తాం. ఢిల్లీలో ధర్నా, నిరసన కార్యక్రమానికి సంబంధించి ఒక్కో ఎంపీ ఒక్కో బాధ్యత తీసుకోవాలి. వెంటనే ఢిల్లీ వెళ్లి ఆ పనుల్లో నిమగ్నం కావాలి. ఇప్పుడు రాష్ట్రంలో జరుగుతున్న ఘటనలు ప్రజల్లో మరింత ఆగ్రహానికి దారి తీస్తున్నాయి. అందుకే మనం రాష్ట్రపతి పాలనకు డిమాండ్ చేస్తున్నాం. అలా చంద్రబాబుకు గట్టిగా హెచ్చరికలు పంపాలి. పోరాటం చేయకపోతే దారుణాలకు అడ్డుకట్ట పడదు. అసెంబ్లీ సమావేశాల్లోనూ నిరసన వ్యక్తం చేస్తాం. ఉభయ సభలను ఉద్దేశించి గవర్నర్ ప్రసంగించే సమయంలో ప్రభుత్వాన్ని నిలదీస్తాం. రాష్ట్రంలో దారుణాలు, అరాచకాలు, ఇక్కడ జరుగుతున్న ఘటనలపై అందరూ గళమెత్తాల్సిన అవసరం ఉంది' అని చెప్పారు. ఈ సమావేశంలో వైఎస్ జగన్ ఇంకా ఏమన్నారంటే..

ప్రజాస్వామ్య మనుగడకే పెను ప్రమాదం

రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఘటనలు ఒక పార్టీకి సంబంధించిన అంశం కాదు. అవి ప్రజాస్వామ్య మనుగడకు పెద్ద దెబ్బ. అందుకే అన్ని పార్టీలకూ రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాల గురించి వివరించాలి. రాష్ట్రంలో శాంతి భద్రతల పరిరక్షణలో ప్రభుత్వం తీవ్ర వైఫల్యం చెందింది. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తల మీద దారుణంగా దాడులు జరుగుతున్నాయి. వినుకొండలో రషీద్ హత్యే ఇందుకు పరాకాష్ట. ఆ హత్య వీడియో దృశ్యాలు.. రాష్ట్రంలో దారుణంగా ఉన్న శాంతి భద్రతల పరిస్థితికి అద్దం పడుతున్నాయి. ప్రజలందరూ చూస్తుండగా, నడిరోడ్డు మీద కత్తితో నరికి చంపిన తీరు అత్యంత అమానుషం. తమ రాజకీయ ప్రత్యర్థులకు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఒక మెసేజ్ పంపడానికి చేసిన ప్రయత్నం ఇది.



వైఎస్సార్‌సీపీ పార్లమెంటరీ సమావేశంలో మాట్లాడుతున్న ఆ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్

రషీద్ హత్యపై వక్రీకరణకు యత్నం

వినుకొండలో దారుణ హత్యకు గురైన పార్టీ కార్యకర్త రషీద్ ఒక వైన్ షాపులో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నాడు. ఆ రాజకీయ హత్య ఘటనను వక్రీకరించడానికి ఎల్లో మీడియా సహాయంతో ప్రభుత్వం నానా ప్రయత్నాలు చేస్తోంది. ఏదో బైక్ కాల్చిన ఘటనకు, ఇప్పుడు జరిగిన దారుణ హత్యకు ముడి పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. నిజానికి ఆ కాలిన బైక్.. వైఎస్సార్‌సీపీ వాళ్లది. ఇందుకు సంబంధించి కేసు కూడా నమోదైంది. దాన్ని కూడా ట్విస్ట్ చేసి, నానా తప్పుడు రాతలు రాస్తున్నారు. అసలు తమ కొడుకు ఏం తప్పు చేశాడని రషీద్ తల్లిదండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. 'సీఎంగా వైఎస్ జగన్ ఉంటే.. అంతా మంచి జరుగుతుందని నమ్మడం మా తప్పు అవుతుందా?' అని వారు ప్రశ్నిస్తున్నారు. హంతకుడైన జిలానీ.. లోకేశ్ పుట్టిన రోజున, స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలను రషీద్ తల్లిదండ్రులు చూపారు. స్థానిక ఎమ్మెల్యేతో కూడా కలిసి దిగిన హంతకుడి ఫొటోలను వారు చూపించారు.

హత్యలు.. హత్యాయత్నాలు.. వేధింపులు.. విధ్వంసాలు

పల్నాడు జిల్లాకు కొత్త ఎస్పీ వచ్చిన రెండు మూడు రోజుల్లోనే హత్యతో సహా పలు ఘటనలు జరిగాయి. సమర్థురాలైన ఎస్పీ మలికా గార్గ్‌ను ఉద్దేశ పూర్వకంగా బదిలీ చేసి తమకు అనుకూలంగా ఉండే ఎస్పీని నియమించుకుని ఈ దారుణాలు చేస్తున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఈ 45 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గురయ్యారు. 300కు పైగా హత్యాయత్నాలు జరిగాయి.

ఎంపీపైనా యథేచ్ఛగా దాడి

తన సొంత పార్లమెంటు నియోజకవర్గంలో, తన తండ్రి ఎమ్మెల్యేగా ఉన్న నియోజకవర్గంలోనే ఎంపీ మిథున్‌రెడ్డిపై దాడులు చేశారు. కావాలనే అక్కడ టీడీపీ మనుషులు ఉండేలా, పోలీసులతో ప్లాన్ చేసి మరీ దాడులు చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్ప ఒక న్యాయవాది. ఎంపీ మిథున్‌రెడ్డి పుంగనూరులో ఆయన ఇంటికి వెళ్తే, రాళ్లతో దాడి చేసి.. వాహనాలు కూడా ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డప్పకు చెందిన వాహనాన్ని దహనం చేశారు. అన్ని తప్పులు చేసిన వారే, తిరిగి మన పార్టీ వాళ్ల మీద కేసులు పెడుతున్నారు.

టీడీపీ వారి వేధింపులు భరించలేక 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నారు. 560 చోట్ల ప్రైవేటు ఆస్తులు ధ్వంసం చేశారు. ఇళ్లల్లోకి చొరబడుతున్నారు. ఆస్తులు ధ్వంసం చేస్తున్నారు. షాపులను కాల్చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ సానుభూతిపరుల చీనీ చెట్లు నరికేస్తున్నారు. 490 చోట్ల ప్రభుత్వ ఆస్తులు సైతం ధ్వంసం చేశారు. ఇవి కాక 1000కి పైగా దౌర్జన్యాలు, దాడులు జరిగాయి. హత్యలు, దాడులు చేయడానికి టీడీపీ వాళ్లకి లైసెన్స్ ఇచ్చినట్టుగా ఉంది.

ప్రజాస్వామ్యానికి విలువ ఉంటుందా?

రాష్ట్రంలో 15 ఏళ్లుగా వైఎస్సార్‌సీపీ ప్రస్థానం సాగుతోంది. చంద్రబాబు ఆశించినట్టుగా వైఎస్సార్‌సీపీని అణగదొక్కలేరు. ఎవరు అధికారంలో ఉన్నా ఇలాంటి దాడులు మంచివి కావు. అధికారంలో ఉన్న పార్టీ, అధికారంలో లేని పార్టీ మీద దాడులు చేయడం ధర్మమా? ఇలాగైతే ప్రజాస్వామ్యానికి విలువ ఏముంటుంది? ప్రభుత్వాలు చేసే మంచి పనుల ఆధారంగా ఆ పార్టీ పరిస్థితులు ఉంటాయి. గత ఎన్నికల్లో మనం 86 శాతం సీట్లను గెలిచాం. అయినా ఇలాంటి ఘటనలు జరగలేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు, ఓటు వేయని వారికి కూడా ఇంటింటికీ వెళ్లి పథకాలు ఇచ్చాం. దాడులను ఎప్పుడూ ప్రోత్సహించలేదు. ప్రజలందరినీ సమానంగా చూశాం. అందరికీ పారదర్శకంగా సేవలు అందించాం. ప్రజలకిచ్చిన వాగ్దానాలు అమలు కాకపోవడంపై ఎవ్వరూ ప్రశ్నించకూడదన్నదే ఈ ప్రభుత్వ ఉద్దేశం. దీనిపై ఎవరూ నిరసనలు, ధర్నాలు, ఆందోళనలు చేయకూడదన్నదే ప్రభుత్వ ఆలోచన. అందుకే దగ్గరుండి విధ్వంసకాండను ప్రోత్సహిస్తున్నారు. పార్టీకి కార్యకర్తలు చాలా ముఖ్యం. ఎక్కడ కార్యకర్తలకు నష్టం జరిగినా వెంటనే స్పందించడం, వారిని కాపాడుకోవడం మన బాధ్యత. ఆయా కుటుంబాలకు తోడుగా నిలవాలి. కార్యకర్తలందరి తరఫున గట్టిగా నిలబడాలి. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీకి లక్షల మంది కార్యకర్తలు ఉన్నారు. వారిని కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉంది.

ఆ వాహనం కాలం చెల్లిందే

- వైఎస్ జగన్‌కు ప్రభుత్వం కల్పించిన భద్రతలో డొల్లతనం బహిర్గతం
- దాన్ని కప్పిపుచ్చుకునే క్రమంలో అడ్డంగా దొరికిపోయిన టీడీపీ
- చంద్రబాబు పదేళ్లు ఆ వాహనంలోనే ప్రయాణించినట్లు వెల్లడి
- అదే వాహనంలో వేల కిలోమీటర్లు తిరిగినట్లు అంగీకారం
- కనీస మరమ్మతులకు నోచుకోని బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయింపు
- పదే పదే మొరాయించడంతో మరో వాహనంలో వెళ్లిన జగన్

సాక్షి, అమరావతి: అబద్ధాలకు బ్రాండ్ అంబాసిడర్ టీడీపీ అధ్యక్షుడు, సీఎం చంద్రబాబైతే.. దుష్ప్రచారానికి మారుపేరు టీడీపీ అనేది మరోసారి నిరూపితమైంది. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రభుత్వం కల్పించిన భద్రతలో బహిర్గతమైన డొల్లతనాన్ని కప్పిపుచ్చుకోవడానికి పచ్చి అబద్ధాలను అస్త్రాలుగా చేసుకుని, దుష్ప్రచారం చేసే యత్నంలో టీడీపీ అడ్డంగా దొరికిపోయింది. వైఎస్ జగన్‌కు కేటాయించిన బుల్లెట్ ప్రూఫ్ వాహనం(ఏపీ 39పీ 0014) పాతదేనని అంగీకరించడం ద్వారా తన నకిలీ బతుకును బయటపెట్టుకుంది. ఆ వాహనంలో పదేళ్లు చంద్రబాబు ప్రయాణించారని.. రాష్ట్రవ్యాప్తంగా వేల కిలోమీటర్లు తిరిగారని 'ఎక్స్' (ట్విట్టర్)లో ఆ పార్టీ అధికారికంగా వెల్లడించింది. కాలం చెల్లిన ఆ వాహనానికి కనీసం మరమ్మతులు చేయకుండా వైఎస్ జగన్‌కు కేటాయించింది. వినుకొండలో నడిరోడ్డుపై ప్రజలందరూ చూస్తుండగానే వైఎస్సార్‌సీపీ కార్యకర్త రషీద్‌ను టీడీపీ కార్యకర్త జిలానీ కత్తితో అత్యంత పాశవికంగా నరికి నరికి చంపారు. ఈ నేపథ్యంలో రషీద్ కుటుంబాన్ని పరామర్శించేందుకు శుక్రవారం ఆ బుల్లెట్ ప్రూఫ్ వాహనంలోనే తాడేపల్లి నుంచి వినుకొండకు వైఎస్ జగన్ బయలుదేరారు. అత్యంత పాతది.. పైగా మరమ్మతులు చేయకపోవడంతో ఆ వాహనం పదే పదే మొరాయించింది. దాంతో మరో వాహనంలో వైఎస్ జగన్ వినుకొండ చేరుకున్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌కు జడ్ ప్లస్ భద్రత ఉంది. జడ్ ప్లస్ భద్రత ఉన్న వారికి ఎవరికైనా కండీషన్‌లో ఉండే బుల్లెట్ ప్రూఫ్ వాహనం కేటాయించాలన్నది నిబంధన. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు.. జడ్ ప్లస్ భద్రత ఉన్న అప్పటి ప్రతిపక్ష నేత చంద్రబాబుకు కండీషన్‌లో ఉన్న బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కేటాయించింది. కానీ.. చంద్రబాబు ప్రభుత్వం తద్భిన్నంగా వైఎస్ జగన్‌కు కాలం చెల్లిన బుల్లెట్ ప్రూఫ్ వాహనాన్ని కేటాయించింది. పదేళ్లపాటు లక్షల కిలో మీటర్లు తిరిగిన ఆ వాహనానికి టీడీపీ సర్కార్ కనీసం మరమ్మతులు కూడా చేయించలేదు. వైఎస్ జగన్‌పై కక్ష సాధింపు చర్యల్లో భాగంగానే టీడీపీ ప్రభుత్వం ఇలా వ్యవహరించిందని స్పష్టమవుతోంది.



పగిలిపోయి ఉన్న కారు సిగ్నల్ లైట్



చంద్రబాబు ఇదే కారులో పదేళ్లపాటు ప్రయాణించారంటూ ఎక్స్‌లో టీడీపీ అధికారిక పోస్ట్

కర్ణాటక నుంచి భారీగా అక్రమ మద్యం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: రాష్ట్రంలో పలువురు అధికార పార్టీ ఎమ్మెల్యేలే లిక్కర్ మాఫియాలా చెలరేగుతున్నారు. కర్ణాటక, గోవా నుంచి మద్యాన్ని లారీలు, కంటైనర్లలో తెప్పించి గ్రామ గ్రామాన విక్రయిస్తున్నారు. గత నెల రోజుల్లో భారీ మొత్తంలో మద్యాన్ని అక్రమంగా దిగుమతి చేసుకొని, కాసుల పంట పండించుకుంటున్నారు. భారీ మొత్తంలో ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. లారీల నంబర్లు ముందే చెప్పి తనిఖీ చేయొద్దని హుకుం జారీ చేయడంతో పోలీసులు ఆ లారీలను వదిలేస్తున్నారు. దీంతో అక్రమ మద్యం నిరాఘాటంగా రాష్ట్రంలోకి వచ్చేస్తోంది. కర్నూలులోని ఆళ్లగడ్డ, పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు సహా పలు నియోజకవర్గాలకు కర్ణాటక, గోవా మద్యం సరఫరా అవుతోంది. ఆళ్లగడ్డలో ఇప్పటికే కర్ణాటక నుంచి 3 లారీల మద్యం దిగుమతి అయింది. జిల్లా నుంచి ఇతర జిల్లాలకూ సరఫరా చేస్తున్నట్లు సమాచారం. ఈ అక్రమ మద్యం దందాలో టీడీపీకి చెందిన కొందరు మాజీ మంత్రులు, పలువురు ఎమ్మెల్యేలు భాగస్వామ్యమైనట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.

గోవా బ్రూవరేజీ కంపెనీ నుంచి..

కర్నూలు జిల్లాలో మద్యం వ్యాపారంలో ఆరితేరి మంత్రిగా పని చేసిన ఓ నేతకు గోవాలోని ఓ బ్రూవరేజి కంపెనీతో సంబంధాలు ఉన్నాయి. 2014 డిసెంబర్‌లో టీడీపీ ప్రభుత్వం ఉండగానే గోవా నుంచి కర్నూలు జిల్లాకు వెళుతున్న మద్యం కంటైనర్‌ను గుత్తి ఎక్సైజ్ అధికారులు సీజ్ చేశారు. ఈ వ్యవహారంలో ముగ్గురిని అరెస్టు కూడా చేశారు. ఈ కేసు విచారణలో భాగంగా గోవాకు వెళ్లి అక్కడి బ్రూవరీని పరిశీలిస్తే నకిలీ మద్యం తయారు చేస్తున్నారని స్పష్టమైంది. అప్పట్లో మంత్రి ప్రమేయంతో ఈ కేసును నీరుగార్చారు. ఇప్పుడు మళ్లీ అధికారం దక్కడంతో అక్కడి బ్రూవరేజీ కంపెనీ నుంచి తిరిగి మద్యం సరఫరా మొదలైంది. ఇప్పటికే కర్నూలు జిల్లాకు రెండు, తెలంగాణ మహబూబ్‌నగర్ జిల్లాకు ఒక కంటైనర్ మద్యం వచ్చినట్లు సమాచారం.



కర్నూలు నగరంలోని ప్రభుత్వ వైన్‌షాప్ పక్కనే మద్యం తాగుతున్న మందుబాబులు

ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వాహనాల ద్వారా ఈ మద్యం సరఫరా చేస్తున్నట్లు తెలుస్తోంది.

కర్ణాటక, గోవా లిక్కర్‌తో భారీ ఆదాయం

మన రాష్ట్రంలోని మద్యం ఈఎన్‌ఏ (ఎక్స్‌ట్రా న్యూట్రల్ ఆల్కహాల్) బేస్డ్‌తో తయారవుతుంది. కర్ణాటక, గోవాలో ఆర్‌ఎస్ (రెక్టిఫైడ్ స్పిరిట్) బేస్డ్‌తో తయారవుతుంది. ఈఎన్‌ఏతో పోలిస్తే ఆర్‌ఎస్ బేస్డ్ మద్యం ధర తక్కువ. అందువల్ల కర్ణాటక, గోవా మద్యం తక్కువకు లభిస్తుంది. ఇది ఆరోగ్యానికి కూడా మంచిది కాదు. ఈఎన్‌ఏ మద్యం నాణ్యమైనది. కర్ణాటకలో 90 ఎంఎల్ టెట్రాప్యాకెట్ ధర రూ.45, క్వార్టర్ రూ.90 మాత్రమే. ఇది అక్కడి మద్యం షాపుల్లోని రేటు. నేరుగా బ్రూవరేజెస్ నుంచి తెప్పించుకుంటే మరింత తక్కువకు వస్తుంది. ధర తక్కువ కావడంతో కర్ణాటక, గోవా నుంచి అక్రమంగా మద్యం తెస్తున్నారు. ఇది అక్రమంగా వచ్చేది కావడంతో పన్నులు కూడా ఉండవు. దీంతో టీడీపీ నేతలు తక్కువకు కొని, ఎక్కువకు అమ్ముకొని డబ్బులు దండుకొంటున్నారు.

గ్రామాల్లోనే విచ్చలవిడిగా మందు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గ్రామాల్లో మద్యం నివారించాలని బెల్ట్‌షాపులను రద్దు చేసింది. ఇప్పుడు కూటమి ప్రభుత్వం రావడంతో టీడీపీ నేతలే జిల్లా, మండల, గ్రామ స్థాయి నేతల ద్వారా గ్రామాల్లోనే బెల్టు షాపులు ఏర్పాటు చేసి మద్యం అమ్మేస్తున్నారు. మద్యం దుకాణాలు ఉన్న చోట సిటింగ్‌కు కూడా అనధికారికంగా అనుమతి ఇచ్చి, అక్కడా అక్రమ మద్యాన్నే తక్కువ ధరకు అమ్ముతున్నారు.

భారీగా ఐఏఎస్‌ల బదిలీలు..

62 మందికి స్థానచలనం కల్పిస్తూ ఆదేశాలు

- పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా కేరళ కేడర్‌కు చెందిన కృష్ణతేజ
- స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ ఐజీగా ఎంవీ శేషగిరిబాబు
- సీఎస్ నీరబ్‌కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో 62 మంది ఐఏఎస్‌లను బదిలీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. కేరళ కేడర్‌కు చెందిన మైలవరపు కృష్ణతేజను పంచాయతీరాజ్–గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌గా నియమించారు. స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ ఇన్‌స్పెక్టర్ జనరల్‌గా ఎంవీ శేషగిరిబాబు, మైనార్టీ సంక్షేమ శాఖ కమిషనర్‌గా సీహెచ్ శ్రీధర్‌బాబును నియమించారు. మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ వీసీఎండీగా శ్రీధర్‌బాబుకు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగించారు. సెర్ప్ సీఈఓగా జి. వీరపాండియన్, పబ్లిక్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ డైరెక్టర్‌గా సీహెచ్ హరికిరణ్‌ను నియమించారు. నేషనల్ హెల్త్ మిషన్ ఎండీగా సీహెచ్ హరికిరణ్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలను అప్పగించారు. బదిలీల పూర్తి వివరాలు ఇవీ..

పేరు	ప్రస్తుత స్థానం	బదిలీ స్థానం
వీఆర్‌కే తేజ మైలవరపు	డిప్యుటేషన్	డైరెక్టర్, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి
సీహెచ్ శ్రీధర్	వెయిటింగ్	కమిషనర్, మైనార్టీ వెల్ఫేర్, వీసీఎండీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్
ఎంవీ శేషగిరిబాబు	కమిషనర్, కార్మిక శాఖ	ఐజీ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్
జి. రేఖారాణి	కార్యదర్శి, పబ్లిక్ ఎంటర్‌ప్రైజెస్	కమిషనర్, జౌళి శాఖ
సీహెచ్ హరికిరణ్	వెయిటింగ్	డైరెక్టర్, ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ, వీసీఎండీ ఎన్‌హెచ్‌ఎం
జి. వీరపాండియన్	ఎండీ, పౌరసరఫరాల కార్పొరేషన్	సీఈఓ, సెర్ప్
ఎం. హరినారాయణ్	వెయిటింగ్	డైరెక్టర్, మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్
ఎల్ఎస్ బాలాజీరావు	వెయిటింగ్	డైరెక్టర్, సర్వే, సెటిల్‌మెంట్స్, ల్యాండ్ రికార్డ్స్
ఎ. మల్లికార్జున	వెయిటింగ్	డైరెక్టర్, బీసీ వెల్ఫేర్, వీసీఎండీ బీసీ కోఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్
ప్రసన్న వెంకటేష్	వెయిటింగ్	కార్యదర్శి, సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలు
పీఎస్ గిరీశా	ఎండీ, హౌసింగ్ కార్పొరేషన్	వీసీఎండీ పౌరసరఫరాల కార్పొరేషన్
మంజీర్ జిలానీ	వెయిటింగ్	ఎండీ, మార్క్‌ఫెడ్, వీసీఎండీ, శాప్
కృతికా శుక్లా	వెయిటింగ్	డైరెక్టర్, ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డు, కార్యదర్శి ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్
పి. రవి సుభాష్	వెయిటింగ్	చైర్మన్, ఎండీ సీపీడీసీఎల్
జి.లక్ష్మీషా	సీఈఓ, ఎన్టీఆర్ వైద్యసేవ	ఎండీ, ఏపీఎంఎస్ఐడీసీ
వేణుగోపాల్‌రెడ్డి	వెయిటింగ్	డైరెక్టర్, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం
పి. రాజాబాబు	ఎండీ, స్కిల్ డెవలప్‌మెంట్	ఎండీ, హౌసింగ్
నిషాంత్ కుమార్	వెయిటింగ్	డైరెక్టర్, ఎక్సైజ్
జీసీ కిశోర్‌కుమార్	--	ఎండీ, క్లీన్ కృష్ణా, గోదావరి కెనాల్స్
ఎం. విజయ సునీత	వెయిటింగ్	ఎండీ, అగ్రికల్చర్ మార్కెటింగ్
కె. శ్రీనివాసులు	వెయిటింగ్	డైరెక్టర్, హార్టికల్చర్
బి. లావణ్యవేణి	జేసీ, ఏలూరు	డైరెక్టర్, సాంఘిక సంక్షేమం
ఎం. అభిషిక్త్ కిశోర్	వెయిటింగ్	ఎండీ, ఏపీఐఐసీ, వీసీ ఎండీ ఏపీటీడీసీ
ఏ. సిరి	స్పెషల్ కమిషనర్,	స్వామిత్వ డైరెక్టర్, సెకండరీ హెల్త్, ఎండీ ఏపీ సాక్స్
ఎస్. రామసుందర్‌రెడ్డి	జేసీ కాకినాడ	కమిషనర్, ఆర్‌ఆర్, సీఏడీఏ
కీర్తి చేకూరి	కమిషనర్, గుంటూరు కార్పొరేషన్	జేఎండీ, ఏపీ ట్రాన్స్‌కో
జి. గణేష్‌కుమార్	జేసీ, కడప	ఎండీ, స్కిల్ డెవలప్‌మెంట్, టెక్నికల్ ఎడ్యుకేషన్
సంపత్‌కుమార్	జేసీ, ఎన్టీఆర్	కమిషనర్, జీవీఎంసీ
బి. నవ్య	డైరెక్టర్, ఎంప్లాయిమెంట్	డైరెక్టర్, గిరిజన సంక్షేమం
కె. దినేష్‌కుమార్	కమిషనర్, రాజమండ్రి కార్పొరేషన్	కమిషనర్, గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్
ధ్యానచంద్ర	జేసీ, తిరుపతి	కమిషనర్, విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్
ప్రవీణ్ ఆదిత్య	జేసీ, పశ్చిమ గోదావరి	సీఈఓ, ఏపీ మారిటైమ్ బోర్డు, ఎండీ ఏపీఎస్ఎఫ్ఎల్
నిషాంతి	జాయింట్ సెక్రటరీ, సీసీఎల్ఏ	జేసీ, అంబేద్కర్ కోనసీమ
హిమాంశు కౌశిక్	అడిషనల్ రెసిడెంట్ కమిషనర్, ఏపీ భవన్	జేసీ, తూర్పు గోదావరి
భార్గవ్ తేజ	కమిషనర్, కర్నూలు కార్పొరేషన్	జేసీ, గుంటూరు
ఎన్. మౌర్య	జేసీ, కర్నూలు	కమిషనర్, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్
ఎస్ఎన్ అజయ్‌కుమార్	--	జేఎస్, సీసీఎల్ఏ
జీఎస్ ధనుంజయ్	పీఓ, రంపచోడవరం ఐటీడీఏ	జేసీ, పల్నాడు
కల్పనాకుమారి	వెయిటింగ్	ఎండీ, గిరిజన సహకార కార్పొరేషన్
కేతన్ గార్గ్	జేసీ, అనంతపురం	కమిషనర్, రాజమహేంద్రవరం మున్సిపల్ కార్పొరేషన్
ఆర్. గోవిందరావు	ఏడీ, సర్వే సెటిల్‌మెంట్స్	జేసీ, కాకినాడ
తేజ్ భరత్	--	కమిషనర్, కడప మున్సిపల్ కార్పొరేషన్
జీఎస్ఎస్ ప్రవీణ్‌చంద్	--	అడిషనల్ కమిషనర్, సీఆర్‌డీఏ
భావన	జేసీ, ఏఎస్ఆర్	కమిషనర్, కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్
ఎం. నవీన్	జేసీ, శ్రీకాకుళం	అడిషనల్ కమిషనర్, సీఆర్‌డీఏ
సి. విష్ణుచరణ్	పీఓ, పార్వతీపురం ఐటీడీఏ	జేసీ, నంద్యాల
నిధి మీనా	డైరెక్టర్, వయోజన విద్య	జేసీ, ఎన్టీఆర్ జిల్లా
కె. సింహాచలం	--	పీఓ, రంపచోడవరం ఐటీడీఏ
శుభం భన్సాల్	పీఓ, సీతంపేట ఐటీడీఏ	జేసీ, తిరుపతి
ఎం. సూర్యతేజ	--	కమిషనర్, నెల్లూరు మున్సిపల్ కార్పొరేషన్
టి. రాహుల్‌కుమార్ రెడ్డి	--	పీఓ, సీతంపేట ఐటీడీఏ
నూరుల్ క్వామర్	సబ్ కలెక్టర్, టెక్కలి	డిప్యూటీ సెక్రటరీ, ఆర్థిక శాఖ
ఫర్మాన్ అహ్మద్ ఖాన్	జేసీ, అన్నమయ్య	జేసీ, శ్రీకాకుళం
అదితిసింగ్	--	జేసీ, కడప
సేధు మాధవన్	జేసీ, నెల్లూరు	పీఓ, పార్వతీపురం ఐటీడీఏ
పి. ధాత్రిరెడ్డి	సబ్ కలెక్టర్ పాడేరు	జేసీ, ఏలూరు
ఆదర్శ్ రాజేంద్రన్	సీఈఓ, ఎంఎస్ఎంఈ కార్పొరేషన్	జేసీ, అన్నమయ్య
అభిషేక్ గౌడ	ఏడీ, గ్రామవార్డు సచివాలయాలు	జేసీ, ఏఎస్ఆర్
వై. మేఘా స్వరూప్	కమిషనర్, అనంతపురం	సబ్ కలెక్టర్, మదనపల్లె
డబ్ల్యూ నదియా దేవి	సీఈఓ, జెడ్పీ, అనంతపురం	సబ్‌కలెక్టర్, రాజంపేట
రామకృష్ణ	ఐజీ, స్టాంప్స్ రిజిస్ట్రేషన్స్	--
జి. శేఖర్‌బాబు	ఎండీ, మార్క్‌ఫెడ్	--

ప్రభుత్వం వద్ద డబ్బుల్లేవ్

కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్



గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం వద్ద డబ్బులు లేవని టీడీపీ నేత, కేంద్ర వ్యవసాయ, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ చెప్పారు. శనివారం గుంటూరులోని కలెక్టరేట్‌లో ఆయన సమీక్ష నిర్వహించారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వానికి సమయం ఇవ్వాలని.. సంపద సృష్టించి అభివృద్ధి చేస్తామని చెప్పారు. ఆ దిశగా కేంద్ర ప్రభుత్వంతో సమన్వయం చేసుకుంటూ ముందుకు వెళ్తున్నట్లు తెలిపారు. వినుకొండలో వ్యక్తిగత కారణాలతో హత్య జరిగిందన్నారు. దీనిని రాజకీయం చేసేందుకు జగన్ రోడ్డెక్కారని ఆరోపించారు. ఆయన రోడ్డు మీద తిరిగిన ప్రతి నిమిషం ఈ రాష్ట్రానికి నష్టం జరుగుతోందని.. అభివృద్ధి వెనక్కి వెళ్లిపోతుందంటూ విమర్శించారు. వైఎస్ జగన్ ఢిల్లీలో చేస్తానంటున్న ధర్నా వల్ల మరింత నష్టం వాటిల్లుతుందన్నారు. ఇప్పటికే జగన్ చేసిన నిర్వాకాల వల్ల ఏపీ గురించి ఢిల్లీలో దారుణంగా మాట్లాడుతున్నారంటూ మంత్రి చెప్పుకొచ్చారు. కాగా, గుంటూరు జీజీహెచ్‌లో ఫిర్యాదుల కోసం ఒక ప్రత్యేక విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఆ ఫిర్యాదులను కలెక్టర్ ఒక్కరే చూసి పరిష్కరించే విధంగా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

పిల్లలకు ఇబ్బంది కలిగితే ఉపేక్షించం : సవిత

సాక్షి, అమరావతి: బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఉంటున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవడంలో ఉపేక్షించబోనని బీసీ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత హెచ్చరించారు. ఈ మేరకు మంత్రి కార్యాలయం శనివారం ఓ ప్రకటన విడుదల చేసింది. వర్షాల కారణంగా వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని, తక్షణమే హాస్టళ్లలో మెరుగైన సదుపాయాలు కల్పించాలని అధికారుల్ని ఆదేశించారు.

■ జలపాతం.. ప్రకృతి ప్రేమికుల పరవశం



పల్నాడు జిల్లా మాచర్ల మండలంలోని ఎత్తిపోతల జలపాతం ప్రకృతి ప్రేమికులను పరవశింపజేస్తోంది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలతో 70 అడుగుల ఎత్తు నుంచి జాలువారుతున్న నీటిధారలు అబ్బురపరుస్తున్నాయి. కొన్ని నెలలుగా నీరులేక వెలవెలబోయిన ఎత్తిపోతల ఇప్పుడుపర్యాటకుల రాకతో సందడిగా మారింది.

– విజయపురిసౌత్

■ నిశ్శబ్ద సంద్రం



నిత్యం అలల ఘోషతో ఎగసిపడే తిరుపతి జిల్లా వాకాడు మండలంలోని సముద్ర తీరంలో రెండు రోజులుగా నిశ్శబ్దం రాజ్యమేలుతోంది. సాధారణంగా బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిన సమయంలో సముద్రంలో అలల శబ్దం తీవ్రంగా ఉంటుంది. ఆ సమయంలో వేటకు వెళ్లడానికి కూడా మత్స్యకారులు భయపడతారు. అలాంటిది ద్రోణి కొనసాగుతున్నప్పటికీ తూపిలిపాళెం గ్రామంలో సముద్రం ప్రశాంతంగా ఉండటంపై మత్స్యకారులు పలు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. గతంలో కూడా ఇదే మాదిరి నాలుగు రోజుల పాటు సముద్రం ప్రశాంతంగా ఉండి ఒక్కసారిగా ఉగ్రరూపం దాల్చి సునామీ రూపంలో ముంచేసిందని గుర్తు చేసుకుని భయంతో వణికిపోతున్నారు.

– వాకాడు (తిరుపతి జిల్లా)

వైభవంగా సింహాచలం గిరి ప్రదక్షిణ

తొలిపావంచా నుంచి ప్రారంభం

32 కి.మీ మేర నడిచిన లక్షలాది మంది భక్తులు



రథయాత్రలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న భక్తులు

సాక్షి, విశాఖపట్నం: సింహాచలం గిరి ప్రదక్షిణ శనివారం అంగరంగ వైభవంగా జరిగింది. శ్రీవరాహలక్ష్మీనృసింహ స్వామిని ప్రసన్నం చేసుకునేందుకు లక్షలాది మంది భక్తులు పోటెత్తారు. సంప్రదాయం ప్రకారం సింహగిరి దిగువన ఉన్న తొలి పావంచా వద్ద తెల్లవారుజామున నాలుగు గంటలకు ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోక్‌గజపతిరాజు, సింహాచలం దేవస్థానం ఈవో శ్రీనివాసమూర్తి కొబ్బరికాయ కొట్టి ప్రచార రథయాత్రను ప్రారంభించారు. సింహాచలం నుంచి బీఆర్‌టీఎస్ రోడ్డు మీదుగా హనుమంతవాక జంక్షన్, తెన్నేటి పార్కు, ఎంవీపీ డబుల్ రోడ్డు, సీతమ్మధార, మాధవధార, ఎన్ఏడీ జంక్షన్, గోపాలపట్నం, బుచ్చిరాజుపాలెం, ప్రహ్లాదపురం మీదుగా భక్తులు తిరిగి సింహాచలం దేవస్థానానికి చేరుకున్నారు. మొత్తం 32 కిలోమీటర్ల మేర ప్రదక్షిణ చేసిన అనంతరం.. వరాహ లక్ష్మీనృసింహ స్వామిని దర్శనం చేసుకున్నారు. విశాఖ వాసులతో పాటు చుట్టు పక్కల జిల్లాలు, ఒడిశా, తెలంగాణ, పశ్చిమబెంగాల్ నుంచి కూడా భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. జిల్లా కలెక్టర్ హరేందిర ప్రసాద్, సీపీ శంఖబ్రత బాగ్చీతో కలిసి ఏర్పాట్లు పర్యవేక్షించారు. 2600 మంది పోలీసులతో బందోబస్తు నిర్వహించారు.

నేడు ఆషాఢ పౌర్ణమి

గిరి ప్రదక్షిణ అనంతరం ఆదివారం ఆషాఢ పౌర్ణమి సందర్భంగా సింహాద్రి అప్పన్నని లక్షలాది మంది దర్శించుకోనున్నారు. స్వామి వారి దర్శనం సులభంగా జరిగేందుకు వీలుగా ప్రస్తుతం ఉన్న క్యూ లైన్లకు అదనపు క్యూ లైన్లను కొండపైన ఉన్న బస్టాండ్ నుంచి ప్రారంభమయ్యేలా ఏర్పాటు చేశారు. ఆదివారం ఆర్జిత సేవల్ని రద్దు చేసిన దేవస్థానం.. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ, సాయంత్రం 5.30 నుంచి రాత్రి 8.30 గంటల వరకూ స్వామి వారి దర్శనానికి అనుమతి వేళలుగా నిర్ణయించింది.

రాజనాలబండ సాక్షిగా..

సత్యప్రమాణాలతో కిటకిటలాడిన క్షేత్రం

బంగారం, నగదు చోరీపై ప్రమాణం చేసిన వలసపల్లె వాసులు

ఇక్కడ ప్రమాణం చేస్తే పోయిన సొమ్ము దొరుకుతుందని నమ్మకం





రాజనాల బండలో ప్రమాణం చేయడానికి సిద్ధమై ఆలయం ముందు బారులు తీరిన వలసపల్లె గ్రామస్తులు, ప్రత్యేక అలంకరణలో ప్రసన్నాంజనేయస్వామి



వలసపల్లె సుమతల దంపతులు, గ్రామస్తులతో కలిసి పంచాయితీ నిర్వహిస్తున్న అర్చకులు

చౌడేపల్లె (చిత్తూరు జిల్లా) : సత్యప్రమాణాలకు నిలయంగా రాజనాలబండ విరాజిల్లుతోంది. సాంకేతిక పరిజ్ఞానం, పోలీసు వ్యవస్థ ఉన్నప్పటికీ చిత్తూరు జిల్లా పరిధిలోని పడమటి ప్రాంతాల వాసులు రాజనాలబండకు వెళ్తే తమకు తప్పక న్యాయం జరుగుతుందని నమ్ముతారు. అక్కడికి వెళ్తే దొంగలు దొరికిపోవడం, చోరీకి గురైన సొత్తు, సొమ్ము భద్రంగా ఇంటికి చేరడమో.. లేదా చోరీచేసిన వారు నేరం అంగీకరించడమో జరుగుతుంది. అందుకే ఈ రాజనాలబండ క్షేత్రంపై ఆ ప్రాంత ప్రజలకు ఎనలేని విశ్వాసం, నమ్మకం. జిల్లాలోని చౌడేపల్లె మండలంలో సత్యప్రమాణాలకు నిలయమైన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం చెంతన ఉన్న రాజనాలబండ శ్రీ ప్రసన్నాంజనేయస్వామి ఆలయం వద్ద శనివారం ప్రమాణాల సందడి నెలకొంది. అన్నమయ్య జిల్లా మదనపల్లె మండలం వలసపల్లెకు చెందిన హనుమంతురెడ్డి, సుమలత దంపతులు ఈ నెల 16వ తేదీన మంగళవారం సాయంత్రం 4 గంటల సమయంలో ఇంటికి తాళాలు వేసి రోజువారీలాగానే ఇంటి ఆవరణలోని బాత్‌రూములో తాళాలు పెట్టి బయటకు వెళ్లారు. అరగంట తర్వాత సుమలత ఇంటికి రాగా.. గేట్లు, ఇంటి తలుపు తెరిచి ఉన్నాయి. దీంతో ఆమె ఇంటి లోపలకు వెళ్లి చూడగా సుమారు 300 గ్రాముల బంగారు నగలు, వెండి 50 గ్రాములు, రూ.1.20 లక్షల నగదు, బీరువాలో దాచిన వస్తువులు చోరీ అయ్యాయని గుర్తించారు. చుట్టుపక్కల ఉన్న వారితో పాటు వీధిలోని వారికి విషయం చెప్పారు. చోరీ ఘటనపై పోలీస్ స్టేషన్‌లో కూడా ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ రాజనాలబండకు వెళ్లాలని, ఇంటికొకరు రావాలని గ్రామంలోని పెద్దమనుషులు తీర్మానించారు. ఆ మేరకు శనివారం 150 కుటుంబాల వారు ఇంటికొకరు రాజనాలబండకు చేరుకున్నారు. మరోమారు అర్చకుల సమక్షంలో పంచాయతీ నిర్వహించి, అనుమానితులపై చర్చించారు. చోరీ గురించి ఎవరికీ తెలియదని తేల్చడంతో బాధితులు ఆలయం వద్ద గల కోనేరులో మునిగి ఆలయం చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణలు చేసి స్వామివారి పాదముద్రికలపై నిలబడి ఒక్కొక్కరు ప్రమాణం చేశారు.

మరో చోరీ ఘటనపై వాయిదా

పుంగనూరు మండలం బర్నేపల్లె గ్రామంలోని చిన్నవెంకటప్పకు చెందిన 30 గ్రాముల బరువుగల నెక్లెస్ 15 రోజుల కిందట చోరీ అయింది. పోలీసులకు ఫిర్యాదు చేసినా ఫలితం లేకపోవడంతో గ్రామస్తుల సూచనల మేరకు ఇంటికి ఒకరు రాజనాలబండకు చేరారు. మరోమారు చోరీ విషయమై పంచాయితీ నిర్వహించారు. వచ్చేవారం వరకు గడువు ఇచ్చి పంపినట్లు అర్చకుడు కృష్ణమూర్తి తెలిపారు.

దళితుడి లాకప్‌డెత్?

ముచ్చుమర్రి బాలిక హత్యాచారం కేసులో కీలక పరిణామం



నంద్యాల ప్రభుత్వాస్పత్రి వద్ద పోలీసుల కాపలా

సాక్షి, నంద్యాల : రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేపిన ముచ్చుమర్రి మైనర్ బాలిక హత్యాచారం కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. పోలీసుల అదుపులో ఉన్న అనుమానితుల్లో ఒక దళిత వ్యక్తి శనివారం లాకప్‌డెత్‌కు గురైనట్లు తెలుస్తోంది.

విచక్షణారహితంగా కొట్టడంతో పాటు థర్డ్ డిగ్రీ ఉపయోగించడంవల్లే అతని ప్రాణాలు పోయినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు.

అంతకుముందు.. మైనర్ బాలిక హత్యాచారం ఘటనతో సంబంధం ఉన్న అనుమానంతో పోలీసులు కొందరిని అదుపులోకి తీసుకుని విచారించారు. వారిచ్చిన సమాచారంతో గురువారం సాయంత్రం మరో ఆరుగురిని నందికొట్కూరు, ముచ్చుమర్రి ప్రాంతంలో అదుపులోకి తీసుకున్నారు. వీరిని మొదట జూపాడు బంగ్లా పోలీస్‌స్టేషన్‌కు తరలించి అక్కడ రెండు గంటల పాటు విచారించినట్లు స్థానికులు చెబుతున్నారు. పోలీసుల దెబ్బలు తాళలేక నిందితులు అరిచిన అరుపులు తమకు వినిపించాయని వారంటున్నారు. అయితే, ఈ విచారణలో నలుగురు వ్యక్తులకు ఈ ఘటనతో సంబంధంలేదని తేలడంతో వారిని వదిలేసి అంబటి హుస్సేన్ అలియాస్ యోహాన్ (36), అంబటి ప్రభుదాస్‌ను తమదైన శైలిలో గట్టిగా విచారించారు. వీరిద్దరినీ మిడుతూరు పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి శుక్రవారం అంతా విపరీతంగా కొట్టినట్లు సమాచారం. ఆ తర్వాత నంద్యాల పట్టణంలోని సీసీఎస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అయితే, హుస్సేన్ మిడుతూరులో మృతిచెందితే నంద్యాల సీసీఎస్‌కు తరలించి ఆ తర్వాత ఆసుపత్రికి తరలించారా? లేక సీసీఎస్ పోలీస్‌స్టేషన్‌లో మృతిచెందిన తర్వాత ఆసుపత్రికి తీసుకెళ్లారా అన్న దానిపై స్పష్టతలేదు.

నోట్లో గుడ్డలు కుక్కి మరీ..

నిజానికి.. హుస్సేన్, ప్రభుదాస్ ఇద్దరూ అన్నదమ్ములు. మైనర్ బాలిక హత్యాచారం కేసులో అభియోగాలు ఎదుర్కొంటున్న నిందితులలో ఒక బాలుడికి వీరు మేనమామ అవుతారని గ్రామస్తులు చెబుతున్నారు. ఘటన జరిగిన తర్వాత నిందితుల్లో ఒకరైన పదో తరగతి బాలుడు ఇచ్చిన సమాచారం మేరకు మృతదేహాన్ని మాయం చేయడంలో హుస్సేన్ ప్రధాన పాత్ర పోషించాడని పోలీసుల విచారణలో తేలినట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో మృతదేహం ఎక్కడ వేశారు.. ఆ సమయంలో ఎవరెవరున్నారు అన్న కోణంలో విచారణ సాగింది. ఈ సందర్భంగా మృతుడిని విచక్షణారహితంగా కొట్టినట్లు బంధువులు ఆరోపిస్తున్నారు. హుస్సేన్ రెండు చేతులు, వేళ్లు, కాళ్లు ఉబ్బిపోయి కనిపిస్తున్నాయి. డొక్క, వీపు భాగంలో గట్టిగా కొట్టిన ఆనవాళ్లు స్పష్టంగా కనిపిస్తున్నాయి. కొట్టే సమయంలో బాధితుడు అరవకుండా నోట్లో గుడ్డ పేలికలు పెట్టినట్లు తెలుస్తోంది. చనిపోయిన తర్వాత మృతుడి నోరు తెరుచుకుని ఉండడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది.

బంధువులతో రాజీ..

ఇక హుస్సేన్ చనిపోయాడన్న సమాచారం తెలుసుకున్న బంధువులు శనివారం ఉదయాన్నే ముచ్చుమర్రి, నందికొట్కూరు నుంచి నంద్యాలకు బయల్దేరారు. మార్గమధ్యంలోనే పోలీసులు వీరిని అడ్డుకుని రహస్య ప్రాంతానికి తరలించారు. అక్కడ లాకప్‌డెత్ విషయంలో రాజీకి ప్రయత్నించినట్లు సమాచారం. వీరితో సంతకం చేయించుకున్న తర్వాత మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించారు. అప్పటివరకు క్యాజువాలిటీలోనే ఉ.6 నుంచి సా.4 వరకు మృతదేహాన్ని ఉంచారు.

ఆయాసంతో చనిపోయాడంట..

ఇక బాధితులతో రాజీ ప్రయత్నం సఫలం కావడంతో జిల్లా ఎస్పీ కార్యాలయం శనివారం రాత్రి ఒక ప్రకటన విడుదల చేసింది. హుస్సేన్‌ను అదుపులోకి తీసుకుని నందికొట్కూర్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్తుండగా నిందితుడు పోలీస్ వాహనం నుంచి దూకి పారిపోయే ప్రయత్నం చేశాడని తెలిపారు. అప్రమత్తమైన పోలీసులు హుస్సేన్‌ను పట్టుకోవడంతో తనకు ఆయాసంగా ఉందని, గుండెనొప్పిగా ఉన్నట్లు పోలీసులకు తెలిపాడని.. దీంతో పోలీసులు అతన్ని నంద్యాల ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారని పేర్కొన్నారు. (నిజానికి.. దగ్గర్లోని నందికొట్కూరు ఆస్పత్రికి తరలించకుండా 60 కి.మీ దూరంలోని నంద్యాలకు తరలించారు.) డాక్టర్లు పరిశీలించి చనిపోయినట్లు నిర్ధారించారని ఆ ప్రకటనలో తెలిపారు. అలాగే, మిడుతూరు పోలీస్‌స్టేషన్‌లో ఈ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్పీ కార్యాలయం ఆ ప్రకటనలో తెలిపింది.

మిడుతూరు నుంచి నంద్యాల సీసీఎస్‌కు అక్కడి నుంచి ఆస్పత్రికి..

ఇక పోలీసులు కొట్టిన దెబ్బలు తట్టుకోలేక శనివారం తెల్లవారుజామున హుస్సేన్ మృతిచెందినట్లు తెలిసింది. కానీ, ప్రభుదాస్ ఎలా ఉన్నాడు? ఎక్కడ ఉన్నాడనే సమాచారం తెలీకపోవడంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళన చెందారు. అంతకుముందు.. హుస్సేన్‌ను హుటాహుటిన నంద్యాల సర్వజన ఆస్పత్రిలోని క్యాజువల్ వార్డుకు తరలించారు. పోలీసులు రోగుల సహాయకులను అక్కడ నుంచి పంపించేసి వార్డులోకి ఎవరూ వెళ్లకుండా కాపలా ఉన్నారు. హుస్సేన్‌ను మిడుతూరు నుంచి నంద్యాల సీసీఎస్ స్టేషన్‌కు అక్కడి నుంచి ప్రభుత్వాస్పత్రికి ఉదయం 5–6 గంటల సమయంలో తీసుకెళ్లినట్లు తెలుస్తోంది. అప్పటి నుంచి నంద్యాల డీఎస్పీ రవీంద్రనాథ్‌రెడ్డితో పాటు ఆరుగురు సీఐలు, నలుగురు ఎస్‌ఐలు దాదాపు 30 మంది కానిస్టేబుళ్లు ఆస్పత్రిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. మీడియా సిబ్బంది ఎవరూ ఆసుపత్రిలోకి రాకుండా అడ్డుకున్నారు. అయినా, మృతుడి ఫొటోలు మీడియాకు లభ్యం కావడంతో వాటిని పోలీసులే దగ్గరుండి మరీ తొలగించారు.

విచారణలో సస్పెండ్ అయిన పోలీసులు?

మైనర్ బాలిక హత్యాచారం ఘటనలో విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలు రావడంతో ఒక సర్కిల్ ఇన్‌స్పెక్టర్, మరో సబ్ ఇన్‌స్పెక్టర్‌ను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. కేసులో మొదటి నుంచి వీరు ఉండడంతో సస్పెండ్ అయిన తర్వాత కూడా వీరు పోలీసు విచారణలో పాల్గొన్నట్లు అత్యంత శ్వసనీయంగా తెలిసింది. అనుమానితులను అదుపులోకి తీసుకున్న తర్వాత విచారణ చేసే సమయంలో వీరిద్దరూ సంఘటన స్థలంలోనే ఉన్నట్లు సమాచారం.

రాజీ కుదిర్చిన టీడీపీ నేత?.. గుట్టుగా అంత్యక్రియలు


మరోవైపు.. లాకప్‌డెత్ కేసులో నియోజకవర్గానికి చెందిన టీడీపీ ప్రజా ప్రతినిధి తండ్రి రాజీ కుదిర్చినట్లు సమాచారం. చనిపోయిన వ్యక్తి కుటుంబానికి ఆర్థిక సాయం చేయడంతో పాటు కుటుంబంలో ఇద్దరికి ఉద్యోగాలిస్తామని చెప్పి రాజీచేసినట్లు జోరుగా ప్రచారం జరుగుతోంది. ఆ నేత ఇచ్చిన హామీ మేరకు హుస్సేన్ మృతిపై బంధువులు ఎలాంటి ఫిర్యాదు చేయలేదని సమాచారం. ఇదిలా ఉంటే.. హుస్సేన్ మృతదేహాన్ని పోలీస్ ఎస్కార్ట్ సాయంతో అంబులెన్స్ ద్వారా రాత్రి ఎనిమిది గంటల సమయంలో నంద్యాల నుంచి పాత ముచ్చుమర్రికి తరలించి అక్కడి శ్మశాన వాటికలో ఉంచారు. కుటుంబ సభ్యులను మాత్రమే అక్కడికి అనుమతిచ్చి అంత్యక్రియలు గుట్టుగా పూర్తిచేయించారు. మృతుడికి తల్లి, ముగ్గురు సోదరులు, ఇద్దరు అక్కలు ఉన్నారు.


తాళం వేసి పోస్టుమార్టం?

మరోవైపు.. మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో హుస్సేన్ మృతదేహాన్ని పోస్టమార్టానికి తరలించారు. సాయంత్రం ఐదు గంటల సమయంలో ప్రొ. డాక్టర్ రాజశేఖర్ దీనిని పూర్తిచేశారు. ఈ గదికి లోపల వైపు తాళం వేసి మరీ ఈ ప్రక్రియను చేపట్టారు. ఇతర సిబ్బంది, మీడియా ప్రతినిధులు ఎవరూ అటువైపు వెళ్లకుండా పోలీసులు అడ్డుకున్నారు. పోస్టుమార్టం ప్రక్రియను వీడియో రికార్డ్ చేశారు. లాకప్‌డెత్ కానప్పుడు తాళంవేసి రహస్యంగా పోస్ట్‌మార్టం చేయించాల్సిన అవసరమేంటని బంధువులు ప్రశ్నిస్తున్నారు. అధికారం అండతో కేసును లాకప్‌డెత్ కాకుండా ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

మా కుమారుడిని ఇంటికి చేర్చండి

- సౌదీ ఎడారిలో చిక్కుకున్న బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా యువకుడు
- ఆహారం, నీరు లేక అనారోగ్యంతో ఇబ్బందులు
- స్వస్థలానికి తీసుకురావాలని తల్లిదండ్రుల వినతి





వీరేంద్రకుమార్.. రోదిస్తున్న తల్లిదండ్రులు, సోదరుడు

అంబాజీపేట: ఉపాధి కోసం సౌదీ వెళ్లిన ఓ యువకుడిని ఏజెంట్ మోసం చేయడంతో ఎడారిలో చిక్కుకుపోయాడు. అధిక ఉష్ణోగ్రతల కారణంగా తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. ప్రభుత్వం జోక్యం చేసుకుని తమ కుమారుడిని తమ ఇంటికి చేర్చాలని అతని తల్లిదండ్రులు కోరుతున్నారు. బాధిత యువకుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం... డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అంబాజీపేట మండలంలోని ఇసుకపూడి మెరకపేటకు చెందిన సరెళ్ల సత్తిరాజు, మరియమ్మ దంపతుల కుమారుడు సరెళ్ల వీరేంద్రకుమార్ ఈ నెల 9వ తేదీన ఏజెంట్, మధ్యవర్తుల సాయంతో ఖతార్‌లో వంట మనిషిగా పనిచేసేందుకు వెళ్లాడు. అతను 10వ తేదీన ఖతార్‌కు చేరగా, అక్కడ వంట మనిషి ఉద్యోగం ఇవ్వలేదు. అతడ్ని ఖతార్ నుంచి ఈ నెల 11 తేదీన సౌదీ అరేబియా పంపించారు. అక్కడ ఎడారిలో ఒంటెలకాపరిగా నియమించారు. భగభగ మండే ఎండ తీవ్రత వల్ల ఎడారిలో ఒంటెలకాపరిగా పని చేస్తున్న వీరేంద్రకుమార్ ఆరోగ్యం దెబ్బతిన్నది. తనకు రక్తపు వాంతులు అవుతున్నాయని, తాగేందుకు నీరు, తినేందుకు ఆహారం దొరకడం లేదని, తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని వీరేంద్రకుమార్ వాట్సాప్ ద్వారా తన తల్లిదండ్రులు సత్తిరాజు, మరియమ్మ, సోదరుడు రవికుమార్‌తోపాటు బంధువులు, స్నేహితులకు తెలియజేశాడు. తన ఆరోగ్యం క్షీణిస్తోందని, వెంటనే స్వగ్రామం తీసుకువెళ్లేందుకు చర్యలు తీసుకోవాలని కన్నీటిపర్యంతమవుతూ వేడుకున్నాడు. దీంతో ఆందోళనకు గురైన తల్లిదండ్రులు స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో ఈ నెల 19న అమరావతిలోని ఏపీ నాన్ రెసిడెంట్ తెలుగు సొసైటీ(ఏపీ ఎన్ఆర్‌టీఎస్) అధికారులను కలిసి సౌదీలో వీరేంద్రకుమార్ పడుతున్న ఇబ్బందులను తెలియజేసి సాయం చేయాలని కోరారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్‌మాధుర్, ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, తహసీల్దార్‌ల దృష్టికి కూడా సమస్యను తీసుకువెళ్లి వీరేంద్రకుమార్‌ను స్వస్థలానికి తీసుకువచ్చేందుకు సహకరించాలని విన్నవించారు.

నాసిరకం బొప్పాయి నారు అమ్ముతున్నా.. పట్టించుకోరా?

ఏపీ కౌలురైతుల సంఘం ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య

సాక్షి, అమరావతి: మంచి దిగుబడులొస్తాయని నమ్మబలికి నాణ్యతలేని విత్తనాలు, నాసిరకం బొప్పాయి నారును విచ్చలవిడిగా విక్రయిస్తూ రైతులను నిలువునా ముంచుతున్న నర్సరీ యాజమాన్యాలు, విత్తన కంపెనీలపై చర్యలు తీసుకోవడంలో ఉద్యాన శాఖాధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారని ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ జమలయ్య ధ్వజమెత్తారు. తక్షణమే నష్టపోయిన ప్రతీ ఎకరాకు ప్రభుత్వం రూ.2లక్షల చొప్పున రైతులకు పరిహారం ఇవ్వాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడతామని జమలయ్య శనివారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. రాయలసీమ జిల్లాల్లోని రైల్వే కోడూరు, రాజంపేట, పీలేరు తదితర ప్రాంతాల్లో పూర్వం నుంచి వాడుతున్న తైవాన్ రెడ్ లేడి 786కి ప్రత్యామ్నాయంగా జి.15, ఎక్సప్ 15 వెరైటీ రకాల వంగడాలు తెగుళ్లను, చీడపీడలను తట్టుకొని మంచి దిగుబడులిస్తాయంటూ నర్సరీ యాజమాన్యాలు చేస్తున్న ప్రచారంతో రైతులు నిలువునా మోసపోతున్నారని పేర్కొన్నారు. పుట్టగొడుగుల్లాగా పుట్టుకొస్తున్న నర్సరీలను రాష్ట్ర ప్రభుత్వం నియంత్రించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని తెలిపారు. నాసిరకం నారువలన నష్టపోయిన రైతులను ఆదుకోవల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు.

క్రిప్టో ట్రేడింగ్ పేరిట మోసం

● తెలంగాణ

సైబర్ నేరగాన్ని అరెస్టు చేసిన సీసీపీఎస్

జోధ్‌పూర్‌లో అరెస్టుచేసి కరీంనగర్ తీసుకొచ్చిన అధికారులు

సాక్షి, హైదరాబాద్: క్రిప్టో ట్రేడింగ్‌లో పెట్టుబడుల పేరిట మోసాలు చేస్తున్న సైబర్ నేరగాన్ని తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో పరిధిలో పనిచేసే సీసీపీఎస్ (సైబర్ క్రైం పోలీస్ స్టేషన్) కరీంనగర్ అధికారులు అరెస్టు చేశారు. పట్టుబడిన నిందితుడిని రాజస్థాన్ జోధ్‌పూర్‌లోని మిలిటరీ ఇంజినీరింగ్ సర్వీసెస్‌లో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న అరుణ్ చౌదరిగా గుర్తించారు. నిందితుడిపై తెలంగాణతోపాటు తమిళనాడు, రాజస్థాన్‌లోనూ పలు సైబర్ కేసులు నమోదైనట్టు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో డైరెక్టర్ శిఖాగోయల్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. వివరాలు.. నిందితుడు అరుణ్‌చౌదరి టెలిగ్రామ్ యాప్‌లో 'ఏజెంట్ రిచర్డ్ ఓఎఫ్‌టీ' ప్రొఫైల్‌తో క్రిప్టో ట్రేడింగ్ చేయాలని కరీంనగర్‌కు చెందిన కృష్ణ గౌడ్‌ను ప్రలోభపెట్టాడు. నిందితుడి మాటలు నమ్మిన కృష్ణగౌడ్ యూపీఐ ద్వారా ఈ ఏడాది ఏప్రిల్ 7 నుంచి 16 వరకు పలు దఫాల్లో నిందితుడి బ్యాంకు అకౌంట్‌కు రూ.1,58,000 పంపాడు. ఆ తర్వాత అరుణ్‌చౌదరి టెలిగ్రామ్ యాప్ నుంచి ప్రొఫైల్‌ను డిలీట్ చేయడంతో తాను మోసపోయినట్టు గుర్తించిన కృష్ణగౌడ్ కరీంనగర్ సీసీపీఎస్‌లో ఫిర్యాదు చేశారు. నిందితుడు అరుణ్‌చౌదరి రాజస్థాన్‌లోని జోధ్‌పూర్‌లో ఉన్నట్టు గుర్తించిన సీసీపీఎస్ అధికారుల ఈనెల 19న అతన్ని అరెస్టు చేసి, రూ.1,58,000 తోపాటు సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. జోధ్‌పూర్ మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చిన అనంతరం ట్రాన్సిట్ వారెంట్‌పై కరీంనగర్‌కు తరలించారు. కరీంనగర్ కోర్టు నిందితుడికి జ్యుడీషియల్ రిమాండ్ విధించింది. నిందితుడిని అరెస్టు చేయడంలో కీలకంగా పనిచేసిన కరీంనగర్ సీసీపీఎస్ ఇన్‌స్పెక్టర్ సునీల్, కేసు దర్యాప్తు పర్యవేక్షించిన డీఎస్పీ నర్సింహారెడ్డిని టీజీ సీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్ అభినందించారు.



పరలోకమునుండి దిగి వచ్చి, లోకమునకు జీవము నిచ్చునది దేవుడనుగ్రహించు ఆహారమై యున్నదని మీతో నిశ్చయముగా చెప్పుచున్నాను.
– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం; దక్షిణాయనం, గ్రీష్మ ఋతువు; ఆషాఢ మాసం; **తిథి:** పౌర్ణమి సా.4.12 వరకు, తదుపరి బహుళ పాడ్యమి; **నక్షత్రం:** ఉత్తరాషాఢ రా.1.52 వరకు, తదుపరి శ్రవణం; **వర్జ్యం:** ఉ.10.13 నుండి 11.47 వరకు, తదుపరి తె.5.43 నుండి 7.16 వరకు (తెల్లవారితే సోమవారం); **దుర్ముహూర్తం:** సా.4.49 నుండి 5.41 వరకు; అమృత ఘడియలు రా.7.34 నుండి 8.56 వరకు; గురు పూర్ణిమ – వ్యాసపూర్ణిమ.

సూర్యోదయం : 5.38
సూర్యాస్తమయం : 6.33
రాహుకాలం : సా.4.30 నుండి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుండి 1.30 వరకు

నిర్మలా సీతారామన్ (ఆర్థిక మంత్రి)

రాయని డైరీ

మాధవ్ శింగరాజు

రెండ్రోజుల్లో బడ్జెట్. పంకజ్ చౌదరి ఇంకా హల్వా గురించే మాట్లాడుతున్నారు! చూస్తుంటే జీవితం పట్ల ఆయన కొత్తగా ఒక దృక్పథాన్ని ఏర్పరుచుకున్నట్లుగా నాకు అనిపిస్తోంది.

"బాగా వండిన హల్వా మానవ జీవితాన్ని రసమయం చేస్తుంది కదా మేడమ్‌జీ..." అంటూ, ఈ ఏడాది బడ్జెట్ విశేషం హల్వానే అన్నట్లు గత వారం రోజులుగా ఆయన నన్ను కీర్తిస్తూ ఉన్నారు. అంతగా హల్వా ఆయనకు నచ్చినట్లుంది.

ఆ రోజు – జూలై 16న, హల్వా సెర్మనీలో ఆయన తన చేతిలోని హల్వాను ఎంతో ప్రియంగా ఒక్కో తునకా నోట్లో వేసుకోవటం గమనించాన్నేను.

"బాగుందా పంకజ్‌జీ, బడ్జెట్ హల్వా" అనేయబోయి, తమాయించుకున్నాను.



ఒకవేళ ఆయన "బాగుంది మేడమ్‌జీ" అని అనుంటే కనుక, అనుబంధ ప్రశ్నగా నేనాయన్ని "మరికొంచెం వడ్డించమంటారా?" అని అడగటం నా కనీస ధర్మం అయ్యేది. అప్పుడాయన... "చాలు మేడమ్‌జీ.. అందరికీ సరిపోవాలి కదా" అని బిడియపడవచ్చు. లేదంటే... "అలాగే మేడమ్‌జీ, మరికొంచెం వడ్డించండి" అనీ అనొచ్చు.

పంకజ్ ఒక్కరికే మరికొంచెం వడ్డించినంత మాత్రాన హల్వాకు వచ్చే కొరత ఏమీ ఉండదు. పైగా పంకజ్ మూడేళ్లుగా ఆర్థికశాఖ సహాయ మంత్రి. మరికొంచెం హల్వాపై ఆయనకు ఆ మాత్రం హక్కు ఎలాగూ ఉంటుంది.

సమస్య ఏమిటంటే, తక్కిన వాళ్లు కూడా ఆయన స్ఫూర్తితో మరికొంచెం అంటూ ముందుకు వస్తే కొంచాన్నే కొంచెం కొంచెంగా అందరికీ సర్దవలసి వస్తుంది. అందుకే నేను "బాగుందా పంకజ్‌జీ, బడ్జెట్ హల్వా..." అని అడగబోయి కూడా ఆగిపోయాను.

హల్వాను తను ఇష్టంగా తింటున్నంత సేపూ నాలో ఇంత సంఘర్షణ జరిగిందని పంకజ్‌కు తెలిసే అవకాశం లేకున్నా... ఆయన అక్కడితో సరిపెట్టుకుని నా వైపు వచ్చారు!

టీమ్‌లోని మిగతా ఆరుగురు మాకు కాస్త దూరంగా నిలబడి ఉన్నారు. సోమనాథన్, అజయ్ సేథ్, తుహిన్ కాంత పాండే, సంజయ్ మల్హోత్రా, వివేక్ జోషీ, అనంత నాగేశ్వరన్... అంతా ఫైనాన్స్ సెక్రెటరీలు, ఎకనమిక్ అడ్వైజర్లు. బడ్జెట్ తయారైంది వాళ్ల చేతుల్లోనే! నా బడ్జెట్ స్పీచ్ డ్రాఫ్ట్‌కి మెరుగులు దిద్దింది సంజయ్ మల్హోత్రా.

"ఈసారి బాగా కుదిరింది మేడమ్‌జీ..." అన్నారు పంకజ్.

"అవును పంకజ్‌జీ! ఈసారి మన మీద చాలా ఎక్స్‌పెక్టేషన్స్ ఉన్నాయి" అన్నాన్నేను.

"మేడమ్‌జీ! ఎక్స్‌పెక్టేషన్స్ బడ్జెట్ మీద కదా ఉంటాయి. హల్వా మీద కూడా ఉంటాయా?" అన్నారు పంకజ్! అప్పుడు గానీ నాకు అర్థం కాలేదు ఆయన బాగా కుదిరింది అని అంటున్నది హల్వా గురించి అని.

"అవును పంకజ్‌జీ... హల్వా బాగా కుదిరింది. బడ్జెట్ కూడా అలా వస్తే బాగుంటుంది కదా..." అన్నాను నవ్వుతూ.

"మీరేదైనా బాగా చేయగలరు మేడమ్‌జీ." అన్నారాయన, నవ్వాన్నేను.

"హల్వాకు గానీ, బడ్జెట్ స్పీచ్ డ్రాఫ్ట్‌కు గానీ ఒక ఫినిషింగ్ టచ్ ఉండాలి పంకజ్‌జీ. అప్పుడు మాత్రమే అవి పూర్తయినట్లు. అంతగా ఇష్టమైంది కదా మీకు హల్వా, ఆ హల్వాకు ఫినిషింగ్ టచ్ ఏమిటో చెప్పండి చూద్దాం?" అన్నాను.


"నేనైతే... హల్వాలో కనిపించే ఆ డ్రైఫ్రూట్స్ పలుకులు అనుకుంటున్నాను మేడమ్‌జీ.." అన్నారాయన.

"సరిగ్గా చెప్పారు. బడ్జెట్ స్పీచ్‌కి కూడా అలాంటి పలుకులే కావాలి. చాణక్యుడివీ, తిరువళ్లువార్‌వీ... నా కోసం కొన్ని పలుకులు వెదకి పెట్టగలరా పంకజ్‌జీ?" అని అడిగాను.

అడిగి వారం కావస్తోంది.

ఆయన అవుననలేదు. కాదనలేదు! ఇవాళొచ్చి... "దేనికైనా ఫినిషింగ్ టచ్ ఇవ్వటం అంత తేలిక కాదేమో కదా మేడమ్‌జీ" అంటున్నారు!!

రాష్ట్రపతి పాలనే శరణ్యం!



జనతంత్రం

వర్ధెల్లి మురళి



"మేం అధికారంలోకి వస్తున్నాం, రాగానే 'అకౌంట్స్' సెటిల్ చేస్తాం. ఒక ఆరు నెలలపాటు మాలో కొందరం ఇదే పని మీద ఉంటాం. అందరి అకౌంట్లూ సెటిల్ చేస్తాం''. ఎన్నికలకు ముందు ఒక తెలుగుదేశం నాయకురాలు టీవీ ఛానల్ ఇంటర్వ్యూలో చెప్పిన మాటలివి. ఇప్పుడా నాయకురాలు హోం మంత్రిగా పని చేస్తున్నారు.

తెలుగుదేశం పార్టీ యువనేత అనేక సభల్లో తన చేతుల్లోని 'రెడ్ బుక్'ను ప్రజలకు చూపెట్టారు. ఈ 'రెడ్ బుక్'లో ప్రత్యర్థుల పేర్లను రాసుకుంటున్నాననీ, అధికారంలోకి రాగానే వారి సంగతి తేల్చేస్తాననీ హెచ్చరికలు జారీ చేశారు. తమ మాట వినని అధికారులకు కూడా ఈ హెచ్చరికలు వర్తిస్తాయనే బెదిరించే ప్రయత్నం చేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఆంధ్రప్రదేశ్ అంతటా యువనేత, 'రెడ్ బుక్' బొమ్మలతో కూడిన హోర్డింగులు ప్రత్యక్షమయ్యాయి. ఆ యువనేత ఇప్పుడు క్యాబినెట్‌లో ఉన్నారు. కీలక నిర్ణయాలన్నీ ఆయనే తీసుకుంటున్నారని సమాచారం.

ఈ రెండు ఉదాహరణలు మచ్చుకు మాత్రమే! తెలుగుదేశం ప్రభుత్వం కక్షపూరిత పాలనా విధానానికి దిగజారిందని చెప్పడానికి ఇటువంటి డజన్లకొద్దీ ఉదాహరణలు ఇవ్వవచ్చు. రాజ్యాంగ వ్యవస్థల్లోని అతి ప్రధాన విభాగమైన ఎగ్జిక్యూటివ్ వ్యవస్థ బాహాటంగానే రాజ్యాంగేతర పాలనా పద్ధతులను ఎంచుకుంటున్నది. పర్యవసానాలు జనజీవితాన్ని భయకంపితం చేస్తున్నాయి.

అధికార పార్టీ కక్షలకూ, కార్పణ్యాలకూ ఆరు వారాల స్వల్పకాలంలోనే 32 మంది వైసీపీ అభిమానులు హతమైనట్టు వార్తలందుతున్నాయి. వినుకొండలోని ఒక ప్రధానమైన సెంటర్‌లో వేలాది మంది ప్రజల సమక్షంలో వైసీపీ కార్యకర్త రషీద్‌ను నరికి చంపిన దృశ్యం రాష్ట్ర ప్రజలకు దిగ్భ్రాంతిని కలిగించింది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పట్టింది. వైసీపీకి అనుకూలంగా ఉండే ఒక దళిత మహిళా రైతును తెలుగుదేశం కార్యకర్త అత్యంత పాశవికంగా ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన దారుణం జరిగిన వారం రోజుల్లోనే రషీద్ దారుణ హత్య జరగడం రాష్ట్ర ప్రజలను కలవరపరుస్తున్నది.

వైసీపీ కార్యకర్తలూ, అభిమానులపై ఈ ఆరు వారాల్లో 305 హత్యాయత్నాలు జరిగినట్టు వివరాలు అందుతున్నాయి. తిరువూరులో ఒక మునిసిపల్ కౌన్సిలర్‌నే రోడ్లపై పరుగెత్తిస్తూ కత్తులతో పొడిచిన వీడియో చిత్రం కూడా కలకలం సృష్టించింది. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడి 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్టు వైసీపీ చెబుతున్నది. దాదాపు నాలుగు వేల కుటుంబాలు సొంత ఊరును వదిలి దూరంగా శరణార్థుల మాదిరిగా తలదాచుకుంటున్నాయి.

వైసీపీ పార్లమెంట్ సభ్యుడు, లోక్‌సభలో ఆ పార్టీ నాయకుడైన మిథున్‌రెడ్డిపై దాడి చేశారు. ఆయన సొంత నియోజకవర్గంలో మాజీ ఎంపీ రెడ్డప్ప ఇంట్లో కూర్చుని మాట్లాడుతున్న సందర్భంలో పథకం ప్రకారం రౌడీ మూకల్ని తరలించి రాళ్ల దాడి చేశారు. ఎంపీ వాహనంతో సహా డజనుకు పైగా వాహనాలకు నిప్పుపెట్టారు. 560 కుటుంబాల ఆస్తులను అధికార పార్టీ మూకలు ధ్వంసం చేశాయి. పరిపాలనా వికేంద్రీకరణకు ఆయువుపట్టు వంటి గ్రామ సచివాలయాలు, ఆర్బీకే సెంటర్లపై వందల సంఖ్యలో దాడులు జరిగాయి. వైఎస్ జగన్ ఆనవాళ్లు కనిపించకూడదన్న కక్షతో వేలాది శిలాఫలకాలను పగులగొట్టారు.

జరిగిన సంఘటనలనూ, వాటి తీవ్రతనూ గమనంలోకి తీసుకుంటే ఈ ఆరు వారాల కాలాన్ని 'బీభత్స పాలన' (reign of terror) గా పరిగణించాలి. ఈ నేపథ్యంలోనే నిన్న రషీద్ కుటుంబ పరామర్శకు వెళ్లిన ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మాట్లాడిన మాటలను అర్థం చేసుకోవాలి. రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీవ్ర భంగం వాటిల్లిన నేపథ్యంలో రాష్ట్రపతి పాలన విధించాలని ఆయన డిమాండ్ చేశారు. బెంగాల్, తమిళనాడుల్లో ఎన్నికల తర్వాత బీజేపీ కార్యకర్తలపై జరిగిన స్వల్ప దాడులకే ఆ రాష్ట్రాలకు కేంద్ర బలగాలను పంపిన మోదీ సర్కార్ ఆంధ్రప్రదేశ్‌లోని తమ కూటమి ప్రభుత్వం బీభత్సపాలన చేస్తున్నా మిన్నకుండటం ద్వంద్వ ప్రమాణాలకు నిదర్శనం.

అధికార పార్టీ కక్షలకూ, కార్పణ్యాలకూ ఆరు వారాల స్వల్పకాలంలోనే 32 మంది వైసీపీ అభిమానులు హతమైనట్టు వార్తలందుతున్నాయి. వినుకొండలోని ఒక ప్రధానమైన సెంటర్‌లో వేలాది మంది ప్రజల సమక్షంలో వైసీపీ కార్యకర్త రషీద్‌ను నరికి చంపిన దృశ్యం రాష్ట్ర ప్రజలకు దిగ్భ్రాంతిని కలిగించింది. రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితులకు అద్దం పట్టింది. వైసీపీకి అనుకూలంగా ఉండే ఒక దళిత మహిళా రైతును తెలుగుదేశం కార్యకర్త అత్యంత పాశవికంగా ట్రాక్టర్‌తో తొక్కించి చంపిన దారుణం జరిగిన వారం రోజుల్లోనే రషీద్ దారుణ హత్య జరగడం రాష్ట్ర ప్రజలను కలవరపరుస్తున్నది.

వైసీపీ కార్యకర్తలూ, అభిమానులపై ఈ ఆరు వారాల్లో 305 హత్యాయత్నాలు జరిగినట్టు వివరాలు అందుతున్నాయి. తిరువూరులో ఒక మునిసిపల్ కౌన్సిలర్‌నే రోడ్లపై పరుగెత్తిస్తూ కత్తులతో పొడిచిన వీడియో చిత్రం కూడా కలకలం సృష్టించింది. అధికార పార్టీ నాయకుల బెదిరింపులకు భయపడి 35 మంది ఆత్మహత్యలు చేసుకున్నట్టు వైసీపీ చెబుతున్నది. దాదాపు నాలుగు వేల కుటుంబాలు సొంత ఊరును వదిలి దూరంగా శరణార్థుల మాదిరిగా తలదాచుకుంటున్నాయి.

ఒకపక్క తెలుగునాట మెజారిటీ మీడియా సంస్థలపై తెలుగుదేశం అనుకూలవర్గ గుత్తాధిపత్యం కొనసాగుతున్నది. మరో పక్క కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏలో తెలుగుదేశం పార్టీ భాగస్వామి. ఈ పరిస్థితుల్లో దేశంలో ఉన్న ప్రజాస్వామ్య మద్దతుదారులందరి దృష్టికీ జరుగుతున్న ఆగడాలను తీసుకురావడం కోసం ఈ బుధవారం ఢిల్లీలో ధర్నా చేయాలని వైసీపీ సంకల్పించింది. రాష్ట్రపతి పాలన అంశాన్ని గత కేంద్ర ప్రభుత్వాలు ఒక రాజకీయ ఆయుధంగా వాడుకున్నందు వల్ల దానిపై ప్రజాస్వామికవాదుల్లో భిన్నాభిప్రాయాలు నెలకొని ఉన్నాయి. ఈ కారణంగా ఆంధ్రప్రదేశ్‌లో నెలకొని ఉన్న యథార్థ పరిస్థితులను జాతీయ స్థాయికి తీసుకొని వెళ్లడం వైసీపీకి అవసరం.

భారత రాజ్యాంగం ఆర్టికల్ 355 ప్రకారం 'విదేశీ దాడుల నుంచీ, అంతర్గత కల్లోలం నుంచీ రాష్ట్రాలను కాపాడే బాధ్యత యూనియన్ ప్రభుత్వానిదే. ఆ రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన పాలన కొనసాగేలా చూడటం కూడా కేంద్రం బాధ్యత'. ఈ ఆర్టికల్‌ను మరింత విశదీకరిస్తే 'రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగానే రాష్ట్రాల ప్రభుత్వాలు పరిపాలించాలి. రాష్ట్రంలోని ప్రతి పౌరుడికీ భద్రత కల్పించడంతోపాటు, అతని ఆత్మగౌరవానికి భంగం కలగకుండా చూడటం కూడా రాష్ట్ర ప్రభుత్వం విధి'. రాష్ట్రాల్లో రాజ్యాంగబద్ధమైన పరిపాలన జరగడం కోసం అవసరాన్ని బట్టి రాష్ట్రపతి పాలన విధించే విశేషాధికారాన్ని ఆర్టికల్ 356 ద్వారా రాష్ట్రపతికి రాజ్యాంగం కట్టబెట్టింది.

రాష్ట్రాల్లో రాజ్యాంగ సూత్రాలకు అనుగుణంగా పరిపాలించడం కుదరని పరిస్థితులు ఏర్పడినట్లయితే ఆర్టికల్ 356 (1) ప్రకారం రాష్ట్రపతి పాలన విధించవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పుడు శాంతిభద్రతల పరిస్థితికి ఏర్పడిన విఘాతం సాధారణమైనది కాదు. జరుగుతున్నవి చెదురుమదురు సంఘటనలు అసలే కావు. సీనియర్ జర్నలిస్టు కృష్ణంరాజు లెక్కగట్టిన వివరాల ప్రకారం శుక్రవారం నాటికే రోజుకు సగటున 130 హింసాత్మక సంఘటనలు జరిగాయి. నెలరోజుల్లో 22 మంది మహిళలు అత్యాచారాలకు గురయ్యారు. ఇందులో నలుగురిని చంపేశారు. అభం శుభం తెలియని చిన్నారులను కూడా చిదిమేశారు. ఒక బాలిక చనిపోయిందని చెబుతున్న పోలీసు యంత్రాంగం ఆమె శవాన్ని కూడా రెండు వారాలు దాటినా గుర్తించలేకపోయింది.

'ఎస్ఆర్ బొమ్మై వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో రాష్ట్రపతి పాలనపై సుప్రీంకోర్టు చరిత్రాత్మక తీర్పును చెప్పింది. రాజకీయ కారణాలతో ఎడాపెడా రాష్ట్రపతి పాలన విధించే సంప్రదాయాలకు చెక్ పెడుతూనే, ఏయే సందర్భాల్లో విధించడం సమర్థనీయమో కూడా రాజ్యాంగ విస్తృత ధర్మాసనం తీర్పు (1994) చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు రాజ్యాంగ మౌలిక స్వరూపానికి విరుద్ధంగా ఉంటే రాష్ట్రపతి పాలన విధించవచ్చని అభిప్రాయపడింది. ఉదాహరణకు సెక్యులరిజం అనే అంశం రాజ్యాంగ మౌలిక స్వరూపంలో భాగం. రాష్ట్ర ప్రభుత్వ చర్యలు సెక్యులరిజాన్ని బలహీనపరిచేవిగా ఉంటే ఆ రాష్ట్ర పరిస్థితులు 356వ అధికరణంలో పేర్కొన్నట్టుగా ఉన్నాయనే భావించాలి.

రాజ్యాంగ పీఠికను రాజ్యాంగ మౌలిక స్వరూపానికి గుర్తుగా భావిస్తారు. ప్రజాస్వామ్యం, సెక్యులరిజంతోపాటు ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం – ఆలోచనా, భావప్రకటన, విశ్వాసం, ఆరాధనా స్వేచ్ఛ – అవకాశాల్లో, హోదాల్లో సమానత్వం – వ్యక్తిగత గౌరవం వంటి అంశాలకు కూడా పీఠిక ప్రాధాన్యమిచ్చింది. ఇందులో దేనికి భంగం కలిగినా రాజ్యాంగ మౌలిక స్వరూపంపై జరిగిన దాడిగానే పరిగణించాలి. భిన్నమైన రాజకీయ అభిప్రాయాలు కలిగి ఉండటాన్ని ప్రస్తుత ఏపీ ప్రభుత్వం నేరంగా పరిగణిస్తున్నది. ప్రతిపక్ష కార్యకర్తలను మోకాళ్లపై కూర్చోబెట్టి చేతులు జోడింపజేసి అధికారపక్షీయులు తమ నాయకునికి జైకొట్టించుకుంటున్నారు. ఇటువంటి వీడియోలు అసంఖ్యాకంగా యూట్యూబ్‌లో కనిపిస్తున్నాయి. ఈ చర్యలు అనైతికమే కాదు రాజ్యాంగ విరుద్ధం కూడా!

రాష్ట్ర ప్రభుత్వాలు ఉద్దేశపూర్వకంగా రాజ్యాంగ విరుద్ధ చర్యలకు పాల్పడడం, హింసను రెచ్చగొట్టడం కూడా రాష్ట్రపతి పాలన విధించడానికి అనువైన చర్యలుగా బొమ్మై కేసులోనే సుప్రీంకోర్టు తేల్చింది. ఉద్దేశపూర్వకంగానే తమ ప్రత్యర్థులపై దాడులు చేస్తామని, 'అకౌంట్లు' సెటిల్ చేస్తామని ఎన్నికల ముందునుంచే తెలుగుదేశం నాయకులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రత్యర్థులపై కక్ష సాధించడమే ధ్యేయంగా 'ఉద్దేశపూర్వకంగా' రెడ్‌బుక్ హోర్డింగులను రాష్ట్రవ్యాపితంగా నెలకొల్పి, తమ పార్టీ కార్యకర్తల హింసాప్రవృత్తిని రెచ్చగొడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తన రాజ్యాంగ విధులను, బాధ్యతలను విస్మరించడం కూడా రాష్ట్రపతి పాలనకు దారితీయాల్సిన పరిస్థితిగానే సర్వోన్నత న్యాయస్థానం పరిగణించింది. ఈ నలభై రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఐదువేల పైచిలుకు హింసాయుత ఘటనల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యతలను విస్మరించింది. ఏ సందర్భంలోనూ పోలీసు యంత్రాంగం స్పందించకపోవడానికి వెనుకనున్న కారణం – రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాలే! ఎంపీ మిథున్‌రెడ్డిని తన నియోజకవర్గంలో పర్యటించకుండా రౌడీ మూకలు అడ్డుకున్న సందర్భంలో గానీ, వినుకొండ నడిబజారులో రషీద్‌ను తెగనరుకుతున్న సందర్భంలో గానీ పోలీసులు ప్రేక్షకపాత్రనే పోషించారు.

ఈ హింసాకాండ – నరమేధం ఆరు మాసాలపాటు కొనసాగిస్తామని ఆ పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు. ఇక ఉపేక్షించడం క్షంతవ్యం కాదు. తన కూటమి భాగస్వామ్య పక్షం పట్ల మోదీ ప్రభుత్వం ఒలకబోస్తున్న ధృతరాష్ట్ర ప్రేమకు వారు కూడా మూల్యం చెల్లించవలసి ఉంటుంది. ఈ ఆటవిక పాలనను ఇంకా కొనసాగించడం ఈ రాష్ట్ర ప్రభుత్వానికి ఒక అవసరంగా మారింది. తమ పార్టీ ఇచ్చిన అలవికాని హామీలను అమలు చేయడం సాధ్యం కాదు. ప్రశ్నించడానికి ప్రతిపక్షాలు, ప్రజలు భయపడాలి. అందుకోసం ఈ బీభత్స పాలన కొనసాగాలి. రేపటి బడ్జెట్‌లో తమ 'సూపర్ సిక్స్' హామీల అమలుకు అదనంగా లక్ష కోట్లు పైచిలుకు కావాలి. అందువల్ల పూర్తి బడ్జెట్‌ను మరోసారి వాయిదా వేసి, మళ్లీ 'ఓట్ ఆన్ అకౌంట్' పెట్టే అవకాశాలను రాష్ట్ర ప్రభుత్వం పరిశీలిస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. అదే జరిగితే ఇది కూడా అసాధారణ చర్యే!

vardhelli1959@gmail.com

ఉద్దేశపూర్వకంగానే తమ ప్రత్యర్థులపై దాడులు చేస్తామని, 'అకౌంట్లు' సెటిల్ చేస్తామని ఎన్నికల ముందునుంచే తెలుగుదేశం నాయకులు బహిరంగంగా చెబుతున్నారు. ప్రత్యర్థులపై కక్ష సాధించడమే ధ్యేయంగా 'ఉద్దేశపూర్వకంగా' రెడ్‌బుక్ హోర్డింగులను రాష్ట్రవ్యాపితంగా నెలకొల్పి, తమ పార్టీ కార్యకర్తల హింసాప్రవృత్తిని రెచ్చగొడుతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా తన రాజ్యాంగ విధులను, బాధ్యతలను విస్మరించడం కూడా రాష్ట్రపతి పాలనకు దారితీయాల్సిన పరిస్థితిగానే సర్వోన్నత న్యాయస్థానం పరిగణించింది. ఈ నలభై రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగిన ఐదువేల పైచిలుకు హింసాయుత ఘటనల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తన రాజ్యాంగ బాధ్యతలను విస్మరించింది. ఏ సందర్భంలోనూ పోలీసు యంత్రాంగం స్పందించకపోవడానికి వెనుకనున్న కారణం – రాష్ట్ర ప్రభుత్వ మౌఖిక ఆదేశాలే! ఎంపీ మిథున్‌రెడ్డిని తన నియోజకవర్గంలో పర్యటించకుండా రౌడీ మూకలు అడ్డుకున్న సందర్భంలో గానీ, వినుకొండ నడిబజారులో రషీద్‌ను తెగనరుకుతున్న సందర్భంలో గానీ పోలీసులు ప్రేక్షకపాత్రనే పోషించారు.

ఈ హింసాకాండ – నరమేధం ఆరు మాసాల పాటు కొనసాగిస్తామని ఆ పార్టీ నాయకులు చెప్పుకొస్తున్నారు. ఇక ఉపేక్షించడం క్షంతవ్యం కాదు. తన కూటమి భాగస్వామ్య పక్షం పట్ల మోదీ ప్రభుత్వం ఒలకబోస్తున్న ధృతరాష్ట్ర ప్రేమకు వారు కూడా మూల్యం చెల్లించవలసి ఉంటుంది.

నిరుపేదల నెత్తురులో ఎన్ని విప్లవాలో!

నిజాం పాలకుడు మీర్ ఉస్మాన్ అలీఖాన్ చేసిన అరాచకాలు అన్ని ఇన్ని కావు. ఆయన్ని ప్రశ్నించటం అంటే ప్రాణాలకు తెగించడమే. దాశరథి కృష్ణమాచార్యులు చేసింది అదే! నిజాం పాలనలో తెలంగాణ ప్రజల ఆర్తనాదాలనూ, ఆకలి కేకలనూ చూసి చలించి ఉక్కు పిడికిలి బిగించి జంగు సైరన్ ఊదారు దాశరథి. నిజాం రాజు తనను నిజామాబాద్ జైలులో బంధిస్తే జైలు గోడలపై బొగ్గుతో నిజాంకు వ్యతిరేకంగా 'ఓ నిజాం పిశాచమా! కానరాడు నిన్ను బోలిన రాజు మాకెన్నడేని' అంటూ కవితలు లిఖించారు. దాశరథి శతజయంతి సంవత్సర ప్రారంభ సందర్భంగా ఆయన రచించిన 'అగ్నిధార' కవితా ఖండికలోని కొన్ని సాహిత్య విషయాలూ, చారిత్రక వాస్తవాలూ పరిశీలించడం నేటి తరానికి స్ఫూర్తినిస్తుంది.

'ఇది నిదాఘము; ఇందు సహింపరాని/ వేడి యేడ్పించుచున్నది; పాడువడిన / గోడలందున జైలులో పాడినాడ/ వాడిపోనున్న పూమొగ్గపైన పాట;/ ఆయాసపడు జైలులో యెన్ని ప్రజల రా/జ్యము లున్నవో! యని యరసినాను;/ నిరుపేదవాని నెత్తురు చుక్కలో నెన్ని/ విప్లవాలో! యని వెదకినాను' అని ఇందూరు జైలులో (నిజామాబాద్) బందీ అయినది శరీరమే కానీ మనసు కాదంటూ నిప్పులు చెరిగే కవిత్వాన్ని రాశారు. బొగ్గుతో గోడలపై వ్రాసి నన్ను బంధిస్తే తన గళం ఇంకా పదునెక్కుతుందని గొంతు చించుకొని అరిచారు. జైలులోని పరిస్థితులను వివరిస్తూ– సహింపరాని వేడి ఏడ్పిస్తు ఉండగా, మొత్తుకున్నాను, ఏడ్చాను నా స్వేచ్ఛకు ఆంక్షలు విధించిన ఓ నిజాం పిశాచమా నన్నే నువ్వు ''బందీని'' చేస్తే సామాన్యులు పరిస్థితి ఏమిటి? నిరుపేద వాని నెత్తురు చుక్కలో ఎన్ని విప్లవాలో అని వెదికాను అంటూనే... 'వెన్నెలలు లేవు, పున్నమ కన్నే లేదు, పైడి వెన్నెల నెలవంక జాడలేదు, చుక్కలే లేవు, ఆకాశ శోకవీధి, ధూమదామమ్ము దుఃఖ సంగ్రామ భూమి' అంటూ తెలంగాణ ప్రాంతం మొత్తం చీకట్లో ఉన్నట్లుగా, యుద్ధ భూమిని తలపిస్తున్నట్లుగా వుందని ఆవేదన వ్యక్తం చేశారు.



దాశరథి కృష్ణమాచార్య

'ఓసి కూలిదానా! అరుణోదయాన/ మట్టి తట్ట నెట్టిన బెట్టి మరుగులేని/యెత్తు రొమ్మును పొంగించి యెందుకొరకు/ ఉస్సురనెదవు? ఆకాశ ముడికిపోవ?' అంటూ రాసిన కవితా పాదాలు చార్మినారు పరిసరాలలో రాతికట్టడాల నిర్మాణ సమయంలో ఓ మహిళా కూలీని చూసి చలించి వ్రాసిన 'ఉస్సురనెదవు' కవితలోనివి.

'అనాదిగా సాగుతోంది/ అనంత సంగ్రామం/ అనాథుడికి, ఆగర్భ/ శ్రీనాథుడికీ మధ్య/ సేద్యం చేసే రైతుకు/ భూమి లేదు, పుట్రలేదు/ రైతుల రక్తం త్రాగే/ జమీందార్ల కేస్టేట్లు' అంటారు 'అనంత సంగ్రామం' కవితలో! యుద్ధం ఇంకా మిగిలేవుంది అన్నట్లుగా ఆదిమ కాలం నుండి నేటి ఆధునిక కాలం వరకు అనేక సంఘర్షణలకు పరిష్కారం లభించట్లేదు, పెద్ద చేప చిన్నచేపను మింగుతున్నట్లుగా, ఉన్నవాడు లేనివాడిని దోచుకుంటే, కర్షకుడికి భూమి లేకుండా, విలాసంగా గడిపేవారికి వందల ఎకరాలు (ఎస్టేట్లు) వుంటే తప్పకుండా 'సంగ్రామం' జరుగుతుంది మరి!

'ఇదే మాట ఇదే మాట/ పదే పదే అనేస్తాను/ కదం తొక్కి పదం పాడి/ ఇదే మాట అనేస్తాను/ దగాకోరు బటాచోరు/ రజాకారు పోషకుడవు/ వూళ్ళ కూళ్ళు అగ్గిపెట్టి/ ఇళ్ళన్నీ కొల్లగొట్టి/ తల్లి పిల్ల కడుపుకొట్టి/ నిక్కిన దుర్మార్గమంత/ దిగిపోవోయ్ తెగిపోవోయ్ / తెగిపోవోయ్ దిగిపోవోయ్/ ఇదే మాట ఇదే మాట/ పదే పదే అనేస్తాను' అంటారు 'అగ్నిధార' కావ్యంలోని చివరి కవితలో. ఈ కవిత శ్రీశ్రీ 'జగన్నాథుని రథచక్రాలు' కవితను గుర్తుకు తెస్తుంది. 'ఇక చాలు నీ అసమర్థపాలన' అంటూ కడిగిపారేశారు, ఈ కవితలో. కవి ఎప్పుడూ పాలకపక్షం కాకుండా ప్రజలపక్షం నిలబడాలి. అన్నార్తుల వైపు, అనాథల వైపు, ఆకలి కేకల వైపు నిలబడాలి. అచ్చంగా అదే చేశారు దాశరథి.

ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర ఉద్యమ సమయంలో ఊరు ఊరునా వాడవాడలా 'అగ్నిధార' కావ్యంలోని వాక్యాలు తెలంగాణ సమాజంలోని ప్రతి గొంతుకను పిడికిలెత్తి అరిచేలా చేశాయి. స్వరాష్ట్రం సిద్ధించాక దాశరథి పేరు మీద రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఏటా లబ్ధప్రతిష్ఠులకు అవార్డులు ఇచ్చి సన్మానించి దాశరథి కీర్తిని దశదిశలా వ్యాపింపజేస్తోంది అధికారికంగా!

– డా॥ మహ్మద్ హసన్
తెలుగు సహాయాచార్యులు, నల్గొండ
99080 59234

(రేపు దాశరథి శతజయంతి ప్రారంభం)

గురువే దైవం

అయిదవ వేదంగా ప్రసిద్ధికెక్కిన మహాభారతాన్ని, 18 మహా పురాణాలను, 545 బ్రహ్మసూత్రాలను రచించి వేద విభాగాన్ని చేసిన వేదవ్యాస మహర్షి 'ఆషాఢ పౌర్ణమి' నాడు జన్మించాడు. జ్ఞాన సముద్రంగా పేర్కొనదగిన విస్తారమైన వాఙ్మయాన్ని అందించిన వ్యాస మహర్షి జన్మదినాన్ని 'గురు పౌర్ణమి'గా ఆచరించే సంప్రదాయాన్ని మన పూర్వీకులు ఏర్పాటు చేశారు.

అజ్ఞానమనే అంధకారంలో ఉన్న వారి కళ్లను వేద విజ్ఞానమనే కాటుక పుల్లతో తెరిపించిన గురువుకు నమస్కారం అని పేర్కొనే– **'అజ్ఞాన తిమిరాంధస్య జ్ఞానాంజన శలాకయా / చక్షురున్మీలితం యేన తస్మై శ్రీ గురవే నమః॥'** అనే గురువందన శ్లోకం అన్నివిధాలుగా వేదవ్యాస మహర్షికి వర్తించేదే! సృష్టికర్తయైన బ్రహ్మదేవుని వలె శిష్యులలో కొంగ్రొత్తగా ఆలోచనలను, ఆశయాలను చిగురింపజేస్తూ, విష్ణుమూర్తివలె శిష్యులలోని అజ్ఞానమును నశింపజేస్తూ త్రిమూర్తులను తలపించే పరబ్రహ్మ స్వరూపుడైన గురువుకు కృతజ్ఞతాపూర్వకంగా త్రికరణ శుద్ధితో



'గురుర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః।
గురుస్సాక్షాత్ పరంబ్రహ్మ తస్మై శ్రీ గురవేనమః॥'

అంటూ గురువుకు నమస్కరించడమే శిష్యులు చేయగలిగిన కార్యం. గు అనే అక్షరానికి అంధకారమని అర్థమైతే, రు అనే శబ్దానికి నిరోధించువాడు అని అర్థం. గురు శబ్దం విజ్ఞానదాతలైన వాల్మీకి వ్యాసాది మహర్షులు మొదలుకొని పూర్వులైన ఆచార్యులతోపాటు వర్తమాన కాలంలో మనల్ని జ్ఞానమార్గంలో నడిపించే అధ్యాపక బృందానికి కూడా వర్తిస్తుంది.

గురువులు తమ దగ్గర ఉండే విద్యా సంపద, శక్తియుక్తులన్నింటినీ శ్రద్ధాసక్తులు, వినయ విధేయతలు కలిగిన సద్గుణవంతులైన శిష్యులకు ధారపోస్తారు. తమ రక్త సంబంధీకులైన కుటుంబ సభ్యులపై కన్న తమ విజ్ఞానానికి వారసులైన శిష్యులపైననే అమితంగా, అధికంగా ఆదరాభిమానాలను కలిగి ఉంటారు. తమ శిష్యులు తమను మించిన విజ్ఞానవంతులు కావాలని శిష్యుల చేతుల్లో తాము ఓటమిని పొందేంతగా శిష్యుల అభివృద్ధిని (శిష్యాదిచ్ఛేత్ పరాజయమ్) ఆకాంక్షిస్తారు.

గురుశిష్యులు ప్రతిరోజూ పాఠ ప్రవచనానికి ముందుగా తమ విద్యా వ్యాసంగం తేజోవంతమై, శక్తిమంతమై విరాజిల్లాలని; తమలో (గురుశిష్యులలో) ఎటువంటి ద్వేషభావనలూ ఏర్పడకుండా చరిత్ర పుటల్లో సువర్ణాక్షరాలతో లిఖించబడేటట్లుగా, శాశ్వతంగా నిలిచిపోయేటట్లుగా ఉండాలని శాంతి పాఠం ప్రార్థించే విధానం మన ప్రాచీన విద్యా విధానంలో గురుకుల పద్ధతిలో ఉండేది. తల్లి తండ్రులిచ్చిన జన్మకు సార్థక్యాన్ని కలిగిస్తూ విలువైన జ్ఞాన జన్మను ప్రసాదించే గురువుకు, వారు చేసిన మహోపకారానికి జిజ్ఞాసువులైన, శ్రద్ధావంతులైన శిష్యులు ప్రత్యుపకారాన్ని చేయలేరు. అవతార పురుషులైన శ్రీరామ చంద్రమూర్తి, శ్రీకృష్ణుడు వంటివారు కూడా వశిష్ఠ, విశ్వామిత్ర, సాందీపని మహర్షి వంటి గురువుల నుండి విద్యా రహస్యాలను పొందినవారే. విద్యా రంగంలోనే కాక ఇతర రంగాలలోనూ నైపుణ్యం, అనుభవం కలవారి చేతికి చిక్కి, వారిచే చెక్కబడిన శిల్పాల్లా రాణిస్తూ జాతీయ, అంతర్జాతీయ స్థాయిల్లో కీర్తి ప్రతిష్ఠలను పొందే ప్రతి ఒక్కరూ... తమను ఆ స్థాయికి తీసుకువచ్చిన గురువులకు ఋణపడే ఉంటారనేది ముమ్మాటికీ వాస్తవమే. జ్ఞానధనులు, త్యాగమూర్తులైన గురువుల ఆశీస్సులతో మన ఆశయాలను నెరవేర్చుకుందాం.

– సముద్రాల శఠగోపాచార్యులు

(నేడు గురుపౌర్ణమి)

క్లుప్తంగా...

'స్వర్ణాల'లో వరాల రొట్టెలు



సాక్షి ప్రతినిధి, నెల్లూరు: నెల్లూరులోని బారాషహీద్ దర్గాలో నిర్వహిస్తున్న రొట్టెల పండుగ చివరి ఘట్టానికి చేరింది. లక్షలాది భక్తులు తరలిరావడంతో స్వర్ణాల తీరంలో శనివారం రద్దీ కొనసాగింది. తమ కోర్కెలు తీరాలని కొందరు భక్తులు వరాల రొట్టెలను పట్టుకోగా, మరి కొంతమంది తమ కోర్కెలు తీరాయని వరాల రొట్టెలను వదిలారు. అనంతరం దర్గాలోని షహీదుల సమాధులను దర్శించుకున్నారు. ముజావర్లు, ఫకీర్లు, మతపెద్దలు ప్రత్యేక దువా చేసి తహలీల్ ఫాతేహా (చదివింపులు) కార్యక్రమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆదివారం జరిగే ఖత్ మే జియారత్(ముగింపు)తో రొట్టెల పండగ ముగియనుంది.

ముందస్తు బెయిల్ మంజూరు చేయండి

- హైకోర్టులో మోహిత్‌రెడ్డి పిటిషన్

సాక్షి, అమరావతి: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా తిరుపతిలో జరిగిన ఘర్షణలకు సంబంధించి తిరుపతిలోని ఎస్వీ క్యాంపస్ పోలీసులు నమోదు చేసిన కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై శనివారం జస్టిస్ కొనకంటి శ్రీనివాసరెడ్డి విచారణ జరిపారు. ఈ సందర్భంగా పిటిషనర్ తరఫు న్యాయవాది వెంకటేష్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని ఫిర్యాదు మేరకు పోలీసులు ఈ కేసు నమోదు చేశారని చెప్పారు. ఫిర్యాదులో పిటిషనర్‌పై నిర్దిష్ట ఆరోపణలేవీ లేవన్నారు. రాజకీయ కారణాలతోనే ఫిర్యాదు చేశారని వివరించారు. ఎన్నికల్లో పిటిషనర్‌ను అడ్డుకునేందుకే ఈ కేసు నమోదు చేశారని వివరించారు. అరెస్ట్ నుంచి పిటిషనర్‌కు రక్షణ కల్పించాలని కోరారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్(ఏపీపీ) స్పందిస్తూ.. ఈ కేసుకు సంబంధించిన పూర్తి వివరాల సమర్పణకు గడువు కావాలని కోరారు. న్యాయమూర్తి అంగీకరిస్తూ తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

అమెరికాలో తెనాలి యువకుడు మృతి

- గతేడాది ఆగస్టులో ఎంఎస్ చేసేందుకు వెళ్లిన రవితేజ



రవితేజ(ఫైల్)

తెనాలి రూరల్: అమెరికాలోని టెక్సాస్ రాష్ట్రం ఆస్టిన్ సిటీలో స్విమ్మింగ్‌పూల్‌లో మునిగి తెనాలి యువకుడు మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే... గుంటూరు జిల్లా తెనాలి పట్టణం ఐతానగర్‌కు చెందిన తాడిబోయిన రవితేజ(28) గతేడాది ఆగస్టులో ఎంఎస్ చేసేందుకు అమెరికా వెళ్లాడు. టెక్సాస్‌లోని ట్రైన్ యూనివర్సిటీలో ఎంఎస్ చేస్తూ పార్ట్‌టైం జాబ్ చేస్తున్నాడు. ఈ నెల 18న స్నేహితులతో కలసి స్విమ్మింగ్ పూల్‌కు వెళ్లాడు. అందులో దిగిన కొద్ది సేపటికే మునిగిపోయి అపస్మారక స్థితికి చేరుకున్నాడు. స్నేహితులు వైద్యశాలకు తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. సెలవులు కావడంతో డెత్ సర్టిఫికెట్ జారీ కాలేదు. సోమవారం జారీ అయ్యే అవకాశం ఉండడంతో మంగళవారం మృతదేహాన్ని స్వస్థలానికి పంపేందుకు అక్కడి భారతీయులు ఏర్పాట్లు చేస్తున్నారు. రవితేజ ఇంటర్ వరకు తెనాలిలోని వివేక విద్యాసంస్థల్లో చదివాడు. అనంతరం కళ్లం హరనాథరెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీలో బీటెక్ పూర్తి చేశాడు. రెండేళ్ల పాటు కోకాకోలా ఫ్యాక్టరీలో ఉద్యోగం చేసి పైచదువుల కోసం గత ఏడాది అమెరికా వెళ్లాడు. మృతునికి తల్లి, సోదరుడు ఉన్నారు.

జొన్నగిరిలో వజ్రం లభ్యం

తుగ్గలి: కర్నూలు జిల్లా తుగ్గలి మండలం జొన్నగిరి గ్రామంలో శుక్రవారం పొలం పనులకు వెళ్లిన ఓ మహిళకు వజ్రం దొరికింది. ఆ వజ్రాన్ని ఓ వ్యాపారి రూ.1.30 లక్షలకు కొనుగోలు చేసినట్లు తెలిసింది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు భూమిలోని వజ్రాలు బయటపడుతున్నాయి.

చంద్రగిరికి నేనే ఎమ్మెల్యే

- నా భర్త చదివింది పదో తరగతే
- ప్రజల కష్టాలు ఆయనకు తెలియవు
- ఎమ్మెల్యే పులివర్తి నాని భార్య సుధారెడ్డి

సాక్షి టాస్క్‌ఫోర్స్: చంద్రగిరికి నేనే ఎమ్మెల్యేని.. అని ప్రస్తుత ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి పులివర్తి సుధారెడ్డి తనకు తానే ప్రకటించుకున్నారు. తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఆమె మీడియాతో మాట్లాడారు. తన భర్త పులివర్తి నాని ఎమ్మెల్యేగా గెలవడంలో అతని కన్నా తానే ఎక్కువగా కష్టపడ్డానని, ఆయన కన్నా తానే ఎక్కువగా పర్యటించానని చెప్పారు. తన భర్త నాని పదో తరగతే చదివారని, నియోజకవర్గంలో ప్రజల కష్టాలు నానికి తెలియవని, తనకే ఎక్కువగా తెలుసంటూ చెప్పుకొచ్చారు. నాని ఆవేశపరుడని, అతని మాటలు పట్టించుకోవద్దన్నారు. తనను ఎమ్మెల్యే అని పిలిచినా, షాడో ఎమ్మెల్యే అని పిలిచినా ఫర్వాలేదన్నారు. వచ్చే నెల నుంచి చంద్రగిరి నియోజకవర్గంలో పర్యటిస్తానని ప్రకటించుకున్నారు.


పులస.. వలస.. ప్రయాణమిక కులాసా

భద్రాచలం వరకు గోదావరిలో పులసల స్వేచ్ఛా విహారానికి పోలవరం ప్రాజెక్టులో ప్రత్యేక ఏర్పాట్లు



- పోలవరం ప్రాజెక్ట్ స్పిల్‌వే రెండో బ్లాక్‌లో 252 మీటర్ల ఫిష్ ల్యాడర్ నిర్మాణం
- జలాశయంలో డెడ్ స్టోరేజీ స్థాయి నుంచి గరిష్ట స్థాయిలో నీరు నిల్వ ఉన్నా రాకపోకలకు వీలుగా మార్గం
- పులస మనస్తత్వాన్ని అధ్యయనం అనంతరం డిజైన్ చేసిన సీఐఎఫ్ఆర్ఐ

పుస్తెలు అమ్మి అయినా పులస తినాలనేది గోదావరి జిల్లాల్లో నానుడి. రుచిలో అత్యంత మేటైన పులస చేపల ప్రవర్తన కూడా అంతే ప్రత్యేకమైనది. సముద్రం నుంచి గోదావరి నదిలోకి ఎదురీదుకుంటూ వచ్చే పులసల కోసం బంగాళాఖాతం నుంచి భద్రాచలం వరకూ స్వేచ్ఛగా విహరించేలా పోలవరం ప్రాజెక్టులో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.



సాక్షి, అమరావతి: గోదావరిలోకి ఎర్రనీరు పోటెత్తగానే సముద్రం నుంచి గోదావరిలోకి ఎదురీది వచ్చే పులసల ప్రయాణానికి ఇబ్బంది లేకుండా పోలవరం స్పిల్‌వే రెండో బ్లాక్‌లో ఫిష్ ల్యాడర్ నిర్మాణం పూర్తయ్యింది. జలాశయంలో డెడ్ స్టోరేజి 25.72 మీటర్ల స్థాయి నుంచి గరిష్ఠ మట్టం 45.72 అడుగుల వరకూ ఏ స్థాయిలో నీరు నిల్వ ఉన్నా పోలవరం ప్రాజెక్టు నుంచి ఎగువకు దిగువకు పులసలు రాకపోకలు సాగించేలా ఫిష్ ల్యాడర్ నిర్మించారు. గోదావరిలో వరద పెరుగుతుండటం.. ధవళేశ్వరం బ్యారేజి నుంచి వరద ప్రవాహం బంగాళాఖాతంలో కలుస్తుండటంతో సముద్రం నుంచి విలస ఎదురీదుతూ ఫిష్ ల్యాడర్ మీదుగా అఖండ గోదావరిలో విహరిస్తోంది. దేశంలో పులస, ఇతర చేపల స్వేచ్ఛా విహారానికి ప్రత్యేకమైన ఏర్పాట్లు చేసిన ఏకైక ప్రాజెక్టు పోలవరమేనని అధికార వర్గాలు చెబుతున్నాయి. ప్రపంచంలో చేపల స్వేచ్ఛా విహారానికి ప్రత్యేక ఏర్పాట్లు ఉన్న అతి పెద్ద జలాశయం పోలవరం ప్రాజెక్టే కావడం గమనార్హం. ప్రపంచంలో ఒక చేప జాతి సైకాలజీపై అధ్యయనం చేసి.. ఆ చేప జాతి స్వేచ్ఛకు విఘాతం కల్పించకుండా నిర్మిస్తున్న ఏకైక ప్రాజెక్టు కూడా పోలవరమేనని పర్యావరణ నిపుణులు స్పష్టం చేస్తున్నారు.

నదుల్లోకి ఎదురీదే అరుదైన జాతి

గోదావరిలో ఏడాది పొడవునా పులసలు దొరకవు. నైరుతి రుతుపవనాల ప్రభావం వల్ల వర్షాలు కురిసి.. గోదావరి వరద ప్రవాహం (ఎర్రనీరు) సముద్రంలో కలిసే సమయంలో (జూన్ 4వ వారం నుంచి జూలై, ఆగస్టు మధ్యన సముద్రంలో జీవించే విలస రకం చేపలు నదిలోకి ఎదురీదుతాయి. సముద్రపు జలాల నుంచి విలస గోదావరి నీటిలోకి చేరాక పులసగా రూపాంతరం చెందుతుంది. పులస సంతానోత్పత్తి కోసం గోదావరిలోకి ఎదురీదుతుంది. వరదల సమయంలో ధవళేశ్వరం బ్యారేజీ గేట్లను ఎత్తి ఉంచడం వల్ల గోదావరి సముద్రంలో కలిసే అంతర్వేది నుంచి దాదాపుగా భద్రాచలం వరకూ నదిలో ఎదురీదుతుంది. విలస గోదావరి నీటిలోకి ప్రవేశించాక.. దాని శరీరంలో అనేక మార్పులు చోటుచేసుకోవడం వల్ల పులసగా మారి అద్భుతమైన రుచినిస్తుంది. సంతానోత్పత్తి చేశాక తిరిగి సముద్రంలోకి చేరి.. విలసగా రూపాంతరం చెందుతుంది.

పోలవరం నుంచి స్వేచ్ఛా విహారం

పోలవరం ప్రాజెక్టును నిర్మిస్తే అత్యంత అరుదైన పులస చేపల స్వేచ్ఛకు విఘాతం కలుగుతుందని కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ అనుమానాలు వ్యక్తం చేసింది. పులస స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా పోలవరం ప్రాజెక్టు మీదుగా ఎగువకు.. దిగువకు స్వేచ్ఛగా విహరించేలా ఏర్పాట్లు చేస్తేనే ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతి ఇస్తామని షరతు విధించింది. ఆ షరతుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ ప్రాజెక్టుకు అనుమతి ఇచ్చింది.

సైకాలజీపై ప్రత్యేక అధ్యయనం

సముద్రంలో ఉండే విలస.. గోదావరిలోకి చేరి పులసగా రూపాంతరం చెందాక.. అది ప్రవర్తించే తీరు(సైకాలజీ)పై అధ్యయనం చేసి.. దాని స్వేచ్ఛకు భంగం వాటిల్లకుండా ఎగువకు దిగువకు రాకపోకలు సాగించేలా పోలవరం ప్రాజెక్టుకు ఫిష్ ల్యాడర్ గేట్ల డిజైన్ రూపొందించే బాధ్యతను కోల్‌కతాలోని ప్రఖ్యాత సీఐఎఫ్ఆర్ఐ (సెంట్రల్ ఇన్‌ల్యాండ్ ఫిషరీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్)కు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించింది. సుమారు ఐదేళ్ల పాటు అధ్యయనం చేసిన సీఐఎఫ్ఆర్ఐ పులస స్వేచ్ఛా విహారానికి వీలుగా పోలవరం స్పిల్‌వే రెండో బ్లాక్‌లో అమర్చే ఫిష్ ల్యాడర్ గేట్లను డిజైన్ చేసింది. ఈ డిజైన్‌ను సీడబ్ల్యూసీ (కేంద్ర జలసంఘం) ఆమోదించింది.

ఇంజనీరింగ్ అద్భుతం.. ఫిష్ ల్యాడర్

సీడబ్ల్యూసీ ఆమోదించిన మేరకు ఫిష్ ల్యాడర్ నిర్మాణాన్ని 2022లో పూర్తి చేసిన ప్రభుత్వం వాటికి గేట్లను కూడా అమర్చింది. గోదావరి నదిలో వరద ప్రవాహం ఏ స్థాయిలో ఉన్నా పులసలు స్వేచ్ఛగా విహరించేలా పోలవరం స్పిల్‌వే రెండో పియర్‌కు మూడుచోట్ల ఫిష్ ల్యాడర్ గేట్లను అమర్చింది. ఫిష్ ల్యాడర్ 252 మీటర్ల పొడవు ఉంటుంది. దీన్ని పోలవరం స్పిల్‌వే రెండో బ్లాక్‌లో నాలుగు అరలుగా నిర్మించారు. ఒక్కో అరకు ఒక్కో గేటు చొప్పున నాలుగు గేట్లను అమర్చారు. క్రస్ట్ లెవల్‌లో అంటే 25.72 మీటర్ల స్థాయిలో ఫిష్ ల్యాడర్ అరకు ఒకటి, 30.5 మీటర్ల స్థాయిలో అరకు రెండో గేటు అమర్చారు. 34 మీటర్ల స్థాయిలో అరకు మూడో గేటు, 41 మీటర్ల స్థాయిలో నాలుగో గేటు అమర్చారు. పోలవరం ప్రాజెక్టు గరిష్ట నీటిమట్టం 45.72 మీటర్లు, కనిష్ట నీటిమట్టం 25.72 మీటర్లు. అంటే.. గోదావరిలో నీటిమట్టం గరిష్టంగా ఉన్నా.. సాధారణంగా ఉన్నా.. కనిష్టంగా ఉన్నా పులసలు ఎగువకు, దిగువకు రాకపోకలు సాగించేలా పోలవరం ప్రాజెక్టుకు ఫిష్ ల్యాడర్ గేట్లు అనుకూలంగా ఉంటాయి. పోలవరం స్పిల్‌వే మీదుగా పులస స్వేచ్ఛగా విహరిస్తుండటంతో ఫిష్ ల్యాడర్‌ను ఇంజనీరింగ్ అద్భుతంగా పర్యావరణ నిపుణులు అభివర్ణిస్తున్నారు.

భార్యను చంపేందుకు వచ్చి... మామను మట్టుబెట్టాడు

ఏలూరు జిల్లా ఐఎస్ జగన్నాథపురంలో దారుణం



మృతుడు లాజర్(ఫైల్)




నిందితుడు సుబ్బారావు

ద్వారకాతిరుమల: తనకు ఏడాది నుంచి దూరంగా ఉండటంతోపాటు కువైట్ వెళుతున్న భార్యను చంపేందుకు వచ్చిన ఓ వ్యక్తి... ఆమె కనిపించకపోవడంతో తన మామను కిరాతకంగా హత్య చేశాడు. ఏలూరు జిల్లా ద్వారకాతిరుమల మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో శుక్రవారం అర్ధరాత్రి ఈ ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఐఎస్ జగన్నాథపురానికి చెందిన పాతకోకల లాజర్(65), విజయమ్మ దంపతుల కుమార్తె గంగాభవానీకి, ఇదే మండలంలోని జి.కొత్తపల్లికి చెందిన తాపీమేస్త్రి కొక్కిరపాటి సుబ్బారావుకు 20ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి కుమారుడు ప్రేమ్‌కుమార్, కుమార్తె స్వీటీ ఉన్నారు. మద్యానికి బానిసైన సుబ్బారావు తరచూ భార్య, పిల్లలను వేధించేవాడు. దీంతో గంగాభవానీ ఏడాది క్రితం పిల్లలను తీసుకుని ఐఎస్ జగన్నాథపురంలోని పుట్టింటికి వచ్చేసింది. కుమార్తెకు రెండు నెలల క్రితం వివాహం చేసింది. ఈ క్రమంలో శనివారం కువైట్ వెళ్లేందుకు గంగాభవానీ ఏర్పాట్లు చేసుకుంది. తన కుమారుడి ద్వారా సుబ్బారావు ఈ విషయం తెలుసుకున్నాడు. తనకు దూరంగా ఉండటంతోపాటు కువైట్‌కు వెళ్లిపోతుందన్న కోపంతో భార్యను చంపాలని సుబ్బారావు నిర్ణయించుకున్నాడు. శుక్రవారం అర్ధరాత్రి 12గంటల సమయంలో కర్ర తీసుకుని లాజర్ ఇంటికి వెళ్లాడు. భార్య కనిపించకపోవడంతో సుబ్బారావు గట్టిగా కేకలు వేయగా, భయపడిన స్వీటీ 'అమ్మను మామ వీరాస్వామి, అన్న ప్రేమ్‌కుమార్ రాత్రి జంగారెడ్డిగూడెం తీసుకెళ్లి బస్సు ఎక్కించి హైదరాబాద్ పంపారు.' అని చెప్పింది. దీంతో రెచ్చిపోయిన సుబ్బారావు 'అది వెనక్కి ఎలా రాదో చూస్తాను.. తండ్రిని చంపితే రాదా..' అంటూ లాజర్‌ను కర్రతో విచక్షణారహితంగా కొట్టి చంపాడు. తన తండ్రి చనిపోయిన విషయం తెలిసి గంగాభవానీ కువైట్ వెళ్లకుండా హైదరాబాద్ నుంచి వెనుదిరిగి ఐఎస్ జగన్నాథపురం చేరుకున్నారు. ఘటనాస్థలాన్ని పోలీసులు పరిశీలించారు. మృతుడి కుమారుడు వీరాస్వామి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి, దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.

ముగ్గురు మిలీషియా సభ్యులు అరెస్టు

పేలుడు పదార్థాలు స్వాధీనం



చింతూరు (అల్లూరి సీతారామరాజు జిల్లా): కూంబింగ్ నిర్వహిస్తున్న పోలీసులను చూసి పారిపోతున్న ముగ్గురు మావోయిస్టు పార్టీ మిలీషియా సభ్యులను శనివారం చింతూరు పోలీసులు అరెస్టు చేశారు. చింతూరు ఏఎస్పీ రాహుల్‌మీనా స్థానిక పోలీసుస్టేషన్లో వివరాలు వెల్లడించారు. చింతూరు ఎస్ఐ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో స్పెషల్‌పార్టీ, సీఆర్పీఎఫ్, డాగ్ స్క్వాడ్ బృందాలు కూంబింగ్ నిర్వహిస్తుండగా చూసి పారిపోతున్న ఎటపాక మండలం సంగంపాడుకు చెందిన వంజం ఉంగయ్య, కుర్సా రాజ్‌కుమార్, చుక్కలపాడుకు చెందిన మడివి ఐరమయ్యను అరెస్ట్ చేశారు. వారి వద్దనుంచి ప్రెషర్‌కుక్కర్ బాంబు, మూడు హ్యాండ్ గ్రెనేడ్లు, రెండు ఎలక్ట్రికల్ డిటోనేటర్లు, కరపత్రాలు స్వాధీనం చేసుకున్నారు. వీరికి చింతూరు మండలంలో జరిగిన పలు ఘటనలతో ప్రమేయమున్నట్లు ఏఎస్పీ తెలిపారు. సీఐ గజేంద్రకుమార్, ఎస్ఐ శ్రీనివాసరావు, సీఆర్పీఎఫ్ అసిస్టెంట్ కమాండెంట్ రాధ పాల్గొన్నారు.

నేడు పౌర్ణమి గరుడసేవ



తిరుమల: గురు పౌర్ణమి సందర్భంగా తిరుమల శ్రీవారి ఆలయంలో ఆదివారం గరుడ సేవ జరుగనుంది. ఇందులో భాగంగా రాత్రి ఏడు నుంచి తొమ్మిది గంటల నడుమ సర్వాలంకార భూషితుడైన శ్రీమలయప్ప స్వామి వారు గరుడునిపై తిరుమాడ వీధుల్లో విహరించి భక్తులను కటాక్షిస్తారు. అలాగే పెద్ద జీయర్ స్వామి నేతృత్వంలో చాతుర్మాస దీక్ష వైభవంగా నిర్వహించనున్నారు.

సామాన్య భక్తులకు పెద్దపీట : టీటీడీ ఈవో

ప్రతి రోజు వేలాదిగా తిరుమలకు విచ్చేసే సామాన్య భక్తులకు మరింత సౌకర్యవంతంగా దర్శనం, వసతి, అన్న ప్రసాదాలు అందించేందుకు చర్యలు చేపట్టినట్లు టీటీడీ ఈవో శ్యామలరావు చెప్పారు. తిరుమలలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. అన్న ప్రసాదాలు, పాలు, తాగునీరు నాణ్యతను మరింత పెంచేందుకు చర్యలు తీసుకున్నామన్నారు. అన్నప్రసాద భవనంలో సిబ్బందిని పెంచడం, వంటశాలల ఆధునీకరణ తదితర అంశాలపై చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. నారాయణగిరి క్యూల వద్ద ఆరు వేల మంది వేచి ఉండేలా నూతన షెడ్లు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. తిరుమలలో హోటల్ నిర్వాహకులు టీటీడీ నిబంధనల ప్రకారం ఆహార పదార్థాల తయారీ, నాణ్యత, రేట్లు ఉండాలన్నారు. గతంలో వారానికి 1.05 లక్షలు ఇస్తున్న ఎస్ఎస్‌డి టోకెన్లను, భక్తులు క్యూలైన్లలో వేచి ఉండే సమయం తగ్గించేందుకు ప్రస్తుతం 1.47 లక్షలు ఇస్తున్నామని, వీటిని మరికొంత పెంచేందుకు సాధ్యాసాధ్యాలు పరిశీలిస్తామన్నారు.



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా రాయవరం మండలం సోమేశ్వరం గ్రామంలోని శ్రీసోమేశ్వర స్వామిని రామచంద్రపురం పట్టణానికి చెందిన తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సాంబశివరావు నాయుడు శనివారం దర్శించుకున్నారు. సోమేశ్వరస్వామికి న్యాయమూర్తి దంపతులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. తొలుత వీరికి ఆలయ ఈవో గంధం సత్యనారాయణ పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. - రాయవరం



గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీలక్ష్మీనృసింహస్వామిని రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్‌కే అబ్దుల్ నజీర్ సతీమణి సమీరా నజీర్ శనివారం దర్శించుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే అమరావతిలోని శ్రీబాల చాముండికా సమేత అమరేశ్వరుడిని కూడా సమీరా నజీర్ దర్శించుకున్నారు. - మంగళగిరి/ అమరావతి



తిరుమల శ్రీవారిని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుధ శనివారం దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారిని దర్శించుకున్నవారిలో సినీ నటుడు శ్రీకాంత్, రాష్ట్ర హోంమంత్రి అనిత ఉన్నారు. - తిరుమల

నిరంతర చదువే విజయానికి కారణం

తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గురిజాల రాధారాణి



జస్టిస్ రాధారాణికి విజయలక్ష్మి స్మారక అవార్డు ప్రదానం చేస్తున్న నిర్వాహకులు, అతిథులు

తెనాలి: ఏ రంగంలోనైనా విజయం సాధించేందుకు అడ్డదారులు ఉండవని.. లక్ష్యాన్ని నిర్దేశించుకుని కష్టపడినపుడే తగిన ఫలితం లభిస్తుందని తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ గురిజాల రాధారాణి అన్నారు. గుంటూరు జిల్లా తెనాలిలో రామకృష్ణకవి కళాక్షేత్రంలో మొవ్వా విజయలక్ష్మి స్మారక పురస్కారాన్ని శనివారం ఆమె స్వీకరించారు. ఈ సందర్భంగా మొవ్వా విజయలక్ష్మి సేవాసమితి ఆధ్వర్యంలో విద్యార్థులు–భవిష్యత్ సవాళ్లు అనే అంశంపై స్మారకోపన్యాసంలో రాధారాణి మాట్లాడుతూ.. విద్యార్థులు ఇష్టంగా చదువుకుంటూ తమ ఆలోచనలు, సందేహాలను ఇతరులతో పంచుకుంటూ తగిన నిర్ణయాలను తీసుకోవాలన్నారు. చదువుతోపాటు ఆటలు, కళల్లోనూ కొంత ప్రవేశం ఉండటం మంచిదన్నారు. విద్యతో పాటు నైతిక విలువలనూ బోధించిన టీచర్లను విద్యార్థులు జీవితాంతం గుర్తుంచుకుంటారని చెప్పారు. సాధారణంగా పిల్లలకు చదువంటే కష్టంగా అనిపిస్తుందని, తాను కూడా చిన్నప్పుడు 'రైలు బడి' అనే పుస్తకం చదివాకనే చదువు ఇష్టంగా మారిందని గుర్తు చేసుకున్నారు. 'సాధారణంగా జీవించు–ఉన్నతంగా ఆలోచించు' అంటూ తన తండ్రి చెప్పిన మాటల్ని ఇప్పటికీ పాటిస్తున్నానని చెప్పారు. గతంలో కన్నా ఇప్పుడు పిల్లలను పక్కదారి పట్టించేవి అనేకం ఉన్నాయని, అందులో సెల్‌ఫోన్, సోషల్ మీడియా ప్రముఖమైనవన్నారు. సబ్‌కలెక్టర్ ప్రఖర్‌జైన్, సేవా సమితి వ్యవస్థాపకుడు మొవ్వా సత్యనారాయణ, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, చైతన్యవేదిక అధ్యక్షుడు పాటిబండ్ల దక్షిణామూర్తి, అమృతసాయి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ వ్యవస్థాపకుడు కె.రామమోహనరావు మాట్లాడారు.

దుర్గమ్మకు శ్రీశైలం, శ్రీకాళహస్తి ఆలయాల సారె



దుర్గమ్మకు సారె తీసుకువస్తున్న శ్రీశైలం ఆలయం ఈవో దంపతులు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ)/శ్రీశైలం టెంపుల్: విజయవాడ ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో నిర్వహిస్తున్న ఆషాఢ మాసోత్సవాలు, శాకంబరీదేవి ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీశైలం, శ్రీకాళహస్తి దేవస్థానాలు అమ్మవారికి శనివారం సారెను సమర్పించాయి. శ్రీశైలంలోని శ్రీభ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి ఆలయం తరఫున ఈవో డి.పెద్దిరాజు దంపతులు, శ్రీజ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయం తరఫున ఎమ్మెల్యే బొజ్జల శ్రీధర్, ఏఈవో ఎన్.ఆర్.కృష్ణారెడ్డి తదితరులు అమ్మవారికి అలంకరించేందుకు పట్టుచీర, పూజా సామగ్రిని దుర్గగుడి ఈవో కె.ఎస్.రామారావు,అర్చకులకు అందజేశారు.

వైభవంగా రెండో రోజు శాకంబరీదేవి ఉత్సవాలు

శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్ల దేవస్థానంలో శాకంబరీదేవి ఉత్సవాలు రెండో రోజు వైభవంగా కొనసాగాయి. శనివారం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి వార్లతో పాటు ఇతర ఉపాలయాల్లో దేవతామూర్తులను కాయగూరలతో అలంకరించారు.

రాష్ట్రంలో రెడ్ బుక్ పాలన

- అరాచకాలన్నింటినీ ప్రధాని దృష్టికి తీసుకెళ్తాం
- హత్యలు, వేధింపులకే టీడీపీ ప్రాధాన్యం
- అతీగతీ లేని సూపర్ సిక్స్ క్యాలెండర్
- మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి మండిపాటు



రాయచోటిలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి

రాయచోటి : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో హామీగా ఇచ్చిన సూపర్ సిక్స్‌ను పక్కన పెట్టి రెడ్ బుక్ పాలన సాగిస్తోందని అన్నమయ్య జిల్లా వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మండిపడ్డారు. రాష్ట్రంలో 45 రోజులుగా విధ్వంసాలు, దాడులు, హత్యలు, హత్యాయత్నాలను టీడీపీ ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం సాయంత్రం ఆయన రాయచోటిలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో ఆటవిక పాలనపై ఈనెల 24వ తేదీన ఢిల్లీలో చేపట్టనున్న ధర్నాలో వైఎస్ జగన్‌తో పాటు పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పలువురు నాయకులు పాల్గొంటారని తెలిపారు. రాష్ట్రంలో విధ్వంసకాండ గురించి ప్రధాని దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. పార్లమెంట్, అసెంబ్లీలో కూడా రాష్ట్రంలో జరుగుతున్న అరాచక పాలనపై గళం విప్పుతామన్నారు. గత ప్రభుత్వంలో వైఎస్ జగన్ 99 శాతం హామీలు నెరవేర్చడానికి ప్రతినెలా సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసిన విషయాన్ని గుర్తు చేశారు. నేడు సూపర్ సిక్స్ అమలు క్యాలెండర్‌కు అతీగతీ లేదన్నారు. గతంలో చంద్రబాబు అమరావతి రాజధాని, పోలవరం ప్రాజెక్టు పూర్తి చేయడంలో పూర్తిగా విఫలమయ్యారన్నారు. గతంలో జరిగిన తప్పులను వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సరిదిద్ది, పోలవరం పనుల్లో వేగం పెంచిందన్నారు. తల్లికి వందనం, 18 ఏళ్లు నిండిన మహిళలకు నెలకు రూ.1,500, రైతు భరోసా, మత్స్యకార భరోసా, నిరుద్యోగ భృతి ఎప్పుడు ఇస్తారో చెప్పాలని చంద్రబాబును నిలదీశారు. గతంలో బాబు పాలనలోనే విద్యుత్ రంగం నిర్వీర్యం అయిందని, బాబు విడుదల చేసిన శ్వేత పత్రాలన్నీ అవాస్తవాలేనని చెప్పారు. కేవలం గుంటూరు, కృష్ణా జిల్లాల్లో మాత్రమే రియల్ ఎస్టేట్ ఉంటేచాలనుకుంటున్నారని విమర్శించారు. ఈ సమావేశంలో మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, డీసీఎంఎస్ మాజీ చైర్మన్ ఆవుల విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొలిమి హారూన్ బాషా, వీవీ ప్రతాప్ రెడ్డి, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.

కిలారు రాజేష్ పేరుతో ఎమ్మెల్యే నాని దందాలు

- అధికారులు, వ్యాపారులను బెదిరిస్తున్నారు
- చంద్రగిరిలో భయానక వాతావరణం సృష్టిస్తున్నారు
- మామూళ్లివ్వలేదని ఆర్యవైశ్య సంఘం నేత రైస్ మిల్లు మూయించేశారు
- రూ.250 కోట్ల దేవదాయ శాఖ భూమిని ఆక్రమించారు
- రియల్ ఎస్టేట్ వ్యాపారులను డబ్బులు డిమాండ్ చేస్తున్నారు
- చంద్రగిరి ఎమ్మెల్యే నానిపై చెవిరెడ్డి ఫైర్




విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి

తిరుపతి రూరల్ : చంద్రబాబు, లోకేశ్‌కి దగ్గరి వ్యక్తి అయిన కిలారు రాజేష్ పేరుతో తిరుపతి జిల్లాలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని దందాలు, అక్రమాలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ నేత, చంద్రగిరి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ఆరోపించారు. నాని చర్యలతో అధికారులు, వ్యాపారులంతా భయాందోళనలకు గురవుతున్నారని, ఇలా భయానక వాతావరణం సృష్టించడం చంద్రగిరికి మంచి సంస్కృతి కాదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన శనివారం తిరుపతిలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. గాడ్‌ఫాదర్ లాంటి కిలారు రాజేష్ తన చెప్పుచేతల్లో ఉన్నాడని, ఎంత చెబితే అంత చేస్తాడంటూ నాని అధికారులు, వ్యాపారులను బెదిరిస్తున్నట్లు ఆరోపించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్‌తో ఆయన, రాజేష్ ఉన్న ఫొటోలు, వీడియోలను చూపుతూ వారిని భయభ్రాంతులకు గురిచేస్తున్నట్లు ఉద్యోగులు వాపోతున్నారన్నారు. మామూళ్లు ఇవ్వలేదని ఆర్య వైశ్య సంఘం రాష్ట్ర నాయకుడు కిషోర్‌కు చెందిన రైస్ మిల్లును మూయించాడని, వైఎస్సార్‌సీపీ సర్పంచ్‌కు చెందిన రూ.7 కోట్ల విలువైన రెండెకరాల భూమిని కాజేసేందుకు ప్రయత్నించారని తెలిపారు. అంతేకాకుండా తిరుపతి రూరల్ మండలం అవిలాల పంచాయతీలో రూ.250 కోట్ల విలువైన దేవదాయ శాఖకు చెందిన 10 ఎకరాల భూమిని ఆక్రమించారని చెప్పారు. చిత్తూరు నుంచి వంద మంది రౌడీలను తీసుకువచ్చి ఎండోమెంట్ అధికారులను బట్టలు విప్పించి, గదిలో బంధించి, మోకాళ్లపై నిలబెట్టి మరీ దాని చుట్టూ కాంపౌండ్ వాల్ నిర్మించారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ వివరిస్తూ ఎండోమెంట్ డిప్యూటీ కలెక్టర్ రమేష్‌నాయుడు జిల్లా కలెక్టర్‌కు, ప్రభుత్వానికి రాతపూర్వకంగా ఫిర్యాదు కూడా చేశారన్నారు. రోజూ రియల్ ఎస్టేట్ వ్యాపారులను ఇంటికి పిలిపించుకుని డబ్బులు డిమాండ్ చేస్తున్నారని చెప్పారు. గట్టిగా ప్రశ్నించిన వారిపై చిత్తూరు నుంచి రప్పించిన రౌడీ మూకలకు ముసుగులు వేయించి కత్తులు, రాడ్లు, బ్లేడ్లతో దాడులు చేయిస్తున్నారని తెలిపారు. నాని దందాలు, ఆక్రమణలపైనా విచారణ చేయించాలని అన్నారు.

జెండా రెపరెపల వెనుక...

అది 1969. జూలై 20. అంతరిక్ష రేసులో యూఎస్ఎస్ఆర్‌పై అమెరికా తిరుగులేని ఆధిక్యం సాధించిన రోజు. అంతేకాదు. అందరాని చందమామను మానవాళి సగర్వంగా అందుకున్న రోజు కూడా. టీవీల్లో ప్రత్యక్ష ప్రసారం ద్వారా వీక్షిస్తున్న లక్షలాది మంది సాక్షిగా నాసా అపోలో 11 మిషన్ విజయవంతంగా చంద్రునిపై దిగింది. కాసేపటికి వ్యోమగామి నీల్‌ఆర్మ్ స్ట్రాంగ్ చంద్రుని ఉపరితలంపై కాలుపెట్టాడు. ఆ ఘనత సాధించిన తొలి మానవునిగా చరిత్ర పుటల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నాడు. ఎడ్విన్ ఆల్డ్రిన్‌తో కలిసి చంద్రుని నమూనాలు సేకరిస్తూ ఉపరితలంపై కొద్ది గంటలు గడిపాడు. మానవాళి ప్రస్థానంలో చిరస్థాయిగా మిగిలిపోనున్న ఆ మైలురాయికి గుర్తుగా అమెరికా జెండాను సగర్వంగా చంద్రునిపై పాతాడు. అయితే ఈ చర్య పెద్ద గందరగోళానికే దారితీసింది. నాసా విడుదల చేసిన ఫొటోల్లో ఆ జెండా రెపరెపలాడుతూ కన్పించడం నానా అనుమానాలకు తావిచ్చింది. అసలు భూమిపై మాదిరిగా వాతావరణం, గాలి ఆనవాలు కూడా లేని చంద్రుని ఉపరితలంపై జెండా ఎలా ఎగిరిందంటూ సర్వత్రా ప్రశ్నలు తలెత్తాయి. చివరికి పరిస్థితి అపోలో 11 మిషన్ చంద్రునిపై దిగడం శుద్ధ అబద్ధమనేదాకా వెళ్లింది! అంతరిక్ష రంగంలో దూకుడు ప్రదర్శిస్తున్న యూఎస్ఎస్ఆర్ మీద ఎలాగైనా పైచేయి సాధించేందుకు నాసా ఇలా కట్టుకథ అల్లి ఉంటుందంటూ చాలామంది పెదవి విరిచారు కూడా...

కానీ, ఆ జెండా రెపరెపల వెనక నాసా కృషి, అంతకుమించి సైన్స్ దాగున్నాయి. చూసేందుకు అచ్చం గాలికి రెపరెపలాడుతున్నట్టు కన్పించే అమెరికా జాతీయ జెండాను ఎలాగైనా చంద్రునిపై పాతాలన్నది నాసా పట్టుదల. నాసా సాంకేతిక సేవల విభాగం చీఫ్ జాక్ కింజ్లర్ ఈ సవాలును స్వీకరించారు. ఆయన ఆధ్వర్యంలో సైంటిస్టులు ఎంతగానో శ్రమించి మరీ ఆ జెండాను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. జెండా పై భాగం పొడవునా ఒక క్రాస్‌బార్ అమర్చారు. దానికి జెండాను అక్కడక్కడా ప్రెస్ చేశారు. తద్వారా జెండా పలుచోట్ల వంపు తిరిగినట్టు కన్పించేలా చేశారు. ఫలితంగా చూసేందుకది అచ్చం గాలికి రెపరెపలాడుతున్నట్టుగా కన్పించింది. నాసా ఉద్దేశమూ నెరవేరింది. అదే క్రమంలో వివాదాలకూ తావిచ్చింది. జెండా తయారీలో పలు అంశాలను దృష్టిలో పెట్టుకున్నారు. జెండా కర్రను కూడా అతి తేలికగా, అదే సమయంలో అత్యంత తీవ్ర వాతావరణ పరిస్థితుల్లో కూడా అత్యంత మన్నికగా ఉండే అనోడైజ్డ్ అల్యూమినియంతో తయారు చేశారు. చంద్రుని నేలపై తేలిగ్గా దిగేందుకు, కిందకు వాలకుండా నిటారుగా ఉండేందుకు వీలుగా దాని మొదట్లో చిన్న స్ప్రింగ్‌ను అమర్చారు. ఇక జెండాను కూడా చంద్రునిపై తీవ్రమైన ఉష్ణోగ్రత తదితరాలను తట్టుకునేందుకు వీలుగా నైలాన్ బట్టతో తయారు చేశారు. అనంతరం పలు అపోలో మిషన్లలో కూడా ఇదే తరహా జెండాలను చంద్రునిపైకి పంపారు.



- సాక్షి, నేషనల్ డెస్క్



మృత్యుంజయుడు!

బాంబు దాడులకు నిండు గర్భిణి బలి
- కడుపులోని చిన్నారి మాత్రం సజీవంగానే
- సిజేరియన్ చేసి కాపాడిన వైద్యులు
- అద్భుతానికి వేదికైన గాజా

డెయిర్ అల్ బలా: మాటలకందని గాజా విషాదం కొన్ని అవాంఛిత అద్భుతాలకూ వేదికగా మారుతోంది. సెంట్రల్ గాజాలోని నజరేత్ సమీపంలో హమాస్ అధీనంలో ఉన్న ప్రాంతాలపై శనివారం రాత్రి ఇజ్రాయెల్ భారీగా దాడుల్లో 24 మంది దుర్మరణం పాలయ్యారు. వారిలో ఓలా అద్నాన్ హర్బ్ అల్‌కుర్ద్ అనే 9 నెలల నిండు గర్భిణి కుటుంబమూ ఉంది. ఆ ఇంట్లో ఆరుగురు దాడికి బలవగా ఆమె తీవ్రంగా గాయపడింది. దాంతో హుటాహుటిన అల్ అవ్దా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు తీవ్రంగా ప్రయత్నించినా గాయాల తీవ్రతకు తాళలేక అద్నాన్ కన్నుమూసింది. కానీ కడుపులోని బిడ్డ మాత్రం బతికే ఉన్నట్టు వైద్యులకు అనుమానం వచ్చింది. అల్ట్రా సౌండ్ చేసి చూడగా చిన్నారి గుండె కొట్టుకుంటున్నట్టు తేలింది. దాంతో హుటాహుటిన సిజేరియన్ చేశారు. పండంటి మగ బిడ్డను విజయవంతంగా కాపాడారు. మృత్యుంజయునిగా నిలిచిన అతనికి మలేక్ యాసిన్ అని పేరు పెట్టినట్టు సర్జన్ అక్రం హుసేన్ తెలిపారు. చిన్నారి శ్వాస తీసుకోవడంలో తీవ్రంగా ఇబ్బంది పడుతుండటంతో ఆక్సిజన్ అందించారు. పరిస్థితి కాస్త మెరుగు పడగానే ఇంక్యుబేటర్‌లో ఉంచి హుటాహుటిన డెయిర్ అల్ బలాలోని అల్ అక్సా ఆస్పత్రికి తరలించారు.

2020లో భారత్‌లో కరోనాతో...

11లక్షల అధిక మరణాలు

- అంతర్జాతీయ అధ్యయనం వెల్లడి
- తీవ్రంగా ఖండించిన కేంద్రం

న్యూఢిల్లీ: కరోనా వల్ల 2020లో భారత్‌లో కేంద్రం చెప్పిన వాటికంటే ఏకంగా 11.9 లక్షల అధిక మరణాలు సంభవించినట్లు అంతర్జాతీయ అధ్యయనం ఒకటి పేర్కొంది. ఇది భారత్ అధికారిక గణాంకాల కంటే 8 రెట్లు, డబ్ల్యూహెచ్ఓ అంచనాల కంటే ఒకటిన్నర రెట్లు అధికం! 2019తో పోలిస్తే ఈ మరణాలు 17 శాతం అధికమని అధ్యయనం పేర్కొంది. బ్రిటన్‌లోని ఆక్స్‌ఫర్డ్, మరికొన్ని విశ్వవిద్యాలయాల పరిశోధకులు ఈ అధ్యయనం నిర్వహించారు. ఇందుకు జాతీయ కుటుంబ ఆరోగ్య సర్వే–5 గణాంకాలను పరిగణనలోకి తీసుకున్నారు. 2019 నుంచి 2020 దాకా దేశవ్యాప్తంగా లక్షలాది మంది కరోనా బాధితుల డేటాను సైతం పరిశీలించారు. ప్రపంచవ్యాప్తంగా సంభవించిన కోవిడ్–19 సంబంధిత మరణాల్లో మూడింట ఒక వంతు మరణాలు ఇండియాలోనే చోటుచేసుకున్నాయని వెల్లడించారు. కోవిడ్–19 ప్రభావం వల్ల ప్రజల సగటు ఆయుర్దాయం 2.6 ఏళ్లు తగ్గినట్లు తెలిపారు. మహిళల ఆయుర్దాయం 3.1 ఏళ్లు, పురుషుల ఆయుర్దాయం 2.1 ఏళ్లు తగ్గినట్లు గుర్తించారు. అధ్యయనం వివరాలను 'సైన్స్ అడ్వాన్సెస్' పత్రికలో ప్రచురించారు.

అవన్నీ కరోనా మరణాలు కాదు

అధ్యయనం గణాంకాలపై కేంద్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అధ్యయనం ప్రజలను తప్పుదోవ పట్టించేలా ఉందని ఆక్షేపించింది. ఈ గణాంకాల్లో వాస్తవం లేదని, అవన్నీ కరోనా మరణాలు కావని పేర్కొంది.

యూపీఎస్సీ ఛైర్మన్

మనోజ్ సోనీ రాజీనామా

15 రోజుల క్రితమే రాజీనామా చేసినా ఇంకా ఆమోదించని రాష్ట్రపతి



సాక్షి, న్యూఢిల్లీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఛైర్మన్ మనోజ్ సోనీ తన పదవికి రాజీనామా చేశారు. గత ఏడాది ఏప్రిల్‌లో ఆయన ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. మరో ఐదేళ్ల పదవీ కాలం ఉండగానే అనూహ్యంగా రాజీనామా చేయడం గమనార్హం. ట్రైనీ ఐఏఎస్ అధికారి పూజా ఖేడ్కర్ వ్యవహారం తీవ్ర దుమారం రేపుతున్న నేపథ్యంలో ఆయన రాజీనామా చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. పూజా ఖేడ్కర్ వ్యవహారానికి, మనోజ్ సోనీ రాజీనామాకు సంబంధం లేదంటూ అధికారిక వర్గాలు వెల్లడించాయి. వ్యక్తిగత కారణాల వల్లే ఆయన పదవి నుంచి తప్పుకున్నారని తెలియజేశాయి. మనోజ్ సోనీ పదిహేను రోజుల క్రితమే తన రాజీనామా లేఖను రాష్ట్రపతి కార్యాలయానికి పంపినట్లు సమాచారం. అయితే శనివారం సాయంత్రం వరకు కూడా ఈ రాజీనామాను రాష్ట్రపతి ఆమోదించలేదు. 2029 మే 15 వరకు మనోజ్ సోనీ పదవీకాలం ఉంది. ఆయన గతంలో బరోడా మహారాజా సాయాజీరావు విశ్వవిద్యాలయం వీసీగా పనిచేశారు. గుజరాత్‌లోని డాక్టర్ బాబాసాహెబ్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీకి రెండు పర్యాయాలు వరుసగా వీసీగా సేవలందించారు. 2017 జూన్ 28న యూపీఎస్సీ సభ్యుడిగా నియమితులయ్యారు. గత ఏడాది మే 16న యూపీఎస్సీ ఛైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు.

రహస్యం ఎందుకు?: ఖర్గే

మనోజ్ సోనీ 15 రోజుల క్రితమే రాజీనామా చేస్తే ఇప్పటిదాకా ఎందుకు రహస్యంగా ఉంచారని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ప్రశ్నించారు. యూపీఎస్సీలో జరిగిన కుంభకోణాలకు, ఈ రాజీనామాకు మధ్య సంబంధం ఉందా? అని అనుమానం వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ గుజరాత్ నుంచి మనోజ్ సోనీని తీసుకొచ్చి యూపీఎస్సీ ఛైర్మన్‌గా నియమించారని చెప్పారు. ఈ మేరకు ఖర్గే శనివారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. యూపీఎస్సీ ఆధ్వర్యంలో జరిగిన నియామకాల్లో ఎన్నో అక్రమాలు చోటుచేసుకున్నాయని, వీటిపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు.

ఎన్టీఏ చీఫ్ పరిస్థితి ఏంటి?: జైరాం రమేష్

మనోజ్ సోనీ రాజీనామాపై కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ స్పందించారు. పూజా ఖేడ్కర్ వివాదం నేపథ్యంలో ఆయనను పక్కనపెట్టాల్సిన పరిస్థితి వచ్చినట్లు కనిపిస్తోందని పేర్కొన్నారు. మరి నీట్–యూజీ పరీక్ష నిర్వహించిన ఎన్టీఏ ఛైర్మన్ పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

బగ్‌తో పరిహాసమా?!

బ్రస్సెల్స్: మైక్రోసాఫ్ట్ విండోస్ ఆపరేటింగ్ సిస్టమ్‌లో బగ్ వల్ల బ్లూ స్క్రీన్ ఆఫ్ డెత్ ఎర్రర్ సమస్య తలెత్తడంతో శుక్రవారం ప్రపంచవ్యాప్తంగా కంప్యూటర్ ఆధారిత సేవలు నిలిచిపోయాయి. కోట్ల డాలర్ల నష్టం వాటిల్లిందని చెబుతున్నారు. సైబర్‌సెక్యూరిటీ సంస్థ క్రౌడ్‌స్ట్రైక్ అందించిన అప్‌డేట్‌లో బగ్ వల్లే ఈ సంక్షోభం ఏర్పడింది. ఇది చాలా తీవ్రమైన విషయం కాగా, బెల్జియం వ్యంగ్య రచయిత విన్సెంట్ ఫ్లిబస్టీర్ పరిహాసానికి దిగాడు. నెటిజన్లతో చీవాట్లు తింటున్నాడు. తాను క్రౌడ్‌స్ట్రైక్ సంస్థలో కొత్తగా ఉద్యోగంలో చేరానని, మొదటి రోజు సాఫ్ట్‌వేర్‌లో చిన్న అప్‌డేట్ చేశానని చెప్పుకొచ్చాడు. ఈ మేరకు 'ఎక్స్'లో పలు పోస్టులు పెట్టాడు. కోడ్‌లో కేవలం ఒక లైన్ మార్చడం వల్ల బగ్ ఏర్పడిందని తెలిపాడు. క్రౌడ్‌స్ట్రైక్ ఆఫీసులో దిగిన ఫొటోను కూడా షేర్ చేశాడు. నిజానికి అతడు ఈ సంస్థలో ఉద్యోగి కాదు. కృత్రిమ మేధ(ఏఐ) సాయంతో ఈ ఫొటో సృష్టించాడు. ఈ పోస్టు సోషల్ మీడియాలో వైరల్ మారింది. 3.8 లక్షల లైక్‌లు వచ్చాయి. 37,000 మంది షేర్ చేశారు. కొన్ని గంటల తర్వాత విన్సెంట్ మరో పోస్టు చేశాడు. సాఫ్ట్‌వేర్ అప్‌డేట్‌లో బగ్ కారణంగా తనను ఉద్యోగం నుంచి తొలగించారని బాధపడ్డాడు. ఇది చాలా అన్యాయం అంటూ ఆక్రోశించాడు. తనకు ఎవరైనా ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలని దీనంగా వేడుకున్నాడు. 'ఎక్స్' అధినేత ఎలాన్ మస్క్‌ను సైతం కోరాడు. తాను బాధపడుతున్న వీడియోను పంచుకున్నాడు. నెటిజన్లు చాలామంది ఇదంతా నిజమేనని నమ్మేశారు. కానీ, నిజం దాగదు కదా! వాస్తవం ఏమిటో తెలిసిపోయింది. పిచ్చి వేషాలు మానుకోవాలంటూ విన్సెంట్‌పై నెటిజన్లు మండిపడుతున్నారు. విన్సెంట్ నార్డ్‌ప్రెస్ అనే బెల్జియన్ పేరడీ న్యూస్ సైట్‌కు వార్తలు రాస్తుంటాడు.

క్రౌడ్‌స్ట్రైక్ అతలాకుతలం

పడిపోయిన షేర్ విలువ

వాషింగ్టన్: ప్రపంచమంతటినీ అతలాకుతలం చేసిన విండోస్ ఆపరేటింగ్ సిస్టం సాంకేతిక సమస్య ఆర్థికంగా కూడా అంతర్జాతీయంగా గట్టి ప్రభావమే చూపింది. పలు దిగ్గజ సంస్థల షేర్ల విలువ తగ్గుముఖం పట్టింది. ముఖ్యంగా తప్పుడు అప్‌డేట్‌తో సమస్యకు కారణమైన సైబర్ సెక్యూరిటీ దిగ్గజం క్రౌడ్‌స్ట్రైక్‌కు ఆర్థికంగా గట్టి దెబ్బే తగిలింది. శుక్రవారం ఆ సంస్థ షేర్ వాల్యూ ఒక్కసారిగా 11 శాతానికి పైగా పడిపోయింది. 42.22 డాలర్లున్న ఒక్కో వాటా విలువ 30 డాలర్లకు తగ్గింది. సంస్థ మొత్తం విలువ 83 బిలియన్ డాలర్ల పై చిలుకని అంచనా. ఆ లెక్కన 900 కోట్ల డాలర్లకు పైగా హరించుకుపోయినట్టే. అయితే ఆర్థిక నష్టం కంటే కూడా ప్రపంచంలోనే అగ్రశ్రేణి సైబర్ సెక్యూరిటీ సంస్థగా క్రౌడ్‌స్ట్రైక్‌కు ఉన్న ఇమేజీకి జరిగిన నష్టమే చాలా ఎక్కువ. ఎందుకంటే దాని కస్టమర్లుగా ఉన్న కంపెనీలు, పెద్ద సంస్థల్లో చాలావరకు తమ సైబర్ సెక్యూరిటీ బాధ్యతల కోసం ఇతర సైబర్ సెక్యూరిటీ సంస్థలవైపు చూస్తున్నట్టు సమాచారం. ప్రపంచ కుబేరుడు, టెస్లా, స్పేస్ ఎక్స్ వంటి దిగ్గజ కంపెనీల సీఈఓ ఎలాన్ మస్క్ ఇప్పటికే ఈ జాబితాలో చేరారు. ''మా వ్యవస్థల నుంచి క్రౌడ్‌స్ట్రాక్‌ను తొలగించేశాం'' అంటూ ఆయన సోషల్ మీడియాలో తాజాగా పోస్ట్ చేశారు. సెంటినల్ వన్, పాలో ఆల్టో నెట్‌వర్క్ వంటి క్రౌడ్‌స్ట్రాక్ ప్రత్యర్థి కంపెనీలు ఈ పరిస్థితిని రెండు చేతులా సొమ్ము చేసుకుంటున్నాయి.

భారీ పరిహారాలు!

మరోవైపు క్రౌడ్‌స్ట్రైక్ కస్టమర్లంతా తమకు జరిగిన నష్టానికి ఆ సంస్థ నుంచి భారీగా నష్టపరిహారం డిమాండ్ చేసేలా ఉన్నాయి. మైక్రోసాఫ్ట్ వంటి దిగ్గజాలు ఆ సంస్థ క్లయింట్ల జాబితాలో ఉండటం తెలిసిందే. షట్‌డౌన్ దెబ్బకు వాటి షేర్ల విలువ సగటున ఒక శాతం దాకా పడిపోయినట్టు వాషింగ్టన్ పోస్ట్ పేర్కొంది.

యూసీసీ కింద నమోదైతే పోలీసు రక్షణ

ఉత్తరాఖండ్ హైకోర్టు సూచన!

నైనిటాల్: సహజీవనం చేస్తున్న ఓ జంట తమకు రక్షణ కల్పించాలంటూ వేసిన పిటిషన్‌పై ఉత్తరాఖండ్ హైకోర్టు వెలువరించిన తీర్పు అందరినీ ఆశ్చర్యంలో ముంచెత్తింది. రాష్ట్రంలో ఉమ్మడి పౌర స్మృతి(యూసీసీ) ఇంకా అమల్లో రాలేదు. అయినప్పటికీ ఈ చట్టం కింద 48 గంటల్లోగా రిజిస్టర్ చేసుకున్న పక్షంలో పిటిషన్‌దారుగా ఉన్న జంటకు ఆరు వారాలపాటు రక్షణ కల్పించాలంటూ పోలీసు శాఖను ఆదేశిస్తూ జస్టిస్ మనోజ్ కుమార్ తివారీ, జస్టిస్ పంకజ్ పురోహిత్‌ల డివిజన్ బెంచ్ తీర్పు వెలువరించింది. ఈ పరిణామంపై ప్రభుత్వ న్యాయవాది స్పందిస్తూ వివరణ ఇచ్చారు. 'పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రభుత్వం తరఫున జూనియర్ న్యాయవాది హాజరయ్యారు. రాష్ట్రంలో యూసీసీ అమలుపై ప్రభుత్వం నోటిఫికేషన్ ఇంకా వెలువడలేదనే విషయం ఆయనకు తెలియదు. అవగాహనా లోపం వల్ల ఇలా జరిగింది. దీనిపై హైకోర్టులో రీ కాల్ పిటిషన్ వేస్తాం. హైకోర్టు ఈ తీర్పును సవరించి, మళ్లీ ఉత్తర్వులు జారీ చేస్తుంది' అని చెప్పారు. అదే సమయంలో, ఆ జంటకు పోలీసులు రక్షణ కల్పిస్తారని కూడా ప్రభుత్వ న్యాయవాది స్పష్టం చేశారు. వేర్వేరు మతాలకు చెందిన తమ కుటుంబాల నుంచి ముప్పుందంటూ సహజీవనం చేస్తున్న 26 ఏళ్ల హిందూ మహిళ, 21 ఏళ్ల ముస్లిం యువకుడు వేసిన పిటిషన్ ఈ మొత్తం వ్యవహారానికి కారణమైంది. ఉత్తరాఖండ్ ప్రభుత్వం ప్రతిపాదించిన యూసీసీ ప్రకారం యువ జంటలు తాము సహజీవనం చేస్తున్న రోజు నుంచి నెల రోజుల్లోగా అధికారుల వద్ద నమోదు చేసుకోకుంటే జరిమానా విధించొచ్చు.

ఒకే సెంటర్‌లో 85 శాతం మందికి అర్హత

పరీక్షా కేంద్రాలు, నగరాల వారీగా నీట్–యూజీ ఫలితాలు విడుదల

న్యూఢిల్లీ: సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నీట్–యూజీ ఫలితాలను పరీక్షా కేంద్రాలు, నగరాల వారీగా శనివారం విడుదల చేసింది. ఫలితాలను వెబ్‌సైట్‌లో అందుబాటులో తీసుకొచ్చింది. ఈ ఫలితాలను పరిశీలిస్తే విస్మయకరమైన అంశాలు బయటపడుతున్నాయి. గుజరాత్‌లోని రాజ్‌కోట్‌లో ఒకే పరీక్షా కేంద్రంలో నీట్ రాసిన అభ్యర్థుల్లో ఏకంగా 85 శాతం మంది అర్హత సాధించినట్లు తెలుస్తోంది. రాజ్‌కోట్‌లోని యూనిట్ స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్ ఎగ్జామ్ సెంటర్‌లో 22,701 మంది నీట్ రాశారు. వీరిలో 85 శాతం అర్హత సాధించారు. ఈ సెంటర్లో 12 మంది 700కు పైగా, 115 మంది 650కిపైగా, 259 మంది 600కు పైగా, 403 మంది 550కిపైగా స్కోర్ సాధించారు. అలాగే రాజస్తాన్‌లోని విద్యాభారతి శిఖర్ సెంటర్‌లో పరీక్ష రాసినవారిలో కూడా చాలామందికి మెరుగైన స్కోర్ లభించింది. అక్కడ 8 మంది 700కు పైగా, 69 మంది 650కిపైగా, 155 మంది 600కుపైగా, 241 మంది 500కు పైగా స్కోర్ సాధించారు.

హరియాణాలోని రోహ్‌తక్‌లో మోడల్ స్కూల్ సెంటర్‌లో పరీక్ష రాసిన వారిలో 45 మంది అభ్యర్థులకు 600కుపైగా స్కోర్ లభించింది. హరియాణాలోని ఝజ్జర్‌లో హర్‌దయాల్ పబ్లిక్ స్కూల్ సెంటర్‌లో ఇంతకముందు ఆరుగురు అభ్యర్థులకు 720కి 720 స్కోర్ దక్కింది. గ్రేసు మార్కులను తొలగించి, ఫలితాలను సవరించిన తర్వాత ఈ సెంటర్‌లో 13 మంది అభ్యర్థులు 600కుపైగా స్కోర్ సాధించారు. 682 స్కోర్ ఎవరికీ దాటలేదు.

నీట్ కేసులో మరో ముగ్గురి అరెస్టు

నీట్ పేపర్ లీక్ కేసులో సూత్రధారుల్లో ఒకరిగా భావిస్తున్న వ్యక్తిని సీబీఐ అధికారులు శనివారం అరెస్టు చేశారు. అతడిని ఎన్ఐటీ–జంషెడ్‌పూర్ బీటెక్ గ్రాడ్యుయేట్ శశికాంత్ పాశ్వాన్ అలియాస్ శశిగా గుర్తించారు. అలాగే ఇదే కేసులో ఇద్దరు ఎంబీబీఎస్ విద్యార్థులను అదుపులోకి తీసుకున్నారు. దీంతో ఇప్పటిదాకా అరెస్టయిన వారి సంఖ్య 21కి చేరుకుంది.

బంగ్లాదేశ్‌లో ఉద్రిక్తతలు తీవ్రతరం...

కనిపిస్తే కాల్చివేత!

ఢాకా/సాక్షి, న్యూఢిల్లీ: బంగ్లాదేశ్ అట్టుడుకుతోంది. రిజర్వేషన్లపై వారం క్రితం మొదలైన దేశవ్యాప్త హింసాకాండ నానాటికీ పెరిగిపోతోంది. భద్రతా సిబ్బందికి, విద్యార్థులకు మధ్య జరుగుతున్న ఘర్షణల్లో మృతి చెందిన వారి సంఖ్య శనివారంతో 115 దాటింది! రాజధాని ఢాకాతో పాటు ప్రధాన నగరాలు, పట్టణాల్లో కర్ఫ్యూ విధించినా, సైనికులు, పోలీసులు భారీ ఎత్తున మోహరించారు. అయినా లాభం లేకపోగా పరిస్థితి విషమించడమే గాక పూర్తిగా అదుపు తప్పుతోంది. దాంతో తాజాగా కనిపిస్తే దేశవ్యాప్తంగా కాల్చివేత (షూట్ ఎట్ సైట్) ఉత్తర్వులు జారీ అయ్యాయి!

- సైన్యం, పోలీసుల గుప్పెట్లో దేశం
- 'రిజర్వేషన్ల' ఘర్షణలు తీవ్రతరం
- ఇప్పటికే 115 దాటిన మరణాలు

978 మంది భారతీయులు వెనక్కు

బంగ్లాదేశ్ నుంచి 978 మంది భారతీయ విద్యార్థులను కేంద్రం సురక్షితంగా వెనక్కు తీసుకొచ్చింది. 778 మంది నౌకల్లో, 200 మంది విమానాల్లో వచ్చారు. బంగ్లాదేశ్‌లో పలు వర్సిటీల్లో ఇంకా 4 వేలకు పైగా భారతీయ విద్యార్థులున్నారు. వారందరినీ సురక్షితంగా తీసుకొచ్చేందుకు ఢాకాలోని భారత హైకమిషన్ కృషి చేస్తోంది.

ఇదీ సమస్య...

1971 బంగ్లాదేశ్ వార్ వెటరన్ల కుటుంబీకులకు ప్రభుత్వోద్యోగాల్లో 30 శాతం రిజర్వేషన్లు అమల్లో ఉన్నాయి. 2018లో షేక్ హసీనా వీటిని రద్దు చేసింది. ఈ నిర్ణయాన్ని ఢాకా హైకోర్టు తాజాగా తప్పుబట్టింది. ఆ రిజర్వేషన్లను పునరుద్ధరించాలంటూ జూన్ 5న ఆదేశాలిచ్చింది. దీనిపై విద్యార్థులు, ఉద్యోగార్థులు భగ్గుమన్నారు. దేశవ్యాప్తంగా వీటిని వ్యతిరేకిస్తూ భారీగా నిరసనలు, ఆందోళనలకు దిగారు. కోటా పునరుద్ధరణ వద్దే వద్దంటూ రోడ్డెక్కారు. దాంతో కోర్టు ఉత్తర్వులను హసీనా ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. హైకోర్టు ఉత్తర్వులను సుప్రీంకోర్టు తాత్కాలికంగా పక్కన పెట్టింది. పరిస్థితి తీవ్రత దృష్ట్యా ఆదివారం తుది విచారణకు అంగీకరించింది.

తక్కువ కేలరీల ఆహారం తీసుకుంటున్నారు

- తీహార్ జైల్లో ఉన్న కేజ్రీవాల్‌పై ఢిల్లీ ఎల్జీ వ్యాఖ్యలు
- తమ నేతను చంపేందుకు బీజేపీ కుట్ర అంటూ మండిపడ్డ ఆప్

న్యూఢిల్లీ: తీహార్ జైలులో జ్యుడీషియల్ కస్టడీలో ఉన్న ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఉద్దేశపూర్వకంగానే తక్కువ కేలరీలున్న ఆహారం తీసుకుంటున్నారని లెఫ్టినెంట్ గవర్నర్ వీకే సక్సేనా ఆరోపించారు. వైద్యులు సూచించిన మందులను కూడా ఆయన వాడకపోవచ్చని పేర్కొన్నారు. తీహార్ జైలు సూపరింటెండెంట్ నివేదికను ప్రస్తావిస్తూ ఎల్జీ ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నరేశ్ కుమార్‌కు లేఖ రాసినట్లు రాజ్‌భవన్ వర్గాలు శనివారం తెలిపాయి. కేజ్రీవాల్‌కు ఇంటి వద్ద నుంచి వచ్చిన ఆహారాన్ని సరిపోను అందజేస్తున్నా కూడా ఆయన కావాలనే తక్కువ కేలరీలున్న ఆహారం తింటున్నట్లుగా ఆధారాలున్నాయన్నారు. గ్లూకోమీటర్ టెస్ట్ రీడింగ్‌కు, కంటిన్యువస్ గ్లూకోజ్ మానిటరింగ్ సిస్టం రీడింగ్‌కు మధ్య కనిపిస్తున్న భారీ వ్యత్యాసంపై అధికారులు పరిశీలన జరపాలని సూచించారు.

ఎల్జీ వైద్యుడనే విషయం తెలియదు

ఎల్జీ వీకే సక్సేనా రాసిన లేఖపై ఢిల్లీ మంత్రి సౌరభ్ భరద్వాజ్ స్పందిస్తూ.. నాకు తెలిసినంత మటుకు ఆయన గతంలో సిమెంట్ ఫ్యాక్టరీలో పనిచేసే వారు. వీకే సక్సేనా డాక్టర్ అని, ఆరోగ్య అంశాల్లో మంచి నిపుణుడనే విషయం నాకు తెలియదు. ఎప్పుడైనా ఆయన ఎన్నికల్లో పోటీ చేసి ఉంటే, ఈసీకి సమర్పించిన అఫిడవిట్‌ను చదివి ఉండేవాళ్లం' అంటూ ఎద్దేవా చేశారు. తమ నేతను చంపేందుకు బీజేపీ దుర్మార్గపు పథకం పన్నిందని ఆరోపించారు.

అక్రమ మైనింగ్ కేసు..

హరియాణా కాంగ్రెస్ ఎమ్మెల్యే అరెస్ట్



న్యూఢిల్లీ: అక్రమ మైనింగ్ కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై హరియాణాకు చెందిన కాంగ్రెస్ ఎమ్మెల్యే సురేందర్ పన్వర్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) అరెస్ట్ చేసింది. శనివారం ఉదయం గురుగ్రామ్‌లో ఆయన్ను అదుపులోకి తీసుకున్నట్లు ఈడీ వర్గాలు తెలిపాయి. అంబాలాలోని ప్రత్యేక కోర్టుల్లో ఆయన్ను హాజరుపర్చనున్నారు. హరియాణాలోని యమునానగర్ ప్రాంతంలో భారీ ఎత్తున అక్రమ మైనింగ్‌కు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై ఈ ఏడాది జనవరిలో ఈడీ అధికారులు ఆయన నివాసాలపై దాడులు జరిపారు. ఇదే కేసులో ఇండియన్ లోక్ దళ్ ఐఎన్ఎల్‌డీకి చెందిన యమునానగర్ ఎమ్మెల్యే దిల్బాగ్ సింగ్, ఆయన సన్నిహితుడు కుల్వీందర్ సింగ్‌ను ఈడీ అధికారులు అరెస్ట్ చేశారు.

ఉక్రెయిన్ మాజీ ఎంపీ దారుణ హత్య



కీవ్: ఉక్రెయిన్ మాజీ పార్లమెంట్ సభ్యురాలు ఇరినా ఫరియోన్(60)శనివారం లీవ్ నగరంలో హత్యకు గురయ్యారు. గుర్తు తెలియని దుండగుడు జరిపిన కాల్పుల్లో ఆమె తీవ్ర గాయాలతో చనిపోయారు. ఉక్రెయిన్ భాష వ్యాప్తికి ఎనలేని కృషి చేస్తున్న ఇరినా మృతి పట్ల అధ్యక్షుడు జెలెన్‌స్కీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. దుండగుడిని పట్టుకునేందుకు అన్ని విధాలుగా ప్రయత్నాలు మొదలయ్యాయని ఆయన అన్నారు. ఘటన వెనుక రష్యా ఉండి ఉండొచ్చని అనుమానం వ్యక్తం చేశారు. ఉక్రెయిన్ ప్రజలు రష్యన్ బదులు మాతృ భాషలోనే మాట్లాడేలా ఇరినా తీవ్రంగా కృషి చేస్తున్నారు. అయితే, రష్యాతో జరుగుతున్న యుద్ధంలో కీలకమైన మరియుపోల్ రక్షణ కోసం సర్వశక్తులూ ఒడ్డిన అజోవ్ రెజిమెంట్ సైనికులు రష్యన్ భాష మాట్లాడటంపై ఇరినా చేసిన వ్యాఖ్యలు గతంలో వివాదాస్పదమయ్యాయి. పలు సామాజిక, రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనే ఇరినాకు వ్యక్తిగతంగా కూడా విరోధులున్నారని పోలీసులు చెబుతున్నారు.

చైనాలో ఆకస్మిక వరదలు.. కూలిన వంతెన

12 మంది మృతి, మరో 60 మంది గల్లంతు




బీజింగ్: చైనాలోని షాంగ్జి, సిచువాన్ ప్రావిన్స్‌ల్లో సంభవించిన ఆకస్మిక వరదలు, వంతెన కూలిన ఘటనల్లో 12 మంది చనిపోగా మరో 60 మందికిపైగా గల్లంతయ్యారు. షాంగ్జి ప్రావిన్స్‌లోని షంగ్లువో నగరంలో ఎడతెరిపి లేని వానలు, ఆకస్మిక వరదలతో శుక్రవారం రాత్రి వంతెన కూలింది. దీంతో, 17 కార్లు, 8 ట్రక్కులు దిగువనున్న జిన్‌క్వియాన్ నదిలో పడిపోయాయి. ఘటనలో 12 మంది మృతి చెందగా, మరో 31 మంది జాడ తెలియడం లేదని అధికారులు చెప్పారు. ఏడు వాహనాల్ని వెలికి తీశామని, కొట్టుకుపోయిన వారి కోసం గాలింపు కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అదేవిధంగా, సిచువాన్ ప్రావిన్స్‌లో శనివారం వేకువజామున సంభవించిన భారీ వర్షాలు, ఆకస్మిక వరదల్లో జిన్హువా గ్రామంలోని 40కి పైగా నివాసాలు కొట్టుకుపోయాయి. ఈ ఘటనలో 30 మందికి పైగా గల్లంతయ్యారు. వరదల కారణంగా పలు ప్రావిన్స్‌ల్లో రోడ్లు, వంతెనలు, సమాచార వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నట్లు అధికారులు తెలిపారు.

లాయర్లూ.. ఆధిపత్య ధోరణి వద్దు: సీజేఐ



సాక్షి, చెన్నై: వృత్తిలోకి కొత్తగా వస్తున్న జూనియర్ లాయర్ల పట్ల చిన్న చూపు తగదని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్ పేర్కొన్నారు. జూనియర్ న్యాయవాదులు అనుభవం గడించేందుకు, పైకెదిగేందుకు సహకరిస్తూ వారికి మార్గదర్శకులుగా వ్యవహరించాలని సీనియర్ లాయర్లకు ఉద్బోధించారు. జూనియర్ల పట్ల ఆధిపత్య ధోరణిని విడనాడాలన్నారు. మద్రాస్ హైకోర్టు మదురై బెంచ్ 20వ వార్షికోత్సవాలను శనివారం సీజేఐ ప్రారంభించారు. ''జూనియర్ లాయర్ల నుంచి కూడా నేర్చుకోవాల్సింది చాలా ఉంది. నెలంతా పని చేయించుకుని కేవలం రూ.5 వేలు ఇవ్వడమంటే వారిని గేట్ కీపర్లుగా మార్చడమే'' అన్నారు. ఢిల్లీ హైకోర్టు డేటా నిల్వ, సాఫ్ట్‌వేర్ బ్యాకప్ కోసం మదురై బెంచ్‌లో 'డిజాస్టర్ రికవరీ సెంటర్'ను ఏర్పాటు చేసుకోవడాన్ని సీజేఐ ప్రస్తావించారు. 'ఇకపై ఢిల్లీకి సమస్య వస్తే పరిష్కారానికి తమిళనాడు వైపు చూస్తుందన్నమాట' అంటూ చమత్కరించారు.

పోటీలో నేనే.. త్వరలో ప్రచారం: బైడెన్




వాషింగ్టన్: ఎవరెన్ని చెప్పినా ఎన్నికల బరినుంచి తప్పుకునేదే లేదని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ (81) కుండబద్దలు కొట్టారు. కరోనా నుంచి కోలుకోగానే త్వరలో మళ్లీ ప్రచార బరిలో దిగుతానని ప్రత్యర్థి డొనాల్డ్ ట్రంప్‌ను దీటుగా ఢీకొంటానని శనివారం ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుతం డెలావెర్‌లోని సొంతింట్లో ఐసోలేషన్‌లో గడుపుతున్న బైడెన్ వారం పాటు అక్కడే విశ్రాంతి తీసుకోనున్నారు.

జార్ఖండ్ జనాభాపై శ్వేతపత్రం: అమిత్ షా



రాంచీ: గిరిజనుల జనాభా అధికంగా ఉన్న జార్ఖండ్‌లోకి అక్రమ వలసలు, చొరబాట్లు విచ్చలవిడిగా కొనసాగుతున్నాయని కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా ఆరోపించారు. ఈ అక్రమ వలసలు, చొరబాట్ల వల్ల గిరిజనులకు తీవ్ర నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి వస్తే జనాభా స్థితిగతులపై శ్వేతపత్రం విడుదల చేస్తామని, గిరిజనుల భూములు, హక్కులు, రిజర్వేషన్లు కాపాడుతామని ప్రకటించారు. శనివారం రాంచీలో బీజేపీ కార్యనిర్వాహక కమిటీ భేటీలో అమిత్ షా మాట్లాడారు. రాష్ట్ర జనాభాలో ఎవరెంత మంది ఉన్నారో తేల్చాల్సిందేనని అన్నారు. చొరబాటుదారులు జార్ఖండ్‌లోకి ప్రవేశించి, స్థానిక మహిళలను పెళ్లి చేసుకొని, ధ్రువపత్రాలు పొందుతున్నారని, గిరిజనుల భూములు కాజేస్తున్నారని విమర్శించారు. స్థానికులకు దక్కాల్సిన ఉద్యోగాలను కొల్లగొడుతున్నారని మండిపడ్డారు. సీఎం హేమంత్ సోరెన్ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నారని, లవ్ జిహాద్, ల్యాండ్ జిహాద్‌ను ప్రోత్సహిస్తున్నారని అమిత్ షా ఆగ్రహం వ్యక్తం చేశారు. ఓట్ల కోసం ఓ వర్గం ప్రజలను బుజ్జగిస్తున్నారని దుయ్యబట్టారు. లోక్‌సభ ఎన్నికల్లో ఓడిపోయినప్పటికీ కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీలో అహంకారం తగ్గలేదని విమర్శించారు.

మంత్రి జితిన్ ప్రసాదకు తప్పిన ప్రమాదం



పిలిభిత్(యూపీ): కేంద్ర సిబ్బంది వ్యవహారాల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాదకు త్రుటిలో ప్రమాదం తప్పింది. శనివారం ఆయన ప్రయాణిస్తున్న కారు కాన్వాయ్‌లోని మరో రెండు కార్లను ఢీకొట్టింది. ఘటనలో మూడు కార్లు దెబ్బతిన్నాయి. అదృష్టవశాత్తూ ఎవరికీ ఎటువంటి ప్రమాదం జరగలేదని మంత్రి సహాయకుడొకరు చెప్పారు. సొంత నియోజకవర్గం పిలిభిత్‌లో వరదలతో దెబ్బతిన్న గ్రామాలను పరిశీలించేందుకు వెళ్లగా మఝోలా–బిర్ఖానీ మధ్య ప్రమాదం చోటుచేసుకుంది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
ఆదివారం । 21 । జూలై । 2024

అప్పణ్ణ జయంతి



ప్రముఖ వాగ్గేయకారుడు, సంఘ సంస్కర్త హడపద అప్పణ్ణ జయంతి సందర్భంగా శనివారం బెళగావి నగరంలో ర్యాలీ. అలరించిన మహిళా కళాకారుల ప్రదర్శన

మైసూరు దసరాకు సన్నాహాలు

- గజరాజుల ఎంపిక పూర్తి?
- ఆగస్టు 9న గజ పయనం!



అందరూ ఎదురుచూసే దసరా ఉత్సవాలు (ఫైల్)

మైసూరు: మైసూరు దసరా అనగానే అందరికీ ఆనందంతో మనసు పులకరిస్తుంది. ప్రపంచ ప్రసిద్ధ నాడ హబ్బ మైసూరు దసరా మహోత్సవాలకు ఏర్పాట్లు షురూ అయ్యాయి. ఈ ఏడాది అక్టోబరు 12న దసరా పండుగ జరగనుంది. గతేడాది కంటే 12 రోజులు ముందుగానే ఈసారి పండుగ వస్తున్నందున మైసూరులో వేడుకల ఏర్పాట్లకు ప్యాలెస్, జిల్లా అధికారులు నడుం బిగించారు. 9 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలతో మైసూరు శోభాయమానం కానుంది.

దసరా వేడుకలలో గజరాజులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అడవులలోని అటవీశాఖ శిబిరాలలో ఉండే ఏనుగులను మైసూరుకు తీసుకు రావాల్సి ఉంది. ఇందుకోసం ఉత్సవం మాదిరిగా గజ పయనం నిర్వహిస్తారు. 14 ఏనుగులతో పాటు అదనంగా మరో నాలుగు కలిసి 18 ఏనుగులను ఎంపిక చేస్తారు. వాటిని ఆగస్టు 9వ తేదీ లేదా 11వ తేదీన మైసూరు ప్యాలెస్‌కు ఊరేగింపుగా తీసుకొస్తారు. ఇందులో మొదటి దశలో 9 ఏనుగులను తరలిస్తారు. మరో వారం తరువాత మిగతా గజరాజులను రప్పిస్తారు.



అడవుల నుంచి సర్వాంగ సుందరంగా మైసూరుకు వస్తున్న గజరాజులు (ఫైల్)

ఈసారి వైభవంగా

అక్టోబరు 12న దసరా రోజున జంబూ సవారీ వేడుకలను జరుపుతారు. రాష్ట్రంలో ఈదఫా మంచి వర్షాలు పడుతుండటంతో పాటు కేఆర్ఎస్, ఆల్మట్టి, కబిని వంటి జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఎలాంటి సంశయం లేకుండా భారీ ఎత్తున దసరా మహోత్సవాలను జరపాలని ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది తీవ్రమైన దుర్భిక్షం వల్ల వేడుకలను తక్కువ ఆర్భాటంతో నిర్వహించారు.

శిబిరాలలో ఏనుగుల ఎంపిక

ఏనుగులను 60 రోజులు ముందుగానే మైసూరుకు తీసుకొస్తారు. ఇప్పటికే మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని నాగరహొళె అడవిలోని మత్తిగోడు, భీమనకట్టి, దొడ్డహరవె, కొడగు జిల్లాలోని దుబారె, బండీపురలోని రాంపుర ఏనుగుల శిబిరానికి మైసూరు వన్యజీవుల విభాగం డీసీఎఫ్ బీఎం శరణబసప్ప ఆధ్వర్యంలో అటవీ అధికారులు వెళ్లారు. పశు వైద్యులతో కలిసి సుమారు 22 ఏనుగులను పరిశీలించారు. వాటిలో 18 ఏనుగుల జాబితాను తయారు చేసి అందులో 14 ఏనుగులను జంబూసవారి కోసం ఎంపిక చేస్తారు. మిగిలిన 4 ఏనుగులను అవసరానికి అందుబాటులో ఉంచుతారు.

కెప్టెన్ అభిమన్యు..

మొదటి బృందంలో మత్తిగోడు క్యాంప్ నుంచి సీనియర్ ఏనుగు కెప్టెన్ అభిమన్యు (58), భీమ, ఏకలవ్య (39), భీమనకట్టి క్యాంప్ నుంచి వరలక్ష్మి (68), దుబారె నుంచి ధనుంజయ (41), గోపి (42), కంజన్ (25), రామాపుర క్యాంప్ నుంచి రోహిత (22), లక్ష్మి (23) అనే ఏనుగులను తీసుకురావాలని నిర్ణయించారు. రెండవ బృందంలో దుబారె క్యాంప్ నుంచి ప్రశాంత్ (51), సుగ్రీవ (42), మత్తిగోడు నుంచి మహేంద్ర (41), దొడ్డహరవె నుంచి లక్ష్మి (53), రాంపుర నుంచి హిరణ్య (37)లను తరలిస్తారు. అదనంగా దుబారె క్యాంప్ నుంచి ప్రశాంత (49), అయ్యప్ప (13), రాంపుర నుంచి పార్థసారథి (19), మాలాదేవి (37)లను ఎంపిక చేశారు.



కనువిందు చేయనున్న ఉత్సవాలు

నాటుబాంబు పేలి ఎలుగుబంటి మృతి

మైసూరు: రెండు వేర్వేరు ప్రమాదాల్లో అరుదైన వన్యజీవులు దుర్మరణం చెందాయి. చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేటె తాలూకాలోని బండీపుర అభయారణ్యంలోని హొరెయల గ్రామంలో చెరుకు తోటలో నాటుబాంబు పేలి ఏడాది వయసున్న ఎలుగుబంటి మరణించింది. మహాదేవస్వామి అనే రైతు చెరుకు తోటలోకి అడవి పందులు వచ్చి పంటను పాడుచేయకుండా అక్కడక్కడా నాటు బాంబులను ఉంచాడు. శనివారం ఓ ఎలుగుబంటి వచ్చి దానిని తొక్కడంతో పేలి దుర్మరణం చెందింది. అటవీ సిబ్బంది చేరుకుని కేసు నమోదు చేశారు. రైతు పరారీలో ఉన్నాడు.

మరో చోట చిరుత..

గుండ్లుపేటె తాలూకాలోనే శీగెవాడి గ్రామంలో ఓ పొలంలోని కరెంటు స్థంభం నుంచి వైరు తెగి పడి ఉంది. దానిని తాకి ఆరు నెలల వయసున్న చిరుతపులి అక్కడే మృతి చెందింది. అటవీ సిబ్బంది పరిశీలించి చిరుత కళేబరాన్ని తరలించారు.

ఆవును చంపిన పులి

మైసూరు: అడవిలో నుంచి ఆహారం కోసం వచ్చిన పెద్ద పులి ఓ గ్రామంలో దాడి చేసి ఆవును హతమార్చింది. జిల్లాలోని హెచ్‌డి కోటె తాలూకాలోని కృష్ణాపుర గ్రామంలో ఈ సంఘటన జరిగింది. పులి దాడితో పల్లె ప్రజల్లో భయం అలముకొంది. శనివారం తెల్లవారుజామున రామస్వామి అనే రైతుకు చెందిన ఇంటి వద్ద కట్టివేసిన ఆవును పులి చంపి కొంత భక్షించింది. ఈ పశువుల కొట్టం వెనుక పులి అడుగులు కనిపించాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ సిబ్బంది చేరుకుని పులి కోసం గాలింపు చేపట్టారు.

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్టులో అదే గందరగోళం

- 55 విమానాలు రద్దు



ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీ

దొడ్డబళ్లాపురం: మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో సంక్షోభం కొనసాగుతోంది. సుమారు 55 విమానాలు రద్దయ్యాయి.77 విమానాలు ఆలస్యంగా నడిచాయి. వీటిలో చాలావరకూ విమానాలు ఇండిగో సంస్థకు చెందినట్లు సమాచారం. మైక్రోసాఫ్ట్ లో సమస్య కారణంగా చెక్ ఇన్‌ను ఆన్‌లైన్‌లో కాకుండా బోర్డుల మీద చాక్‌పీస్‌తో రాసి నిర్వహించారు. టెర్మినల్‌లో పేపర్ బోర్డింగ్ పాస్ ఇచ్చారు. 1, 2వ టెర్మినల్స్‌లో క్యూ లైన్లు నిదానంగా సాగాయి. ప్రయాణికుల సంఖ్య గంటగంటకూ పెరిగిపోగా, విమానాలు రద్దు కావడంతో గందరగోళం ఏర్పడింది. అనేకమంది ముఖ్యమైన పనుల మీద వెళ్లాల్సి ఉండగా విమానాలు మొండిచేయి చూపడంతో లబోదిబోమన్నారు. ప్రయాణికులు తిరిగి డబ్బులు పొందడానికి కౌంటర్ల వద్ద పడిగాపులు కాశారు.

గంధపు చెక్కల డంప్ సీజ్



స్వాధీనపరుచుకున్న గంధపు మొద్దులు

కృష్ణరాజపురం: గంధపు చెక్కల దొంగతనం, రవాణా, నిల్వ మిస్టరీని ఛేదించిన రాష్ట్ర అటవీ జాగృత దళ సిబ్బంది రూ.2 కోట్లకు పైగా విలువ చేసే గంధపు చెక్కల డంప్‌ను పట్టుకున్నారు. కేఆర్ పురం ఐటీఐ ఫ్యాక్టరీ ఆవరణలోని ఓ గోదాముపై దాడి చేసిన అటవీ అధికారులు అక్కడ రెండు టన్నులకు పైగా నిల్వ చేసిన గంధపు చెక్కలను స్వాధీనం చేసుకుని గోడౌన్‌కు సీల్ చేశారు. వాటిని నిల్వ చేసిన వారి కోసం విచారణ సాగుతోంది.

విమానాశ్రయంలో రూ.3.5 కోట్ల గంజాయి సీజ్



హైడ్రోఫోనిక్ గంజాయి (ఫైల్)

దొడ్డబళ్లాపురం: విదేశాల నుండి అక్రమంగా తరలిస్తున్న రూ.3.5 కోట్ల విలువైన 3 కేజీల హైడ్రోఫోనిక్ గంజాయిని కెంపేగౌడ ఏర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు సీజ్ చేసారు. బ్యాంకాక్ నుంచి ప్రత్యేకంగా పండించిన గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన శహన్సా సాహుల్ అహ్మద్ అనే ప్రయాణికున్ని అరెస్టు చేసారు. కవర్‌లో ప్యాక్ చేసి లగేజ్ మధ్యలో దాచి తరలిస్తూ తనిఖీలలో పట్టుబడ్డాడు.

విదేశీ సిగరెట్లు సీజ్

విదేశాల నుండి అక్రమంగా తరలిస్తున్న విదేశీ సిగరెట్లను బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సీజ్ చేసారు. తనిఖీ చేస్తుండగా విదేశీ సిగరెట్లను తరలిస్తున్న ప్రయణికుడు పట్టుబడ్డాడు. 260 సిగరెట్ ప్యాక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తుపాకీతో భార్య కాల్చివేత





నిందితుడు బోపణ్ణ , శిల్పా సీతమ్మ (ఫైల్)

మండ్య: ఓ మహిళను ఆమె భర్త తుపాకీతో కాల్చి చంపిన ఘటన కొడగు జిల్లా విరాజపేటె సమీపంలోని బేటోళి గ్రామంలో జరిగింది. బేటోళి గ్రామ పంచాయతీ మాజీ సభ్యురాలు శిల్పా సీతమ్మ (40) అనే మహిళను ఆమె భర్త సి. నాయకండ బోపణ్ణ తుపాకీతో కాల్చి హత్య చేశాడు. భార్యాభర్తల మధ్య చాలా రోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి శిల్పా వేరొకరితో ఫోన్‌లో మాట్లాడుతుండగా, బోపణ్ణ అడ్డు చెప్పాడు. ఈ విషయమై గొడవ జరగడంతో కసితో రగిలిపోయిన బోపణ్ణ శనివారం ఉదయం ఇంట్లోని సింగిల్ బ్యారెల్ తుపాకీతో భార్య శిల్పాపై కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మరణించింది. శిల్పా సీతమ్మ 2012 నుంచి 2017 వరకు బేటోళి గ్రామ పంచాయతీ సభ్యురాలిగా పనిచేశారు. జిల్లా ఎస్పీ కే.రామరాజన్, విరాజపేటె గ్రామీణ పోలీసు అధికారులు గ్రామానికి వెళ్లి పరిశీలించి నిందితున్ని అరెస్టు చేశారు. కొడగు జిల్లాలో ఇళ్లలో తుపాకులు ఉంచుకోవడం సాధారణం. దీని వల్ల అప్పుడప్పుడు తుపాకీ కాల్పుల ఘటనలు జరుగుతూ ఉంటాయి.

పవిత్రకు అందని పెట్టె

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో ఏ1 నిందితురాలిగా ఉన్న నటి పవిత్రగౌడ ప్రస్తుతం పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా ఉంది. శనివారంనాడు పవిత్రగౌడను చూడడానికి ఆమె తల్లి వచ్చారు. కూతురికి ఒక బాక్స్‌ను ఇవ్వగా జైలు సిబ్బంది నిరాకరించారు. ఇంటి నుండి తెచ్చిన తినుబండారాలను పెట్టుకోవడానికి పవిత్రగౌడ ఒక పెట్టెను తీసుకురమ్మని తల్లిని కోరిందట. అందువల్ల పవిత్ర తల్లి బాక్స్‌ను తీసుకువచ్చింది. అయితే బయటి నుండి తీసుకువచ్చే పాత్రలను లోపలకు అనుమతించబోమని, అది జైలు నిబంధన అని సిబ్బంది అడ్డుకున్నారు.

దాడి దృశ్యాలు వీడియో?

రేణుకాస్వామిపై దాడిని హీరో దర్శన్, అనుచరులు ఐఫోన్‌లో రికార్డు చేసినట్టు తెలిసింది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ రేణుకాస్వామి స్పృహతప్పి పడిపోగానే ఒక నిందితుడు తన ఐఫోన్‌లో వీడియో తీశాడు. నిందితులకు 5 సిమ్‌కార్డులు అందజేసిన వారిని పోలీసులు విచారణ జరిపి వాంగ్మూలాన్ని రికార్డు చేసారు. దర్శన్, పవిత్ర గౌడలు తలా ఒక సిమ్‌కార్డు తీసుకున్నారు.



నటి పవిత్ర గౌడ (ఫైల్)

సీఎంతో రేణుకాచార్య తల్లిదండ్రుల భేటీ

శివాజీనగర: రేణుకాస్వామి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసి రేణుకాస్వామి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, పవిత్ర, మరో 15 మంది అరెస్టు కావడం తెలిసిందే. సీఎంను కృష్ణా నివాసంలో కలిసి తల్లిదండ్రులు తమ బాధను వెళ్లబుచ్చారు. అనాథగా మారిన తమ కోడలికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సిద్దరామయ్య సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

సౌధ గుమ్మంలో బీటలు

శివాజీనగర: రాజధాని బెంగళూరులో పలు చారిత్రక భవనాలలో విధానసౌధ ప్రముఖమైనది. అయితే విధానసౌధ గుమ్మంలో బీటలు కనిపించడం ఆందోళనకు కారణమైంది. శనివారం స్పీకర్ యూ.టీ.ఖాదర్ అధికారులతో కలసి పరిశీలించారు. విధానసౌధ తూర్పు దిక్కులోని గుమ్మంలో బీటలు కనిపించాయి. వర్షం నీటితో బీటలు వాలి స్థలం నుండి నీరు కారుతోంది. చాలా ఏళ్ల భవనం కావటంతో కొన్ని లోపదోషాలు ఉండవచ్చు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొస్తాను. డీపీఆర్ ప్రజాపనుల శాఖ అధికారులకు మరమ్మతులకు ఆదేశిస్తానని తెలిపారు.

కష్టపడకుంటే.. కనపడరు

- పార్టీ నేతలకు డీకేశి హెచ్చరిక

శివాజీనగర: రానున్న జిల్లా పంచాయితీ, తాలూకా పంచాయితీ, బీబీఎంపీ ఎన్నికలను ఎదుర్కోవడంపై కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ శనివారం జిల్లా నేతలతో కేపీసీసీ కార్యాలయంలో సమావేశం జరిపారు. ఎన్నికలకు నేటి నుండే పార్టీని సన్నద్ధం చేయాలని సూచించారు. గతంలో అసెంబ్లీ, లోక్‌సభా ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన అందరిని గుర్తించి బోర్డు, కార్పొరేషన్‌ల పదవులను కట్టబెడతామని ఊరడించారు. రాబోయే స్థానిక ఎన్నికలు పార్టీకి అగ్ని పరీక్ష వంటివని, అందుచేత ఈ ఎన్నికలకు ప్రతి ఒక్కరు శ్రమించాలని సూచించారు. పనిచేయని జిల్లా, బ్లాక్ అధ్యక్షులను తక్షణమే మారుస్తామని హెచ్చరించారు. ప్రతి జిల్లాలో కూడా సమావేశాలు జరిపి సమస్యలపై చర్చించాలని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ నేతలు పాల్గొన్నారు.



ఆషాడ శనివారం సందర్భంగా చామరాజనగరలో చామరాజేశ్వర తేరు వేడుక సంభ్రమం

రింగ్‌రోడ్డుపై కుంగిన భూమి



ఏర్పడిన పెద్ద గుంత

మైసూరు: మైసూరు నగరంలోని దట్టగళ్లి రింగ్ రోడ్డులో ఉన్నట్లుండి రోడ్డుపై గుంత ఏర్పడింది. అది సుమారు 5 అడుగుల వెడల్పుతో 20 అడుగల లోతుగా ఉంది. మైసూరు విశ్వ విద్యానిలయం లేఔట్ తరువాత మారెమ్మ గుడికి కూతవేటు దూరంలో రోడ్డుపై నేల కుంగిపోయింది. కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలే కారణమని భావిస్తున్నారు. అధికారులు చేరుకుని గుంత చుట్టూ బారికేడ్లు పెట్టారు. 15 సంవత్సరాల క్రితం ఈ రింగ్ రోడ్డు నిర్మాణమైంది.

ఊపిరి పోయినా ఉత్తుత్తి వైద్యం

- పేద కుటుంబానికి రూ.8 లక్షల బిల్లు
- కలబుర్గిలో ప్రైవేటు ఆస్పత్రి ధనదాహం



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయచూరురూరల్: రోగులకు వైద్యం చేసి ప్రాణం నిలపాల్సిన వైద్యులు డబ్బు కోసం కక్కుర్తితో పక్కదారి పట్టడం సినిమాల్లోను, నిజ జీవితంలోనూ చూస్తుంటాం. చిన్న చిన్న జ్వరాలకు కూడా అనేక టెస్టులు చేసి వేలాది రూపాయల బిల్లులు వేయడం నేటిరోజుల్లో సాధారణమైంది. ఇక కలబుర్గిలో మరణించిన వ్యక్తికి వైద్యం చేసి రూ.8 లక్షలు బిల్లులు చేసిన యునైటెడ్ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం ఆలస్యంగా బయటపడింది.

పొట్టకు శస్త్రచికిత్స చేసి

వివరాలు.. జేవర్గి తాలుకా జైనాపూర్‌కు చెందిన నాగన్న (50), ఈ నెల 3న ఇంటిలో కిందపడ్డాడు, పొట్టకు చిన్న గాయం కావడంతో కలబుర్గిలోని యునైటెడ్ అస్పత్రిలో చేరారు. 4వ తేదీన యంఆర్ఐ స్కానింగ్ చేసిన వైద్యులు కడుపులో రక్తం గడ్డ కట్టిందని శస్త్రచికిత్స చేశారు. అయితే పరిస్థితి విషమించి నాగన్న చనిపోయాడు. కానీ విషయాన్ని దాచిపెట్టిన వైద్యులు ఐసీయూలో ఉంచి సీటీ స్కాన్, ఇతరత్రా వైద్య సేవలు అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో రోగికి గుండెపోటు రావడంతో పాటు మరణించాడని వైద్యులు రెండురోజుల తరువాత తీరిగ్గా తెలిపారు. కుటుంబసభ్యుల నుంచి రూ.8 లక్షలు డబ్బులు వసూలు చేశారు. చనిపోయిన వ్యక్తికి వైద్యం పేరుతో తమను దోచుకున్నారని కుటుంబ సభ్యులు ఆస్పత్రిపై దుమ్మెత్తిపోశారు. ఇంత జరిగినా జిల్లా మంత్రులు ప్రియాంక్ ఖర్గే, శరణు ప్రకాష పాటిల్‌లు మౌనం వహించడాన్ని తప్పు బట్టారు.




చిక్కమగళూరు సమీపంలోని రామనహళ్లిలో ఆరంభమైన రాష్ట్రస్థాయి ఎద్దుల బండ్ల పోటీలు. దూసుకెళ్తున్న పోటీదారులు

తీరంలో కుమ్మేస్తున్న కుండపోత



శనివారం కొడగు జిల్లాలో లక్ష్మణ తీర్థ నది పరవళ్లను తిలకిస్తున్న జనం



మండ్య జిల్లాలో కృష్ణరాజ సాగర జలాశయం నుంచి కావేరి నది దూకుడు

- కరావళి, మలెనాడులో భారీ వర్షాలు
- జన జీవనానికి ఆటంకం
- ఆరు జిల్లాల్లో విద్యాలయాలకు సెలవు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు
- నిండుకుండలా కేఆర్ఎస్ డ్యాం



ఉడుపి వద్ద నివాసాలు జలమయం

బనశంకరి: గతేడాది కరువును తీరుస్తూ ఈదఫా పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుంభవృష్టి వర్షాల వల్ల దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడుపి, శివమొగ్గ, కొడగు, హాసన్ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ జిల్లాల్లో శనివారం విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. వానలతో ఉత్తర కన్నడ జిల్లా అంకోలా వద్ద జాతీయ రహదారి- 66లో కొండచరియ తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడింది. బండరాళ్ల కింద ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది మిస్టరీగా మారింది. ఉత్తర కన్నడ జిల్లాలో విద్యాలయాలకు సెలవు ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీప్రియా తెలిపారు రాష్ట్రంలో మరో మూడు నాలుగురోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఉడుపి జిల్లాలో కుండపోత వర్షాల వల్ల అనేక ఊళ్లలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సహాయక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ విద్యాకుమారి తెలిపారు.

నదులు, జలపాతాల జోరు

- కరావళి, దక్షిణ ఒళనాడు జిల్లాల్లో వర్షాలు ఎడతెరపిలేకుండా కురుస్తుండటంతో రెడ్‌అలర్ట్ ప్రకటించారు. గత వారం రోజులుగా కరావళి ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కొండచరియలు, ఇళ్లు కూలిన ఘటనలు పెరిగాయి.
- కొడగు జిల్లాలో భారీ గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. లక్ష్మణ తీర్థ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రఖ్యాత అబ్బే ఫాల్స్ ఉరకలెత్తుతోంది. ఇక్కడ కావేరినది పాయ 20 అడుగుల ఎత్తు నుంచి దూకుతుంది.
- వర్షాలతో బెంగళూరు-మంగళూరు మధ్య సంచారంలో ఇబ్బందులు తలెత్తాయి. కాళి, గంగావళి, అఘునాశిని, నేత్రావతి, కుమారధారతో పాటు 10కి పైగా నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.



కొండచరియలు కూడిన చోట తనిఖీ

నేడు నిండనున్న కేఆర్ఎస్

కావేరి నదీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండ్య జిల్లాలో కేఆర్ఎస్ డ్యాంలోకి 5 రోజుల్లో 15 టీఎంసీల నీరు చేరింది. ఆదివారం సాయంత్రంలోగా కేఆర్ఎస్ పూర్తిగా భర్తీ కానుంది. 124.80 అడుగులు గరిష్ఠ నీటిమట్టం కలిగిన కేఆర్ఎస్ 120 అడుగులకు చేరింది. ముందుజాగ్రత్త చర్యగా 10 గేట్ల నుంచి 10 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. దీంతో కావేరి నది ఉప్పొంగే ప్రమాదం ఉన్నందున పరీవాహక ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు ప్రకటించారు.

- అరేబియా సముద్రంలో అలలు ఇంతెత్తున ఎగిసిపడుతున్నాయి, దీంతో చేపల వేటను నిషేధించారు. ఉడుపిలో సముద్రపు అలలకు తీరంలో ఉన్న కొబ్బరిచెట్లు కొట్టుకుపోయాయి. తీరాన్ని ఆనుకుని ఉన్న ఇళ్లలోకి నీరు చేరింది.

క్లుప్తంగా

బాల్య వివాహాలు ప్రమాదకరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: సమాజానికి కంటకంగా పరిణమించిన బాల్య వివాహాలు, బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరు సహకారం అందించాలని సీనియర్ సివిల్ న్యాయమూర్తి సునీల్ ఎస్ హొసమని తెలిపారు. శనివారం నగరంలోని నూతన జూనియర్ కళాశాలలో జిల్లా కానూను సేవల ప్రాధికార, సఖి వన్ స్టాప్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కానూను అరివు నెరవు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో ఇంకా బాల్యవివాహాలు, బాల కార్మిక వ్యవస్థ కనిపిస్తుండటం శోచనీయమన్నారు. మనిషికి ఆహారం, నీరు ఎంత ప్రధానమో, చట్టాలను కూడా అంతే ప్రాధాన్యతతో తెలుసుకోవాలన్నారు. డ్రగ్స్‌కు యువత దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో సఖి వన్ స్టాప్ సెంటర్ సలహాదారు వెంకటలక్ష్మమ్మ, కేజీఎఫ్ పిల్లల సహాయ వాణికి చెందిన అశ్విని, ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కుంభకోణం కేసును మూసివేసేందుకు పన్నాగం

• విపక్షనేత ఆర్.అశోక్ ఆరోపణ

శివాజీనగర: మహర్షి వాల్మీకి అభివృద్ధి మండలి కుంభకోణాన్ని మూసిపెట్టేందుకు ముఖ్యమంత్రి సిద్ధరామయ్య పన్నాగం పన్నారని శాసనసభ ప్రతిపక్ష నేత ఆర్.అశోక్ తీవ్ర ఆరోపణ చేశారు. శనివారం ఆయన బీజేపీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. వాల్మీకి మండలి అక్రమాలపై బీజేపీ ఉద్దేశపూర్వకంగా ఆరోపణ చేయలేదని, 40 పేజీల ఆధారాలు, అధికారులిద్దరి ప్రసంగం క్లిప్పింగ్‌ను కూడా అసెంబ్లీ సమావేశాల్లో ప్రదర్శించినట్లు తెలిపారు. అయితే తాము అవాస్తవాలు చెబుతున్నట్లు సీఎం సిద్దరామయ్య పేర్కొనడం దారుణమన్నారు. కుంభకోణంలో అధికారులదే పాత్ర అని అంటున్నారని, మరి మంత్రి స్థానం నుంచి నాగేంద్రను ఎందుకు రాజీనామా చేయించారని ఆర్.అశోక్ ప్రశ్నించారు. రాష్ట్ర ప్రభుత్వ సొమ్ము దొంగ ఖాతాలకు, అక్కడి నుంచి తెలంగాణకు బదిలీ అయిందన్నారు. కుంభకోణంలో సీఎం, డీసీఎం పేర్లు చెప్పాలని కేంద్రం ఈడీ ద్వారా ఒత్తిడి చేస్తోందని కాంగ్రెస్ నేతలు ఆరోపించడం తగదన్నారు. బదిలీ అయిన సొమ్ము దుర్వినియోగమైనట్లు ఈడీ ప్రకటించిందన్నారు. దమ్ముంటే ఈడీకి వ్యతిరేకంగా కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

డెంగీపై రీల్స్ చేస్తే బహుమతులు



బనశంకరి: ప్రాణాంతక డెంగీ బెంగళూరు నగరాన్ని వణికిస్తోంది. దీనిని నియంత్రించాలంటే పరిసరాల శుభ్రత, అవగాహన అవసరం. ఈ విషయంలో ప్రజలను అప్రమత్తం చేసేందుకు బీబీఎంపీ వినూత్న కార్యక్రమాన్ని అమలు చేయనుంది. ప్రజలను ఆకట్టుకునేలా రీల్స్ చేసేవారికి బహుమతులు అందజేస్తామని ప్రకటించింది. మొదటి ఐదు ఉత్తమ రీల్స్‌కు రూ.25 వేలు, ద్వితీయ బహుమతిగా ఐదుమందికి తలా రూ.10 వేలు అందిస్తామని బీబీఎంపీ ప్రకటించింది. విద్యార్థులతో కలిసి రీల్స్ చేసే పాఠశాలలకు రూ.లక్ష బహుమానం ఇస్తామని పాలికె ప్రకటించింది. విద్యార్థులను జాగృతం చేసే వీడియోలు చేయడానికి ప్రోత్సహించే ఉపాధ్యాయులకు రూ.35 వేలు బహుమానం అందిస్తారు. రీల్స్‌ను బీబీఎంపీ ఆరోగ్యశాఖ ఫేస్‌బుక్ , ఎక్స్ ఖాతాలకు ట్యాగ్ చేయాలి.

కూల్‌కూల్‌గా బెంగళూరు

బనశంకరి: ఈ వేసవిలో వేడిమితో ఉడికిపోయిన బెంగళూరు నగరం ఇప్పుడు చాలా చల్లగా మారిపోయింది. ఈ ఏడాదిలోనే అతి తక్కువ ఉష్ణోగ్రత శుక్రవారం 23.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. గురు, శుక్రవారం నగర ఉష్ణోగ్రత 3.2 డిగ్రీలు తగ్గింది. శుక్రవారం ఈ ఏడాదిలోనే అతి చల్లదైన రోజుగా నమోదైంది. దట్టంగా మేఘావృతం కావడం, వర్షమే ఇందుకు కారణం.

మహిళకు గాయాలు

నల్లచెరువు: శ్రీసత్యసాయి జిల్లా నల్లచెరువు మండలం యర్రగుంటపల్లి వద్ద బైక్ అదుపు తప్పి బెంగళూరుకు చెందిన మహిళకు గాయాలయ్యాయి. నారాయణ స్వామి,చందన దంపతులు శనివారం కదిరిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామిని దర్శించుకోవడానికి బైక్‌లో బెంగళూరు నుంచి కదిరికి వెళ్తుండగా యర్రగుంటపల్లి వద్దకు రాగానే అదుపుతప్పి కింద పడ్డారు. చందనకు గాయాలయ్యాయి.అటుగా వెళ్తున్న వందేమాతరం టీమ్ సభ్యులు శేఖర్, అశోక్‌లు గాయపడిన మహిళను కదిరి ఆసుపత్రికి తరలించారు.


వర్షాల నేపథ్యంలో తీర ప్రాంతం ఉడుపి వద్ద శనివారం నిలిచిపోయిన పడవలు

మట్టి గాజులు కేరాఫ్ బెళగావి


బెళగావి జిల్లాలో గాజుల తయారీలో నిమగ్నమైన కార్మికులు


మట్టి గాజులను తయారుచేస్తున్న దృశ్యం


గాజుల తయారీలో మరో కుటుంబం

• కనుమరుగువుతున్న చేతిగాజుల పరిశ్రమలు
• నన్నగిల్లుతున్న ఆదరణ
• చేయూత కరువైందని కార్మికుల ఆవేదన

సాక్షి,బళ్లారి: గాజులు సౌభాగ్యానికి చిహ్నం..గాజులు అంటే ఇష్టపడని మహిళలు ఉండరు. ఆర్థిక స్థితిగతులను బట్టి బంగారు, వజ్రాలతో గాజులు చేయించుకుంటారు. అయితే మట్టి గాజులు అందరికీ అందుబాటులో ఉంటాయి. డబ్బుతో సంబంధం లేకుండా అందరూ మట్టి గాజులను ఇష్టపడుతారు. అటువంటి మట్టి గాజులకు బెళగావి ప్రసిద్ధి చెందింది. కోటీశ్వరుల నుంచి సాధారణ కుటుంబాలకు చెందిన నారీమణులు ఎంత ఖరీదైన చీరలు కట్టిన వారి చేతికి రంగు, రంగుల గాజులు వేసుకుని మరింత మురిసిపోతుంటారు. అలాంటి గాజులు అందరి మహిళలకు అందంగానే కాకుండా మన సంస్కృతి వారసత్వాలను కాపాడుకునేందుకు ఉపయోగిస్తున్న మట్టి గాజులు తయారీ కర్ణాటకలో పేరు ప్రఖ్యాతలు గడించింది. ఉత్తర కర్ణాటక పరిధిలోని బెళగావి జిల్లాలో కేవలం కుందాకే, పాలకోవకే ప్రసిద్ధి చెందడమే కాకుండా మహిళలకు ఇష్టమైన గాజులు తయారీ చేస్తున్న బెళగావి అంతే పేరు ప్రఖ్యాతలు పొందింది. చాలా సంవత్సరాలు నుంచి కొన్ని వందల కుటుంబాలు బెళగావి జిల్లాలో గాజులు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు.

గాజుల గలగలలు :

ప్రస్తుతం మార్కెట్ అంతా ఫ్యాన్సీ గాజుల మయమైంది. అయితే పెళ్లిళ్ల ఇతర ఆధ్యాత్మిక కార్యక్రమాలకు మట్టి గాజులే శ్రేష్టమైనవి. ఎటువంటి ముక్కలేని, ఈ అఖండ గాజులు అంటేనే ఎంతో ప్రాధాన్యత ఉండేవి. బెళగావి నుంచి బాగల్‌కోట మార్గంలో అలతి క్రాస్‌కు వెళ్లి కుడివైపు తిరిగి రెండు మైళ్ల దూరంలో ఓ ఊరు కనిపిస్తుంది. రెవెన్యూ అధికారులు ప్రకారం మురగోడ దీని పేరు. కాగా ప్రజలు నోళ్లలో మాత్రం కన్నడలో బళగల ఊరు (గాజులు ఊరు) అని పిలుచుకుంటారు. ఇక్కడ అఖండ గాజులనే తయారు చేసేందుకు సుమారు 15 బట్టీలు ఉన్నాయి. వీటిపైనే వందలాది కుటుంబాలు ఆధారపడ్డాయి. హైటెక్ ఫ్యాన్సీ గాజులు జోరు మధ్య కూడా అఖండ గాజులు తమ మనుగడను కాపాడుకుంటున్నాయి. ఈ క్రమంలో బెళగావి జిల్లాలో ఎక్కువగా బట్టీలు చెన్నమ్మ కిత్తూరులో ఉన్నాయి. ఇక్కడే కాదు సవదత్తి, అలాగే ధార్వాడ జిల్లా అళ్నావర తాలూకాలో అరవటిగి ,కుంభారకుప్పలో కూడా మట్టి గాజులు తయారు అవుతాయి. వీటిని ప్రారంభంలో లింగాయత్ సామాజిక వర్గం మాత్రమే తయారు చేసేవారు. ప్రస్తుతం మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు చెందిన వారు బట్టీలు నిర్మించుకుని ఈ వృత్తిలో జీవనోపాధి పొందుతున్నారు.


మహిళల మదిని దోచే మట్టి గాజులు


మహిళలు గాజులు ధరించడం సనాతన సంప్రదాయం

గాజులు తయారీకి ముడిసరుకు

గాజులు తయారీ చేసేందుకు మహారాష్ట్రలోని మీరజ్, పూణె, సతారా, కరాడా నుంచి వీటి ముడిసరుకుని తెప్పించుకుంటారు. ప్రతి క్వింటాళు గాజు ముక్కల ధర రూ.220 ఉంటుంది. ఇక్కడ తయారు చేసిన గాజులను బెళగావి, ధార్వాడ, దావణగెరె నగరాలతో రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా మహారాష్ట్రలో పలు ప్రాంతాల్లో విక్రయిస్తారు. పచ్చ గాజులు కొనుగోళ్ల కోసమే నిర్దిష్టమైన వినియోగదారులు ఉన్నారు.

అంతంత మాత్రంగానే కూలి

నేటి ఆధునిక యుగంలో ఇంటింటికి తిరిగి గాజులు అమ్మేవారు కనుమరుగయ్యారు. కుటీర పరిశ్రమలుగా వెలసిన గాజులు తయారీ చేసే వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు లభించడం లేదని గాజులు తయారీ చేసే కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాజులు తయారు చేసే ప్రతి ఇద్దరికి కలిసి రూ.1000లు కూలీ ముట్టచెబుతారు. కార్మికులు అంతంత మాత్రమే చదివిన వారే. మురుగోడు బట్టీలో 30 సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న వారు ఎంతో మంది వారు ఉన్నారు. వీటినే నమ్ముకున్న వృత్తిపర కార్మికులు చాలా వేడిమి భరించాల్సి వస్తుందని, ఆరోగ్యాలు దెబ్బతింటాయని, దీనిని నమ్ముకున్నాము కాబట్టి, వేరే పని తెలియదు దీంతో జీవనం వెళ్లదీస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు.

భూ స్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా


ధర్నాలో పాల్గొన్న రైతులు

మాలూరు: గత 40 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిని స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తుండటంతో గ్రామానికి చెందిన రైతులు సర్వే పనులను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. మాలూరు తాలూకా రాంపుర గ్రామం వద్ద సర్వే నెంబర్ 89లో తహసీల్దార్, సర్వే అధికారులు వచ్చి సర్వే చేయడాన్ని గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు. కెఐఏడీబీకి భూమి స్వాధీనం అయిందని తెలిపి అధికారులు సర్వేకి రావడం సరికాదన్నారు. ఈ సమయంలో రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సర్వే నెంబర్ 89లోని 53 ఎకరాలలో సుమారు వంద మందికి పైగా రైతులు జీవనం సాగిస్తున్నారు. 30 సంవత్సరాల క్రితమే తమకు పట్టా చేసి ఇవ్వాలని దరఖాస్తు చేసుకోవడం జరిగింది. పట్టాల కోసం గతంలో కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం కనిపించలేదు. 53 ఎకరాల భూమిని కెఐఏడీబీ స్వాధీనం చేసుకోరాదని రైతులు డిమాండ్ చేశారు. ధర్నాలో పంచాయతీ మాజీ సభ్యుడు నవీన్ రెడ్డి, మంజునాథ్, రమేష్, రాజప్ప, సొణ్ణేగౌడ, వెంకటేష్‌రెడ్డి, జయమాల రాజ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం

• అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారం అభినందనీయం
• సీఎం సిద్దరామయ్య

శివాజీనగర: మానసిక ఆరోగ్యం, ఉత్తమ విద్యకు నాణ్యమైన ఆహారం ముఖ్యమని ముఖ్యమంత్రి సిద్ధరామయ్య అన్నారు. అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సహకారంతో ప్రభుత్వ, ఎయిడెడ్ ప్రాథమిక, ఉన్నత పాఠశాల పిల్లలకు వారంలో ఉచితంగా 6 రోజుల పాటు పౌష్టిక ఆహారం అందించే కార్యక్రమాన్ని శనివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. వారంలో రెండు రోజులు భోజనం, గుడ్లు ఇవ్వనున్నట్లు తెలిపారు. ప్రస్తుతం అజీం ప్రేమ్‌జీ ఫౌండేషన్ సంస్థ నాలుగు రోజులపాటు గుడ్లు, పౌష్టిక ఆహారం అందించే పుణ్య కార్యానికి ప్రభుత్వంతో చేతులు జోడించారన్నారు. పేద పిల్లలకు ఉత్తమ విద్య కోసం అవకాశాలను సృష్టించటం తమ ఆశయమన్నారు. విద్యాశాఖ మంత్రి మధు బంగారప్ప, విప్రో చైర్మన్ అజీం ప్రేమ్‌జీ దంపతులు, ప్రభుత్వ అదనపు ప్రధాన కార్యదర్శి ఎల్.కే.అతీక్ అహమ్మద్, ముఖ్యమంత్రి రాజకీయ కార్యదర్శి నజీర్ అహమ్మద్, పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

నేడు అంకోలాకు సీఎం

వర్షాలతో రోడ్లు దెబ్బతిన్న ప్రాంతాల్లో సహాయక చర్యలు వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించినట్లు సీఎం తెలిపారు. పంటలు నీట మునిగి నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఆదేశించినట్లు తెలిపారు. ఉత్తర కన్నడ జిల్లాలో వంతెన పరిశీలించేందుకు ఆదివారం వెళ్తున్నట్లు సీఎం తెలిపారు.

నూతన ఆవిష్కారాల వేదిక

• ప్రముఖ సివిల్ ఇంజినీర్ రాజసింహ



రాష్ట్రపతి ద్రౌపదిముర్ముతో డాక్టర్ హెచ్.రాజసింహ

బనశంకరి: అంతరిక్ష పరిశోధనలో అంతర్జాతీయ ఖ్యాతిఘడించిన ఇస్రో తో పాటు దేశంలోని పలు ప్రముఖ సంస్థల్లో చీఫ్ ఇంజనీర్‌గా విధులు నిర్వహించిన డాక్టర్ హెచ్.రాజసింహ ప్రముఖ సివిల్ ఇంజినీర్‌గా పేరుగాంచారు. ఇవే కాకుండా ఐడీబీఐ, ఆర్‌డీపీఆర్, యుడీడీ, బెంగళూరుసిటీ కార్పొరేషన్ తదితర పది ప్రముఖ సంస్థల్లో సాంకేతిక సలహాదారుగా సేవలందించారు. జీటీకే అధికారిగా 1800 గ్రామాలకు తాగునీరు, పారిశుధ్య వసతులు కల్పించారు. ఇటీవల రాష్ట్రపతి ద్రౌపది ముర్ము నుంచి పురస్కారం అందుకున్న ఆయనను పలువురు అభినందించారు.

భూగర్భంలో ఇళ్లు

రాష్ట్రపతిని కలిసినప్పుడు ఒడిశాలోని గ్రామాలు, ఆదివాసీ ప్రాంతాలను ఏవిధంగా అభివృద్ధి చేయాలనే అంశంపై చర్చించామని రాజసింహ తెలిపారు. తాగునీరు, పరిశుభ్రత, పక్కాగృహాలు, ఉపాధి అవకాశాలను సృష్టించడం, సౌరశక్తితో వెలిగే వీధి దీపాల ఏర్పాటుతో గ్రామాలను బంగారు పల్లెలుగా మార్చవచ్చునని తాను ప్రతిపాదించినట్లు ఆయన తెలిపారు. ఇప్పటివరకు తాను ఆవిష్కరించిన నూతన విధానాలను రాష్ట్రపతికి వివరించినట్లు చెప్పారు. తాను రూపొందించిన టెక్నాలజీ ద్వారా భూగర్భంలో మూడు పడక గదులతో కూడిన విశాలమైన ఇళ్లను నిర్మించుకోవచ్చు తెలిపారు. 15 రోజుల్లో ఆర్‌సీసీ ఫ్లోరింగ్‌తో పాటు రూఫ్, పెయింటింగ్ నీటి సరఫరా విద్యుత్ సరఫరా ఇలా అన్ని వసతులన్నీ ఉంటాయని చెప్పారు.

గురుపౌర్ణమికి ఏర్పాట్లు పూర్తి



షిరిడీసాయిబాబా సన్నిధిలో విశేష అలంకరణ

బనశంకరి: విభిన్న అలంకరణ, పూజలకు ప్రసిద్ధి చెందిన జేపీ.నగర శ్రీ సత్యగణపతి షిరిడీ సాయి ట్రస్ట్ ఆధ్వర్యంలో గురుపౌర్ణమి ఆచరించడానికి ఏర్పాట్లు పూర్తిచేశారు. ట్రస్ట్ అధ్యక్షుడు లోకరాజు శనివారం విలేకరులతో మాట్లాడుతూ ఈ సారి సాయిబాబా స్మరణతో సబ్‌కా మాలిక్ ఏక్‌హై అనే పరికల్పనతో భక్తుల దర్శనానికి ఏర్పాట్లుచేశామన్నారు. వివిధ రకాల పుష్పాలతో షిరిడీ సాయిబాబా విగ్రహంతో పాటు ఆలయాన్ని అలంకరిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఆదివారం ఉదయం 8 గంటల నుంచి పూజలు జరుగుతాయని తెలిపారు.


శివబాలయోగిమహరాజ్

శివబాలయోగి మహరాజ్ ఆశ్రమంలో...

బనశంకరి: అదేవిధంగా జేపీ.నగరమూడో స్టేజ్‌లోని శ్రీశివబాలయోగిమహరాజ్ ఆశ్రమంలో ఆదివారం సాయంత్రం 4 గంటలకు శివబాలయోగిమహరాజ్ విగ్రహానికి ప్రత్యేక అలంకరణ, పూజలు నిర్వహిస్తామని ట్రస్ట్ కార్యాధ్యక్షుడు డీ.రాంబాబు తెలిపారు. 6 గంటలకు భజన, ధ్యానం, రాత్రి 8 గంటలకు ప్రసాదవితరణ చేస్తామన్నారు. త్రిమూర్తి ఆలయంలో మరకత శివలింగానికి విశేష పూజలు నిర్వహిస్తామని తెలిపారు.

వర్షాలకు కూలుతున్న ఇళ్లు.. పేదలకు పాట్లు



కూలిన ఇళ్లను చూపుతున్న నిరాశ్రయులు



మైసూరు: ఎడతెరిపిలేకుండా కురుస్తున్న భారీ వర్షాలకు పూర్తిగా తడిసిన ఇళ్లు కుప్పకూలుతున్నాయి. దీంతో పేదలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మైసూరు జిల్లా సరగూరు తాలూకా బసాపుర గ్రామంలో 90 ఏళ్ల క్రితం నిర్మించిన ఇల్లు కూలిపోయిందని నింగనాయక్ ఆవేదన వ్యక్తం చేశాడు. అదేవిధంగా శాంతకుమారి, జీ.కే.హోవనాయక, రత్నమ్మ, శివప్ప, మహదేవమ్మ, మహాదేవనాయక, సణ్ణమ్మ, చిన్నమ్మ, చెన్ననాయక, సణ్ణమ్మ నాగ నాయక, దొడ్డమ్మ, సణ్ణప్ప నాయకకు చెందిన ఇళ్లు కూలిపోయాయి. తాము ఎక్కడకు వెళ్లి తలదాచుకోవాలో తెలియడం లేదని బాధితులు వాపోతున్నారు. వానలకు ఇళ్లు కారడంతో తిండిగింజలు కూడా తడిసిపోయాయని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

కోలారు వార్తలు...

శాశ్వత నీటి పారుదల సౌకర్యాలు కల్పించాలి


ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

కోలారు: కోలారు, చిక్కబళ్లాపురం జిల్లాల్లో శాశ్వత నీటి పారుదల సౌలభ్యాలను కల్పించడానికి అసెంబ్లీ సమావేశాలలో ఉభయ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు గళం ఎత్తాలని డిమాండ్ చేస్తూ శనివారం శాశ్వత నీటిపారుదల పోరాట సమితి సభ్యులు నగరంలోని బస్టాండు సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళకారులు మాట్లాడుతూ... ఉభయ జిల్లాలకు శాశ్వత నీటి పారుదల సౌలభ్యాల కోసం 40 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామని, ఇంతవరకు నీటి సౌలభ్యాలను అందలేదన్నారు. రెండు జిల్లాలో వందల చెరువులు ఉన్నా ప్రజలకు మాత్రం నీటి సమస్య తప్పలేదన్నారు. అంతర్జాల నీటిమట్టం దిగజారి పోయిందని, బోర్లు వేయాలంటే రైతులకు రూ.లక్షలు ఖర్చు అవుతోందన్నారు. ప్రభుత్వాలు కేసీ వ్యాలీ, హెచ్ ఎన్ వ్యాలీ, ఎత్తినహొళె పథకాలను పట్టుకుని శాశ్వత నీటిపారుదల సౌలభ్యాలను పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. బయలుసీమ జిల్లాలకు నీటి పారుదల సౌలభ్యాలను కల్పిస్తే జిల్లాలో వంద శాతం నిరుద్యోగ సమస్య పరిష్కార మవుతుందన్నారు. ధర్నాలో ప్రముఖులు ఆర్ ఆంజనేయరెడ్డి, హొళలి ప్రకాష్, కె నారాయణగౌడ, ఈకంబళ్లి మంజునాథ్, జి నారాయణస్వామి, చంబెరాజేష్, కోటిగానహళ్లి గణేషగౌడ తదితరులు పాల్గొన్నారు.

మెడికల్ కళాశాల స్థాపించాలని వినతి


వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

కోలారు: జిల్లాలో ప్రభుత్వ మెడికల్ కళాశాలను స్థాపించాలని డిమాండ్ చేస్తూ ప్రగతి సంఘాల కార్యకర్తలు శనివారం ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్, ఎమ్మెల్సీ ఎంఎల్ అనిల్‌కుమార్లకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం కార్యాధ్యక్షుడు అబ్బణి శివప్ప మాట్లాడుతూ...కోలారు జిల్లా బెంగుళూరు చాలా దగ్గరలో ఉన్నా అభివృద్ధిలో ఎంతో వెనుకబడి ఉంది. రాష్ట్రంలో దాదాపు అన్ని జిల్లాలలో ప్రభుత్వ మెడికల్ కళాశాలలు ఉన్నా కోలారులో మాత్రం లేదు. జిల్లాలో విద్యార్థులు ఎంతో ప్రతిభావంతులు ఉండి వైద్య విద్య కోసం దూరపు జిల్లాలకు వెళుతున్నారు. మరికొంత మంది పొరుగు దేశాలకు వెళ్లి లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఇది తల్లిదండ్రులకు మోయలేని భారం అవుతోందన్నారు. జిల్లాలో ఒక మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి లేకపోవడం వల్ల ప్రజలు వైద్యం కోసం బెంగళూరు నగరానికి వెళ్లాల్సి వస్తోంది. అత్యవసర పరిస్థితిలో ప్రజలు వైద్యం అందక మార్గం మధ్యలోనే ప్రాణాలు వదులుతున్నారు. ఇలాంటి పరిస్థితిలో జిల్లాలో మెడికల్ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కె ఆనందకుమార్, భీమసేన రాష్ట్ర అధ్యక్షుడు పండిత్ మునివెంకటప్ప, నడుపల్లి వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

జల్లి క్రషర్‌కు అనుమతి వద్దు


తహసీల్దార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న దృశ్యం

శ్రీనివాసపురం: తాలూకాలోని బాసాలహళ్లి గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 8లో గోమాళం భూమి ఉండి ఇందులో సంవత్సరాలుగా 60 మందికి పైగా రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ భూమినే నమ్ముకుని ఎంతో మంది రైతులు ఉన్నారు. సాగు భూమి పట్టాలు ఇవ్వాలని ఇప్పటికే రైతులు ఫారం నెంబర్ 54, 57లో దరఖాస్తులను సమర్పించారు. అయితే ప్రస్తుతం ఈ స్థలంలో జల్లి క్రషర్‌లను నిర్వహించడానికి కొంతమంది జిల్లా యంత్రాంగానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసిందని ఎట్టి పరిస్థితిలో ఇక్కడ జల్లి క్రషర్ల నిర్వహణకు అనుమతి ఇవ్వకూడదని విన్నవించారు. గ్రామస్తులు రామకృష్ణ, సురేష్ రెడ్డి, లక్ష్మి నారాయణ, వెంకటరమణ ఉన్నారు.

అసభ్య ప్రవర్తన.. కారు డ్రైవర్ అరెస్ట్

బనశంకరి: కారు డ్రైవింగ్ శిక్షణ పేరుతో అసభ్యకరంగా వ్యవహరించిన డ్రైవర్‌ను బసవేశ్వరనగర పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. 18 ఏళ్ల యువతి ఓ కారు డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ పూర్తిచేసింది. అయితే స్వంత కారులోనే ప్రత్యేక శిక్షణ తీసుకోవాలని భావించిన ఆ యువతి అణ్ణప్ప అనే డ్రైవర్‌కు 15 రోజులకు రూ.10,500 ఫీజు ఇచ్చేలా ఒప్పందం చేసుకుంది. ఈనెల 7 తేదీ నేషనల్ పబ్లిక్ స్కూల్ పై వంతెన వద్ద శిక్షణ తీసుకుంటుండగా అప్పణ్ణ ఆ యువతిపట్ల అసభ్యకరంగా వ్యవహరించాడు. భయాందోళనకు గురైన బాధితురాలు కారును ఇంటి వద్దకు మళ్లించింది. అనంతరం బసవేశ్వరనగర పోలీసులకు ఫిర్యాదు చేసింది.

ఇద్దరు హిటాచీ దొంగల అరెస్ట్

బనశంకరి: హలసూరు గేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సిటీ సివిల్ కోర్టు ఆవరణలోనిలిపిన హిటాచీ వాహనాన్ని చోరీచేసిన జిగణి చెందిన సచ్చిదానంద, శక్తివేలు అనే దొంగలను శనివారం పోలీసులు అరెస్ట్‌చేశారు. కోర్టు ఆవరణలో పనులు చేసేందుకు హిటాచీని ఉంచగా బుధవారం అర్ధరాత్రి దాటిన తర్వాత నలుగురు దుండగులు లారీలో వచ్చారు. మీరు ఎవరని సెక్యూరిటీ గార్డు ప్రశ్నించగా హిటాచీ తమదేనని, ఇక్కడ పనులు పూర్తికావడంతో తీసుక్కెళ్లేందుకు వచ్చామని తెలిపారు. అనంతరం హిటాచీని లారీలోకి ఎక్కించి తీసుకెళ్లారు. వచ్చింది దొంగలని తెలియడంతో యజమాని పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీసీకెమెరా దృశ్యాల ఆధారంగా పోలీసులు దర్యాప్తు చేపట్టి ఇద్దరిని అరెస్ట్ చేశారు. మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు.

పరిశ్రమ ఉద్యోగి మృతి

మైసూరు : పరిశ్రమ ఉద్యోగి మృతి చెందిన ఘటన నంజనగూడు తాలూకా తాండ్యా పారిశ్రామిక కేంద్రంలోని ఐటీసీ పరిశ్రమలో చోటు చేసుకుంది. తొరెమావు గ్రామానికి చెందిన అభిషేక్(21) స్టోర్ విభాగంలో పనిచేస్తున్నాడు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శనివారం స్టోర్ గదిని శుభ్రం చేశాడు. అంతలోనే వాంతులు కావడంతో ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. నంజనగూడు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు. అతను ఎలా మృతి చెందాడనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది.

త్రీడీ, యానిమేషన్ కోర్సులతో ఉపాధి

బొమ్మనహళ్లి: నేటి డిజిటల్ యుగంలో త్రీడీ, యానిమేషన్, గ్రాఫిక్స్‌లో నైపుణ్యం పొందిన వారికి మంచి ఉద్యోగ అవకాశాలు ఉన్నాయని, యువత వాటి పైన దృష్టిని పెట్టి మంచి పేరును సంపాదించుకోవాలని ప్రముఖ సినిమాటోగ్రాఫర్ మనోజ్ పరమహంస అన్నారు. శనివారం బెంగళూరు నగరంలోని బసవణగుడి నేషనల్ కళాశాలలో యానిమేషన్ కోర్స్‌ని ప్రారంభించి మాట్లాడారు. డిజిటల్ రంగం అనేది క్రియాత్మకంగా కార్యాచరణ చేసే ఆయుధం వంటిదని అన్నారు. రాబోయే రోజుల్లో సినిమా, గేమింగ్, సోషల్ మీడియాతో పాటు అనేక రంగాల్లో డిజిటల్ రంగం అభివృద్ధి సాధిస్తుందన్నారు. అందువలన యువత ఈ రంగంలో ప్రావీణ్యం సంపాదించాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్. హెచ్.ఎస్ .సుబ్రమణ్యం, యాదలం జీ.మధుసూదన్, వి.వెంకట శివారెడ్డి బీ.ఎస్.అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

క్రీడా రంగంలో జిల్లా ఖ్యాతిని పెంచండి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: విద్యను అభ్యసించడంతో పాటుగా క్రీడా రంగంలో రాణించడం ద్వారా జిల్లా ఖ్యాతిని పెంచాలని ఎంపీ ఎం మల్లేష్‌బాబు పిలుపునిచ్చారు. శనివారం నగరంలోని టీ చన్నయ్య రంగమందిరంలో రవి ఇంటర్ కళాశాల ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులకు స్వాగతం, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వీడ్కోలు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. క్రికెట్ తదితర క్రీడలను టీవీలలో చూసి ఆనందించడం మాత్రమే కాకుండా ఆయా క్రీడలలో పాల్గొని జిల్లాకు కీర్తిని తీసుకు రావాలన్నారు. తనను ఎంపీగా ఎన్నిక చేసిన నియోజకవర్గ ప్రజలకు సదా రుణ పడి ఉంటానని తెలిపారు. ఇందుకోసం నియోజకవర్గంలో పరిశ్రమలను అధికంగా స్థాపించడం ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. కౌశల్యాధారిత శిక్షణా కేంద్రాలను నెలకొల్పి నిరుద్యోగ యువతకు కౌశల్యాలు అభివృద్ధి చేయడానికి ప్రామాణికంగా కృషి చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రవి విద్యా సంస్థ కార్యదర్శి మూరాండహళ్లి డాక్టర్ ఇ గోపాలప్ప, విద్యా సంస్థ డైరెక్టర్ జి నరేష్‌బాబు, ప్రిన్సిపాల్ సలీంపాషా తదితరులు పాల్గొన్నారు.

బైక్ దొంగల అరెస్టు


పోలీసులు అరెస్టు చేసిన నిందితులు

శ్రీనివాసపురం: బైక్ దొంగలను అరెస్టు చేసిన పోలీసులు వారి వద్ద నుంచి ఆరు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. పట్టణానికి చెందిన సాదిక్, మున్సిఫ్‌లను పోలీసులు అరెస్టు చేశారు. ఈ నెల 17న పట్టణానికి చెందిన రాజేష్ తన ద్విచక్ర వాహనం చోరీ అయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు నిందితులను అరెస్టు చేసి వారి వద్ద నుంచి రాజేష్ పల్సర్ బైక్‌తో పాటు మరో ఐదు వాహనాలను కూడా స్వాధీనం చేసుకున్నారు.

క్లుప్తంగా

దేహదారుఢ్య పోటీల్లో బంగారు పతకం



బంగారు పతకం అందుకుంటున్న రవిశంకర్

బొమ్మనహళ్లి : దేశ రాజధాని ఢిల్లీలో ఐసీఎస్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన దేహదారుఢ్య పోటీల్లో బెంగళూరు నగర జిల్లా ఆనేకల్ పట్టణానికి చెందిన రవిశంకర్ ప్రతిభ చాటి బంగారు పతకం సాధించాడు. ఆస్ట్రేలియాకు చెందిన జోయి చేతుల మీదుగా పతకం అందుకున్నారు. ఇతర రాష్ట్రాలకు చెందిన సంజయ్ వెండి, మనీష్ కంచు పతకాలు సాధించారు.

రేణుకాస్వామి హత్యకేసు నిందితుడి తల్లి మృతి



మంజులమ్మ(ఫైల్)

దొడ్డబళ్లాపురం : రేణుకాస్వామి హత్య కేసులో ఏ4గా ఉన్న రఘు తల్లి మంజులమ్మ(70)మృతిచెందారు. కుమారుడు హత్య కేసులో ఇరుక్కుని జైలుపాలవడంతో మానసికంగా కుంగిపోయిన మంజులమ్మ హఠాన్మరణం చెందింది. రఘు చిత్రదుర్గ జిల్లా దర్శన్ అభిమానుల సంఘం అధ్యక్షుడిగా ఉన్నాడు. రేణుకాస్వామిని గుర్తించి కిడ్నాప్ చేసి బెంగళూరుకు తీసుకురావడంలో రఘు కీలకపాత్ర పోషించాడు.

సాయిభక్తుల భిక్షాటన



భిక్షాటన చేస్తున్న భక్తులు

తుమకూరు : గురు పౌర్ణమిని పురస్కరించుకొని రామకృష్ణనగర్‌లోని షిర్డీ సాయినాథ సేవా సమితి ఆధ్వర్యంలో శాంతినగర, అమర జ్యోతినగర కాలనీల్లో సాయిభక్తులు శనివారం భిక్షాటన చేశారు. మాజీ ఎంపీ జీఎస్ బసవరాజు, సమితి ప్రధాన కార్యదర్శి కేఎస్ గురుసిద్దప్ప పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి



వ్యక్తి మృతదేహం

కృష్ణరాజపురం: భీమక్కనహళ్లి గేట్ నుంచి హొసకోటె చింతామణి వెళ్లే రోడ్డులో శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు వచ్చి పరిశీలించారు. మృతుడి పేరు, చిరునామ తెలియరాలేదు. చేతిపై కే.భారతి అని పచ్చబొట్టు రాసి ఉంది. ఆచూకీ తెలిసిన వారు పోలీసు స్టేషన్‌లో సంప్రదించాలని హొసకోటె ట్రాఫిక్ పోలీసులు ఓ ప్రకటనలో కోరారు.

బుల్లితెర దర్శకుడి ఆత్మహత్య




వినోద్ దొండాలె(ఫైల్)

యశవంతపుర: కన్నడ బుల్లితెర దర్శకుడు వినోద్‌దొండాలె బెంగళూరు నాగరబావిలోని తన నివాసంలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. నటుడిగా, దర్శక నిర్మాతగా పేరుపొందిన వినోద్ దొండాలె శుక్రవారం రాత్రి ఇంటిలో ఎవరూ లేని సమయంలో ఉరి వేసుకొని బలవన్మరణం చెందాడు. పోలీసులు మృతదేహాన్ని విక్టోరియా ఆస్పత్రికి తరలించారు. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు దర్యాప్తులో ఉంది.

యువకుడు హత్య

మైసూరు: సగం కాలిన స్థితిలో ఓ యువకుని మృతదేహం లభ్యమైన ఘటన జిల్లాలోని పిరియా పట్టణ తాలూకాలోని బెట్టదపుర పోలీసు స్టేషన్ పరిధిలో ఉన్న తమ్మడహళ్లి గ్రామంలో జరిగింది. ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడవేసి ఉంటారని అనుమానాలున్నాయి. మృతదేహాన్ని గుర్తు పట్టకుండా ఉండాలని కాల్చివేయడానికి ప్రయత్నించారు. సగం వరకు కాలింది. బెట్టదపుర పోలీసులు పరిశీలించి శవ పరీక్షల కోసం ఆస్పత్రికి తరలించారు. హంతకుల కోసం గాలింపు చేపట్టారు.

ప్రమాదకరంగా రోడ్డు గుంతలు



నడి రోడ్డులో ఏర్పడిన గుంతలు

బొమ్మనహళ్లి : ఆనేకల్ పట్టణంలో రోడ్లు గుంతలమయం అయ్యాయి. దీంతో పాదచారులు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పట్టణం నుంచి అత్తిబెలెకి వెళ్లే రోడ్డులో గుంతలు ఎక్కువగా ఉన్నాయి. ఈ రోడ్డు నిత్యం రద్దీగా ఉంటుంది. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో గుంతలు నీటితో నిండిపోయాయి. ఆ గుంతలు కనిపించక వాహనదారులు అందులో పడి గాయపడుతున్నారు. కొన్ని చోట్ల గుంతల్లో రాళ్లు వేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలు పూడ్చాలని ప్రజలు కోరుతున్నారు.

శివమొగ్గ జిల్లాలో జలకళ

- శివమొగ్గ జిల్లాకు కొంచెం ఉపశమనం
- రాబోయే 2 రోజులు భారీ వర్షసూచన



తుంగా జలాశయం



శనివారం ధార్వాడలో వర్షంలో తడుస్తూ వెళ్తున్న జనం

శివమొగ్గ: మలెనాడులో వరుణుడు కొంత శాంతించాడు, జోరు వర్షాలు తగ్గాయి, లింగనమక్కి, భద్రా జలాశయాలకు వస్తున్న వరద జోరు తగ్గుముఖం పట్టింది. అయితే మరో వైపు వాతావరణ శాఖ రాబోయే రెండు మూడు రోజుల పాటు మలెనాడులో భారీ వర్షాలు కొనసాగే అవకాశాలు ఉన్నట్లు ప్రకటించింది. శనివారం ఉదయం 8 గంటల సమయానికి గత 24 గంటల్లో పశ్చిమ కనుమల్లోని భద్రావతిలో 22.80 మిమీ, శివమొగ్గలో 28.20 మిమీ, శికారిపురలో 41.40 మిమీ, సొరబలో 53.40 మిమీ, తీర్థహళ్లిలో 65.60 మిమీ, హొసనగరలో 77.60 మిమీ, సాగరలో 93.10 మిమీ, యడూరులో 105 మిమీ, మాణిలో 108 మిమీ, చక్రాలో 125 మిమీ, సావేహక్లులో 140 మిమీ, హులికల్‌లో 149 మిమీ, మాస్తికట్టెలో 167 మిమీల వర్షపాతం నమోదైంది.

లింగనమక్కికి భారీ ఇన్‌ఫ్లో

శనివారం రాష్ట్రంలోని ప్రధాన జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రమైన లింగనమక్కి డ్యాంకు 69,724 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో రూపంలో వస్తోంది. కానీ గేట్లను పూర్తిగా మూసివేశారు. డ్యాం గరిష్ట నీటి మట్టం 1819 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 1794.30 అడుగులుగా ఉంది. గత ఏడాది ఇదే సమయానికి డ్యాం నీటిమట్టం 1761.50 అడుగులుగా ఉండేది.

భద్రా డ్యాంలో..

ఇక శివమొగ్గ, దావణగెరె జిల్లాల రైతుల జీవనాడిగా పేరొందిన భద్రా డ్యాంకు శనివారం వరద కాస్త తగ్గుముఖం పట్టింది. గత 24 గంటల్లోగా డ్యాంలో 5 అడుగుల మేర నీరు నిల్వ చేరింది. ఈఏడాది ఖరీఫ్ సీజన్‌లో ఒకే రోజులో ఇంత భారీగా వరద నీరు డ్యాంలోకి చేరడం ఇదే మొదటిసారి అని చెప్పవచ్చు. శుక్రవారం డ్యాంకు 49,555 క్యూసెక్కుల నీరు వస్తోండగా, శనివారం డ్యాంకు 46,876 క్యూసెక్కుల వరద ఇన్‌ఫ్లో రూపంలో వస్తోంది. డ్యాం గరిష్ట నీటిమట్టం 186 అడుగులు కాగా ప్రస్తుత నీటిమట్టం 162.3 అడుగులుగా ఉంది. డ్యాం నుంచి కేవలం 186 క్యూసెక్కులను ఔట్‌ఫ్లో రూపంలో వదులుతున్నారు. గత ఏడాది ఇదే సమయానికి డ్యాం నీటిమట్టం 142.10 అడుగులుగా ఉండేది. ఈసారి ఖరీఫ్ సీజన్‌లో మంచి వర్షాలు కురుస్తుండటంతో గత ఏడాదితో పోల్చితే డ్యాంలో ఈఏడాది 21.2 అడుగుల మేర నీరు ఎక్కువగా నిల్వ చేరింది.

తుంగా నుంచి నీరు విడుదల

మరో వైపు తుంగా డ్యాం కొన్ని వారాల క్రితమే భర్తీ అయిన సంగతి తెలిసిందే. డ్యాం గరిష్ట నీటిమట్టం 588.24 మీటర్లు కాగా ప్రస్తుతం డ్యాంకు 65,796 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. డ్యాం గరిష్ట నీటి నిల్వ సామర్థ్యం 45.040 టీఎంసీలు కాగా ప్రస్తుతం 28.336 టీఎంసీల నీరు నిల్వ చేరింది. 68,654 క్యూసెక్కులను ఔట్‌ఫ్లో రూపంలో హొసపేటె సమీపంలోని తుంగభద్రా డ్యాంకు వదులుతున్నారు.

డిగ్రీలో అంధ విద్యార్థినికి నాలుగో ర్యాంక్



ఎస్ లక్ష్మిని అభినందిస్తున్న దృశ్యం

గౌరిబిదనూరు: సాధనకు అంగవైకల్యం అడ్డుకాదని నిరూపించింది అంధ విద్యార్థిని లక్ష్మి. బెంగుళూరు ఉత్తర విశ్వవిద్యాలయం నిర్వహించిన వార్షిక పరీక్షల్లో పట్టణంలోని నేషనల్ కళాశాలలో బీఏ (చరిత్ర, ఎకనామిక్స్,పొలిటికల్ సైన్స్)చదివిన విద్యార్థి ఎస్.లక్ష్మి అద్భుతమైన ప్రతిభ చదివి నాలుగో ర్యాంకు కైవసం చేసుకుంది. 2023–24 సంవత్సరానికి జరిగిన పరీక్షల్లో 91.4 శాతం ఉత్తీర్ణత సాధించింది. విద్యార్థి లక్ష్మి సాధనను కళాశాల ఉపన్యాసక బృందం, ప్రిన్సిపాల్ గాయిత్రీ అభినందించారు. శుక్రవారం కళాశాలలో సభ ఏర్పాటు చేసి సన్మానించారు. లక్ష్మి పరీక్షలు రాసేందుకు సహాయకురాలిగా నియమించిన సుమన సహకారాన్ని విద్యార్థిని లక్ష్మి కొనియాడారు. తన విజయానికి ఉపన్యాసకుల బృందం, తల్లిదండ్రుల ప్రోత్సాహం మరువలేనిదని లక్ష్మి అన్నారు. ఉప ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నేత్ర, డాక్టర్ గుణరంజని, డాక్టర్ శైలజా సప్తగిరి, డా రామాంజినమ్మ, ప్రొఫెసర్ నిజాముద్దీన్, సుప్రియ నాయక్, నాగరాజు, ప్రొఫెసర్ దివ్య, వర్ష, నజీం కౌసర్ పాల్గొన్నారు.

ముడా స్థలాల కేసులో సీఎంపై ఫిర్యాదు



లోకాయుక్త కార్యాలయం ముందు ఎన్ఆర్.రమేశ్

బనశంకరి: సీఎం సిద్దరామయ్య రాజకీయ బలంతో భార్య పేరున అక్రమంగా బదిలీ చేసుకున్న స్థలాల విషయంలో ప్రభుత్వానికి రూ.40కోట్లకు పైగా ప్రభుత్వానికి నష్టం చేకూర్చారంటూ సీఎం కుటుంబంపై బీజేపీ నేత ఎన్ఆర్ రమేశ్.. శనివారం బెంగళూరులో లోకాయుక్తలో ఫిర్యాదు చేశారు. సిద్దరామయ్య సతీమణి బీఎం.పార్వతి, బావమరిది బీఎం.మల్లికార్జునస్వామి, ముడా మాజీ అధ్యక్షుడు బసవేగౌడ, హెచ్‌వీ.రాజీవ్, అప్పటి కమిషనర్ డీబీ.నటేశ్ తదితరులపై 383 పేజీలు ఆధారాలతో ఫిర్యాదు చేసినట్లు రమేశ్ తెలిపారు. తరువాత విలేకరులతో మాట్లాడారు. ముడాలో దేవనూరు 3వ స్టేజ్ లేఔట్ నిర్మాణం కోసం 1997లో మైసూరు తాలూకా కసబా హోబళి కెసరగ్రామం, చుట్టుపక్కల ప్రాంతాల్లో వందలాది ఎకరాల భూములను స్వాధీనం చేసుకుంది. వీటిలో కేసర గ్రామ సర్వేనెంబరు 464 లో 3.16 ఎకరాల స్థలాన్ని యజమాని నింగబిన్‌జవర నుంచి స్వాధీనం చేసుకుని పరిహారం రూపంలో రూ.3,24,700 ను సదరు యజమానికి విడుదలచేశారు. తరువాత ఆ స్థలాన్ని 1998లో భూస్వాధీన ప్రక్రియ నుంచి మినహాయింపు (డీనోటిఫై) ఆదేశాలు జారీచేశారు. తరువాత అదే స్థలాన్ని భూ యజమాని కొడుకు నుంచి సిద్దరామయ్య బావమరిది మల్లికార్జునస్వామి కొనుగోలు చేసి, పార్వతికి దాన విక్రయం చేశారన్నారు. మళ్లీ ఈ భూమిని ముడాకు అందజేసి భారీ మొత్తంలో విలువైన స్థలాలను సిద్దరామయ్య కుటుంబం పొందారని, ఇది అక్రమమని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ జరపాలని లోకాయుక్తను కోరినట్లు తెలిపారు.

సిద్దగంగ మఠంలో కేంద్ర మంత్రి సోమణ్ణ



కేంద్ర మంత్రి సోమణ్ణ దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న స్వామీజీ

తుమకూరు : కేంద్ర జలశక్తి, రైల్వే శాఖ సహాయ మంత్రి వీ.సోమణ్ణ శనివారం తన పుట్టిన రోజు సందర్భంగా కుటుంబ సభ్యులతో కలిసి సిద్దగంగా మఠాన్ని సందర్శించారు. లింగైక్య డాక్టర్ శివకుమార స్వామీజీ సమాధిని దర్శించుకుని మఠాధిపతి సిద్దలింగ స్వామీజీ ఆశీర్వాదం పొందారు. స్వామీజీతో కొంతసేపు ముచ్చటించిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం వర్షాకాలం కావడంతో సాంకేతిక సమస్యతో రైళ్ల రాకపోకల్లో స్వల్ప ఆలస్యం అవుతోందని విలేకరులు అడిగిన ప్రశ్నకు బదులిచ్చారు. తాను వ్యవసాయ, సహకార శాఖల మంత్రులను కలిసి రాష్ట్రంలోని 10 జిల్లాల్లో కొబ్బరి కొనుగోలుకు ఆదేశాలు ఇప్పించానన్నారు. రాష్ట్రంలో ఐదు రైల్వే పైవంతెనల నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం అనుమ తించిందన్నారు. ఇందుకోసం రూ.350 కోట్లను భరిస్తోందన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బీ.సురేష్‌గౌడ, జీబీ జ్యోతిగణేష్, జిల్లా బీజేపీ అధ్యక్షుడు రవిశంకర్ హెబ్బాక, భైరణ్ణ, దిలీప్, గ్యాస్ బాబు పాల్గొన్నారు.

భాషా సంస్కృతులను కాపాడుకోవాలి

- హోం మంత్రి డాక్టర్ పరమేశ్వర్
- కన్నడ జ్యోతి రథయాత్రకు శ్రీకారం



కొబ్బరికాయ కొట్టి ప్రారంభిస్తున్న మంత్రి పరమేశ్వర్

తుమకూరు: రాష్ట్రానికి కర్ణాటకగా నామకరణమై 50 ఏళ్లు నిండిన సందర్భంగా కన్నడ నాడు, నుడి, సంస్కృతి సుగంధాన్ని వ్యాపింపజేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా శనివారం నగరంలో కన్నడ జ్యోతి రథయాత్రను రాష్ట్ర హోం, జిల్లా ఇన్‌చార్జీ మంత్రి డాక్టర్ జీ.పరమేశ్వర్ ప్రారంభించారు. కలెక్టరేట్ ఎదుట కన్నడ మాత భువనేశ్వరి విగ్రహానికి పూజ చేసి రథయాత్రకు శ్రీకారం చుట్టారు. మంత్రి మాట్లాడుతూ కన్నడ సుందర, సిరివంతమైన, సుమారు 2 వేల సంవత్సరాల చరిత్ర కలిగిన మాతృభాషను కాపాడుకోవడం మనందరి కర్తవ్యమన్నారు. జెడ్పీ సీఈఓ జీ.ప్రభు, జిల్లా కసాప అధ్యక్షుడు సిద్దలింగప్ప, ఎస్పీ కేవీ అశోక్, పాలికె కమిషనర్ బీవీ అశ్విజ, అదనపు జిల్లాధికారి శివానంద, ఉపవిభాగాధికారి గౌరవ్‌కుమార్ శెట్టి, తహసీల్దార్ సిద్దేశ్, కన్నడ సంస్కృతి శాఖ ఏడీ రవికుమార్, కర్ణాటక జానపద అకాడమి సభ్యుడు కెంకెరె మల్లికార్జున, కర్ణాటక నాటక అకాడమి సభ్యుడు ఉగమ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ట్రాక్టర్ పైనుంచి పడి బాలుడి మృతి



నందన్(ఫైల్)

దొడ్డబళ్లాపురం : ట్రాక్టర్ పైనుంచి జారిపడి 4ఏళ్ల బాలుడు మృతిచెందిన విషాద ఘటన నెలమంగల తాలూకా సొల్లెగుట్టె గ్రామంలో చోటుచేసుకుంది. బావిగెరె గ్రామానికి చెందిన రైతు భరత్ వ్యవసాయ పనుల కోసం ఇటీవల ట్రాక్టర్ తెప్పించాడు. శనివారం పొలానికి తన నాలుగు సంవత్సరాల వయసున్న కుమారుడు నందన్‌తో కలిసి వెళ్లాడు. బాలుడిని పక్కనే కూర్చొబెట్టుకొని పొలం దున్నుతుండగా చిన్నారి జారి టిల్లర్‌పై పడి బ్లేడ్ల మధ్య ఇరుక్కుపోయి తీవ్ర గాయాలతో మృతి చెందాడు. ఘటనా స్థలాన్ని ఏఎస్పీ నాగరాజు సందర్శించారు. దాబస్‌పేట పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ముందస్తు బెయిల్ కోసం రక్షిత్‌శెట్టి పిటిషన్

బనశంకరి: కాపీ రైట్ చట్టాన్ని ఉల్లంఘించినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న నటుడు, దర్శకుడు రక్షిత్ శెట్టి ముందస్తు బెయిల్ కోసం బెంగళూరులోని 61వ సీసీహెచ్ కోర్టులో దాఖలు చేసిన పిటిషన్ విచారణ వాయిదా పడింది. బ్యాచులర్స్ పార్టీ సినిమా కోసం న్యాయ ఎల్లిదే పాట అనధికారికంగా వినియోగించినట్లు రక్షిత్‌శెట్టిపై ఎంఆర్‌టీ మ్యూసిక్ సంస్థకు చెందిన నవీన్‌కుమార్ అనే వ్యక్తి యశవంతపుర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాపీరైట్ యాక్ట్ కింద రక్షిత్‌శెట్టిపై పోలీసులు కేసు నమోదు చేశారు. దీంతో అరెస్ట్‌చేస్తారనే భయంతో రక్షిత్‌శెట్టి కోర్టును ఆశ్రయించారు. న్యాయమూర్తి ప్రకాశ్‌సంగప్ప హెచ్ శనివారం విచారణ చేపట్టి బుధవారానికి వాయిదా వేశారు.

వ్యవసాయ అనుబంధ రంగాలపై దృష్టి పెట్టండి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ

గౌరిబిదనూరు: రైతులు కేవలం వ్యవసాయంపైనే ఆధారపడకుండా పాడి పరిశ్రమ, గొర్రెలు, మేకలు, కోళ్ల పెంపకంపై దృష్టి పెట్టి వార్షిక ఆదాయం పెంచుకోవాలని ఎమ్మెల్యే పుట్టస్వామిగౌడ సూచించారు. డీ పాళ్య హోబళి గుండ్లహళ్లిలో వర్షాధారిత ప్రదేశాభివృద్ధి కార్యక్రమంలో భాగంగా రైతులకు సౌలభ్యాలను అందజేసి మాట్లాడారు. ప్రభుత్వ సౌలభ్యాలను వినియోగించుకోవాలని సూచించారు. రాగులు, ఉలవలు, మరి కొన్ని పంటలకు సంబంధించి బీమా ప్రీమియం చెల్లించేందుకు ఆగస్టు 15 వరకు, కందులు, వేరుశనగ, మొక్కజొన్న పంటల ప్రీమియం చెల్లించడానికి ఈ నెల చివరి వరకు గడువు ఉందని వ్యవసాయశాఖ అధికారులు తెలిపారు. కార్యక్రమంలో రాఘవేంద్ర హనుమాన్, ఈఓ హొన్నప్ప, తహసీల్దార్ మహేశ్ పత్రి, వ్యవసాయ శాఖ అధికారులు జవీదా నసీమా ఖానం, దీపశ్రీ, మోహన్, పశువైద్యుడు మారుతీ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హోసూరు వార్తలు..

మొబైల్ షాపులో చోరీ

క్రిష్ణగిరి: రాయకోటలో సెల్‌ఫోన్ దుకాణంలో దొంగలు 8 సెల్‌ఫోన్‌లను దోచుకెళ్లారు. వివరాల మేరకు ధర్మపురి జిల్లా పాలక్కోడు ప్రాంతానికి చెందిన ఇమ్రాన్ (26). రాయకోటలోని హోసూరు రోడ్డులో సెల్‌ఫోన్ షాపు నిర్వహిస్తున్నాడు. శుక్రవారం సాయంత్రం వ్యాపారం ముగించుకొని ఇంటికెళ్లాడు. ఉదయం దుకాణానికి రాగా తలుపులు పగులగొట్టి ఉన్నాయి. లోనికెళ్లి చూడగా విలువ చేసే 8 సెల్‌ఫోన్‌లను దోచుకెళ్లినట్లు తెలిసింది. బాధితుడు రాయకోట పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

విపత్తుల నిర్వహణకు సిద్ధం

హోసూరు: భారీ వర్షాలు కురిసే సమయంలో ప్రకృతి వైపరీత్యాల నియంత్రణకు అన్ని శాఖల అధికారులు సిద్ధంగా ఉండాలని క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో జరిగిన సమీక్షా సమావేశంలో కలెక్టర్ శరయు సూచించారు. వర్షాకాలం ప్రారంభం కావడంతో డెంగీ దోమల నియంత్రణకు పారిశుద్య శాఖాధికార్లు చర్యలు చేపట్టాలని, బురద ఉన్న చోట్ల క్లోరిన్ పౌడర్‌ను వెదజల్లాలని, ఇళ్ల వద్ద నీళ్లు నిలువ లేకుండా చూడాలని తెలిపారు. వరదలు, వైపరీత్యాల సమయంలో సహాయక చర్యలకు సంసిద్ధంగా ఉండాలని సూచించారు. జేసీబీ యంత్రాలు, పంపుసెట్లు, చెట్లు నరికే యంత్రాలు, ఇసుక బస్తాలు తదితరాలను సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జనాభా పెరిగితే దేశాభివృద్ధి తిరోగమనం



ప్రసంగిస్తున్న నగరసభ కమిషనర్ గీత

గౌరిబిదనూరు : దేశంలో జన సంఖ్య పెరిగితే అభివృద్ధికి అడ్డంకిగా మారుతుందని నగరసభ కమిషనర్ గీత అన్నారు. పట్టణంలోని తల్లీ బిడ్డల ఆస్పత్రి ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన జనాభా నియంత్రణ దినోత్సవంలో కమిషనర్ పాల్గొని మాట్లాడారు. పేదరికం, నిరక్షరాశ్యత వల్ల జనసంఖ్య విపరీతంగా పెరుగుతోందని, ఫలితంగా ప్రతి మనిషికీ ఆరోగ్యం, విద్య, ఉత్తమ జీవన స్థితిని కగించడం కష్టంగా మారిందన్నారు. కుటుంబ నియంత్రణ విధానాలు పాటించి జనాభా పెరగకుండా చూసుకోవాలన్నారు. ఆరోగ్యాధికారి డా లక్ష్మీకాంత్ మాట్లాడుతూ కుటుంబ నియంత్రణ పద్ధతులను పాటిస్తే జనాభాను నియంత్రించవచ్చన్నారు. వైద్యాధికారి డాక్టర్ చంద్రమోహనరెడ్డి, సాంఘిక సంక్షేమశాఖ అధికారి చిన్నప్ప గౌడ నాయ్కర్, శాంతమ్మ, రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

బ్యాంక్ ఏజెంట్ల వేధింపులకు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ బలి

దొడ్డబళ్లాపురం: లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు తాళలేక సాఫ్ట్‌వేర్ ఇంజినీర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన ఆనేకల్‌లో చోటుచేసుకుంది. బీహార్‌కు చెందిన గౌరిశంకర్ శర్మ(40) ఆనేకల్ రైల్వే స్టేషన్ వద్ద ఉన్న అపార్ట్‌మెంట్‌లో నివసిస్తున్నాడు. బ్యాంకులో లోన్ తీసుకున్న గౌరిశంకర్ గత 18 నెలలుగా ఈఎంఐ చెల్లించలేదు. ఇటీవల బ్యాంకు నుంచి వచ్చిన ఏజెంట్లు అతన్ని ఇంట్లోంచి బయటకు లాక్కువచ్చి అవమానించారు. దీంతో గౌరిశంకర్ అవమానం భరించలేక ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో మృతుడి కుటుంబ సభ్యులు బ్యాంకు సిబ్బందిపై పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు దర్యాప్తులో ఉంది.

వెంటాడిన మృత్యువు

యశవంతపుర: ఓ లారీని మృత్యువు వెంటాడింది. వాహనం బోల్తా పడిన సమయంలో ఒక కార్మికుడు మృతి చెందగా అదే లారీలో పనిచేసే మరో కార్మికుడు కరెంటు షాక్‌తో మృతి చెందాడు. ఈ ఘటన దక్షిణ కన్నడ జిల్లాలో జరిగింది. సదరు లారీలో శుక్రవారం షామియానా సామగ్రి తరలిస్తుండగా కెమ్మిదకాడుబెట్ట వద్ద అదుపు తప్పి బోల్తా పడింది. ఆ సమయంలో ఒక కార్మికుడు మృతి చెందాడు. కాగా అదే లారీలో శనివారం షామియానా సామగ్రి తరలిస్తుండగా కడే శివాలయం వద్ద విద్యుత్ వైర్ తగిలి నలుగురు కార్మికులు గాయపడ్డారు. వీరిని మంగళూరు ఆస్పత్రికి తరలిస్తుండగా కుందన్ కుమార్(20) అనే కార్మికుడు మృతి చెందాడు. ఇతను బిహార్‌కు చెందినవ్యక్తిగా గుర్తించారు. బంట్వాళ గ్రామాంతర పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

రోగిని భుజాలపై మోస్తూ ఆస్పత్రికి తరలింపు

యశవంతపుర: తీవ్ర అనారోగ్యంతో ఉన్న రోగిని ఓ వ్యక్తి భుజంపై మోస్తూ భారీ వర్షాన్ని లెక్క చేయకుండా ఐదు కిలోమీటర్లు దూరం ప్రయాణించి ఆస్పత్రికి చేర్చాడు. ఈ ఘటన బెళగావి జిల్లా ఖానాపుర తాలూకా అటవీ ప్రాంతంలోని అమగాంవ్ గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన హర్షద(36) అనే మహిళ తీవ్రమైన జ్వరంతో బాధపడుతూ తీవ్ర అస్వస్థతకు గురైంది. తక్షణం ఆస్పత్రిలో చేర్పించాల్సి వచ్చింది. అయితే దట్టమైన అటవీ ప్రాంతమైన అమగాంవ్ గ్రామానికి ఎలాంటి రోడ్డు సదుపాయం లేదు. రాళ్లు, రప్పలున్న దారిలో నడిచి పోవాల్సిందే. దీంతో ఆ కుటుంబ సభ్యుడు హర్షిదాను భుజలపై మోసుకుంటూ ఐదు కిలోమీటర్ల దూరం వెళ్లాడు. అక్కడికి అంబులెన్స్ రావటంతో ఖానాపుర తాలూకా కేంద్రానికి తరలించగా వైద్యులు ఆమెను కాపాడారు. దట్టమైన అటవీ ప్రాంతమైన అమగాంవ్‌లో 10 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. తమ గ్రామానికి రోడ్డు నిర్మించాలని డిమాండ్ చేస్తున్నా ఎవరూ స్పందించడం లేదని గ్రామస్తులు వాపోయారు.

పరిశ్రమల్లో డెంగీ దోమల బెడద



పరిశ్రమల్లో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు

హోసూరు: హోసూరు కార్పొరేషన్ పరిధిలో ఆరు మందికి డెంగీ పాజిటివ్ కేసులు నమోదయ్యాయి. అనేకమంది తీవ్ర జ్వరం, ఒళ్లు నొప్పులు తదితరాలతో ఆస్పత్రులకు వెళ్తున్నారు. ఈ నేపథ్యంలో పారిశుధ్య అధికార్లు పారిశ్రామిక ప్రాంతంలో పరిశ్రమల్లో తనిఖీలు ముమ్మరం చేశారు. అక్కడ పేరుకుపోయిన చెత్త వల్ల అధిక సంఖ్యలో డెంగీ కారక దోమల ఉత్పత్తి జరుగుతోందని, దీని వల్ల పరిశ్రమల్లో కార్మికులకే డెంగీ వ్యాపించే ప్రమాదం ఉందని తెలిపారు. శనివారం ఉదయం పలు పరిశ్రమల్లో తనిఖీలు నిర్వహించారు. ఓ పరిశ్రమలో పెద్ద మొత్తంలో డెంగీ దోమలు కనిపించాయి. దోమల నియంత్రణకు చర్యలు చేపట్టి, వ్యర్థాలను వెంటనే తొలగించాలని హెచ్చరించారు.

జంతువుల అడ్డుకట్టకు సౌర కంచె



కంచెను పరిశీలిస్తున్న అటవీ అధికారులు

కెలమంగలం: జవళగిరి అటవీ ప్రాంతంలో కర్ణాటక, తమిళనాడుల సరిహద్దుల్లో వన్యమృగాల దాడుల నివారణకు సౌర విద్యుత్ కంచె ఏర్పాటు చేసేందుకు ఇరు రాష్ట్రాల అటవీశాఖాధికార్లు చర్యలు చేపట్టారు. బెంగళూరు బన్నేరుఘట్ట అటవీ ప్రాంతంలోని ఏనుగులు ప్రతిలేటా సరిహద్దు గ్రామాలైన దేవరబెట్ట, జవళగిరి ప్రాంతాల మీదుగా తమిళనాడులోకి ప్రవేశించి రైతు పండిస్తున్న పంటలపై, ప్రజలపై దాడులు చేస్తుంటాయి. ఇరురాష్ట్రాల అటవీశాఖాధికారులు చర్యలు చేపట్టాలని రైతు సంఘ నాయకులు, స్థానిక ప్రజలు ప్రభుత్వాలను డిమాండ్ చేస్తూ వచ్చారు. అందులో భాగంగా కర్ణాటక డీసీఎఫ్ ప్రియదర్శన్, బన్నేరుఘట్ట అటవీశాఖాధికార్లు అంథోని రోగో, రంజిత, క్రిష్ణగిరి జిల్లా అధికారులు కార్తికేయిని, రాజమారియప్పన్, ప్రకాశం, దిలీప్, రైతు సంఘ నాయకుడు గణేష్‌రెడ్డి తదితరులు జవళగిరి సమీపంలోని పాళ్యం వద్ద సోలార్ కంచె నిర్మాణ పనులు చేపట్టారు.

వ్యాపారి ఆత్మహత్య

కెలమంగలం: వ్యాపారంలో నష్టం వచ్చిందని వ్యాపారి ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాల మేరకు నియోజకవర్గ కేంద్రం తళి ముస్లీం వీధికి చెందిన కౌషిప్ (30), అదే ప్రాంతంలో మాంసం దుకాణం నిర్వహిస్తున్నాడు. వ్యాపారంలో నష్టం ఏర్పడడంతో రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. గమనించిన బంధువులు చికిత్స కోసం బెంగళూరులోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా ఫలితం లేక మరణించాడు. తళి పోలీసులు కేసు నమోదు చేశారు.

సబ్ రిజిస్ట్రార్ కారులో లక్షల నగదు



సబ్‌రిజిస్ట్రార్ సాయ్‌గీత (ఫైల్)

కెలమంగలం: డెంకణీకోట సబ్ రిజిస్ట్రార్ సాయ్‌గీత కారులో లంచ నిరోధక శాఖ పోలీసులు (ఏసీబీ) లెక్కకు రాని రూ.6.35 లక్షల నిధులను స్వాధీనపరుచుకొన్నారు. వివరాల మేరకు సాయ్‌గీత డాక్యుమెంట్ రైటర్ల నుంచి పెద్ద మొత్తంలో లంచం వసూలు చేస్తున్నట్లు ఏసీబీకి సమాచారం అందింది. అందులో భాగంగా లంచ నిరోధక శాఖ పోలీసులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఈ సమయంలో శుక్రవారం సాయంత్రం డెంకణీకోట సమీపంలోని కొతాలం వద్ద వెళుతున్న సబ్‌రిజిస్ట్రార్ కారును అడ్డుకొని పరిశీలించగా డబ్బు కట్టలు కనిపించాయి. విచారణ చేయగా, లంచంగా పుచ్చుకొన్న రూ. 6.35 లక్షలను క్రిష్ణగిరిలోని ఇంటికి తీసుకెళుతున్నట్లు ఆమె తెలిపారు. ఆమెను అరెస్టు చేసి తీవ్ర విచారణ చేపట్టారు. సాయ్‌గీత గతంలో హోసూరు సబ్‌రిజిస్ట్రార్‌గా పనిచేస్తున్న సమయంలో లంచం పుచ్చుకొంటూ నేరుగా పట్టుబడడం గమనార్హం.

షాపులో మంటలు



హోసూరు: హోసూరు – బాగలూరు రోడ్డులో ఉన్న హార్డ్‌వేర్ దుకాణంలో శుక్రవారం సాయంత్రం అగ్ని ప్రమాదం జరిగింది. ఆకస్మాత్తుగా పొగలు, మంటలు వచ్చాయి. ఫైర్ సిబ్బంది వచ్చి మంటలార్పారు. రూ. 3 లక్షల మేర ఆస్తినష్టం జరిగినట్లు షాపు యజమాని చెప్పాడు. అగ్ని ప్రమాదం వల్ల హోసూరు– బాగలూరు రోడ్డుపై గంటల తరబడి ట్రాఫిక్ సమస్య ఎదురైంది.

కాబోయే దంపతులకు గాయాలు



అగళి: మడకశిర నియోజకవర్గం అగలి మండలం రామనపల్లి గ్రామం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో బెంగళూరుకు చెందిన రాకేష్,శ్యామల గాయపడ్డారు. వీరికి ఇటీవల నిశ్చితార్థం జరిగింది. కారులో లేపాక్షికి వెళ్లి ఆలయాలను దర్శించుకొని తిరిగి వెళ్తుండగా వెనుక టైరు పంక్చరై అదుపు తప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొంది. కారులో బెలూన్లు తెరుచుకోవడంతో పెను ప్రమాదం తప్పింది. ఇద్దరికి మూగ దెబ్బలు తగిలడంతో శిర ఆసుపత్రికి తరలించారు.

క్లుప్తంగా...

కమ్మ అంటే.. అమ్మ లాంటి ఆలోచన

- కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ సదస్సులో తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి
- ఆ సామాజికవర్గంతో నాకున్న సంబంధాల గురించి ప్రత్యేకంగా చెప్పక్కర్లేదు..
- నన్ను ఆ వర్గం ఎంతో అభిమానంతో చూసుకుంటుంది



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందజేస్తున్న కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ ప్రతినిధులు

సాక్షి, హైదరాబాద్: 'కమ్మ అంటే అమ్మ లాంటి ఆలోచన. అమ్మ బిడ్డ ఆకలి చూస్తుంది. అలాగే భూమిని నమ్ముకుని వ్యవసాయం చేసి పది మందినీ బతికించే కులం కమ్మ. కమ్మ వారు ఎక్కడున్నారో గుర్తించేందుకు కష్టపడనవసరం లేదు. సారవంతమైన భూమి, సాగు నీరు ఎక్కడ ఉంటే అక్కడ కమ్మ సోదరులు ఉంటారు. కష్టపడాలనే మనస్తత్వం కమ్మ వాళ్లది. పది మందికీ సాయం చేయాలనే ఆలోచన ఉన్న కమ్మ సోదరులు తమ డీఎన్‌ఏను వదులుకోకుండా ముందుకు సాగాలి' అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శనివారం హైదరాబాద్ హెచ్‌ఐసీసీలో కమ్మ గ్లోబల్ ఫెడరేషన్ (కేజీఎఫ్) ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగే కమ్మ గ్లోబల్ సమ్మిట్‌ను ఆయన ప్రారంభించి ప్రసంగించారు. 'ఎన్టీఆర్ రాజకీయాల్లో, నాయకత్వంలో ఒక బ్రాండ్. 1982 కన్నా ముందు కమ్మ ఎమ్మెల్యేలు ఎందరు ఉన్నా, ఎన్టీఆర్ ఇచ్చిన అవకాశాలతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఎందరో నాయకులుగా ఎదిగారు. ఎన్టీఆర్ ప్రవేశపెట్టిన సంకీర్ణ రాజకీయాలే నేడు దేశానికి మార్గదర్శకం' అని రేవంత్ అన్నారు. తమిళనాడు ఎంపీ కళానిధి వీరాస్వామి, కర్ణాటక ఎమ్మెల్యే మునిరత్నం నాయుడు, తానా అధ్యక్షుడు నిరంజన్ శృంగవరపు ప్రసంగించారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి పాల్గొన్నారు.

ఉద్యోగుల బదిలీలకు మరో 10 రోజులు అవకాశం

ఉత్తర్వులు జారీ

సాక్షి, అమరావతి: ఉద్యోగుల బదిలీలకు రాష్ట్ర ప్రభుత్వం మరో పది రోజులు అవకాశం కల్పించింది. తొలుత జూలై 5 నుంచి 20వ తేదీ వరకు బదిలీలపై నిషేధం ఎత్తివేసింది. అయితే.. ఇంకా పలు శాఖల్లో జరగాల్సిన బదిలీలు ఉన్నట్టు అధికారులు తెలపడంతో బదిలీల షెడ్యూల్‌ను జూలై 31 వరకు పొడిగించింది. ఈ మేరకు ప్రభుత్వం శనివారం జీవో జారీ చేసింది. ఆగస్టు 1నుంచి బదిలీలపై నిషేధం అమల్లోకి వస్తుందని పేర్కొంది.

రైతులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోండి

మంత్రి అచ్చెన్నాయుడు ఆదేశం

సాక్షి, అమరావతి: అల్పపీడనం ప్రభావంతో రాష్ట్రంలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేశించారు. ఈ మేరకు వ్యవసాయ శాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్‌తో ఆయన శనివారం ఫోన్‌లో మాట్లాడి పలు సూచనలు చేశారు. రైతుల సమస్యల పరిష్కారానికి టోల్ ఫ్రీ నంబర్ ఏర్పాటు చేయాలని సూచించారు. సాధ్యమైనంత త్వరగా పంట నష్టం అంచనా వేసేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు.

యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టాలి

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో భారీ వర్షాల కారణంగా నష్టపోయిన బాధితులను తక్షణమే ప్రభుత్వం ఆదుకోవాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. వేలాది ఇళ్లు, పంటలు దెబ్బతిన్నాయని, పశువులు చనిపోయాయని, ప్రభుత్వం యుద్ధ ప్రాతిపదికన రక్షణ, సహాయక చర్యలు చేపట్టి ఆదుకోవాలని కోరారు.

అడిగోపుల వెంకటరత్నం మృతికి సంతాపం

ప్రముఖ కవి అడిగోపుల వెంకటరత్నం మృతి పట్ల సీపీఎం రాష్ట్ర కమిటీ శనివారం ఓ ప్రకటనలో సంతాపం తెలిపింది.

చట్ట సవరణతో 'మైనింగ్'లో సంస్కరణలు

- 'మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ హ్యాకథాన్'లో కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

సనత్‌నగర్(హైదరాబాద్): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో 2015లో మైన్స్ అండ్ మినరల్స్ రెగ్యులేషన్ అండ్ డెవలప్‌మెంట్ (ఎంఎండీఆర్) చట్టంలో తీసుకువచ్చిన సవరణలతోనే నేడు మైనింగ్ రంగంలో సంస్కరణలు ప్రారంభమయ్యాయని, ఇప్పుడు వాటి ఫలితం స్పష్టంగా కనిపిస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. శనివారం ఆయన హైదరాబాద్ బేగంపేటలోని తాజ్‌వివంతా హోటల్‌లో జరిగిన మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ హ్యాకథాన్, క్రిటికల్ మినరల్ రోడ్ షోలో పాల్గొన్నారు. కిషన్‌రెడ్డి మాట్లాడుతూ గనుల అన్వేషణ వేగంగా జరగడానికి నేషనల్ మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ ట్రస్టును కూడా ఏర్పాటు చేశామన్నారు. ఇప్పటివరకు 373కు పైగా మైనింగ్ బ్లాకుల వేలం పూర్తయిందని తెలిపారు. క్రిటికల్ మినరల్స్‌కు సంబంధించి 2, 3వ ట్రాంచ్‌కు చెందిన బిడ్డర్స్‌ను శనివారం ప్రకటించారు.

రాబడిలేని రైడర్లు..
కాసులు రాలని కెప్టెన్లు!

దుర్భరంగా యాప్ ఆధారిత డ్రైవర్ల జీవితం

- తక్కువ వేతనంతో ఎక్కువ పని గంటలు
- 10 గంటల కంటే ఎక్కువ పనిచేస్తున్న 83 శాతం మంది
- నెలకు రూ.15 వేల కంటే తక్కువ సంపాదన
- ఆదాయాన్ని మించి ఖర్చులు
- కమీషన్ పేరుతో 31-40 శాతం లాగేస్తున్న కంపెనీలు
- కస్టమర్ల దుష్ప్రవర్తనతోనూ ఇబ్బందులు
- అయినా కుటుంబ పోషణ కోసం ముందుకే
- క్యాబ్ డ్రైవర్ల జీవితాలపై 'సాక్షి' గ్రౌండ్ రిపోర్ట్





విజయవాడకు చెందిన సంతోష్ డిగ్రీ చదివాడు.. ఓ ప్రైవేటు సంస్థలో చిన్న ఉద్యోగం చేస్తున్నాడు.. చాలీచాలని జీతంతో కుటుంబాన్ని నెట్టుకురావడం కష్టంగా మారడంతో అదనపు రాబడి కోసం పార్ట్‌టైమ్ ఉద్యోగం ఏదైనా చేయాలనుకున్నాడు. అప్పుడే సోషల్ మీడియాలో ఓ ప్రకటన అతని దృష్టిని ఆకర్షించింది. 'మా సంస్థలో చేరండి.. నెలకు రూ.45 వేల వరకూ సంపాదించండి' అనేది ఆ ప్రకటన సారాంశం. దీనికి అవసరమైన అర్హతల్లా కేవలం డ్రైవింగ్ లైసెన్స్, సొంత వాహనం.. ఇంకేముంది వెంటనే ఆ సంస్థ యాప్‌ను ప్లే స్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకుని వాళ్లు అడిగిన డాక్యుమెంట్లన్నీ అందులో అప్‌లోడ్ చేసేశాడు. రైడర్ (డ్రైవర్)గా చేరిపోయాడు. కొన్ని రోజులు గడిచేసరికే అతడికి అసలు విషయం అర్థమైంది. వస్తున్న రాబడికి, జరుగుతున్న ఖర్చులకి పొంతన లేదని తేలింది. ఇలా కొన్ని యాప్ ఆధారిత సంస్థలు. ఉద్యోగులకు ఆకర్షణీయమైన ప్రోత్సాహకాలు ఇస్తున్నట్లు చూపిస్తూ నిరుద్యోగులను కట్టుబానిసలుగా మార్చుకుంటున్నాయి.

సాక్షి, అమరావతి: ఇటీవల కాలంలో ఎవరు ఎక్కడికి వెళ్లాలన్నా వెంటనే ఫోన్ యాప్‌లో క్యాబ్ బుక్ చేసుకోవడమనేది సర్వసాధారణమైపోయింది. బుకింగ్ అయిన కొన్ని నిమిషాల్లోనే రైడర్లు, కెప్టెన్లు కస్టమర్ల ముందు వాలిపోతుంటారు. కిలోమీటర్ల చొప్పున సంబంధిత సంస్థ యాప్ ఈ రైడ్‌కు చార్జీని నిర్ణయిస్తుంది. ఆ మొత్తాన్నీ ఆన్‌లైన్ లేదా నగదుగా చెల్లించవచ్చు. ఇందులో కొంత మొత్తాన్ని యాప్ నిర్వాహకులు తమ కమీషన్‌గా మినహాయించుకుని మిగతాది రైడర్/కెప్టెన్‌కు ఇస్తుంటారు. అయితే ఈ కమీషన్ 20 శాతానికి మించదని ఆయా సంస్థలు చెబుతున్నప్పటికీ కంపెనీలు ఒక్కో రైడ్‌కు కమీషన్ కింద 31 శాతం నుంచి 40 శాతం తీసుకుంటున్నాయని రైడర్లు/కెప్టెన్లు వాపోతున్నారు. దీంతో వారు ఆదాయం సరిపోక దీనితో పాటు ఫుడ్ యాప్‌లు, ఈ-కామర్స్ సైట్లకు డెలివరీ బాయ్స్‌గా కూడా పనిచేస్తున్నారు. వాటి ద్వారా వచ్చే అదనపు ఆదాయంతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు.

పీపుల్స్ అసోసియేషన్ ఇన్ గ్రాస్‌రూట్స్ యాక్షన్ అండ్ మూవ్‌మెంట్స్ అధ్యయనం ప్రకారం రైడర్లు/కెప్టెన్ల వివరాలు ఇలా..

- **33 లక్షల మంది** దేశంలో ఉన్న యాప్ ఆధారిత ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్
- **12 శాతం** ఈ రంగంలో మహిళలు
- **83 శాతం** రోజులో 10 గంటలకు పైగా ఎక్కువ పనిచేస్తున్నవారు
- **60 శాతం** రోజులో 12 గంటలకు పైగా విధులు నిర్వర్తిస్తున్నవారు
- **60 శాతం** రోజుకు 14 గంటలకు పైగా కష్టపడుతున్న ఎస్సీ, ఎస్టీ డ్రైవర్లు
- **43 శాతం** రోజుకు రూ.500 కంటే తక్కువ సంపాదిస్తున్నవారు
- **85 శాతం** రోజూ 8 గంటలకు మించి వాహనాన్ని నడుపుతున్నవారు
- **72 శాతం** ఈ పని చేస్తున్నా ఖర్చుల విషయంలో ఇబ్బంది పడుతున్నవారు
- **80 శాతం** ఆయా కంపెనీలు అందించే ఛార్జీలతో సంతృప్తి చెందనివారు

కమీషన్ల పేరుతో కంపెనీల దోపిడీ..

రాష్ట్రంలో విశాఖపట్నం, విజయవాడ, తిరుపతి వంటి ప్రధాన నగరాల్లో మాత్రమే క్యాబ్ సేవలు అందుబాటులో ఉన్నాయి. దేశంలో 33 లక్షల యాప్ ఆధారిత ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఉన్నారు. వీరిలో అత్యధికులు విద్యార్థులు, ప్రైవేటు ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులే. ఈ రంగంలో మహిళలు 12 శాతం మాత్రమే. లైంగిక వేధింపుల నేపథ్యంలో వీరు ఈ రంగంలోకి రావడానికి భయపడుతున్నారు. రైడర్/కెప్టెన్‌గా నమోదు చేసుకున్నప్పుడే బ్యాంక్ అకౌంట్ నంబర్‌తోపాటు అన్ని వివరాలు తీసుకుంటారు. యాప్‌లో వ్యాలెట్ కూడా ఉంటుంది. అందులో కెప్టెన్/రైడర్ ముందుగా నగదు యాడ్ చేసుకోవాలి. కస్టమర్లు క్యాష్ ఇచ్చినా, ఆన్‌లైన్ పేమెంట్ చేసినా వ్యాలెట్ నుంచే కమీషన్ కట్ అవుతుంది. సంబంధిత కంపెనీ తన వాటాగా కమీషన్‌ను మినహాయించుకుని కెప్టెన్/రైడర్‌కు రావాల్సిన మిగతా నగదును వ్యాలెట్‌లో వారానికి ఒకసారి జమ చేస్తుంది. క్యాబ్, ఆటోకి కిలోమీటర్‌కి రూ.16–18 వరకూ చార్జ్ చేస్తారు. ఇందులో ప్లాట్‌ఫామ్ కమిషన్ కింద రూ.6 తీసుకుని మిగతాది కెప్టెన్/రైడర్‌కు ఇస్తారు. బైక్‌కి అయితే కిలోమీటర్‌కు రూ.10 వరకూ చార్జ్ చేస్తూ అందులో రూ.3.5ను కంపెనీలు కమీషన్‌గా తీసుకుంటున్నాయి.

స్టార్ రేటింగ్‌పైనే వీరి జీవితాలు..

ఇంత కష్టపడుతున్నా కెప్టెన్లు/రైడర్ల జీవితాలు కస్టమర్లు ఇచ్చే స్టార్ రేటింగ్స్‌పైనే ఆధారపడి ఉంటున్నాయి. ఎవరైనా కస్టమర్ ఫిర్యాదు చేస్తే డ్రైవర్ ఐడీని డీయాక్టివేట్ చేసేస్తారు. ఇది వారికి తర్వాత వచ్చే ప్రోత్సాహకాలు, రైడ్స్‌పై ప్రతికూల ప్రభావం చూపుతుంది. కొంత మంది కస్టమర్లు రాత్రి వేళల్లో డ్రైవర్లను దూర ప్రాంతాలకు తీసుకువెళుతుంటారు. అక్కడి నుంచి ఒంటరిగా వెనక్కి తిరిగిరావాల్సి ఉంటుంది. మరికొందరు డబ్బులు ఇవ్వకుండా ఇబ్బందులకు గురిచేస్తుంటారు. ఇంకొందరు చిర్రుబుర్రులాడుతూ కనీసం సాటి మనిషికి ఇచ్చే విలువ కూడా ఇవ్వరని రైడర్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒళ్లు హూనమవుతున్నా, వాహనం దెబ్బతింటున్నా, తమకు వచ్చేది రిపేర్లకు, వైద్య ఖర్చులకే సరిపోతున్నా కుటుంబ పోషణ కోసం తప్పడం లేదని చెబుతున్నారు. అలాగే తాము ఎంతోమందికి అత్యవసర సమయంలో ఆసరా అవుతున్నామనే తృప్తి ఉంటుందని అంటున్నారు.

అధ్యయనంలో సంచలన విషయాలు..

పని గంటల కారణంగా కెప్టెన్లు/రైడర్లు శారీరకంగా అలసిపోయి రోడ్డు ప్రమాదానికి గురవుతున్న సందర్భాలు అనేకం. 10 వేల కంటే ఎక్కువ భారతీయ క్యాబ్ డ్రైవర్లు, గిగ్, ప్లాట్‌ఫామ్‌లపై ఇండియన్ ఫెడరేషన్ ఆఫ్ యాప్ ఆధారిత ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్, యూనివర్సిటీ ఆఫ్ పెన్సిల్వేనియా, ఫ్రెడరిచ్-ఎబర్ట్-స్టిఫ్టంగ్ ఇండియా సాంకేతిక సహకారంతో పీపుల్స్ అసోసియేషన్ ఇన్ గ్రాస్‌రూట్స్ యాక్షన్ అండ్ మూవ్‌మెంట్స్ అధ్యయనం నిర్వహించింది. దీని ప్రకారం.. యాప్ ఆధారిత క్యాబ్ కెప్టెన్లలో దాదాపు మూడింట ఒక వంతు మంది రోజుకు 14 గంటలకు పైగా పనిచేస్తున్నారు. 83 శాతం కంటే ఎక్కువ మంది 10 గంటల కంటే ఎక్కువ, 60 శాతం మంది 12 గంటలకు పైగా విధులు నిర్వర్తిస్తున్నారు. ఇందులో మరో ఆశ్చర్యకర విషయం ఏమిటంటే.. 60 శాతం మందికి పైగా ఎస్సీ, ఎస్టీ డ్రైవర్లు రోజుకు 14 గంటల కంటే ఎక్కువగా కష్టపడుతున్నారు. 43 శాతం మంది తమ ఖర్చులన్నింటినీ తీసివేశాక రోజుకు రూ.500 లేదా నెలకు రూ.15,000 కంటే తక్కువ సంపాదిస్తున్నారు. డ్రైవర్లలో 85 శాతం మంది రోజుకి 8 గంటల కంటే ఎక్కువగా వాహనాన్ని నడుపుతున్నారు. ఫలితంగా వారు శారీరకంగా అలసిపోతున్నారు. క్యాబ్ డ్రైవర్లలో 72 శాతం మంది ఖర్చుల విషయంలో ఇబ్బంది పడుతున్నారు. 80 శాతం మంది ఆయా కంపెనీలు అందించే ఛార్జీలతో సంతృప్తి చెందడం లేదు. అయితే అనుకూల సమయాల్లో విధులు నిర్వర్తించే అవకాశం ఉండటం, వారానికోసారి నగదు ఖాతాలో పడిపోవడం, పెద్దగా చదువుకోవాల్సిన అవసరం లేకపోవడం వంటి వెసులుబాట్లు ఉండటంతో అత్యధికులు ఈ రంగంలోకి వస్తున్నారు.



భారీ వర్షానికి చింతూరు మండలం కల్లేరు వద్ద కోతకు గురైన ఆంధ్రా, ఒడిశా జాతీయ రహదారి-326, మధ్యలో నిలిచిపోయిన లారీ



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురులో ముంపు బారిన పడిన నారుమడి



దువ్వ గ్రామంలో వయ్యేరు ఏటిగట్టున ఉన్న పూరిళ్లు పూర్తిగా మునిగిన దృశ్యం

పంటను ముంచి.. ఆశలు తుంచి..

- భారీ వర్షాలతో రైతన్నలు అతలాకుతలం
- రాష్ట్రవ్యాప్తంగా వేలాది ఎకరాల్లో పంట నష్టం
- పొంగి ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- ఏలూరు, అల్లూరి జిల్లాల్లో కష్టాల్లో గిరిజన ప్రాంతాలు
- కనిపించని ప్రభుత్వ సాయం
- ప్రభుత్వంపై వరద బాధితుల మండిపాటు

సాక్షి, అమరావతి/సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో భారీ వర్షాలకు 8 జిల్లాలపై తీవ్ర ప్రభావం పడింది. ముఖ్యంగా ఉమ్మడి ఉభయ గోదావరి, కాకినాడ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, అల్లూరి సీతారామరాజు, కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాల్లో వేలాది ఎకరాలు నీట మునిగాయి. దీంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అలాగే పోలవరం విలీన మండలాల్లోని పలు గ్రామాలను వరద నీరు చుట్టుముట్టడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటివరకు ప్రభుత్వం పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో ఆయా ప్రాంతాల ప్రజలు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. ప్రభుత్వం సహాయం చేయడం లేదని వర్షాల ప్రభావిత ప్రాంతాల ప్రజలు ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏలూరు జిల్లాలోని బుట్టాయగూడెం, వేలూరుపాడు, కుక్కునూరు మండలాలు, అల్లూరి సీతారామరాజు జిల్లాలోని జి.మాడుగుల, పెదబయలు, ముంచంగిపుట్టు, జీకే వీధి, అనంతగిరి, చింతూరు, కూనవరం, ఎటపాక, వీఆర్ పురం మండలాల్లో పలు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. వేలూరుపాడు మండలంలో యడపల్లి వద్ద ఎద్దులవాగు ప్రవాహానికి కల్వర్టు కొట్టుకుపోవడంతో 29 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. వేలూరుపాడు మండలంలో పెదవాగు ప్రాజెక్టు పొంగి గట్టు తెగిపోయింది. దీంతో మేడేపల్లి, అల్లూరినగర్, రామవరం తదితర గ్రామాలు నీటమునిగాయి. బుట్టాయగూడెం కుక్కునూరు మండలాల్లో పలు వాగులు పొంగడంతో కల్వర్టులు బాగా దెబ్బతిన్నాయి. దీంతో పలు గ్రామాలకు రాకపోకలు స్తంభించిపోయాయి. అల్లూరి జిల్లాలో సోకులేరుతోపాటు పలు వాగులు, వంకలు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. చింతూరు మండలంకుయిగూరు-ఒడిశా జాతీయ రహదారి-326 కొట్టుకుపోయింది. దీంతో ఆంధ్రా, ఒడిశా మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. తూర్పుగోదావరి జిల్లా నిడదవోలు మండలం తీరుగూడెంలో ఎర్రకాలువలో కొట్టుకుపోయి జి.వెంకటేశు, అల్లూరి జిల్లా రంపచోడవరం మండలం మడిచర్లలో పెంకుటిల్లు కూలి లక్ష్మి మృత్యువాత పడ్డారు. అనకాపల్లి జిల్లాలోని దేవరాపల్లి మండలం ఎం.అలమండలో ఇంటి స్లాబ్ విరిగిపడి సూరిశెట్టి లక్ష్మికి తీవ్రగాయాలయ్యాయి.



నంద్యాల జిల్లా కోవెలకుంట్ల సమీపంలో చెరువును తలపిస్తున్న పంట పొలాలు

వేలాది ఎకరాల్లో పంట నష్టం..

తూర్పుగోదావరి జిల్లా వ్యాప్తంగా వరి నాట్లు నీట మునిగాయి. 50,997 హెక్టార్లలో వరి నాట్ల ప్రక్రియ పూర్తవగా.. 14,329 హెక్టార్లలో నీట మునిగింది. 18 మండలాల పరిధిలో 217 గ్రామాల్లో 16,845 మంది రైతులకు సంబంధించిన వరి పంటకు నష్టం వాటిల్లినట్లు వ్యవసాయ శాఖ ప్రాథమిక అంచనా వేసింది. గుంటూరు జిల్లాలోని 40 గ్రామాల్లో 3,014 హెక్టార్లలోని వరి పంట నీట మునిగినట్లు అధికారులు ప్రాథమికంగా అంచనా వేశారు. కాకినాడ జిల్లాలో 2,045 హెక్టార్లలో వరి పొలాలు నీట మునిగి పాడయ్యాయి.

అసలే ఏజెన్సీ.. ఆపై గాఢాంధకారం..

అసలే అంధకారం.. ఆపై మోకాళ్లలోతు నీరు.. ఇంకోవైపు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షంతో పోలవరం విలీన మండలాల్లో ఏజెన్సీ వాసులు బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నారు. వేలేరుపాడు, కుక్కునూరు మండలాల్లో గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేదు. పెదవాగుకు ఉధృతికి కమ్మరిగూడెంలో 240 ఇళ్లు పూర్తిగా కొట్టుకుపోయాయి. ఇక మేడేపల్లి, అల్లూరు నగర్, బంటిబండ, కోయమాధవరంతో పాటు మరో నాలుగు గ్రామాల్లో సుమారు 1,500 ఇళ్లల్లో నీరు చేరి అనేక కుటుంబాలు నిరాశ్రయులయ్యాయి. ఏలూరు జిల్లా కొయ్యలగూడెం మండలం కన్నాపురం గ్రామ సమీపంలోని తూర్పు కాలువ వంతెన కొంతమేర కొట్టుకుపోయింది. మండలంలోని పలు గ్రామాల ప్రజలకు ఈ వంతెనే ఆధారం. దేవీపట్నంలోని గండిపోచమ్మ అమ్మవారి ఆలయం పూర్తిగా మునిగిపోయింది.

కట్టలేరు, వైరా ఉధృతి

ఎన్టీఆర్ జిల్లాలోని కట్టలేరు, వైరాయేరు, చిన్న వాగులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. దీంతో ప్రకాశం బ్యారేజీ వద్ద వరద ఉధృతి పెరిగింది. బ్యారేజ్ వద్ద ప్రస్తుతం 7,519 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ఉంది. బ్యారేజ్ 8గేట్లను అడుగు మేర ఎత్తి సముద్రంలోకి వదిలారు. విజయవాడ నగరంలోని కొండ ప్రాంతంలో కొండ చరియలు విరిగిపడ్డాయి. పశ్చిమగోదావరి జిల్లాలో ఎర్రకాలువ, యనమదుర్రు, గొంతేరు, నక్కలకాలువ, బసవరాజు కోడు, వెంకయ్య వయ్యేరు, కాజ, భగ్గేశ్వరం, మొగల్తూరు డ్రయిన్స్ ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఎర్రకాలువ ఉధృతికి వందలాది ఎకరాలు నీటమునిగాయి. అప్పారావుపేట - కోరుమామిడి, మాధవరం - కంసాలిపాలెం కాజ్ వే వద్దకు రాకపోకలు నిలిచిపోయాయి. వర్షం నీరు ఎర్రకాలువ ద్వారా తణుకు మండలం దువ్వ గ్రామంలోని వయ్యేరులో ప్రవహించడంతో పరిస్థితి ఆందోళనకరంగా మారింది. దీంతో పూరిళ్లు నీటమునిగాయి. దువ్వ గ్రామంలోకి వరద నీరు చేరింది.

నేడు ఒడిశా–ఛత్తీస్‌గఢ్ మధ్య తీరం దాటే అవకాశం

ఒడిశాలోని చిలక సరస్సు సమీపంలో కేంద్రీకృతమై ఉన్న వాయుగుండం సముద్రంలోనే బలహీనపడింది. ఇది ప్రస్తుతం పూరీకి నైరుతి దిశగా 40 కి.మీ, గోపాల్‌పూర్‌కు తూర్పు ఈశాన్యంలో 70కి.మీ. దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది క్రమంగా తీరం వైపు కదులుతూ ఆదివారం ఉదయం లేదా మధ్యాహ్నానికి మరింత బలహీనపడి అల్పపీడనంగా తీరం దాటే అవకాశాలున్నాయని విశాఖ తుపాను హెచ్చరికల కేంద్రం అధికారులు తెలిపారు. మరోవైపు తూర్పు మధ్య బంగాళాఖాతంలో రుతుపవన ద్రోణి స్థిరంగా కొనసాగుతోంది. ఇది ప్రస్తుతం ఒడిశా తీరం మీదుగా రాయ్‌పూర్‌కి సమీపంలో కేంద్రీకృతమై ఉంది. వాయుగుండం ఒడిశా వైపు వెళ్లిపోవడంతో రాష్ట్రంలో వర్షాలు తగ్గుముఖం పట్టాయి. నేడు, రేపు ఉత్తరాంధ్ర, కోస్తా, రాయలసీమల్లో అక్కడక్కడా తేలిక పాటి నుంచి మోస్తరు వర్షాలు, ఒకట్రెండు చోట్ల భారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని అధికారులు తెలిపారు. వరద ప్రభావిత జిల్లాలకు సహాయ, పునరావాస చర్యల కోసం రూ.21.50 కోట్లు మంజూరు చేసినట్లు విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ చెప్పారు.

అత్యధికంగా వర్షపాతం నమోదైన ప్రదేశాలు

(శుక్రవారం ఉదయం 8.30 గంటల నుంచి శనివారం ఉదయం 8.30 గంటల వరకు)

జిల్లా	ప్రదేశం	కురిసిన వర్షం (సెంటీమీటర్లలో)
అనకాపల్లి	ఎరుకవానిపాలెం	14.4
అల్లూరి సీతారామరాజు	పాడేరు	11.6
విశాఖపట్నం	గోపాలపట్నం	9.8
శ్రీకాకుళం	శ్రీకాకుళం టౌన్	9.4
అల్లూరి సీతారామరాజు	కాకరపాడు	8.4
అనకాపల్లి	నర్సీపట్నం	8.2
శ్రీకాకుళం	హిరమండలం	8.1
అల్లూరి సీతారామరాజు	అడ్డతీగల	7.9

మంత్రి కొలుసుపై వరద బాధితుల ఆగ్రహం




మంత్రి పార్థసారథితో మాట్లాడుతున్న వరద బాధితులు

మంత్రి కొలుసు పార్థసారథిపై వరద బాధితులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఏలూరు జిల్లా కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వరద బాధితులను ఎమ్మెల్యేలు చిర్రి బాలరాజు, చింతమనేని ప్రభాకర్, సొంగా రోషన్‌కుమార్, జాయింట్ కలెక్టర్ బి.లావణ్యావేణితో కలిసి శనివారం ఆయన పరామర్శించారు. భోజనం సంగతి దేవుడెరుగు.. తమకు అధికారులు కనీసం టిఫిన్ కూడా పెట్టలేదని వరద బాధితులు మండిపడ్డారు. పెద్దవాగు వల్ల తమ ఇళ్లన్నీ నేలమట్టమై సర్వస్వం కోల్పోయామని, ప్రభుత్వ సహాయం అందించడంలో అధికారులు అలసత్వం ప్రదర్శిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిపై స్పందించిన మంత్రి కొలుసు అధికారులపై మండిపడ్డారు. కాగా ఎర్రకాలువ ముంపు రైతాంగాన్ని ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని, రైతులకు జరిగిన నష్టాన్ని అసెంబ్లీలో ప్రస్తావిస్తామనడం సరికాదని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెం మండలంలో ఎర్రకాలువ ముంపు గ్రామాలైన నందమూరు, కొత్తూరు, దండగర్ర, మాధవరం, అప్పారావుపేట, వీరంపాలెంలో శనివారం ఆయన పర్యటించారు. రైతాంగానికి పెట్టుబడి సాయం మే నెలలో ముందుగా ఇవ్వాల్సి ఉందని, నేటికీ ఇవ్వలేదన్నారు. ముంపు రైతాంగానికి ఇన్‌పుట్ సబ్సిడీ ఎప్పుడు ఇస్తారో స్పష్టమైన ప్రకటన చేయాలన్నారు.

శ్రీశైలంలో అడుగిడిన కృష్ణమ్మ

- ఉరకలేస్తున్న గోదావరి
- శ్రీశైలం ప్రాజెక్టులోకి 33,499 క్యూసెక్కుల కృష్ణా జలాలు
- గోదావరి నుంచి 4,09,459 క్యూసెక్కులు సముద్రంలోకి..



అల్మట్టి డ్యాం నుంచి కృష్ణమ్మ పరుగులు

సాక్షి, అమరావతి/ధవళేశ్వరం/పోలవరం రూరల్/భీమవరం/శ్రీశైలం ప్రాజెక్ట్/రాయచూరు రూరల్: కృష్ణా నదిలో వరద ప్రవాహం పరుగులు పెడుతుండగా.. గోదావరిలో వరద ఉరకలు వేస్తోంది. కర్ణాటకలోని విజయపుర జిల్లాలో గల ఆల్మట్టి జలాశయం దాదాపు పూర్తిగా నిండింది. శనివారం మొత్తం 26 గేట్లు ఎత్తి 75 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. శ్రీశైలం ప్రాజెక్టులోకి కృష్ణమ్మ చేరుకుంది. శనివారం సాయంత్రం 6 గంటలకు 33,499 క్యూసెక్కులు చేరుతుండగా.. నీటి నిల్వ 813.7 అడుగుల్లో 36.55 టీఎంసీలకు చేరుకుంది. శ్రీశైలం ప్రాజెక్టు నిండాలంటే ఇంకా 179.26 టీఎంసీలు అవసరం. నాగార్జున సాగర్‌లోకి ఇంకా వరద ప్రవాహం చేరడం లేదు. కృష్ణా ప్రధాన ఉప నది అయిన తుంగభద్రలో వరద ఉధృతి కొనసాగుతోంది. తుంగభద్ర డ్యామ్‌లోకి 1,03, 787 క్యూసెక్కులు చేరుతోంది. ఆదివారం కూడా వరద ఉధృతి కొనసాగుతుందని కేంద్ర జలసంఘం అంచనా వేసింది.

ఉరకలెత్తుతున్న ప్రవాహం

గోదావరిలో వరద ఉధృతి క్రమేణా పెరుగుతోంది. ధవళేశ్వరం బ్యారేజీలోకి శనివారం సాయంత్రం 6 గంటలకు 4,11,259 క్యూసెక్కులు చేరుతుండగా.. కాలువలకు 1,800 క్యూసెక్కులు ఇస్తూ.. మిగిలిన 4,09,459 క్యూసెక్కులను సముద్రంలోకి విడుదల చేస్తున్నారు. తెలంగాణలో కాళేశ్వరం ప్రాజెక్టులో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీలోకి 3,73,500, తుపాకులగూడెం బ్యారేజీలోకి 4,82,800 క్యూసెక్కులు చేరుతుండగా.. అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. దిగువన ఉన్న దుమ్ముగూడెం (సీతమ్మసాగర్) బ్యారేజీలోకి 5,93,167 క్యూసెక్కులు చేరుతుండగా అంతే స్థాయిలో వరదను దిగువకు వదిలేస్తున్నారు. దాంతో భద్రాచలం వద్ద వరద ఉధృతి గంటగంటకూ పెరుగుతోంది. పోలవరం ప్రాజెక్టులోకి 4.35 లక్షల క్యూసెక్కుల ప్రవాహం చేరుతుండగా.. 48 గేట్ల ద్వారా అంతే స్థాయిలో దిగువకు వదిలేస్తున్నారు. కాటన్ బ్యారేజీ వద్ద నీటిమట్టం శనివారం సాయంత్రానికి 8.70 అడుగులకు చేరింది. మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేస్తుండటంతో వశిష్ట గోదావరి పాయకు వరద తాకిడి మొదలైంది. నది మధ్యలోని ఇసుక దిబ్బలను ఎర్రనీరు ముంచెత్తింది. వరద ఉధృతి పెరుగుతుండటంతో లంక గ్రామాల్లో అలజడి మొదలైంది.



ఆమె బడ్జెట్ ఎంత?

ఆకాశంలో సగం అన్నారు స్త్రీలను. బిడ్డకు జన్మనిచ్చి పౌరుడిగా దేశానికి ఇస్తుంది స్త్రీ. కుటుంబ నిర్మాణంలో సమాజ ముందడుగులో ఆమె భాగస్వామ్యం సగం. జనాభాలో ఆమె సగం. కాని బడ్జెట్ ప్రస్తావన వచ్చినప్పుడల్లా ఆమె ప్రాధాన్యం వెనక్కు వెళ్లి ఇతర ప్రాధాన్యాలు ముందుకొస్తాయి. 'ఇది పేదవాడి బడ్జెట్', 'రైతు బడ్జెట్', 'మధ్యతరగతి బడ్జెట్' లాంటి మాటలు వినిపిస్తాయి తప్ప 'ఇది స్త్రీ సంక్షేమం కోరిన బడ్జెట్' అనే మాట వినపడదు. ఇప్పుడు రానున్నది బడ్జెట్ కాలం. దేశంలో, తెలంగాణ రాష్ట్రంలో ఆయా సభలు బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నాయి. ఈ సందర్భంగా స్త్రీలు ఏం కోరుతున్నారు? ఆర్థిక మంత్రులకు ఏం సందేశం ఇస్తున్నారు?

విద్య వైద్యం రవాణా ప్రభుత్వానిదే

ఇది గ్లోబలైజేషన్ కాలం. గ్లోబలైజేషన్‌కి హ్యూమన్‌ఫేస్ ఉండదని ఆర్థిక వేత్త అమర్త్య సేన్ అన్న మాటలు ఈ మూడు దశాబ్దాల్లో స్త్రీల పట్ల సాగుతున్న వివక్ష చూసినప్పుడు సత్యమని తేలాయి. కనీసం విద్య, వైద్యరంగాలనైనా ప్రభుత్వం స్వయంగా నిర్వహించినప్పుడు మాత్రమే ఆ సేవలకు మానవ ముఖం ఉంటుంది. విద్య, వైద్యంతోపాటు ప్రజా రవాణా, ఉపాధి... ఈ నాలుగూ ప్రభుత్వరంగంలో ఉన్నప్పుడే మహిళలకు రాజ్యాంగంలో సూచించిన విధంగా జీవనోపాధి పరస్పర గౌరవంతో కూడిన జీవితం సాధ్యమవుతుంది. ప్రభుత్వ ఉద్యోగులకు తప్ప మిగిలిన ఏ రంగంలోనూ మగవాళ్లకు, మహిళలకు సమాన పనికి సమానవేతనం లభించడం లేదు. ప్రజల సంక్షేమమే ప్రధానంగా లేని బడ్జెట్‌లో మహిళల సంక్షేమం దుర్భిణీతో చూసినా దొరకదు. ఐక్యరాజ్య సమితి 2000 సంవత్సరంలో నిర్దేశించిన మిలీనియం డెవలప్‌మెంట్ గోల్స్‌లో సంపూర్ణ మహిళ అక్షరాస్యత, ప్రసవ మరణాలను తగ్గించడం ప్రధాన లక్ష్యాలు. ఆ లక్ష్యాలను చేరడానికి నామమాత్రపు చర్యలు తప్ప చిత్తశుద్ధితో ప్రణాళికలు చేపట్టలేదు. 'ఇలాగే కొనసాగితే భారతదేశం 2040 నాటికి కూడా మహిళల అక్షరాస్యత సంపూర్ణంగా సాధించలేదు' అని తదుపరి సమీక్షలో ఐక్యరాజ్యసమితి వ్యాఖ్యానించిన విషయాన్ని మర్చిపోకూడదు. నిర్భయ ఘటన నేపథ్యంలో జస్టిస్ వర్మ కమిటీ 'ప్రజారవాణా వ్యవస్థను ప్రభుత్వమే నిర్వహించాలి' అన్నది. ఆర్టీసీ బస్సులో ఎప్పుడైనా నిర్భయ ఘటనలాంటి దుర్ఘటనలు చోటు చేసుకున్నాయా? మహిళకు క్షేత్రస్థాయిలో అందాల్సిన కనీస అవసరాల్లో అందడం లేదు. మొక్కకు నీరు పోయకుండా చెట్టుకు అంటుకడతానంటే దానిని అభివృద్ధి అనలేం.



- తోట జ్యోతిరాణి, ఎకనమిక్స్ ప్రొఫెసర్ (రిటైర్డ్), కాకతీయ యూనివర్సిటీ, వరంగల్

ఆదాయం పెంచుకునేలా చూడాలి

దివ్యాంగులు, సీనియర్ మహిళలు, ఒంటరి మహిళల గురించి బడ్జెట్‌లో ప్రత్యేక దృష్టి సారించాలి. వారు స్వయంగా ఎదిగేందుకు అవకాశాలు కల్పించాలి. కుటీర పరిశ్రమలతోపాటు హోమ్‌మేడ్ ఇండస్ట్రీలలో ప్రోత్సహించాలి. విద్య, నైపుణ్యావృద్ధి, ఉపాధి సంబంధించి నోడల్ డిపార్ట్‌మెంట్‌లు కొత్త కొత్త ప్రయోగాల్లో మహిళలను భాగస్వాములు చేయాలి. కేజీ నుంచి పీజీ వరకు నాణ్యమైన విద్య అందించాలి. సాఫ్ట్‌వేర్, మెడిసిన్, రేడియోగ్రఫీ తదితర అత్యంత నైపుణ్యం కలిగిన రంగాలలో స్త్రీల కోసం బడ్జెట్‌లో నిధులు వెచ్చించి ప్రోత్సహించాలి. వెల్‌బీయింగ్, కేర్ ఎకానమిలతో స్త్రీలు ఆదాయం పెంచుకునేలా చూడాలి.



- చిత్రామిశ్ర, ఐఏఎస్, పీఓ, ఐటీడీఏ, ఏటూరునాగారం

విద్యకు ప్రాధాన్యం ఇవ్వాలి

బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. శాస్త్ర, సాంకేతిక రంగాల్లో బాలికలు రాణించేలా కార్యక్రమాలు నిర్వహించాలి. ప్రాథమిక పాఠశాల సమయంలో డ్రాపౌట్స్‌ను నిరోధించాలి. వృత్తి విద్య శిక్షణ ఇవ్వాలి. పనిచేసే తల్లుల పిల్లలను చూసుకునేందుకు పని స్థలాల్లో కేర్ టేకర్లను ఏర్పాటు చేయాలి. పాఠశాల, కళాశాల రోజుల్లో వైద్యశిబిరాల ద్వారా వివిధ వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు పరీక్షలు చేయాలి.



- శేషాద్రిని రెడ్డి, ఏఎస్పీ, వేములవాడ

కుటీర పరిశ్రమల ఏర్పాటు

పురుషులతో సమానంగా మహిళలు విద్య, వైద్య, ఆర్థిక, రాజకీయ రంగాల్లో ఎదిగితేనే ప్రపంచ దేశాలతో పోల్చినప్పుడు గర్వపడేలా దేశాభివృద్ధిని సాధించగలం. మహిళల ఎదుగుదలకు కుటీర పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర బడ్జెట్‌లో ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఆడపిల్ల పుట్టిందని తల్లిదండ్రులు ఆందోళనకు గురి కాకుండా ప్రత్యేక ప్రోత్సాహకాలు అందించాలి. యువతులు ఇంటర్, డిగ్రీతోనే చదువు మానేసి వివాహం చేసుకోవడం వల్ల పురుషులతో సమానంగా ఎదగలేకపోతున్నారు. వారికి నాణ్యమైన విద్య అందించాలి. స్కూల్స్, జూనియర్, సాంకేతిక కళాశాలలు ఎక్కువ సంఖ్యలో ఏర్పాటు చేయాలి. బాలికలు, మహిళలకు ఉచిత వ్యాక్సిన్‌లు ఇచ్చేలా బడ్జెట్ నిధులు కేటాయించాలి.



- ఇంజారపు పూజ, ఎస్పీ (ఐపీఎస్ అధికారి), పీటీసీ, మామునూరు

రక్షణకు నిధులు పెంచాలి

పెరుగుతున్న మహిళా జనాభాకు అనుగుణంగా బడ్జెట్‌లో నిధులు పెంచాలి. మహిళల రక్షణ కోసం ఏర్పాటు చేసే వివిధ శాఖలకు ఆ నిధులను ఖర్చు చేయాలి. వారిని ఆర్థికంగా మరింత బలోపేతం చేసేందుకు గ్రామాల్లో ప్రత్యేక కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ప్రోత్సహించాలి. ప్రత్యేకమైన పథకాలు రూపొందించాలి. ప్రభుత్వం పాఠశాలల్లో చదివే విద్యార్థినులకు అనుకూలంగా మౌలిక వసతులు కల్పించడం ముఖ్యం. మహిళలపై రాక్షసంగా వ్యవహరించేవారికి కఠిన శిక్షలు వేసే విధంగా చట్టాల్లో మార్పు తీసుకురావాలి. రాజకీయపరంగా అన్ని విభాగాల్లో మహిళలు తన కలలను సాకారం చేసుకునే విధంగా ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది.



- విజయలక్ష్మి, జడ్పీ సీఈఓ, జయశంకర్ భూపాలపల్లి జిల్లా

వ్యాపార రంగంలో భాగస్వామ్యం

అభివృద్ధి చెందిన దేశాల్లో మహిళలకు సముచిత స్థానం కల్పిస్తున్నారు. మన దేశంలోనూ అన్ని రంగాల్లో ప్రాతినిధ్యం పెరిగింది. ఉన్నత చదువుల్లో ప్రభుత్వ ప్రోత్సాహంతో పాటు వ్యాపారరంగాల్లో మహిళల భాగస్వామ్యం పెంచాలి. వైద్యం, శారీరక దృఢత్వం కోసం అంగన్వాడీ కేంద్రాలను మరింత పటిష్ఠం చేయాలి. మహిళలు వివిధ రంగాల్లో రాణించేలా రిజర్వేషన్లు కల్పించాలి. మొత్తంగా రాజకీయ, వ్యాపార, పారిశ్రామిక, విద్య, వైద్యం అన్నింటా మహిళలను ప్రోత్సహించాలి.



- లక్ష్మీకిరణ్, అదనపు కలెక్టర్, కరీంనగర్

– సాక్షి నెట్‌వర్క్

వైరల్

ఇలా కూడా నిద్రపోతారు!



'నిద్ర పోయే ముందు మీరు ఏం చేస్తారు?' అనే ప్రశ్నకు– 'చక్కని సంగీతం వింటాను. నచ్చిన పుస్తకం చదువుకుంటాను'... ఇలాంటి జవాబులు వినిపించడం సాధారణమే. అయితే ఇన్‌స్టాగ్రామ్ ఇన్‌ఫ్లూయెన్సర్ టియా విల్సన్ నోటి నుంచి వచ్చిన మాట విని నెట్ లోకులు షాకు అయ్యారు. 'సౌకర్యవంతంగా. సుఖంగా నిద్రపోవడానికి నా భుజాన్ని డిస్‌లోకేట్ చేస్తాను. నిద్ర నుంచి లేచిన తరువాత తిరిగి యథాస్థానంలో అమర్చుకుంటాను' అంటుంది విల్సన్. 'జోక్ చేస్తోందా?' అనుకోవద్దు. ఆమె చెప్పింది నిజమే. ఎహ్లార్స్ డాన్లోస్ సిండ్రోమ్ (ఈడీఎస్)తో బాధ పడుతోంది టియా విల్సన్. 'ఈడీఎస్' అనేది జన్యుపరమైన రుగ్మత. చర్మం సాగదీయబడినట్లుగా ఉంటుంది. కీళ్లు వదులవుతాయి. చర్మంపై మచ్చలు ఏర్పడతాయి. భుజాన్ని డిస్‌లోకేట్ చేసినప్పుడు అచేతనంగా మారి వేలాడబడుతున్నట్లుగా ఉంటుంది. కొద్దిరోజుల క్రితం 'హౌ ఐ స్లీప్' క్యాప్షన్‌తో ఇన్‌స్టాగ్రామ్‌లో టియా విల్సన్ పోస్ట్ చేసిన ఈ వీడియో రెండు మిలియన్‌ల వీక్షకుల గుండెలను చెమ్మగిల్లేలా చేసింది.

ఎలాంటి చి'కాకులు' లేకుండా హాయిగా..!



'బస్సు ఉండగా రెక్కలతో పనేమిటి!' అనుకున్నట్టున్నాయి ఈ కాకులు. ముంబైలోని ఒక బస్సు టాప్ మీద కాకులు వాలాయి. వాలిన కొద్దిసేపటికి ఆకాశంలోకి ఎగరడం కామన్. కాని ఈ కాకులు మాత్రం ఎక్కడికీ ఎగరకుండా బస్సుతోపాటు ముంబైలోని ఎన్నో వీధులలో హాయిగా విహరించాయి. 'వేర్ ఆర్ దే గోయింగ్' క్యాప్షన్‌తో 'ఎక్స్'లో పోస్ట్ చేసిన ఈ నాలుగు సెకన్‌ల వీడియో 1.4 మిలియన్ వ్యూస్‌ను సొంతం చేసుకుంది. 'ఈ కాకులు అంబానీల ఇంట పెళ్లికి వెళుతున్నట్లుగా ఉంది'.... 'ఎగిరి ఎగిరి అలిసిపోయాయి. పాపం వాటి గురించి మనం కూడా అర్థం చేసుకోవాలి'.. 'బస్సులపై కాకులకు ఉచిత ప్రయాణం స్కీమ్ ఏదైనా ప్రవేశ పెట్టారా!' 'కాకులు క్రాఫోర్డ్ మార్కెట్ (సౌత్ ముంబైలోని ప్రసిద్ధ మార్కెట్)కు వెళుతున్నట్లుగా ఉంది'... ఇలాంటి వ్యాఖ్యలతో కామెంట్ సెక్షన్ నిండిపోయింది.

హెల్త్



నేరుగా మనిషి చేయి చేయలేని ఎన్నో పనుల్ని ఇప్పుడు రోబో ఎంతో సమర్థంగా చేస్తోంది. వీటిల్లో శస్త్రచికిత్సలూ ఉన్నాయి. సర్జరీలో మనిషి చేయి సులభంగా చేరలేని చోట్లకు తన సన్నటి యాంత్రిక వేళ్లు చేరగలవు. నిజానికి రోబో చేస్తోందని అంటున్నా... మళ్లీ వాటిని నడిపించేది నిపుణులైన శస్త్రచికిత్సకులే. అత్యంత క్లిష్టమైన శస్త్రచికిత్సల్ని రోబోలతో అతి తేలిగ్గా చేయగలిగేవేమిటో, ప్రస్తుత వైద్యవిభాగాల్లోని ఏయే శాఖల్లో ఈ సర్జరీలు జరుగుతున్నాయో తెలుసుకుందాం.



రోబోలతో సంక్లిష్టమైన సర్జరీలు తేలిగ్గా..!

మానవ మణికట్టు ఒక పరిమితి వరకే తేలిగ్గా తిరుగుతుంది. కానీ ఓ రోబో మణికట్టు ఎటువైపైనా దాదాపు 270 డిగ్రీల వరకు తిరిగేలా రూపొందుతుంది. దాంతో అత్యంత నిశితంగా అనుకున్నంత మేరకే కోసేలా, కుట్లు వేసేలా చేసే శస్త్రచికిత్స ప్రక్రియల్ని రోబోకు ఆదేశాలిస్తూ డాక్టర్లు 'ఆపరేట్' చేస్తుంటారు. ఆ సర్జరీలో శస్త్రచికిత్స జరుగుతున్న అవయవాన్నీ, అందులోని భాగాల్నీ (ఫీల్డ్‌ను) 3–డీ ఇమేజ్ తెరపై చూస్తుంటారు.

మరింత సురక్షితమెందుకంటే...

కోత చాలా చిన్నగా ఉండటంవల్ల కోలుకునే సమయం తగ్గుతుంది. గాయమూ వేగంగా మానుతుంది. కోత, గాయం తక్కువ కావడం వల్ల ఇన్ఫెక్షన్‌కు అవకాశాలు బాగా తక్కువ. ఇవే కాదు... శస్త్రచికిత్సకు పట్టే సమయమూ, ఇవ్వాల్సిన మత్తుమందూ, రక్తస్రావమూ అన్నీ తక్కువే. ఇవన్నీ రోబోతో జరిగే శస్త్రచికిత్సను మరింత సురక్షితంగా మార్చేస్తాయి.

ఏయే శాఖల్లో ఈ శస్త్రచికిత్సలు?

మూత్ర వ్యవస్థకు సంబంధించి...

మూత్రపిండాల శస్త్రచికిత్సల్లో:

● కిడ్నీ నుంచి మూత్రాశయానికి (బ్లాడర్‌కు) మూత్రం తీసుకొచ్చే పైపులైన యురేటర్‌లలో ఏవైనా అడ్డంకులు ఉన్నప్పుడు (ఉదాహరణకు యురేటరో–పెల్విక్ జంక్షన్‌లో అడ్డంకి. దీన్నే యూపీజే అబ్‌స్ట్రక్షన్ అంటారు.) చేసే 'పైలోప్లాస్టీ ప్రొసీజర్' అనే శస్త్రచికిత్సలో ● కిడ్నీల్లో గడ్డల (రీనల్ ట్యూమర్స్) తొలగింపు ● కిడ్నీ పూర్తిగా తొలగించాల్సిన కేసుల్లో (నెఫ్రెక్టమీ).

ప్రోస్టెక్టమీ : ప్రోస్టేట్ గ్రంథి తొలగింపులో.

గైనకాలజీలో : ● గర్భసంచికీ అలాగే గర్భాశయ ముఖద్వారంలో క్యాన్సర్ (ప్రీ–మ్యాలిగ్నెంట్ సర్విక్స్ అండ్ యుటెరస్) వచ్చే అవకాశముందని తెలిసినప్పుడు ● ఫైబ్రాయిడ్, అడినోమయోసిస్ వంటి గడ్డల తొలగింపులో ● ఎండోమెట్రియాసిస్ కేసుల్లో సమస్యాత్మకమైన / వ్యాధికి గురైన భాగాలను తొలగించడానికి ● ఎండోమెట్రియమ్ శస్త్రచికిత్సలో అడ్హెషన్స్‌తో ఆ భాగం ఇతర శరీర భాగాలకు అతక్కుపోవడాన్ని విడదీయడానికి.

యూరో–గైనకాలజీ శస్త్రచికిత్సల్లో : ● పొత్తి కడుపు కింది భాగంలోని అవయవాలు మరో అవయవంలోకి చొచ్చుకునిపోయే హెర్నియా కేసుల్లో 'సాక్రోకాల్పోపెక్సీ' చేసేందుకు ● దగ్గినప్పుడూ, ఒత్తిడికి మూత్రం పడిపోయే కేసుల్లో చేసే కాల్పోసస్పెన్షన్ ప్రొసీజర్లలో, ● ఫిస్టులా రిపేర్ల వంటి కేసుల్లో సర్జరీ కాంప్లికేషన్లను తగ్గించడానికి.



డాక్టర్ వి. చంద్రమోహన్, సీనియర్ రోబోటిక్ యూరో సర్జన్

ఇతరత్రా విభాగాల్లోని శస్త్రచికిత్సలివి...

విపుల్ ప్రొసీజర్ : పాంక్రియాస్ (క్లోమం)లోని 'హెడ్' అనే భాగాన్నీ, అలాగే చిన్నపేగుల్లోని 'డియోడినమ్' అనే భాగాన్ని, గాల్‌బ్లాడర్‌నూ, బైల్‌డక్ట్‌ను తొలగించే 'పాంక్రియాటికో–డియోడనెక్టమీ' వంటి సంక్లిష్టమైన శస్త్రచికిత్సలో.

● పాంక్రియాస్, చిన్నపేగులు, గాల్‌బ్లాడర్‌లోని కొన్ని జబ్బులు (డిజార్డర్స్)లో (ఉదా: క్రానిక్ పాంక్రియాటైటిస్, డియోడనల్ ట్రామా వంటి చికిత్సల్లో)

థైరాయిడెక్టమీ : క్యాన్సర్‌కు గురైన థైరాయిడ్ గ్రంథిని తొలగించడానికి చేసే సంప్రదాయ శస్త్రచికిత్స తర్వాత మెడ చుట్టూ గీత కనిపిస్తుంది. కానీ రోబో చేసే శస్త్రచికిత్స తర్వాత ఎలాంటి గీతా పడకుండా శస్త్రచికిత్స చేసేందుకు. (అందంగా కనిపించాలని కోరుకునే యువతీ యువకులకూ / పెళ్లి కావాల్సిన యువతకు ఇదో వరం).


బ్రెయిన్ సర్జరీస్ : మెదడులోని సంక్లిష్టమైన భాగాల్లోకి ఏర్పడ్డ ట్యూమర్స్‌ను సంప్రదాయ శస్త్రచికిత్సతో తొలగింపు వీలుకాని సందర్భాల్లో.

భవిష్యత్తులో మరింత చవగ్గా...

ఇప్పుడు చాలా చోట్ల అమెరికన్ తయారీ రోబోలు ఉపయోగంలో ఉన్నాయి. ఇవి బాగా ఖరీదు కావడంతో ఈ శస్త్రచికిత్సలూ కాస్త ఖరీదే. అయితే భారతీయ రోబోలు అతి వేగంగా అందుబాటులోకి రానున్నాయి. ఇవి అమెరికన్ రోబోల ఖరీదులో సగానికే దొరుకుతాయి. ఫలితంగా అవి అందుబాటులోకి వస్తే ఇప్పటివరకూ అడ్వాన్స్‌డ్‌గా పరిగణిస్తున్న లాపరోస్కోపీ సర్జరీల స్థానంలో అన్ని వర్గాల ప్రజలకూ కొద్దిరోజుల్లోనే కారు చవగ్గా రోబో శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చే అవకాశముంది.

రేపు వరల్డ్ బ్రెయిన్ డే సందర్భంగా...

అన్యురిజమ్స్ అంటే?



మెదడులోని రక్తనాళాల్లో బలహీనమైన చోట ఉబ్బిపోయి బుడగలా మారడాన్ని 'అన్యురిజమ్స్' అంటారు. అకస్మాత్తుగా ప్రమాదకరంగా పరిణమించే ఈ సమస్య గురించి...

మెదడులోని ఏ ప్రాంతంలో రక్తనాళాలు ఉబ్బి ఉంటే ఆ ప్రాంతం పేరుతో అన్యురిజాన్ని చెబుతారు. ఉదాహరణకు సెరిబ్రమ్ అనే ప్రదేశంలో ఉంటే సెరిబ్రల్ అన్యురిజమ్స్ అంటారు. మెదడు చుట్టూ ఉండే ప్రధాన ప్రాంతం సబార్కనాయిడ్‌లో రక్తనాళాలు చిట్లి రక్తస్రావమైతే దాన్ని 'సబార్కనాయిడ్ హ్యామరేజ్' (ఎస్ఏహెచ్) అంటారు. రక్తనాళాలు చిట్లిన ప్రదేశాన్ని బట్టి మెదడు ఏ అవయవాన్ని కంట్రోల్ చేస్తుందో, ఆ అవయవం ప్రభావితమవుతుంది. అయితే ఇలా అన్యురిజమల్ బ్లీడ్‌కి గురైన ప్రతి ఏడుగురిలోనూ నలుగురు ఏదో ఒక రకమైన వైకల్యానికి గురయ్యే అవకాశం ఉంది. కీలక ప్రాంతంలో రక్తస్రావం కాగానే మొదట అది పక్షవాతానికీ (స్ట్రోక్‌కు), తీవ్రతను బట్టి కోమాలోకి తీసుకెళ్లే అవకాశాలెక్కువ.

బయట పడేందుకు అవకాశం తక్కువ... ఎందుకంటే?

అన్యురిజమ్స్ ఉన్న చాలామందిలో అవి వారి జీవితకాలంలో అవి చిట్లకపోవచ్చు. ఉబ్బు చిన్నగా ఉన్నవి కాకుండా... 'జెయింట్ అన్యురిజమ్స్' అని పిలిచే పెద్దవి అకస్మాత్తుగా చిట్లే అవకాశాలెక్కువ. దాంతో బాధితుల్లో అకస్మాత్తుగా పక్షవాతం కనిపించవచ్చు. హార్ట్ ఎటాక్స్‌లాగే 'సబర్కనాయిడ్ హ్యామరేజ్' అకస్మాత్తుగా వస్తుంది. గుండెకు రక్తాన్ని చేరవేసే రక్తనాళాల్లోని పూడిక వల్ల గుండెపోటు వస్తే... అప్పటికే అన్యురిజమ్స్‌కు గురైన రక్తనాళాలు చిట్లడం వల్ల సబర్కనాయిడ్ హ్యామరేజ్ వస్తుంది.

కారణాలు: ● కంట్రోల్‌లో లేని అధిక రక్తపోటు, డయాబెటిస్ వంటి జబ్బులు. ● చాలావరకు పుట్టుకతో వచ్చే (కంజెనిటల్), అలాగే జన్యుపరమైన కారణాలు (ఈ కారణంగా ఫ్యామిలీ హిస్టరీలో ఈ సమస్య ఉన్నప్పుడు ముప్పు ఎక్కువ) ● రక్తానికి వచ్చే ఇన్ఫెక్షన్‌తో కలిగే కాంప్లికేషన్లు ● ఆరోగ్యకరంగా లేని జీవన శైలి ● పొగాకు వాడకం, మద్యం అలవాటు ● యాక్సిడెంట్‌లో రక్తనాళాలకు గాయం ● కొన్ని అరుదైన కేసుల్లో : ఉదా. ఫైబ్రోమస్క్యులార్ డిస్‌ప్లేసియా, కిడ్నీల్లో నీటితిత్తులు వచ్చే పాలిసిస్టిక్ కిడ్నీ డిసీజ్.

చిట్లినప్పుడు కనిపించే లక్షణాలు: ● జీవితంలో ఎప్పుడూ అనుభవించనంత బాధతో కూడిన తలనొప్పి ● స్పృహ కోల్పోవడం ● పక్షవాతం / ఫిట్స్ కూడా ● మాట్లాడలేకపోవడం, మూతి వంకరపోవడం.

చికిత్సలు : ● **మందులిస్తూ చేసే చికిత్స:** ఇది రక్తనాళాలు చిట్లకముందు చేసే చికిత్స. రక్తపోటును అదుపులో ఉంచేందుకు మందులిస్తూ, కొన్ని ఆహారాలు, వ్యాయామాలు సూచిస్తారు. ● **శస్త్రచికిత్స / క్లిప్పింగ్ :** పుర్రె (క్రేనియమ్) తెరవడం ద్వారా చేసే శస్త్రచికిత్స (క్రేనియాటమీ) ద్వారా అన్యురిజమ్‌లను గుర్తించి, శస్త్రచికిత్సతో వాటిని జాగ్రత్తగా వేరుచేస్తారు. ఉబ్బిన చోట క్లిప్పింగ్ జరిపాక ముందులాగే రక్తప్రసరణ జరిగేలా చూస్తారు. ● **ఎండోవాస్క్యులార్ కాయిలింగ్ :** తొడ ప్రాంతంలోని రక్తనాళం నుంచి ఒక పైప్‌ను ప్రవేశపెట్టి... అందులో నుంచి మరింత చిన్నపైప్‌లను అన్యురిజమ్స్ వరకు చేరేలా చేసి, అక్కడ కాయిల్ అనే డివైజ్‌ని అన్యురిజమ్ నింపడానికి వాడతారు. దాంతో ఉబ్బిన బలహీన ప్రాంతానికి రక్తసరఫరా ఆగడంతో చిట్లడం జరగదు. ఇందులోనే బెలూన్ కాయిలింగ్ అనే ప్రక్రియతో అన్యురిజమ్ ఉన్న ప్రాంతానికి దగ్గర్లో బెలూన్ లాంటి దాన్ని ఉబ్బేలా చేసి, అటు తర్వాత కాయిలింగ్ చేస్తారు. దాంతో పెద్ద రక్తనాళాల దగ్గర ఉన్న ఉబ్బును చిట్లకుండా రక్షిస్తారు. ఇక 'ఫ్లో డైవర్టర్ స్టెంట్స్'తో రక్తపు దిశను మళ్లించి ఉబ్బు తగ్గిపోయేలా చేస్తారు.



డాక్టర్ ఎమ్.ఎల్. నీహారిక, కన్సల్టెంట్ న్యూరాలజిస్ట్

మెడీ ఫ్యాక్ట్

దగ్గును అణిచేయకండి!



దగ్గు రక్షణ వ్యవస్థలో భాగం. దగ్గడానికి ముందు శ్వాసనాళాల్లోని గాలి చాలా వేగంగా ప్రవహించి, దగ్గుతున్న సమయంలో లోపల ఉన్న అనవసర స్రావాల్ని బయటకు బలంగా నెట్టివేస్తూ దగ్గు ఒక రక్షణ ప్రక్రియలా పనిచేస్తుంది. అందుకే వీలైనంత మేరకు దగ్గును మందులతో అణచేయడానికి ప్రయత్నించకూడదు. లంగ్స్‌లోని స్రావాలు చిక్కబడ్డా, వాయునాళాల్లో ఏదైనా అడ్డుపడ్డా దగ్గు రావడం పెరుగుతుంది. దగ్గుతో పాటు కళ్లె / కఫం పడుతుంది. అలా వ్యర్థ స్రావాలను బయటకు పంపించి వేస్తుంది. కాబట్టే దగ్గును మందులతో అణచివేయకూడదు.

పరిపరిశోధన

టాబ్లెట్ త్వరగా పనిచేయాలంటే?



టాబ్లెట్ వేసుకున్న తర్వాత కుడి పక్కకు ఒరిగి కూర్చున్నా లేదా కుడిపక్కకే ఒరిగి పడుకున్నా కడుపులో టాబ్లెట్ త్వరగా కరిగి, ప్రతి కణానికీ అందుతుందంటున్నారు జాన్ హాప్‌కిన్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్ పరిశోధకులు. ''టాబ్లెట్ వేసుకున్నాక రక్తంలోకి వెళ్లడానికి ముందు అది చిన్న పేగుల్లోకి వెళ్లాలి. అయితే అలా వెళ్లాలంటే... కడుపును దాటాక టాబ్లెట్ మొదట చిన్నపేగుల తలుపు (వాల్వ్) 'పైలోరస్'నూ దాటాక కరిగి రక్తంలో చేరాలి. కుడిపక్కకు ఒరగడం వల్ల అది మరింత వేగంగా, ప్రభావవంతంగా చేరుతుందన్నది వారి మాట.



భారత ఫుట్‌బాల్ జట్టు హెడ్ కోచ్‌గా మనోలో మార్క్వెజ్

భారత ఫుట్‌బాల్ టీమ్‌కు కొత్త కోచ్ వచ్చాడు. స్పెయిన్‌కు చెందిన మనోలో మార్క్వెజ్‌ను టీమ్ హెడ్ కోచ్‌గా నియమిస్తున్నట్లు అఖిల భారత ఫుట్‌బాల్ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్) శనివారం ప్రకటించింది. 55 ఏళ్ల మార్క్వెజ్ ప్రస్తుతం ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టీమ్ ఎఫ్‌సీ గోవాకు కోచ్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే 2024-25 సీజన్‌లో ఆయన ఇటు భారత జట్టుతో పాటు అటు ఎఫ్‌సీ గోవా కోచ్‌గా కూడా రెండు బాధ్యతలను నిర్వర్తిస్తారని ఏఐఎఫ్‌ఎఫ్ వెల్లడించింది. కోచ్‌గా యూఈఎఫ్‌ఏ ప్రొ లైసెన్స్ ఉన్న మార్క్వెజ్ పదవీకాలంపై ఫెడరేషన్ ఎలాంటి స్పష్టతనివ్వలేదు. వియత్నాం, లెబనాన్‌లతో వచ్చే అక్టోబరులో జరిగే మూడు దేశాల టోర్నీనుంచి కొత్త కోచ్ బాధ్యతలు స్వీకరిస్తారు. 2020 నుంచి భారత్‌లో మార్క్వెజ్ కోచింగ్ కొనసాగుతోంది. ఎఫ్‌సీ గోవాకు కోచ్‌గా మారక ముందు ఐఎస్‌ఎల్‌లో ఆయన హైదరాబాద్ ఎఫ్‌సీకి కోచ్‌గా పని చేశారు. మార్క్వెజ్ నేతృత్వంలోనే 2021-22లో హైదరాబాద్ ఐఎస్‌ఎల్ చాంపియన్‌గా నిలవడం విశేషం. స్పెయిన్‌లో కోచ్‌గా మార్క్వెజ్ అపార అనుభవం ఉంది. పలు స్థానిక క్లబ్‌లతో పాటు లా లిగా జట్టు లాస్ పామాస్‌కు కూడా కోచ్‌గా పని చేశారు.

అసిస్టెంట్ కోచ్‌గా అభిషేక్ నాయర్

- ర్యాన్ టెన్ డష్కెట్‌కూ అవకాశం
- శ్రీలంక సిరీస్ నుంచి బాధ్యతలు


అభిషేక్


డష్కెట్

న్యూఢిల్లీ: భారత మాజీ క్రికెటర్ అభిషేక్ నాయర్, నెదర్లాండ్ మాజీ ఆటగాడు ర్యాన్ టెన్ డష్కెట్ టీమిండియా సహాయక సిబ్బందిలో భాగం కానున్నారు. హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ సూచనల మేరకు వీరిద్దరినీ అసిస్టెంట్ కోచ్‌లుగా ఎంపిక చేసినట్లు సమాచారం. గంభీర్‌తో పని చేసిన అనుభవం ఉండటంతో వీరిద్దరి ఎంపికకు మార్గం సుగమమైంది. 2024 ఐపీఎల్‌లో చాంపియన్‌గా నిలిచిన కోల్‌కతా నైట్‌రైడర్స్ టీమ్‌కు గంభీర్ మెంటార్‌గా వ్యవహరించగా...నాయర్, డష్కెట్ అసిస్టెంట్ కోచ్‌లుగా వ్యవహరించారు. భారత్ తరఫున 3 వన్డేలు ఆడిన నాయర్‌కు ఆల్‌రౌండర్‌గా దేశవాళీ క్రికెట్‌లో ఘనమైన రికార్డు ఉంది. 103 ఫస్ట్‌క్లాస్ మ్యాచ్‌లు ఆడిన అతను రంజీ చాంపియన్‌గా నిలిచిన ముంబై టీమ్‌లలో భాగంగా ఉన్నాడు. కరీబియన్ ప్రీమియర్ లీగ్‌లో ట్రిన్‌బాగో నైట్‌రైడర్స్ టీమ్‌కు నాయర్ హెడ్‌కోచ్‌గా వ్యవహరించాడు. డష్కెట్ నెదర్లాండ్స్ తరఫున 34 వన్డేలు, 24 టి20లు ఆడాడు. కౌంటీ టీమ్ కెంట్‌కు బ్యాటింగ్ కోచ్‌గా వ్యవహరించిన అతను ప్రస్తుతం మేజర్ లీగ్‌లో లాస్ ఏంజెల్స్ నైట్‌రైడర్స్‌కు అసిస్టెంట్ కోచ్‌గా పని చేస్తున్నాడు. వీరిద్దరు శ్రీలంకతో సిరీస్ కోసం జట్టుతో కలుస్తారు. స్వయంగా గంభీర్ అగ్రశ్రేణి బ్యాటర్ కావడంతో టీమిండియాకు ప్రత్యేకంగా బ్యాటింగ్ కోచ్ అని కాకుండా ఇద్దరు అసిస్టెంట్ కోచ్‌లను ఎంచుకున్నట్లు తెలుస్తోంది. మరో వైపు బౌలింగ్ కోచ్ రేసులో దక్షిణాఫ్రికా మాజీ పేసర్ మోర్నీ మోర్కెల్ ముందున్నాడు. ఐపీఎల్‌లో లక్నో టీమ్‌కు మోర్కెల్, గంభీర్ కలిసి పని చేశారు. ఫీల్డింగ్ కోచ్ విషయంలో మార్పు లేకపోవచ్చు. వరల్డ్ కప్ వరకు టీమ్‌కు ఫీల్డింగ్ కోచ్‌గా వ్యవహరించిన హైదరాబాదీ టి.దిలీప్ ఇకపై కూడా కొనసాగే అవకాశం ఉంది.

శ్రీలంక, థాయిలాండ్ విజయం

- నేడు యూఏఈతో భారత్ ఢీ
- మహిళల ఆసియా కప్ టోర్నీ



దంబుల్లా: మహిళల ఆసియా కప్ టోర్నీలో శనివారం శ్రీలంక, థాయిలాండ్ జట్లు విజయాలు నమోదు చేశాయి. మాజీ చాంపియన్ బంగ్లాదేశ్‌ను 7 వికెట్ల తేడాతో శ్రీలంక ఓడించింది. ముందుగా బంగ్లాదేశ్ 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 111 పరుగులు చేసింది. కెప్టెన్ నిగార్ సుల్తానా (59 బంతుల్లో 48 నాటౌట్; 6 ఫోర్లు) టాప్ స్కోరర్‌గా నిలిచింది. అనంతరం లంక 17.1 ఓవర్లలో 3 వికెట్లకు 114 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' విష్మీ గుణరత్నే (48 బంతుల్లో 51; 7 ఫోర్లు, 1 సిక్స్) అర్ధ సెంచరీ చేయగా...హర్షిత సమరవిక్రమ (31 బంతుల్లో 33; 4 ఫోర్లు) రాణించింది. మరో మ్యాచ్‌లో థాయిలాండ్ 22 పరుగుల తేడాతో మలేసియాపై విజయం సాధించింది. ముందుగా థాయిలాండ్ 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 133 పరుగులు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ననపట్ కొంచరోంకయ్ (35 బంతుల్లో 40; 6 ఫోర్లు) కీలక పరుగులు సాధించింది. ఆ తర్వాత మలేసియా 20 ఓవర్లలో 8 వికెట్లకు 111 పరుగులే చేయగలిగింది. వాన్ జూలియా (53 బంతుల్లో 52; 6 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించినా మిగతావారంతా విఫలమయ్యారు.

గ్రూప్ 'ఎ'లో భాగంగా నేడు జరిగే తమ రెండో మ్యాచ్‌లో యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)తో భారత్ తలపడుతుంది. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి జరిగే ఈ మ్యాచ్ స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం కానుంది. తమ తొలి పోరులో పాకిస్తాన్‌పై 7 వికెట్ల తేడాతో భారత్ విజయం సాధించింది.

ఇంగ్లండ్ 248/3

వెస్టిండీస్‌తో రెండో టెస్టు

నాటింగ్‌హమ్: వెస్టిండీస్‌తో జరుగుతున్న రెండో టెస్టులో మూడో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తమ రెండో ఇన్నింగ్స్‌లో 3 వికెట్ల నష్టానికి 248 పరుగులు చేసింది. హ్యారీ బ్రూక్ (78 బంతుల్లో 71 నాటౌట్; 8 ఫోర్లు), బెన్ డకెట్ (92 బంతుల్లో 76; 11 ఫోర్లు), ఒలీ పోప్ (67 బంతుల్లో 51; 6 ఫోర్లు) అర్ధ సెంచరీలు సాధించగా...జో రూట్ (33 నాటౌట్) రాణించాడు. అంతకు ముందు వెస్టిండీస్‌కు తొలి ఇన్నింగ్స్‌లో 41 పరుగుల ఆధిక్యం లభించింది. ఓవర్‌నైట్ స్కోరు 351/5తో ఆట కొనసాగించిన విండీస్ 457 పరుగులకు ఆలౌటైంది. జోషువా డి సిల్వా (122 బంతుల్లో 82 నాటౌట్; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), షామర్ జోసెఫ్ (27 బంతుల్లో 33; 5 ఫోర్లు, 2 సిక్స్‌లు) దూకుడుగా ఆడారు. వీరిద్దరు పదో వికెట్‌కు 78 బంతుల్లో 71 పరుగులు జోడించడం విశేషం. ప్రస్తుతం ఇంగ్లండ్ 207 పరుగులు ముందంజలో ఉంది.


జోషువా
జోసెఫ్

'హ్యాట్రిక్'పై సింధు గురి

- సాత్విక్–చిరాగ్ జోడీకి పతకావకాశాలు
- సంచలనంపై లక్ష్యసేన్ దృష్టి
- ఒలింపిక్స్‌లో బ్యాడ్మింటన్‌పై ఆశలు



చిరాగ్
సాత్విక్
లక్ష్యసేన్
ప్రణయ్
సింధు

బ్యాడ్మింటన్‌ను 1972 మ్యూనిచ్ ఒలింపిక్స్‌లో, ఆ తర్వాత 1988 సియోల్ ఒలింపిక్స్‌లలో ఎగ్జిబిషన్ / డెమాన్‌స్ట్రేషన్ స్పోర్ట్‌గా ఆడించారు. అంటే పోటీలు జరిపి విజేతలను ప్రకటించినా...ఆ విజయాలను పతకాల జాబితాలో కలపరు. 1992లో జరిగిన బార్సిలోనా ఒలింపిక్స్‌నుంచి అధికారికంగా బ్యాడ్మింటన్ ఒలింపిక్స్‌లో భాగమైంది. 1992 నుంచి 2008 వరకు భారత షట్లర్లు పోటీల్లో పాల్గొన్నా...ఈ ఐదు ప్రయత్నాల్లోనూ మనకు ఒక్క పతకం కూడా దక్కలేదు. అంతర్జాతీయ బ్యాడ్మింటన్‌లో చెప్పుకోదగ్గ విజయాలతో అప్పటికే తమకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న పుల్లెల గోపీచంద్, విమల్ కుమార్, మధుమిత బిష్త్, పీవీవీ లక్ష్మి, అపర్ణా పోపట్, అనూప్ శ్రీధర్‌లాంటి ఆటగాళ్లు చేసిన ప్రయత్నాలన్నీ విఫలమయ్యాయి. 2008 బీజింగ్ ఒలింపిక్స్‌లో సైనా నెహ్వాల్ క్వార్టర్ ఫైనల్ వరకు చేరడమే అప్పటి వరకు భారత అత్యుత్తమ ప్రదర్శన.

వరుసగా మూడు సార్లు...

2012 లండన్ ఒలింపిక్స్‌లో భారత్ పరిస్థితి మారింది. అప్పటికే వరుస విజయాలు, సూపర్ సిరీస్ టైటిల్స్‌తో అద్భుత ఫామ్‌లో ఉన్న సైనా నెహ్వాల్ భారత్‌కు బ్యాడ్మింటన్‌లో తొలి ఒలింపిక్ పతకాన్ని అందించింది. సెమీ ఫైనల్లో యిహాన్ వాంగ్ (చైనా) చేతిలో ఓడిన సైనా...ప్లే ఆఫ్ మ్యాచ్‌లో గ్జిన్ వాంగ్ (చైనా)పై విజయం సాధించి కాంస్య పతకాన్ని గెలుచుకుంది. మరో వైపు పురుషుల సింగిల్స్‌లో పారుపల్లి కశ్యప్ క్వార్టర్ ఫైనల్ వరకు రాగలిగాడు. నాలుగేళ్ల తిరిగే సరికి షటిల్‌లో భారత్ పతకం మరింత మెరుగైంది. అంతర్జాతీయ యవనికపై దూసుకొచ్చిన 21 ఏళ్ల యువ తార పూసర్ల వెంకట (పీవీ) సింధు రజత పతకాన్ని గెలుచుకొని భారత అభిమానులను ఆనందంలో ముంచెత్తింది. పదునైన ఆటతో ఫైనల్ చేరిన సింధు...తుది పోరులో కరోలినా మరీన్ (స్పెయిన్) చేతిలో ఓడింది. ఈ ఒలింపిక్స్ పురుషుల సింగిల్స్‌లో కిడాంబి శ్రీకాంత్ క్వార్టర్స్ వరకు చేరినా...చైనా దిగ్గజం లిన్ డాన్ చేతిలో ఓడి నిష్క్రమించాడు. 2020 టోక్యో ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో మరో కాంస్యం చేరింది. ఈ సారి కూడా సింధునే పతకాన్ని గెలుచుకుంది. సెమీస్‌లో తై జు (తైపీ) చేతిలో ఓటమిపాలైన సింధు... ప్లే ఆఫ్ పోరులో బింగ్‌జియావో (చైనా)పై గెలిచి వరుసగా రెండో ఒలింపిక్ పతకాన్ని తన మెడలో వేసుకుంది. పురుషుల డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టి జోడీపై ఆ సమయంలో మంచి అంచనాలే ఉన్నా...దురదృష్టవశాత్తు వాళ్లు గ్రూప్ దశకే పరిమితమయ్యారు.

అనుకూలమైన 'డ్రా'తో...

ఒలింపిక్స్‌లో భారత్‌నుంచి వ్యక్తిగత విభాగంలో రెండు పతకాలు గెలుచుకున్న ఆటగాళ్లు ఇద్దరే ఉన్నారు. సుశీల్ కుమార్ (రెజ్లింగ్), సింధు మాత్రమే ఈ ఘనత సాధించారు. ఇప్పుడు వరుసగా మూడో ఒలింపిక్స్‌లోనూ పతకం గెలిచి ఆల్‌టైమ్ గ్రేట్‌గా నిలిచే అవకాశం సింధు ముందుంది. ఊహించినట్లుగానే గ్రూప్ దశలో రెండు సునాయాస మ్యాచ్‌లు ఉన్నాయి. ఆ తర్వాత వరుసగా 2020లో కాంస్య పోరులో తాను ఓడించిన బింగ్‌జియావో, చెన్ యు ఫె, మరీన్‌లను దాటితే ఫైనల్ వరకు వెళ్లగలదు. గత కొంత కాలంగా గొప్ప ఫామ్‌లో లేకపోయినా... కీలక సమయంలో సత్తా చాటగల నైపుణ్యం సింధు సొంతం. అందుకే ఆమె పతకం గెలవడంపై అంచనాలున్నాయి. పురుషుల డబుల్స్‌లో కూడా సాత్విక్ సాయిరాజ్–చిరాగ్ శెట్టికి మంచి 'డ్రా'నే లభించింది. గ్రూప్ 'సి'లో విజేతగా ముందంజ వేస్తే ఈ జోడీకి నాకౌట్‌లోనూ తమకంటే బలహీన ప్రత్యర్థులే ఎదురు కావచ్చు. పురుషుల సింగిల్స్‌లో హెచ్‌ఎస్ ప్రణయ్ ఎంత వరకు వెళతాడనేది ఆసక్తికరం. జొనాథన్ క్రిస్టీలాంటి టాప్ ప్లేయర్‌ను ఓడిస్తే లక్ష్యసేన్ నాకౌట్‌కు వెళ్లే అవకాశం ఉంది. ప్రీక్వార్టర్స్‌లో లక్ష్యసేన్, ప్రణయ్ ఎదురు కావచ్చు. మహిళల డబుల్స్‌లో అశ్విని పొన్నప్ప – తనీషా క్రాస్టో జోడి గ్రూప్ దశను దాటి నాకౌట్‌కు చేరడం కష్టమే.

ఒలింపిక్స్‌లో భారత్ ఖాతాలో గత మూడు ఒలింపిక్స్‌లలో వరుసగా పతకాలు వచ్చాయి. 2012లో సైనా నెహ్వాల్ కాంస్యంతో మెరవగా...2016లో పీవీ సింధు రజతం సాధించింది. 2020లోనూ తన జోరును కొనసాగిస్తూ సింధు కాంస్యాన్ని అందుకుంది.

–సాక్షి క్రీడా విభాగం

సినిమా


టార్గెట్ పంద్రాగస్ట్

వరుసగా సెలవులు వస్తే సినిమాలకు పండగే పండగ. ఆగస్ట్ రెండో వారం అలాంటి పండగే కానుంది. ఆగస్ట్ 15 గురువారం... స్వాతంత్య్ర దినోత్సవం కాబట్టి గవర్నమెంట్ హాలిడే. ఆ రోజుతో పాటు శుక్ర, శని, ఆదివారాల వసూళ్లు రాబట్టుకోవచ్చు. సోమవారం రక్షా బంధన్... అది కూడా కలిసొస్తుంది. అందుకే పంద్రాగస్ట్ టార్గెట్‌గా థియేటర్స్‌లో గెలుపు జెండా ఎగురవేయడానికి కొందరు నిర్మాతలు తమ చిత్రాలను ఆ తేదీన విడుదలకు సిద్ధం చేస్తున్నారు. ఆ చిత్రాల గురించి తెలుసుకుందాం.


పూజా హెగ్డే

మిస్టర్ బచ్చన్ రెడీ

రవితేజ టైటిల్ రోల్‌లో నటించిన చిత్రం 'మిస్టర్ బచ్చన్'. దర్శకుడు హరీష్ శంకర్ తెరకెక్కిస్తున్న ఈ సినిమాతో భాగ్యశ్రీ బోర్సే హీరోయిన్‌గా తెలుగు పరిశ్రమకు పరిచయం అవుతున్నారు. పీరియాడికల్ యాక్షన్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాలో రవితేజ ఇన్‌కమ్ టాక్స్ ఆఫీసర్‌గా కనిపిస్తారని తెలుస్తోంది. పనోరమా స్టూడియోస్, టీ సిరీస్‌ల సమర్పణలో టీజీ విశ్వప్రసాద్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 14 లేదా 15న థియేటర్స్‌లోకి రానుందని సమాచారం.



రవితేజ

డబుల్ ఎనర్జీ

పంద్రాగస్ట్‌కు థియేటర్స్‌లోకి వచ్చేందుకు డబుల్ ఎనర్జీతో రెడీ అయ్యాడు 'డబుల్ ఇస్మార్ట్'. హీరో రామ్, దర్శకుడు పూరి జగన్నాథ్ కాంబినేషన్‌లో వచ్చిన 'ఇస్మార్ట్ శంకర్' సినిమాకి సీక్వెల్‌గా 'డబుల్ ఇస్మార్ట్' తెరకెక్కింది. సీక్వెల్‌లో కావ్యా థాపర్ హీరోయిన్‌గా నటించగా, సంజయ్ దత్, అలీ కీలక పాత్రధారులు. పూరి జగన్నాథ్, ఛార్మీ నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న రిలీజ్ కానుంది. ఓ సీబీఐ ఆఫీసర్ మెమొరీని ఓ సైన్స్ చిప్ సాయంతో కిరాయి హంతకుడు శంకర్ (రామ్) మెదడులోకి ట్రాన్స్‌ఫార్మ్ చేస్తారు. ఆ తర్వాత శంకర్ జీవితం ఏ విధంగా ప్రభావితమైంది? అనే కోణంలో 'ఇస్మార్ట్ శంకర్' కథ సాగిన విషయం తెలిసిందే. ఈ కథకు కొనసాగింపుగా 'డబుల్ ఇస్మార్ట్' చిత్రం ఉంటుందని తెలుస్తోంది.


రామ్

కేజీఎఫ్ కథ

కేజీఎఫ్ (కోలార్ గోల్డ్ ఫీల్డ్స్)లో జరిగిన వాస్తవ ఘటనల ఆధారంగా తెరకెక్కిన చిత్రం 'తంగలాన్'. 18వ శతాబ్దం నేపథ్యంలో పా. రంజిత్ దర్శకత్వం వహించిన ఈ సినిమాలో విక్రమ్ హీరోగా నటించారు. పార్వతీ తిరువోతు, పశుపతి, హరికృష్ణన్, అన్బుదురై ఇతర లీడ్ రోల్స్‌లో నటించారు. ఈ సినిమాను జనవరి 26న విడుదల చేయాలనుకున్నారు. పోస్ట్ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కాకపోవడంతో విడుదల కాలేదు. అలా వాయిదా పడి ఫైనల్‌గా ఆగస్టు 15న రిలీజ్ కానుంది. కేజీఎఫ్‌లోని బంగారం కోసం జరిగే అక్రమ తవ్వకాలకు, అక్కడి ఓ గిరిజన తెగకు ఉన్న సంబంధం ఏంటి? అనేది ఈ చిత్రం ప్రధానాంశం. ఇందులో ఆ తెగ నాయకుడిగా విక్రమ్ కనిపిస్తారు. కేఈ జ్ఞానవేల్ రాజా నిర్మించిన ఈ చిత్రం తెలుగులోనూ ఆగస్ట్ 15నే రిలీజ్ కానుంది.


విక్రమ్

చిన్న కథ కాదు

'అమ్మ టెన్త్ ఫెయిల్... కొడుకు ఫిఫ్త్ ఫెయిల్... చిన్న కథ కాదు..' అనే డైలాగ్ '35: చిన్న కథ కాదు' సినిమాలోనిది. నివేదా థామస్, ప్రియదర్శి, విశ్వదేవ్, గౌతమి, భాగ్యరాజ్ లీడ్ రోల్స్‌లో నటించిన చిత్రం ఇది. నంద కిశోర్ ఈమాని ఈ సినిమాకు దర్శకత్వం వహించారు. ఈ సినిమాలో ప్రసాద్ (విశ్వతేజ్), సరస్వతి (నివేదా థామస్) భార్యాభర్తలు. వీరి కొడుక్కి 35 పాస్ మార్కులు కూడా రావు. దీంతో వాళ్ల కుటుంబం కాస్త నిరాశకు లోనవుతుంది. నిజంగా... 35 పాస్ మార్కులు ముఖ్యమా? ఆ ఊర్లోని మాస్టర్ (ప్రియదర్శి) వల్ల సరస్వతి కొడుకు పడిన ఇబ్బందులు ఏంటి? అనే అంశాలతో ఈ సినిమాను తెరకెక్కించినట్లుగా తెలుస్తోంది. రానా దగ్గుబాటి సమర్పణలో సృజన్ యరబోలు, సిద్ధార్థ్ రాళ్లపల్లి నిర్మించిన ఈ చిత్రం ఆగస్టు 15న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదల కానుంది.


నివేదా థామస్

స్ఫూర్తిదాయక పోరాటం

కీర్తి సురేష్ నటించిన ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ 'రఘుతాత'. తన గ్రామం కోసం కయల్‌విళి అనే ఓ యువతి చేసే స్ఫూర్తిదాయక పోరాటం నేపథ్యంలో ఈ సినిమా కథనం సాగుతుంది. సుమన్ కుమార్ దర్శకత్వంలో హోంబలే ఫిలింస్ బేనర్ నిర్మించింది. ఈ సినిమాను ఆగస్టు 15న విడుదల చేయనున్నట్లుగా గతంలో మేకర్స్ ప్రకటించారు. కానీ ఆ తర్వాత ఈ సినిమా రిలీజ్‌పై మరో అప్‌డేట్ రాలేదు. మరి.. ఆగస్టు 15 బరిలో కీర్తి సురేష్ 'రఘుతాత' సినిమా ఉంటుందా? లేదా అనేది చూడాలి. ఈ తమిళ చిత్రం తెలుగు, మలయాళ భాషల్లోనూ విడుదల కానుంది.


కీర్తి సురేష్

పుష్ప వాయిదా పడటంవల్లేనా?


'పుష్ప' ఫ్రాంచైజీలో హీరో అల్లు అర్జున్, దర్శకుడు సుకుమార్ కాంబినేషన్‌లో 'పుష్ప: ది రూల్' సినిమా రానుంది. నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మిస్తున్న ఈ సినిమా ఆగస్టు 15న విడుదల కావాల్సింది. అయితే క్వాలిటీ విషయంలో రాజీ పడాలనుకోవడం లేదని, అందుకే విడుదలను వాయిదా వేశామని యూనిట్ పేర్కొంది. ఆ తర్వాత 'పుష్ప: ది రూల్'ను డిసెంబరు 6న విడుదల చేస్తామని ప్రకటించింది. ఆగస్టు 15కి 'పుష్ప' రాకపోవడంవల్ల, లాంగ్ వీకెండ్, రక్షాబంధన్ ఫెస్టివల్ కూడా కలిసొచ్చి తమ సినిమాలకు లాభాలు వస్తాయని ఆయా చిత్రయూనిట్‌లు ఆలోచన చేసి ఆగస్టు 15ను టార్గెట్‌గా చేసుకుని ఈ సినిమాలను రిలీజ్ చేస్తున్నట్లుగా తెలుస్తోంది.

మేం ఫ్రెండ్సండి....

మేం ఫ్రెండ్సండి అంటూ థియేటర్స్‌లోకి వస్తున్నారు కార్తీక్, సబ్బు, హరి. మరి... వీళ్ల కథ ఏంటి? అనేది ఆగస్టు 15న థియేటర్స్‌లో తెలియనుంది. ఈ చిత్రంలో కార్తీక్‌గా నార్నే నితిన్, అతని ప్రేయసి పల్లవి పాత్రలో నయన్ సారిక, సుబ్బుగా రాజ్‌కుమార్ కసిరెడ్డి, హరిగా అంకిత్ నటించారు. ప్రేమ, స్నేహం అంశాల మేళవింపుతో అంజి కె. మణిపుత్ర దర్శకత్వంలో అల్లు అరవింద్ సమర్పణలో 'బన్నీ' వాసు, విద్యా కొప్పినీడి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఆగస్టు 15కి ఇంకా సమయం ఉంది. సో... ఈ విడుదల జాబితా ఇంకా పెరిగే చాన్స్ ఉంది.


నార్నే నితిన్

సరితూగే సమరమే...


ఎస్‌జే సూర్య

నాని హీరోగా వివేక్ ఆత్రేయ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'సరిపోదా శనివారం'. ఇందులో ప్రియాంకా అరుళ్ మోహన్ హీరోయిన్‌గా నటిస్తుండగా, ఎస్‌జే సూర్య, సాయికుమార్ లీడ్ రోల్స్‌లో నటించారు. శనివారం (జూలై 20) ఎస్‌జే సూర్య బర్త్ డే సందర్భంగా 'సరిపోదా శనివారం' నుంచి కొత్త వీడియోను రిలీజ్ చేశారు. 'సరితూగే సమరమే... సంహారం తథ్యమే' అంటూ ఈ వీడియోను షేర్ చేశారు నాని. డీవీవీ దానయ్య, దాసరి కల్యాణ్ నిర్మిస్తున్న ఈ చిత్రం ఆగస్టు 29న రిలీజ్ కానుంది.

కుర్రోళ్లు వస్తున్నారు


'కమిటీ కుర్రోళ్ళు' పోస్టర్

నిహారిక కొణిదెల సమర్పణలో ఎల్.ఎల్.పి, శ్రీరాధా దామోదర్ స్టూడియోస్ బ్యానర్స్‌పై రూపొందిన చిత్రం 'కమిటీ కుర్రోళ్ళు'. యదు వంశీ దర్శకత్వంలో పద్మజ కొణిదెల, జయలక్ష్మి అడపాక నిర్మించిన ఈ చిత్రం ఆగస్ట్‌లో వచ్చే ఫ్రెండ్‌షిప్ వీక్‌లో విడుదలకు సిద్ధమైంది. వచ్చే నెల 9న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నామని చిత్రయూనిట్ ప్రకటించింది. ''ఈ చిత్రం ద్వారా పదకొండు మంది హీరోలను, నలుగురు హీరోయిన్లను పరిచయం చేస్తున్నాం. స్నేహం, భావోద్వేగాలు, ప్రేమ, పల్లెటూరిలోని రాజకీయాలు, యువత పడే సంఘర్షణలన్నింటినీ ఈ చిత్రంలో చూపించాం'' అన్నారు. సందీప్ సరోజ్, యశ్వంత్ పెండ్యాల, ఈశ్వర్ రాచిరాజు, త్రినాథ్ వర్మ, ప్రసాద్ బెహరా, మణికంఠ పరసు, లోకేష్ కుమార్ పరిమి తదితరులు ఈ చిత్రంలో నటించారు.

తీర్పు ఒక్కటే

హాస్య నటుడు అలీ ఫ్యామిలీకి చెందిన సదన్ హీరోగా నటించిన సినిమా 'ప్రణయ గోదారి'. ప్రియాంకా ప్రసాద్ హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాలో సాయికుమార్, సునీల్ రావినూతల కీలక పాత్రలు పోషించారు. పి.ఎల్. విఘ్నేష్ దర్శకత్వంలో పారమళ్ళ లింగయ్య నిర్మించిన ఈ చిత్రం త్వరలో రిలీజ్ కానుంది. ఈ సినిమా గ్లింప్స్‌ను రిలీజ్ చేసిన నిర్మాత రాజ్ కందుకూరి మాట్లాడుతూ– ''గ్లింప్స్‌లో సాయికుమార్‌గారి డైలాగ్స్ పవర్‌ఫుల్‌గా ఉన్నాయి'' అన్నారు. ఈ సినిమాలో ఊరి పెద్దలా సాయికుమార్ నటించారు. సాయికుమార్ పలికిన 'తప్పు ఎవరు చేసినా తీర్పు ఒక్కటే' అనే డైలాగ్ గ్లింప్స్‌లో ఉంది.


విఘ్నేష్, రాజ్ కందుకూరి, మార్కండేయ

అమ్మాయి... సూర్యుడు... జెలాటో

''భగవంతుడు సృష్టించిన ఈ పెద్ద ప్రపంచంలో మనం ఎంత చిన్నవాళ్లమో ప్రకృతి గుర్తు చేస్తుంది. ప్రకృతికి సంబంధించిన ప్రతిదీ చాలా వైశాల్యంతో కూడుకుని ఉంటుంది. చాలా గంభీరంగా, వినయంగా అనిపిస్తుంటుంది. అలాగే ప్రతిదాంట్లోనూ ఓ ఆధ్యాత్మిక ఉట్టిపడుతుంది'' అంటున్నారు పూజా హెగ్డే. ఈ బ్యూటీ ప్రస్తుతం ప్రకృతి అందాలను ఆస్వాదిస్తున్నారు. షూటింగ్స్‌కి కాస్త విరామం రావడంతో విహార యాత్రకు ఇటలీలో వాలిపోయారు పూజా హెగ్డే. అక్కడ పలు ప్రదేశాలను సందర్శిస్తూ ఎంజాయ్ చేస్తున్నారు. కలర్‌ఫుల్ ఫ్రాక్‌లో సన్ గ్లాసెస్‌తో, చేతిలో జెలాటో (ఇటలీలో అన్ని రకాల ఐస్‌క్రీమ్‌లను జెలాటో అంటారు)తో చిరునవ్వులు చిందిస్తూ దిగిన ఫొటోలను 'అమ్మాయి... సూర్యుడు... జెలాటో' అనే క్యాప్షన్ ఇచ్చి, షేర్ చేశారామె. అలాగే పడవ ప్రయాణం చేస్తూ, ప్రకృతిని చూసి పరవశించిన వీడియోను షేర్ చేసి, పై విధంగా పేర్కొన్నారు. ఇక ఈ హాలిడేలో ఫుల్‌గా రిలాక్స్ అయి, ఇండియా వచ్చాక ఓ నూతనోత్సాహంతో పూజా హెగ్డే షూటింగ్స్‌లో పాల్గొంటారని చెప్పొచ్చు.

పెళ్ళిచూపులు

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను



క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తి లేదు/ B.Tech / C.Govt. ట్రైన్ డ్రైవర్/ రైల్వే/ 60,000/-PM/5'11"ఎత్తు/29 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9908222406 [HA-16317]

వడ్డెర/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ Govt. బీట్ ఆఫీసర్/ఫారెస్ట్ Dept/ 60,000/-PM/6'ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9618008271 [HA-16317]

ముదిరాజ్/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/ C.Govt. Sr. ఇంజినీర్/రైల్వే/ 89,000/-PM/6'ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 9618007652 [HA-16317]

SC హిందూ మాదిగ/కట్నం ప్రసక్తి లేదు /M.Tech / Govt.Asst. ఇంజినీర్ / జీవో/ 1.20 Lakhs. PM/5'11"ఎత్తు/30 సం॥ల వరుడికి వధువు కావలెను. Ph: 6305007091 [HA-16317]

యాదవ/M.Tech / Govt. Asst. Exq. ఇంజినీర్/RWS/10 Lakhs. PA/ 5'11" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-16317]

రజక/కట్నం ప్రసక్తి లేదు/B.Tech/C.Govt. ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్/ ఇన్‌కమ్‌ట్యాక్స్ Dept / 80,000/-PM/5'10"ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-16316]

యాదవ / B.Tech(సివిల్) / C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI/85000/-PM/5'8" ఎత్తు /28 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. కట్నప్రసక్తి లేదు. Ph: 9515755529 [HA-16316]

SC మాదిగ/M.Tech, IT / C.Govt. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్ / 14 Lakhs. PA / 5'8"ఎత్తు/28 సం॥ల వరునికి వధువు కావలెను. Ph: 6304407230 [HA-16316]

బ్రాహ్మణ(శ్రీవత్సవ)/33 Age (AP) DED ప్రైవేట్ టీచర్ పౌరోహితం వరుడికి వధువు కావలెను శాఖా భేదం లేదు. 1& 2 మ్యారేజ్ అయినా పర్వాలేదు. Ph: 7993670455 [H-778900]

క్రిస్టియన్ మాల/కట్నం ప్రసక్తిలేదు/28/ 5'9"/ B.Tech/ C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI / 1 Lakh pm/ అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-16318]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్ / 34y / నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు/కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి, ఓన్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ/ విడో OK. కుల, కట్నం ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801637]

★★

డైరెక్ట్. 5'5"/55 Yrs/ కాపు. కుల పట్టింపు లేదు. నెలకు సుమారు రూ. యాభైవేల ఆదాయం కలిగి రూ.40 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న వధువు కావలెను. మోసము, ఆర్థిక ఇబ్బందులు ఉండవు. Ph: 8341482731 [H-1177705]

REDDY, 34 y, MS (Civil USA) Civil Engineer in USA, 5'11", Fair, SC, Looking for Graduate Bride Pls Cont: 9493242896/ 5 [G-795924]

వరుడు కావలెను



రెడ్డి/విడో/2nd మ్యారేజ్, కుల, మత ప్రసక్తి లేదు /డిగ్రీ/5'4"/Own ట్రావెల్స్ & షాప్స్/ బిజినెస్‌లు గల అందమైన వధువుకు వరుడు కావలెను 1st/ 2nd (ఇల్లరికం ఓకే) Ph: 9063623252 [H-782751]

రెడ్డి/37y/5'5"/ఫెయిర్ / కుల పట్టింపు లేదు/ M.Com/Govt.ఎంప్లాయ్/65K (PM)/వెల్ సెటిల్డ్ & సొంత ఇల్లు కలిగిన వధువుకి వరుడు కావలెను (1st & 2nd మ్యారేజ్ & ఇల్లరికం OK) సంప్ర: 9133672661 [H-778900]

క్రిస్టియన్ మాదిగ/B.Tech, IIT/C.Govt. డిప్యూటీ మేనేజర్/SBI బ్యాంక్/35000/-PM/ 5'5"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6305007091 [HA-16317]

బెస్త, గంగపుత్ర, అగ్నికులక్షత్రియ/ B.Tech /Govt.A.E/జీవో/ 12 Lakhs PA/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-16317]

వాల్మీకి బోయ/B.Sc/Govt.Jr.Asst./ రెవెన్యూ Dept/40,000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-16317]

రజక/B.Tech /C.Govt. టెక్నికల్Asst./ పోస్టల్ Dept/32000/-PM/5'4" ఎత్తు /25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618007652 [HA-16317]

SC హిందూ మాల/ఏకైక కుమార్తె/ B.Tech (Agri)/C.Govt.Asst.మేనేజర్/ఇండియన్ బ్యాంక్ /1 Lakh. PM/5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-16317]

SC మాల & క్రిస్టియన్/M.Tech (EEE)/ C. Govt. డిప్యూటీ మేనేజర్/SBI బ్యాంక్/ 65000/-PM/ 5'4"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9676995093 [HA-16316]

SC మాల/B.Tech / C.Govt. Asst. మేనేజర్/కెనరా బ్యాంక్/ 60,000/-PM/ 5'4"ఎత్తు/25సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-16316]

రెండోపెళ్ళి/విడో/46y/Animal Husbandry & Veternary(Dept) మంచి జీతం. సొంత ఇల్లు/20 ఎ॥ పొలాలు, కోట్ల ఆస్తి గల వధువుకు కుల ప్రసక్తి లేని వరుడు కావలెను. Ph: 9032670876 [H-782751]

రెండవ పెళ్ళి/విడో / 50y/Fair / భద్రాచలం/ Govt. Job/80,000/-PM/Own House Rents పిల్లలు లేని ఏ బాదర బందీ లేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [H-782751]

కమ్మ/విడో/56Y/Eluruలో సొంత ఫ్లాట్లు/Hydలో సొంత బిజినెస్, రెంట్స్/మంచి ఆస్తి గల వధువుకి కుల, ఆస్తి ప్రసక్తి లేని వరుడు కావలెను (అర్జెంట్) (ఇల్లరికం OK) (నో బ్రోకర్స్) 7799083500, 7386660643 [H-778900]

2వ పెళ్లి/4,00,000 PM/బాగా స్థిరపడిన అందమైన అమ్మాయికి, అందమైన వరుడు కావలెను. కులప్రసక్తి లేదు. ఇల్లరికం: పిల్లలు ఉన్నా OK. కోట్ల ప్రాపర్టీ ఉంది. Ph: 9381696641 [H-778900]

పద్మశాలి/విడో/52y/B.Ed/ప్రైవేట్ జాబ్ / సొంత బిజినెస్/సొంత ఇల్లు/7 ఎకరాల పొలం గల వధువుకి కుల, ఆస్తి పట్టింపులేని వరుడు కావలెను. 9705499686 [H-796322]

FC/విడో/60y/రిటైర్డ్ పెన్షనర్/సొంత ఇల్లు & రెంట్స్/ఏ బాదరబందిలేని సాంప్రదాయ కుటుంబానికి చెందిన వెల్ సెటిల్డ్ ఒంటరి వధువుకి వరుడు కావలెను. 7893328547 [H-796322]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Business, BE, 26, 6' 1", Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 11", SWE, 160 K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 6', Infosys, SWE, 25 Crores, USA, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Bengaluru, BE (IIT), 30, 5' 8", SWE, 40 L P/A, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Citizen, BS, 28, 5' 6", SWE, 50 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 8", SWE, 120 K, 7 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 26, 5' 4", Engineer, 20 L P/A, 8 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 25, 5' 6", SWE, 2 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



www.avinashreddy.com
అవినాష్ రెడ్డి మ్యారేజెస్
(రెడ్డిలకు మాత్రమే)
D.V. Koti Reddy
690, Road No.3, Banjara Hills, (TV 9 : Opp. Colony) Hyderabad
98480 11818, 93933 11818

రెడ్డి Canada, BE (BITS), MS (USA), 30, 6', Analyst, 140 K, Handsome. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 31, 5' 8", Analyst, 175K, 15 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MS, 30, 6' 1", PG Doctor, Hyderabad, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, CFA, 49, 5' 6", Sr.Consultant, 18 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 27, 5' 3", Analyst, 12 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 28, 5' 6", Developer, 110 K, 5 Crores, H1, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 3", PG Doctor, 10 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Divorce, BE, 33, 5' 3", SWE, 20 Crores, USA, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెడ్డి/విడో/ 58y/5'5" / V.Fair/Govt.HM /సొంత ఇల్లు & రెంట్స్/26 ఎకరాల కొబ్బరి తోటలు /3L.PM/ పిల్లలు లేని ఒంటరి వధువుకి వరుడు కావలెను. కుల, ఆస్తి ప్రసక్తి లేదు. 9492718486 [H-796322]

రెడ్డి/30/5'4"/MBBS, MS ENT "29/5'2"/ MBBS, MD Paediatric "25/5'4" / B.Tech, MS / F1 / USA రెడ్డి అమ్మాయిలకు తగిన రెడ్డి అబ్బాయిలు కావలెను. సంప్ర: "శుభమస్తు" DSNR, HYD. S.రాములు గౌడ్ 8790690309 [H-796322]

వయస్సు : 34yrs/ఎత్తు:5'5"/ గవర్నమెంట్ జాబ్, 1.50 Laks జీతం కలిగిన అందమైన అమ్మాయికి వరుడు కావలెను. కుల పట్టింపు లేదు. పిల్లలున్నా OK. 8019954482 [H-796322]

యాదవ /ఎర్ర శాఖ అప్పర్ మిడిల్, 37Y/ 5'4"/ M.ఫార్మసీ వధువుకి Hydలో జాబ్ కలిగి లక్ష రూ॥ P/M అపై ఆదాయం కలిగిన యాదవ వరుడు మాత్రమే కావలెను. డైరెక్ట్ Father సంప్ర : 9989597799 [H-778746]

బ్రాహ్మణ /24/5'3"/B.Sc "27/5'4"/ MBA "30/ 5'3"/ B.Sc "27/5'2"/ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్ / బిజినెస్ / పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph : 7842635086 [HA-16313]

రెడ్డి/2nd మ్యారేజ్, (కుల/మత/ఆస్తి) ప్రసక్తి లేదు/AGe: 29/ Degree/ 2 Own Houses/ Site/ Business/ గల అందమైన వధువుకి 1 లేదా 2వ వరుడు కావలెను. (ఇల్లరికం Ok). Ph: 9573797905 [HA-16318]

రెండో పెళ్ళి/59y&58y&56y&55y&53y&52y &50y&49y&47y&46y&44y&43y&41y&40y & 38y &37y & 35y&33y & 31y&30y&28y&27y&25y& 24y/"మాసేవ"(Since 1998). Ph/WH: 9291503949 [HA-16318]

క్రిస్టియన్ మాల/25 / 5'4" / B.Tech/ Govt. A.E / ఇరిగేషన్ Dept. / 60,000/-pm/ అందమైన వధువుకి వరుడు కావలెను. Ph: 6309258463 [HA-16318]

★★

డైరెక్ట్/42/ ఒంటరి, 2nd మ్యారెజ్ వధువుకి కుల, వయసు, మత ప్రసక్తి లేని వెల్‌సెటిల్డ్ అయిన వరుడు పెళ్ళి లేదా తోడు కొరకు కావలెను. డైరెక్ట్-Ph: 81063 28649. [L-796409]

కమ్మ/వయస్సు 56 పైన / భర్త చని పోయారు/ పిల్లలు లేరు/వదువు : B.Com., LLM, DCA. / 3 కోట్లు పైన ఆస్తి / వరుడు కావలెను. డైరెక్ట్ ✆ : 720 748 7220 [R-1154979]

వేదికలు



కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి 1వ/ 2వ/లేట్ విడో/విడోయర్/ పెన్షనర్స్/ఒంటరి స్త్రీలకు మరియు పురుషులకు వ॥ 21-80 సం॥ పెళ్ళి సంబంధాలు త్వరగా చూడబడును. సంప్ర : 8374802603 [H-778900]

మాల, మాదిగ, హిందూ, క్రిస్టియన్/ Govt. సాఫ్ట్‌వేర్ / గెజిటెడ్/MBBS/PG/ NRI/PVT/ బిజినెస్/1వ/2వ/లేట్/ AP/ TS/ 15 సం॥ Exp. Ph: 8790555273 [HA-32610]

కావ్య మ్యారేజ్ లింక్స్! 1వ, 2వ లేట్ మ్యారేజస్, డైవర్సీ, విడోస్, విడోయర్స్, పెన్షనర్లకు అన్ని కులాల వారికి ఫాస్ట్ సెటిల్‌మెంట్ స్త్రీలకు ఫ్రీ. Ph: 7702526428 [H-782751]

సెకండ్ మ్యారేజ్‌లకు మాత్రమే. అన్ని కులాల వారికి వయస్సుతో నిమిత్తం లేకుండా ఫాస్ట్ సెటిల్‌మెంట్ చేయబడును. సంప్ర : 8555980066, 9885144375 [H-782751]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Suresh, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Suresh, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-16319]

ధ్రువ మ్యారేజెస్ అన్ని కులాల వారికి 1వ, 2వ, లేటు, విడో, డైవర్సీ వారికి తగిన సంబంధాలు చూడబడును. Age: 18-70 సం॥లు. Ph: 7702955854 [HA-15721]

క్రైస్తవ వివాహ సంబంధాలు & ప్రొంఫైజీ కొరకు Visit: www.christianholymatrimony.com, YMCA Clock Tower Secunderabad. మీ ప్రొఫైల్స్‌ను వాట్సాప్ చేయండి. 7330957771 [HA-97698]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులము వారికి Govt/ సాఫ్ట్‌వేర్ /గెజిటెడ్ / MBBS / PG/NRI/ Pvt / బిజినెస్/1వ/2వ/లేట్/AP/TS 15 సం॥ Exp: Ph: 9989140444 [H-32366]

Doctors, Software, NRI, Rich Persons కు Late Matches కు, అన్ని ప్రాంతాల వార్కి వ్యక్తి గత శ్రద్ధతో Fast గా సెటిల్‌మెంట్ చేయబడును. పూర్ణమ్యాట్రిమోని, తిరుపతి, 7093722724. [T-2957]

మాల, మాదిగ స్పెషల్ IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్, USA, UK. Ph: 7396915712 [HA-16318]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt. Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-909]

★★

అన్ని కులాల వధూవరుల వివాహ సంబంధాలకై సంప్రదించండి. స్త్రీలకు రిజిస్ట్రేషన్ ఫీజు లేదు. విఘ్నేశ్వర మ్యారేజెస్. సెల్: 63016 18808. [N-1246028]

పల్నాడు వైఎస్సార్‌సీపీ భవనంపై

హైకోర్టు స్టేటస్ కో

సాక్షి, అమరావతి: పల్నాడు జిల్లా నర్సరావుపేట మండలం లింగంగుట్లలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం భవనం విషయంలో యథాతథ స్థితి (స్టేటస్ కో) కొనసాగించాలని హైకోర్టు శనివారం పల్నాడు పట్టణాభివృద్ధి సంస్థ (పుడా)ను ఆదేశించింది. వైఎస్సార్‌సీపీ భవనం విషయంలో పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పుడా, పంచాయతీ అధికారులను ఆదేశిస్తూ వారికి నోటీసులు జారీ చేసింది. వ్యక్తిగత హోదాలో ప్రతివాదిగా ఉన్న పుడా వైస్ చైర్మన్ సాంబశివరావుకు కూడా నోటీసులిచ్చింది. తదుపరి విచారణను నాలుగు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు.పార్టీ కార్యాలయ భవనం కూల్చివేతకు పుడా అధికారులు ఈ నెల 9న జారీ చేసిన కన్ఫర్మేషన్ ఉత్తర్వులను సవాలు చేస్తూ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి, పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కృష్ణమోహన్ శనివారం విచారణ జరిపారు. పిటిషనర్ల తరపు న్యాయవాది కాసా జగన్‌మోహన్‌రెడ్డి వాదనలు వినిపించారు. భవనానికి నిబంధనల ప్రకారం అన్ని అనుమతులు తీసుకున్నప్పటికీ, అనుమతులు లేవంటూ కూల్చివేత నిమిత్తం నోటీసులు ఇచ్చారన్నారు. అనుమతుల వివరాలను కోర్టుకు వివరించారు. కోర్టు ఆదేశాల మేరకు వివరణ కూడా ఇచ్చామన్నారు. పుడా అనుమతి లేదంటూ కూల్చివేతలకు సిద్ధపడుతున్నారని తెలిపారు. అనుమతులిచ్చే అధికారం పంచాయతీకి లేదంటున్నారని వివరించారు. నివాసేతర భవనం 300 చదరపు మీటర్ల విస్తీర్ణం ఉంటే పంచాయతీ నుంచి అనుమతులు తీసుకోవచ్చునని చట్టం చెబుతోందన్నారు. నిబంధనల మేర భవన నిర్మాణాన్ని కూడా పూర్తి చేశామని వివరించారు. ప్రభుత్వ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. పట్టణాభివృద్ధి సంస్థ ఏర్పాటైన తరువాత ఆ సంస్థ నుంచే అనుమతులు తీసుకోవాలని, అందు కు విరుద్ధంగా గ్రామ పంచాయతీ నుంచి అనుమతులు తీసుకున్నారని తెలిపారు. తమ నోటీసులకు పిటిషనర్ల వివరణను పరిగణనలోకి తీసుకున్న తరువాతే తుది ఉత్తర్వులు జారీ చేశామన్నారు.

పవన్‌కళ్యాణ్ సతీమణికి సింగపూర్ వర్సిటీ మాస్టర్స్‌డిగ్రీ



సాక్షి, అమరావతి: ఉప ముఖ్యమంత్రి, జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సతీమణి అనా కొణిదెల సింగపూర్ యూనివర్సిటీ నుంచి మాస్టర్స్ డిగ్రీ పొందారు. ఈ మేరకు జనసేన పార్టీ రాష్ట్ర కార్యాలయం శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. అనాకు ఇది రెండో మాస్టర్స్ డిగ్రీ అని, ఈ సందర్భంగా సతీమణికి పవన్ కళ్యాణ్ అభినందనలు తెలిపారని పేర్కొంది.

నిధులు తెచ్చే బాధ్యత ఎంపీలదే

టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో ముఖ్యమంత్రి చంద్రబాబు

సాక్షి, అమరావతి : 'ప్రజలు మనపై అనేక ఆశలు పెట్టుకున్నారు. తిరుగులేని మెజారిటీలతో గెలిపించారు. అభివృద్ధి.. సంక్షేమం చేసి చూపించడం ద్వారా వారి నమ్మకాన్ని నిలబెట్టాలి. ఇందుకోసం ఎంపీలు కేంద్రం నుంచి భారీగా నిధులు తెచ్చేందుకు గట్టిగా కృషి చేయాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సూచించారు. ఉండవల్లిలోని తన నివాసంలో శనివారం ఆయన టీడీపీ పార్లమెంటరీ పార్టీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పార్టీ ఎంపీలు, రాష్ట్ర మంత్రులతో మాట్లాడారు. పార్లమెంటు సమావేశాల్లో మాట్లాడాల్సిన అంశాలపై చర్చించారు. ఇప్పటికే ఐదు హామీలపై నిర్ణయాలు తీసుకుని ముందుకు వెళ్తున్నామని చెప్పారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్నా, ఇచ్చిన హామీలు అమలు చేస్తున్నామని తెలిపారు. ఎంపీలకు శాఖలు అప్పగించామని, ఆ మేరకు ఎన్ని నిధులు తెచ్చారు.. కేంద్రం నుంచి రావాల్సిన ప్రాజెక్టులు, అనుమతుల విషయంలో అందరి పనితీరును ప్రతి మూడు నెలలకు ఒకసారి సమీక్షిస్తానని తెలిపారు. అమరావతి, పోలవరం, జల్ జీవన్ మిషన్ వంటి ప్రాజెక్టుల కోసం కేంద్రం నుంచి ప్రత్యేకంగా నిధులు రాబట్టాలని, విభజన చట్టంలో ఉన్న హామీలు అమలయ్యేలా చూడాలని సూచించారు. విశాఖలో పెట్రోలియం యూనివర్సిటీ, విశాఖ స్టీల్, కడప ఉక్కుపైనా కేంద్రంతో చర్చలు జరపాల్సి ఉందన్నారు. వెనుకబడిన జిల్లాలకు మైక్రో ఇరిగేషన్ కింద 90 శాతం సబ్సిడీని కేంద్రం నుంచి సాధించాలని సూచించారు. విశాఖలో రైల్వే జోన్‌కు అవసరమైన భూములు వెంటనే కేటాయించే ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. ఒకే గొడుగు కింద హైవేలు, పోర్టులు, విమానాశ్రయాలు, పారిశ్రామిక పార్కులు తీసుకురావాలని చెప్పారు. రైల్వే లైన్లు, జాతీయ రహదారులు, కొత్త వలసలో ట్రైబల్ యూనివర్సిటీ ఏర్పాటుపై దృష్టి పెట్టాలన్నారు. 2029లో కూడా పార్టీ గెలవడానికి ఇప్పటి నుంచే అడుగులు వేయాలని చెప్పారు. రాష్ట్రంలో పొలిటికల్ గవర్నెన్స్ ఉండాలని, దాన్ని 1995లో అమలు చేశానని చెప్పారు. మళ్లీ ఆ విధానం అమల్లో ఉండాలని సూచించారు. పబ్లిక్ పాలసీలతో దేశ గమనం మార్చవచ్చని, ప్రజల తలరాతలు మార్చవచ్చని గతంలో చేసి చూపించామన్నారు.

వ్యక్తిగత కారణాలతోనే వినుకొండ హత్య

పల్నాడు జిల్లా వినుకొండలో జరిగిన హత్యకు వ్యక్తిగత కారణాలే కారణమని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు స్పష్టం చేశారు. ఉనికి కోసం దానికి జగన్ రాజకీయ రంగు వేస్తున్నారని ఆరోపించారు. వినుకొండలో హతుడు, నిందితుడి మధ్య వ్యక్తిగత గొడవలు ఉన్నాయని ఆ పార్టీ నేతలే అంగీకరించారన్నారు. పోలీసుల విచారణలో కూడా అదే విషయం తేలిందని చెప్పారు. ఎన్నికల్లో ప్రజలు పూర్తిగా తిరస్కరించిన తర్వాత కూడా జగన్ ప్రవర్తనలో మార్పు రాలేదన్నారు. ఉనికి చాటుకోవడానికే జగన్ హింసా రాజకీయాలంటూ తప్పుడు ప్రచారం చేస్తున్నాడని, ఫేక్ పాలిటిక్స్‌నే నమ్ముకున్నాడని విమర్శించారు. లా అండ్ ఆర్డర్ విషయంలో రాజీ పడేది లేదని, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని చెప్పారు. ఇకపై నేరస్తుల ఆటలు ఏమాత్రం సాగనివ్వమన్నారు. నేరస్తులను పట్టుకోవడంలో, విచారణలో ఆలస్యం జరిగితే తానే స్వయంగా విచారణకు వస్తానన్నారు. రాష్ట్రంలో హింస అనేది కనిపించకూడదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు

చట్ట ప్రకారమే వ్యవహరించాలి

- మాజీ ఎంపీ సురేష్ ఇంటి విషయంలో అధికారులకు హైకోర్టు ఆదేశం

సాక్షి, అమరావతి: బాపట్ల మాజీ ఎంపీ నందిగం సురేష్ ఇంటి విషయంలో చట్ట ప్రకారం మాత్రమే వ్యవహరించాలని అధికారులకు హైకోర్టు స్పష్టం చేసింది. ఏ చర్యలు తీసుకున్నా ముందుగా ఆయన వాదన వినాలని చెప్పింది. నోటీసుల ప్రక్రియ కొనసాగించవచ్చంది. రెండు వారాల్లో సమగ్ర వివరాలతో అదనపు వివరణ ఇచ్చేందుకు సురేష్‌కు వెలుసుబాటునిచ్చింది. భవనం అనుమతుల రెన్యువల్‌కు కూడా అవకాశం ఇచ్చింది. అనుమతుల్లేకుండా తదుపరి నిర్మాణాలు చేపట్టరాదని ఆదేశించింది. ఆ తర్వాత తుది విచారణ చేపట్టి నిర్ణయం తీసుకోవాలని అధికారులను ఆదేశించింది. ఈ వ్యాజ్యంలో తదుపరి విచారణ అవసరం లేదంటూ సురేష్ పిటిషన్‌ను పరిష్కరించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు.

వాళ్లు తప్పు చేసి.. మాపైనే కేసులు

- వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు మిథున్‌రెడ్డి ఆగ్రహం
- దాడులు చేయడానికే వాళ్లకు లైసెన్స్ ఇచ్చినట్లుంది
- రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారు
- 75 ఏళ్ల మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంటిపై దాడి చేసి, ఆయనపైనే హత్యా నేరం

సాక్షి, అమరావతి: 'అన్ని తప్పులు వాళ్లే చేసి.. తిరిగి మాపైనే కేసులు పెడుతున్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక దౌర్జన్యాలు, దాడులు, విధ్వంసాలకు లెక్కే లేదు. ఈ 45 రోజుల్లో 36 మంది రాజకీయ హత్యలకు గుర య్యారు. హత్యలు, దాడులు చేయడానికే టీడీపీ వాళ్లకు లైసెన్స్ ఇచ్చినట్టుగా ఉంది' అని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షుడు, రాజంపేట ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి నిప్పులు చెరిగారు. తాడేపల్లిలోని వైఎస్ జగన్ క్యాంపు కార్యాలయం వద్ద శనివారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'సీఎం చంద్రబాబు కుమారుడు నారా లోకేశ్.. టీడీపీ కార్యకర్తలపై ఎన్ని కేసులు ఉంటే అంత బాగా పని చేసినట్లు అని ప్రచారం చేశారు. ఎ న్నికల తర్వాత టీడీపీ గెలిస్తే రెడ్ బుక్ రాజ్యాంగం అమలు చేస్తాం అని చెప్పారు. ఇప్పుడు ఎక్కడ చూసిన రెడ్ బుక్ ఫొటోలతో కూడిన హో ర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. టీడీపీ కార్యకర్తలను వైఎస్సార్‌సీపీ కార్యకర్త లపైకి, ప్రజలపైకి ఉసిగొల్పుతున్నారు' అని ఆగ్ర హం వ్యక్తం చేశారు. 'పుంగనూరులో మాజీ ఎంపీ రెడ్డెప్ప ఇంట్లో ఉండగా నా పైనే దాడి చేసి, నాపైనే హత్యా నేరం మోపడం దారుణం. వందలాది మంది టీడీపీ కార్యకర్తలను సమకూర్చుకొని ఇంట్లో ఉన్న నా పై దాడి చేశారు. పుంగనూరు నేను ప్రాతినిథ్యం వహిస్తున్న రాజంపేట పార్లమెంటు నియోజకవర్గంలోనిదే. పుంగనూరు నియోజకవర్గానికి మా నాన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నారు. కావాలనే అక్కడ టీడీపీ మనుషులు ఉండేలా, పోలీసులతో ప్లాన్ చేసి మరీ దాడులు చేశారు. 75 ఏళ్ల వయసున్న మాజీ ఎంపీ రెడ్డెప్ప ఒక న్యాయవాది. ఆయన ఇంటిపైనే రాళ్లతో దాడి చేసి, వాహనాలు ధ్వంసం చేశారు. మాజీ ఎంపీ రెడ్డెప్పకు చెందిన వాహ నాన్ని దగ్ధం చేశారు. వారి కుటుంబ సభ్యులను భయభ్రాంతులకు గురి చేశారు. తిరిగి ఆయనపైనే హత్య నేరం కేసు పెట్టడం దారుణం' అని మండిపడ్డారు. పార్లమెంట్ సమావేశాల్లో ఏపీలో విధ్వంసకాండ, ఆటవిక పాలన గురించి గట్టిగా ప్రస్తావిస్తామని చెప్పారు. వైఎస్ జగన్ అధికారంలో ఉన్నప్పుడు ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల నేతలందరినీ ఒకే విధంగా, సమానంగా చూడాలని ఐఏఎస్, ఐపీఎస్ అధికారులకు చెప్పారన్నారు. వినుకొండలో 'రషీద్ హంతకుడైన జిలానీ.. లోకేశ్ పుట్టిన రోజున స్థానిక ఎమ్మెల్యే భార్యకు స్వయంగా కేక్ తినిపించిన ఫొటోలు, ఎమ్మెల్యేతో ఉన్న ఫొటోలను.. రషీద్ తల్లిదండ్రులు చూపారు. అయినా వినుకొండ ఎమ్మెల్యే ప్రెస్‌మీట్ పెట్టి జిలానీ గురించి అబద్ధాలు చెబుతున్నారు. ఫొటోల్లో స్పష్టంగా కన్పిస్తుంటే చంద్రబాబు, పవన్‌లు మాట్లాడక పోవటం, ఖండించక పోవటం ఆశ్చర్యకరం అన్నారు.



మిథున్‌రెడ్డి




ఆళ్ల అయోధ్య

రాష్ట్రంలో ప్రజాస్వామ్యంపై దాడి : ఎంపీ ఆళ్ల అయోధ్యరామిరెడ్డి

రాష్ట్రంలో జరుగుతున్న ఈ ఆకృత్యాలు ఒక రాజకీయ పార్టీపై జరుగుతున్న దాడిగా కాకుండా, ప్రజాస్వామ్యంపై జరుగుతున్న దాడిగా దేశ ప్రజలు చూడాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడు ఆళ్ల అయోధ్య రామిరెడ్డి అన్నారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ పార్టీ ఎంపీలతో సమావేశం అనంతరం.. ఆ వివరాలను అయోధ్య రామిరెడ్డి మీడియాకు వివరించారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైనప్పటి నుంచి వైఎస్సార్‌సీపీ శ్రేణులపై చేస్తున్న భౌతిక దాడులు, ప్రజల్లో నెలకొన్న భయాందోళల గురించి, కేంద్రం దృష్టికి తీసుకెళ్లాల్సిన అంశాలపై ఈ సమావేశంలో చర్చించామని చెప్పారు. వాటన్నింటినీ పార్లమెంట్‌లోనూ ప్రస్తావించాలని నిర్ణయించామన్నారు. 'రాష్ట్రంలో జరిగిన విధ్వంసకాండపై ఢిల్లీలో బుధవారం జరిగే ధర్నాలో ఫొటో గ్యాలరీ ఏర్పాటు చేస్తాం. వీడియోల ద్వారా దేశ ప్రజలందరికీ తెలియజెప్పే ప్రయత్నం చేస్తున్నాం. రాష్ట్రపతి, ప్రధాని, కేంద్ర హోం మంత్రిని కలిసేందుకు ఇప్పటికే అపాయింట్‌మెంట్ అడిగాం. లోక్‌సభ, రాజ్యసభలో పెద్ద ఎత్తున మా వాణి వినిపిస్తాం' అని చెప్పారు.

మా ప్రహరీని కూల్చేస్తున్నారు

హైకోర్టులో విజయసాయి రెడ్డి కుమార్తె నేహా రెడ్డి అత్యవసర పిటిషన్



సాక్షి, అమరావతి : విశాఖపట్నం భీమిలి బీచ్ సమీపంలో ఉన్న తమ ప్రహరీని కూల్చివేసేందుకు గ్రేటర్ విశాఖపట్నం మునిసిపల్ కార్పొరేషన్ జారీ చేసిన తుది ఉత్తర్వులను సవాలు చేస్తూ రాజ్యసభ సభ్యుడు వేణుంబాక విజయసాయి రెడ్డి కుమార్తె పెనకా నేహా రెడ్డి శనివారం హైకోర్టులో లంచ్‌మోషన్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై న్యాయమూర్తి జస్టిస్ బొప్పూడి కృష్ణమోహన్ విచారణ జరిపారు. నేహా రెడ్డి తరపున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. నోటీసులు, ప్రాథమిక ఉత్తర్వుల్లేకుండానే ప్రహరీ కూల్చేస్తామంటూ తుది ఉత్తర్వులు జారీ చేశారని తెలిపారు. పిటిషనర్ చేపట్టిన నిర్మాణం సీఆర్‌జెడ్ నిబంధనలకు విరుద్ధమని పిల్ దాఖలైందని, అది 24న సీజే ధర్మాసనం ముందుకు విచారణకు రానుందని, ఈ వ్యాజ్యాన్ని కూడా దానితో జత చేయాలని ప్రభుత్వ ప్రత్యేక న్యాయవాది సింగమనేని ప్రణతి చెప్పారు. దీంతో నేహా రెడ్డి పిటిషన్‌ను పిల్‌తో జత చేయాలని న్యాయమూర్తి రిజిస్ట్రీని ఆదేశించారు. దానిని విచారించే వరకు ప్రహరీ విషయంలో ఎలాంటి కఠిన చర్యలు తీసుకోకుండా ఆదేశాలిచ్చారు.


ఫీజులు.. గుండెలు గుభిల్లు


దేశంలో విపరీతంగా పెరిగిపోతున్న విద్యా వ్యయం



విద్యార్థులు, తల్లిదండ్రుల డ్రీమ్ కోర్సు అయిన ఇంజనీరింగ్‌కు సంబంధించి దేశంలోనే ప్రఖ్యాత విద్యా సంస్థ ఐఐటీ బాంబేలో నాలుగేళ్ల బీటెక్‌కు 2008లో మొత్తం ట్యూషన్ ఫీజు రూ.1,08,000 ఉండగా ఇది 2024-25 నాటికి ఏకంగా రూ.8,00,000కు చేరింది. గత 16 ఏళ్లలో 7.2 రెట్లు పెరిగింది. అలాగే మరో ప్రముఖ విద్యా సంస్థ ఎన్ఐటీ తిరుచిరాపల్లిలో 2011-12లో బీటెక్‌కు రూ.1,42,000 ఫీజు ఉండగా 2023-24 నాటికి ఇది 5,02,800కు పెరిగింది. ఇక్కడ 12 ఏళ్లలో మూడున్నర రెట్లు ఫీజులు పెరిగాయి. మొత్తం మీద ఐఐటీల్లో 15 ఏళ్లలో ఏడుసార్లు, ఎన్ఐటీల్లో 12 ఏళ్లలో 3 సార్లు ఫీజులు పెంచారు. అలాగే ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాల్లలో 15 ఏళ్లలో 8 సార్లు ఫీజులు పెరిగాయి. భారతదేశంలో పెరిగిపోతున్న విద్యా వ్యయంపై కెరీర్స్360 ఫౌండర్ చైర్మన్ మహేశ్వర్ పెరి అందిస్తున్న ప్రత్యేక వ్యాసం

- మన దేశంలో చదువు రోజురోజుకీ భారంగా మారుతోంది. ప్రాథమిక విద్య నుంచి మేనేజ్ మెంట్ చదువుల వరకు ప్రతి దశలోనూ విద్య సామాన్యుడికే కాదు, మధ్య తరగతికీ తలకు మించిన భారంగా పరిణమించింది. విద్యలో ప్రభుత్వ పాత్ర క్రమేణా తగ్గడం.. ప్రైవేటు విద్యా సంస్థలు పుట్టుకొచ్చి ఫీజులు పెంచుకుంటూ పోవడమే అందుకు ప్రధాన కారణం.
- గత 13 ఏళ్లలో ప్రభుత్వ బడుల సంఖ్యలో పెరుగుదల కేవలం 9 శాతం. అదే సమయంలో ప్రైవేటు స్కూళ్లు ఏకంగా 35% పెరిగిపోయాయి. ప్రస్తుతం దేశంలోని మొత్తం కాలేజీల్లో 79 % ప్రైవేటువే. 14 ఏళ్ల కిందట దేశంలోని ప్రతి రెండు ప్రభుత్వ యూనివర్సిటీలకు ఒక ప్రైవేటు యూనివర్సిటీ ఉంటే నేడు ప్రైవేటు వర్సిటీల సంఖ్య ప్రభుత్వ వర్సిటీల సంఖ్యను అధిగమించేసింది. వీటన్నింటి ఫలితంగా చదువులపై పెట్టాల్సిన ఖర్చు గణనీయంగా పెరిగిపోయింది. ఇవన్నీ ఆందోళనకరమైన పరిణామాలు.
- మన చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టి, పెద్ద పెద్ద విషయాలను పక్కనపెట్టేశామేమో అనిపిస్తోంది. ఈ సందర్భంగా మనమంతా కొన్ని అంశాలు ఆలోచించాలి. మన ప్రజల సుసంపన్నమైన అభివృద్ధికి ఇప్పటికీ కట్టుబడే ఉన్నామా? నిపుణులైన మానవ వనరులను తయారుచేసుకోవడంలో మనం వెనకబడుతున్నామా? గత 15-20 ఏళ్లలో దేశంలో విద్యా రంగంలో చోటుచేసుకున్న పరిణామాలను గమనిస్తే అవుననే అనిపిస్తుంది.





ఐఐటీలను మించి స్కూల్ ఫీజులు..

ముఖ్యంగా మెట్రో నగరాల్లో ఫీజులు స్కూల్‌ను బట్టి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు ఉన్నాయి. హైదరాబాద్‌లోని పటాన్‌చెరులో ఉన్న ఒక ఇంటర్నేషనల్ స్కూల్ 2024-25 విద్యా సంవత్సరానికి రూ.12 లక్షల ఫీజు వసూలు చేస్తోంది. ఇది కాకుండా అడ్మిషన్ ఫీజు కింద మరో రూ.1.7 లక్షలు చెల్లించాల్సిందే. అలాగే శంషాబాద్‌లో ఉన్న మరో అకాడమీ ఏడాదికి రూ.9.5 లక్షల ఫీజు వసూలు చేస్తోంది. అలాగే మోకిలాలో ఉన్న ఇంకో ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఏడాదికి రూ.8.2 లక్షల ఫీజు ఉంది. వీటికి అదనంగా అడ్మిషన్ ఫీజు కింద మరింత ముట్టజెప్పాల్సిందే.

భారీ ఫీజులతో తల్లిదండ్రుల్లో ఆందోళన

ఆ కోర్సు, ఈ కోర్సు అనే తేడా లేకుండా ప్రతి కోర్సుకు ఫీజుల మోత మోగిపోతోంది. మనదేశంలో విద్యా వ్యయం ఏయేడాదికాయేడాది అంతకంతకూ పెరిగిపోతోంది. తల్లిదండ్రులు తమ పిల్లలను అత్యున్నత విద్యా సంస్థల్లో చదివించాలని కలలు కంటారు. తమ కంటే తమ పిల్లల భవిష్యత్ బాగుండాలని ఆశిస్తారు. మంచి విద్యా సంస్థలో తమ పిల్లలు సీటు సాధించాలని.. ఆ తర్వాత కోర్సు పూర్తయ్యాక మంచి పే ప్యాకేజీతో ఉద్యోగం సాధించాలని ఆకాంక్షిస్తారు. అత్యుత్తమ విద్య, ఆ తర్వాత మంచి ఉద్యోగం సాధించాలంటే మేటి విద్యా సంస్థల్లో చదవకతప్పదని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు భావిస్తున్నారు. ఈ పోటీ ప్రపంచంలో అందరికంటే ముందుండాలన్నా, మంచి అవకాశాలు దక్కించుకోవాలన్నా నాణ్యమైన చదువులతోనే సాధ్యమని నమ్ముతున్నారు. అయితే పెరుగుతున్న ఫీజులు తల్లిదండ్రుల్లో ఆందోళన రేపుతున్నాయి.

క్యాష్ చేసుకుంటున్న విద్యా సంస్థలు..

విద్యార్థులు, వారి తల్లిదండ్రుల ఆకాంక్షలను విద్యా సంస్థలు 'క్యాష్' చేసుకుంటున్నాయి. ఫీజులను అమాంతం పెంచేస్తున్నాయి. నర్సరీ నుంచి మొదలుపెడితే పీజీలు, పీహెచ్‌డీల వరకు ఈ విద్యా వ్యయం ఏటా అంతకంతకూ గణనీయంగా పెరుగుతోంది. ధనవంతులకు ఈ విషయంలో ఎలాంటి ఇబ్బంది లేకపోయినా మధ్యతరగతి వర్గాలు, పేదలు అంతకంతకూ పెరిగిపోతున్న విద్యా వ్యయంతో తీవ్ర ఆందోళన చెందుతున్నారు. ఏటా భారీగా పెరిగిపోతున్న ఫీజులను కట్టలేక నాణ్యమైన చదువులకు విద్యార్థులు దూరమవుతున్నారు. ఇలా అర్ధంతరంగా చదువులు మానేసేవారి శాతం అంతకంతకూ పెరిగిపోతోంది. కొంతవరకు బ్యాంకులు విద్యా రుణాలు అందిస్తున్నా అవి అందరికీ దక్కడంలేదు. దీంతో డ్రాపవుట్లు పెరుగుతున్నాయి.

ప్రభుత్వరంగంలో తగ్గిపోయిన విద్యాసంస్థలు

ప్రపంచంలోనే అత్యధిక యువజనాభా భారతదేశంలోనే ఉంది. అయితే దేశంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రభుత్వ రంగంలో విద్యా సంస్థలు ఏర్పాటు కావడం లేదు. ప్రైవేటు రంగంలోనే ఎక్కువ విద్యా సంస్థలు ఏర్పాటవుతున్నాయి. దీంతో ప్రైవేటు విద్యా సంస్థలు భారీగా ఫీజులు వసూలు చేస్తూ సద్ది విరుస్తున్నాయి. ప్రభుత్వ రంగంలో ఎక్కువ విద్యా సంస్థలు ఏర్పాటయితే ప్రైవేటు సంస్థలతో పోలిస్తే ఫీజుల భారం తక్కువగా ఉంటుంది. అయితే అలా జరగకపోవడంతో పేదలు, మధ్య తరగతి వర్గాలు భారీ ఫీజులను చెల్లించలేక చదువులకు స్వస్తి చెబుతున్నాయి. దేశంలో ప్రైవేటు విద్యా సంస్థల్లో గత 15 ఏళ్లలో వివిధ కోర్సుల ఫీజులు 300 శాతం పెరిగాయి. దేశంలో గత 20 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ గణాంకాలను పరిశీలిస్తే దిమ్మతిరిగే విషయాలు వెల్లడయ్యాయి.

భారీగా ఫీజుల భారం..

దేశంలో ప్రైవేటు స్కూళ్లు, కళాశాలలు, యూనివర్సిటీలు పెరిగిపోవడం.. ప్రభుత్వ రంగంలో విద్యా సంస్థలు తగ్గిపోవడంతో విద్యార్థులపై భారీ ఎత్తున ఫీజుల భారం పడుతోంది. దీంతో విద్యకు సంబంధించిన ద్రవ్యోల్బణం అంతకంతకూ పెరిగిపోతోంది. తాజా నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం.. 2014–2018 మధ్య ప్రాథమిక విద్యకు తల్లిదండ్రులు 30.7 శాతం వ్యయం చేశారు. అలాగే ప్రాథమికోన్నత తరగతులకు 27.5 శాతం ఖర్చు పెట్టారు. లోకల్ సర్కిల్స్ సర్వే ప్రకారం.. కోవిడ్ తర్వాత తమ పిల్లల స్కూల్ ఫీజులు 30 శాతం నుంచి 50 శాతం వరకు పెరిగాయని 42 శాతం మంది తల్లిదండ్రులు చెప్పారు. తన కుమారుడి ఫీజు కింద నెలకు రూ.30,000 చెల్లిస్తున్నానంటూ హరియాణాలోని గురుగ్రామ్‌లో ఒక తండ్రి సోషల్ మీడియాలో పెట్టిన పోస్టు వైరల్‌గా మారింది. హైదరాబాద్‌లో ఒక స్కూల్ ఒకేసారి 50 శాతం ఫీజు పెంచింది.

44 శాతం మంది చదువులకు దూరం

నేషనల్ శాంపుల్ సర్వే ప్రకారం.. 23 శాతం మంది ఆర్థిక ఇబ్బందులతోనే చదువులు మానేశారు. 21 శాతం మంది తమ కుటుంబ పోషణ కోసం పనులకు వెళ్లడం వల్ల చదువులు మానేశామని చెప్పారు. అంటే దేశ యువతలో 44 శాతం మంది పెరిగిన ఫీజులు, కుటుంబ ఆర్థిక పరిస్థితులతో ఉన్నత చదువులు చదవలేకపోయారు. ఈ నేపథ్యంలో విద్య నిరుపేద, మధ్యతరగతి వర్గాలకు భారం కాకుండా చూడాల్సిన బాధ్యత ప్రభుత్వాలపై ఉంది.

ఎంబీబీఎస్.. ఫీజుల మోత మోగాల్సిందే..

- ప్రైవేటు స్టేట్ యూనివర్సిటీల్లో రూ.80 లక్షల నుంచి రూ.1.25 కోట్ల వరకు
- డీమ్డ్ యూనివర్సిటీల్లో రూ.1.25 కోట్ల నుంచి రూ. 2 కోట్ల వరకు
- ఎన్నారైలకు రూ.3 కోట్ల నుంచి రూ.4 కోట్ల వరకు



ఇంజనీరింగ్ తొలిదశ ప్రవేశాలు 22తో ఆఖరు

రిపోర్టింగ్ చేయకుంటే సీటు రద్దు

సాక్షి, అమరావతి: ఏపీ ఈఏపీసెట్ 2024 మొదటి దశ అడ్మిషన్లకు సంబంధించి సీట్లు పొందిన విద్యార్థులు తప్పనిసరిగా సోమవారం లోపు రిపోర్టింగ్ పూర్తి చేయాలని సాంకేతిక విద్యాశాఖ సంచాలకురాలు డాక్టర్ బి. నవ్య తెలిపారు. 17వ తేదీన సీట్ల కేటాయింపు జరిగిందని, సీటు దక్కించుకున్న అభ్యర్థులు పోర్టల్‌లో సెల్ఫ్ రిపోర్టింగ్, కాలేజీలో ఫిజికల్ రిపోర్టింగ్‌తోపాటు అన్ని కార్యక్రమాలను 22వ తేదీ లోపు పూర్తి చేసుకోవాలన్నారు. నిర్దేశించిన తేదీని కచ్చితంగా పాటించాలని, విద్యార్థులు రిపోర్ట్ చేయకపోతే కేటాయించిన సీటు 23వ తేదీ నాటికి ఖాళీగా పరిగణించబడుతుందని, ఆరోజు ప్రారంభమయ్యే రెండోదశ అడ్మిషన్ కౌన్సెలింగ్‌కు అందుబాటులో ఉన్న సీటుగా చేర్చబడుతుందన్నారు. అభ్యర్థి కళాశాలలో నివేదించిన వెంటనే అన్ని ఇంజనీరింగ్ కళాశాల యాజమాన్యాలు పోర్టల్‌లో వివరాలను అప్‌డేట్ చేయాలని స్పష్టం చేశారు. కళాశాల యాజమాన్యాలు తప్పనిసరిగా 23వ తేదీ నాటికి పోర్టల్‌లో అప్‌డేట్ చేయాలన్న విషయాన్ని పరిగణనలోకి తీసుకోవాలని సూచించారు.

24 వరకూ 'ఎండీఎస్' దరఖాస్తుల స్వీకరణ

సాక్షి, అమరావతి: మాస్టర్ ఆఫ్ డెంటల్ సర్జరీ (ఎండీఎస్) ప్రవేశాల కోసం దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించామని వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ వేమిరెడ్డి రాధికారెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి కన్వీనర్, యాజమాన్య కోటా సీట్లలో ప్రవేశాల కోసం నీట్ ఎండీఎస్-2024లో అర్హత సాధించిన అభ్యర్థులు ఈనెల 24వ తేదీ మధ్యాహ్నం ఒంటి గంటలోపు దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. http://drysruhs.in వెబ్‌సైట్‌లో నోటిఫికేషన్‌ను అందుబాటులో ఉంచామన్నారు.

మైక్రోసాఫ్ట్ ఎఫెక్ట్... పలు విమానాల రద్దు

గోపాలపట్నం (విశాఖ పశ్చిమ): మైక్రోసాఫ్ట్ సేవల్లో సాంకేతిక లోపం కారణంగా విశాఖ నుంచి వెళ్లాల్సిన పలు విమానాలు రద్దయ్యాయి. హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్ (6408/779) ఇండిగో విమానం, బెంగళూరు-విశాఖ ఇండిగో విమానం(217), చెన్నై-విశాఖ-చెన్నై (557/845) ఇండిగో విమానం, హైదరాబాద్-విశాఖ-హైదరాబాద్ (879/6645) ఇండిగో విమానం, బెంగళూరు-విశాఖ-బెంగళూరు(6366/5309) ఇండిగో విమాన సర్వీసులు రద్దయినట్లు ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు.

వైద్య విద్య పీజీ ఇన్-సర్వీస్ కోటా కుదింపు

- ఎంపిక చేసిన స్పెషాలిటీల్లో 15 శాతం.. నాన్ క్లినికల్‌లో 30 శాతం కేటాయింపు
- విజయవాడ డెంటల్ కళాశాలకు రాష్ట్ర హోదా తొలగింపు

సాక్షి, అమరావతి : రాష్ట్ర వైద్యశాఖలో సివిల్ అసిస్టెంట్ సర్జన్ (సీఏఎస్)లుగా చేరిన వారికి పీజీ వైద్య విద్య అభ్యసించేందుకు కేటాయించే ఇన్-సర్వీస్ కోటాను రాష్ట్ర ప్రభుత్వం కుదించింది. ప్రభుత్వ వైద్య కళాశాలల్లో జనరల్ మెడిసిన్, జనరల్ సర్జరీ, గైనకాలజీ, పీడియాట్రిక్స్, అనస్తీషియా, ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషాలిటీల్లో 15 శాతం, నాన్‌క్లినికల్ స్పెషాలిటీల్లో 30 శాతం చొప్పున 2024-25 విద్యా సంవత్సరం నుంచి సీట్లు కేటాయించనున్నారు. ఈ మేరకు వైద్య, ఆరోగ్య శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శనివారం ఉత్తర్వులిచ్చారు. మరోవైపు.. 2025-26 నుంచి వార్షిక ప్రాతిపదికన క్లినికల్‌లో 15 శాతం, నాన్ క్లినికల్‌లో 30 శాతానికి లోబడి ప్రభుత్వ అవసరాలకు అనుగుణంగా ఇన్-సర్వీస్ కోటాకు ఎన్ని సీట్లు కేటాయించాలన్న దానిపై వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి తెలియజేస్తామని ఆయన ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నిజానికి.. క్లినికల్ విభాగంలో 30 శాతం, నాన్ క్లినికల్‌లో 50 శాతం చొప్పున గత ప్రభుత్వంలో ఇన్-సర్వీస్ కోటా ఉండేది. నిరుపేదలకు ప్రభుత్వాస్పత్రుల్లో నాణ్యమైన, సత్వర వైద్యసేవల కల్పన కోసం వైద్యుల కొరత ఉండటానికి వీల్లేకుండా గత ప్రభుత్వం జీరో వేకెన్సీ విధానాన్ని ప్రవేశపెట్టింది. ఈ క్రమంలో సెకండరీ కేర్, బోధనాస్పత్రుల్లో స్పెషలిస్ట్ వైద్యుల కొరతను అధిగమించడానికి అప్పట్లో వీలైనంత ఎక్కువమంది సీఏఎస్‌లకు ఇన్-సర్వీస్ కోటా కింద అవకాశం కల్పించారు. అలాగే, అప్పట్లో ప్రభుత్వం పలు దఫాలుగా నియామకాలు చేపట్టడంతో ఆస్పత్రుల్లో ప్రస్తుతం స్పెషలిస్ట్ వైద్యుల కొరత తగ్గింది. ఈ క్రమంలో ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన కమిటీ సూచనల మేరకు ఇన్-సర్వీస్ కోటాను కుదించినట్లు స్పష్టం చేశారు. మరోవైపు.. ఈ విద్యా సంవత్సరం నుంచి ఎండీఎస్‌లో ఇన్-సర్వీస్ కోటాను తొలగించారు. శాశ్వత ప్రాతిపదికన పనిచేసే వైద్యుల్లో పీజీ నోటిఫికేషన్ వెలువడిన నాటికి గిరిజన ప్రాంతాల్లో రెండు, ఆ పైబడి/గ్రామీణ ప్రాంతాల్లో మూడేళ్లు, ఆ పైబడి/ఆరేళ్లు ప్రభుత్వ సర్వీస్ పూర్తిచేసుకున్న వాళ్లు పీజీ మెడికల్ ఇన్‌సర్వీస్ కోటాకు అర్హులు. ఇక ఇన్-సర్వీస్ కోటా ఒప్పందాన్ని అతిక్రమించిన వైద్యులకు రూ.50 లక్షల జరిమానా విధించనున్నారు.

'డెంటల్' సీట్లన్నీ మన విద్యార్థులకే..

ఇక విజయవాడ ప్రభుత్వ డెంటల్ కళాశాలకు రాష్ట్ర హోదాను తొలగిస్తూ మరొక జీఓను శనివారం కృష్ణబాబు ఇచ్చారు. రాష్ట్ర విభజన చట్టంలోని నిబంధనల మేరకు ఈ కళాశాలలో 42 : 36 : 22 నిష్పత్తిలో ఆంధ్రా యూనివర్సిటీ (ఏయూ), ఉస్మానియా యూనివర్సిటీ, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ (ఎస్వీయూ) రీజియన్లకు ఇప్పటివరకూ సీట్లు కేటాయిస్తూ వస్తున్నారు. పదేళ్ల పాటు సీట్లు ఈ మేరకు కేటాయించాలని చట్టంలో ఉంది. కానీ, ఈ ఏడాది జూన్ ఒకటో తేదీకి పదేళ్ల గడువు ముగియడంతో రాష్ట్ర హోదాను తొలగించినట్లు పేర్కొన్నారు. దీంతో కళాశాలలోని సీట్లన్నీ ఇకపై మన విద్యార్థులకు కేటాయించనున్నారు. 85 శాతం ఏయూ రీజియన్ విద్యార్థులకు, మిగిలిన 15 శాతం అన్-రిజర్వ్‌డ్ సీట్లలో ఏయూ, ఎస్వీయూ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.

ఇంధన రంగాల్లో వినూత్న మార్గాలను అన్వేషించాలి

- సీఎస్ఐఆర్-ఎన్ఐవో రీజనల్ సెంటర్ చీఫ్ సైంటిస్ట్ ప్రొ.శర్మ
- ఘనంగా ఐఐపీఈ నాలుగో వార్షికోత్సవం


గ్రాడ్యుయేట్ విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేస్తున్న ప్రొ. శర్మ, ప్రొ.శాలివాహన్

సాక్షి, విశాఖపట్నం: గ్లోబల్ వార్మింగ్‌ని తగ్గించడంతో పాటు వాతావరణ మార్పుల కోసం ఇంధన రంగాల్లో వినూత్న మార్గాలను అన్వేషించాలనీ.. లేకపోతే భవిష్యత్తు తరాలపై తీవ్ర ప్రభావం పడుతుందని సీఎస్ఐఆర్-ఎన్ఐవో రీజనల్ సెంటర్ చీఫ్ సైంటిస్ట్ ప్రొఫెసర్ వీవీఎస్ఎస్ శర్మ హెచ్చరించారు. విశాఖలోని ఓ హోటల్‌లో నిర్వహించిన ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పెట్రోలియం అండ్ ఎనర్జీ (ఐఐపీఈ) నాలుగో స్నాతకోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఐఐపీఈలో తొలి పీహెచ్‌డీ పట్టాను గౌరీశంకర్ దాస్‌కు ప్రదానం చేశారు. పెట్రోలియం ఇంజినీరింగ్ నుంచి 26 మంది, కెమికల్ ఇంజినీరింగ్ నుంచి 32 మంది విద్యార్థులకు పట్టాలు ప్రదానం చేశారు. ప్రతి బ్రాంచ్ నుంచి ప్రతిభ కనబరిచిన ఇద్దరు విద్యార్థులకు బంగారు పతకాలు అందించారు. అనంతరం ప్రొ.శర్మ మాట్లాడుతూ పెట్రోలియం, ఇంధన రంగంలో అపారమైన అవకాశాలున్నాయని తెలిపారు. మేక్ ఇన్ ఇండియాలో భాగంగా అంతర్జాతీయ విపణిలో భారత్ ఉత్పత్తులు అగ్రగామిగా నిలిపుతూ.. దేశ జీడీపీ వృద్ధిలో కీలక పాత్ర పోషించాలన్నారు. ఐఐపీఈ డైరెక్టర్ ప్రొ.శాలివాహన్ మాట్లాడుతూ పరిశ్రమలతో ఇన్‌స్టిట్యూట్‌ని అనుబంధం చేయడంతో పాటు అంతర్జాతీయ సంస్థలో జతకడుతూ విద్యార్థులకు మంచి భవిష్యత్తుని అందించడమే తమ ముందున్న ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. ఐఐపీఈ రిజిస్ట్రార్ రామ్‌పాల్ ద్వివేదీ, బోర్డు సభ్యులు, సెనేటర్లు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

తప్పుడు పని చేయాలని వస్తే తలనరికేసింది

- లైంగిక దాడికి ప్రయత్నించిన యువకుడిని హత్య చేసిన మహిళ
- నరసాపురం రూరల్ మండలంలో ఘటన


హత్యకు గురైన మైల చంద్రశేఖర్

నరసాపురం రూరల్: ఒంటరిగా ఉంటున్న తనపై లైంగిక దాడికి ప్రయత్నించిన యువకుడిని ఓ మహిళ నరికి చంపింది. ఈ ఘటన పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం రూరల్ మండలం సర్దుకొడప గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి జరిగింది. నరసాపురం రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... నరసాపురం రూరల్ మండలం చినమైనవానిలంకకు చెందిన మైల చంద్రశేఖర్ (36)కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అతని భార్య ఉపాధి కోసం గల్ఫ్ దేశాలకు వెళ్లగా, చంద్రశేఖర్ తన తల్లిదండ్రులు, ఇద్దరు పిల్లలతో కలిసి ఉంటున్నాడు. ఈ నేపథ్యంలో చంద్రశేఖర్ సర్దుకొడప గ్రామానికి చెందిన మహిళ(58) ఒంటరి మహిళపై కన్నేశాడు. అతను శుక్రవారం రాత్రి సర్దుకొడప గ్రామంలోని ఆమె ఇంటికి వెళ్లి లైంగిక దాడికి ప్రయత్నించాడు. దీంతో ఆమె కత్తి తీసుకుని చంద్రశేఖర్ తల నరికి చంపేసింది. పోలీసులు శనివారం ఘటనాస్థలాన్ని పరిశీలించి నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నరసాపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుని తండ్రి కొండలరావు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

గిరిజనాభివృద్ధికి విజన్-2047 రోడ్ మ్యాప్

రాష్ట్రాలకు కేంద్ర కార్యదర్శి విభు నాయర్ ఆదేశం

సాక్షి, అమరావతి: గిరిజనాభివృద్ధి కోసం విద్య, ఆరోగ్యం, జీవనోపాధి, అటవీ హక్కులు వంటి నాలుగు ప్రధాన అంశాలపై దృష్టి సారించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల శాఖ కార్యదర్శి విభు నాయర్ ఆదేశించారు. అన్నిరాష్ట్రాల గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శులు, డైరెక్టర్లకు ఢిల్లీలో గురు, శుక్రవారాల్లో రెండు రోజులపాటు నిర్వహించిన వర్క్‌షాప్ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇందుకు సంబంధించిన వివరాలను శనివారం మీడియాకు విడుదల చేశారు. గిరిజనాభివృద్ధిలో భాగంగా విజన్-2047 రోడ్ మ్యాప్‌ను, వంద రోజుల కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని విభు నాయర్ సూచించారు. ఆయా రాష్ట్రాల్లో అమలు చేస్తున్న కేంద్ర పథకాల పురోగతిని ఈ సందర్భంగా సమీక్షించారు.

ఆగస్టు 3,4 తేదీల్లో జాతీయ వర్క్‌షాప్

సాక్షి, అమరావతి: నూతన జాతీయ విద్యావిధానం అమలులో ఎదురయ్యే సవాళ్లపై ఆగస్టు 3,4 తేదీల్లో రెండ్రోజుల పాటు విజయవాడలో జాతీయ వర్క్‌షాప్ నిర్వహిస్తున్నట్లు ప్రణాళిక, రూపశిల్పికళాశాల (ఎస్పీఏ) సంచాలకులు ప్రొ.కొండ రమేష్ తెలిపారు. అఖిల భారతీయ రాష్ట్రీయ శైక్షిక్ మహాసంఘ్ (ఏబీఆర్ఎస్ఎం), ఎస్పీఏలు సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ సదస్సులో రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ ముఖ్యఅతిథిగా, సిద్ధార్థ అకాడమీ విద్యా విషయక సలహాదారు వినయ్ కుమార్ గౌరవ అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. ఏబీఆర్ఎస్ఎం జాతీయ సంయుక్త నిర్వహణ కార్యదర్శి గుంత లక్ష్మణ్ కీలకోపన్యాసం చేస్తారన్నారు.

సినీనటి శ్రీరెడ్డిపై కేసు నమోదు

కర్నూలు: సినీనటి శ్రీరెడ్డిపై కర్నూలు 3వ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. సీఎం చంద్రబాబు, ఆయన కుటుంబ సభ్యులు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, హోంమంత్రి అనితలపై శ్రీరెడ్డి అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ టీడీపీ బీసీ సెల్ నాయకుడు మేకల వెంకట నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు 352, 353 బీఎన్ఎస్-66 ఐటీ చట్టం కింద కేసు నమోదు చేసినట్లు సీఐ మురళీధర్‌రెడ్డి శనివారం తెలిపారు. కాగా, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా నాయకుడు బోరుగడ్డ అనిల్‌పై కూడా టీడీపీ సోషల్ మీడియా బృందం చేసిన ఫిర్యాదు మేరకు ఇదే పోలీస్ స్టేషన్‌లో వారం రోజుల క్రితం కేసు నమోదైంది.

పెన్షనర్లకు ట్యాక్స్ లేకుండా చూడండి

కేంద్ర మంత్రిని కోరిన సీబీఐసీ పెన్షనర్ల సంఘం

సాక్షి, అమరావతి: కేంద్ర బడ్జెట్‌లో పెన్షనర్లకు ఇన్‌కంటాక్స్, ఇతర ట్యాక్స్‌ల నుంచి పూర్తి మినహాయింపు ఇవ్వాలని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్‌డైరెక్ట్ టాక్సెస్ అండ్ కస్టమ్స్(సీబీఐసీ) శాఖకు చెందిన ఆంధ్రప్రదేశ్ పెన్షనర్ల సంఘం కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ విషయమై కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సీబీఐసీ సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గద్దె తిలక్, టి.వివేకానంద మెయిల్ ద్వారా శనివారం వినతిపత్రం పంపించారు. పెన్షనర్లు తమకు వచ్చిన వేతనంలో అధికభాగం ట్యాక్స్‌లు చెల్లించడానికే సరిపోతోందని, అన్ని ట్యాక్స్‌ల నుంచి పెన్షనర్లకు విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు. వర్కింగ్ ఎంప్లాయీస్ మాదిరిగా పెన్షనర్లకు ఎటువంటి అలవెన్స్‌లు, ఇంక్రిమెంట్‌లు ఉండవని పేర్కొన్నారు. నిత్యావసర ధరలు, ఔషధాల ధరలు ఏటా విపరీతంగా పెరుగుతున్నాయని, ఇటువంటి పరిస్థితిలో పెన్షనర్లకు ట్యాక్స్‌ల నుంచి ఊరట కల్పించి ఆదుకోవాలని కేంద్రానికి వారు విజ్ఞప్తి చేశారు.

రూ.7 కోట్ల విలువైన హెరాయిన్ స్వాధీనం

ఆఫ్గనిస్తాన్ నుంచి హైదరాబాద్‌కు తరలింపు

సాక్షి, హైదరాబాద్: ఆఫ్గనిస్తాన్ నుంచి హైదరాబాద్‌కు రూ.7 కోట్ల విలువైన హెరాయిన్‌ను సరఫరా చేసిన ముఠా పోలీసులకు చిక్కింది. సైబరాబాద్‌లో ఈ స్థాయిలో నాణ్యమైన హెరాయిన్ పట్టుబడటం ఇదే తొలిసారని పోలీసు కమిషనర్ అవినాష్ మహంతి తెలిపారు. బ్రౌన్ కలర్‌లో ఉండే ఈ హెరాయిన్ మన దేశంలో ఉత్పత్తి కాదని, ఆఫ్గనిస్తాన్ వంటి దేశ సరిహద్దు ప్రాంతాల నుంచే ఇక్కడికి సరఫరా అవుతుందని చెప్పారు. తొలుత దేశ సరిహద్దుల నుంచి విమానంలో రాజస్థాన్‌కు తరలిస్తున్నారని, అక్కడి నుంచి ప్రైవేట్ బస్సుల్లో హైదరాబాద్‌కు సరఫరా చేస్తున్నారని వివరించారు. నలుగురు అంతర్‌రాష్ట్ర నిందితుల నుంచి రూ.7 కోట్ల విలువైన కిలో హెరాయిన్‌ను పట్టుకున్నామని చెప్పారు. సీపీ మహంతి ఇంకా ఏం చెప్పారంటే..

గ్రాము రూ.7 వేల చొప్పున..

రాజస్థాన్‌లోని నాగోర్ జిల్లాకు చెందిన సంతోష్ ఆచారి, నేమిచంద్ భాటి, నర్పత్ సింగ్ అక్కడే చిన్న చిన్న డ్రగ్ పెడ్లర్లకు హెరాయిన్, ఎండీఎంఏ వంటి డ్రగ్స్ విక్రయిస్తుంటారు. మాదక ద్రవ్యాల కేసులో అరెస్టయి ప్రస్తుతం జోధ్‌పూర్ జైలులో ఉన్న సంతోష్ నుంచి నేమిచంద్ మరికొంతమందితో జట్టుగా ఏర్పడి హెరాయిన్ తీసుకున్నాడు. హెరాయిన్‌ను గ్రాము రూ.7 వేల చొప్పున మాదాపూర్‌లోని డ్రగ్ పెడ్లర్లు, కస్టమర్లకు విక్రయించాలని నిర్ణయించుకున్నారు. శిల్పారామం సమీపంలో డ్రగ్స్‌ను విక్రయించేందుకు సిద్ధమవుతుండగా.. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో సహాయంతో ఎస్ఓటీ శంషాబాద్, మాదాపూర్ పోలీసులు నలుగురు డ్రగ్ పెడ్లర్లను పట్టుకున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22.Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708. Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act)
RNI No:TNTEL/2008/25943

సాక్షి 24|7 కర్ణాటక

KARNATAKA

ఆదివారం : 21 : జూలై : 2024

అప్పణ్ణ జయంతి



ప్రముఖ వాగ్గేయకారుడు, సంఘ సంస్కర్త హడపద అప్పణ్ణ జయంతి సందర్భంగా శనివారం బెళగావి నగరంలో ర్యాలీ. అలరించిన మహిళా కళాకారుల ప్రదర్శన

న్యూస్‌రీల్

ఎయిర్‌పోర్టులో అదే గందరగోళం

- 55 విమానాలు రద్దు



ఎయిర్‌పోర్టులో ప్రయాణికుల రద్దీ

దొడ్డబళ్లాపురం: మైక్రోసాఫ్ట్ సాఫ్ట్‌వేర్‌లో తలెత్తిన సాంకేతిక సమస్య కారణంగా బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో సంక్షోభం కొనసాగుతోంది. సుమారు 55 విమానాలు రద్దయ్యాయి.77 విమానాలు ఆలస్యంగా నడిచాయి. వీటిలో చాలావరకూ విమానాలు ఇండిగో సంస్థకు చెందినట్లు సమాచారం. మైక్రోసాఫ్ట్ లో సమస్య కారణంగా చెక్ ఇన్‌ను ఆన్‌లైన్‌లో కాకుండా బోర్డుల మీద చాక్‌పీస్‌తో రాసి నిర్వహించారు. టెర్మినల్‌లో పేపర్ బోర్డింగ్ పాస్ ఇచ్చారు. 1, 2వ టెర్మినల్స్‌లో క్యూ లైన్లు నిదానంగా సాగాయి. ప్రయాణికుల సంఖ్య గంటగంటకూ పెరిగిపోగా, విమానాలు రద్దు కావడంతో గందరగోళం ఏర్పడింది. అనేకమంది ముఖ్యమైన పనుల మీద వెళ్లాల్సి ఉండగా విమానాలు మొండిచేయి చూపడంతో లబోదిబోమన్నారు. ప్రయాణికులు తిరిగి డబ్బులు పొందడానికి కౌంటర్‌ల వద్ద పడిగాపులు కాశారు.

గంధపు చెక్కల డంప్ సీజ్



స్వాధీనపరుచుకున్న గంధపు మొద్దులు

కృష్ణరాజపురం: గంధపు చెక్కల దొంగతనం, రవాణా, నిల్వ మిస్టరీని ఛేదించిన రాష్ట్ర అటవీ జాగృత దళ సిబ్బంది రూ.2 కోట్లకు పైగా విలువ చేసే గంధపు చెక్కల డంప్‌ను పట్టుకున్నారు. కేఆర్ పురం ఐటీఐ ఫ్యాక్టరీ ఆవరణలోని ఓ గోదాముపై దాడి చేసిన అటవీ అధికారులు అక్కడ రెండు టన్నులకు పైగా నిల్వ చేసిన గంధపు చెక్కలను స్వాధీనం చేసుకుని గోడౌన్‌కు సీల్ చేశారు. వాటిని నిల్వ చేసిన వారి కోసం విచారణ సాగుతోంది.

విమానాశ్రయంలో రూ.3.5 కోట్ల గంజాయి సీజ్



హైడ్రోఫోనిక్ గంజాయి (ఫైల్)

దొడ్డబళ్లాపురం: విదేశాల నుండి అక్రమంగా తరలిస్తున్న రూ.3.5 కోట్ల విలువైన 3 కేజీల హైడ్రోఫోనిక్ గంజాయిని కెంపేగౌడ ఏర్‌పోర్టులో కస్టమ్స్ అధికారులు సీజ్ చేసారు. బ్యాంకాక్ నుంచి ప్రత్యేకంగా పండించిన గంజాయి తరలిస్తున్న కేరళకు చెందిన శహన్వా సాహుల్ అహ్మద్ అనే ప్రయాణికున్ని అరెస్టు చేసారు. కవర్‌లో ప్యాక్ చేసి లగేజ్ మధ్యలో దాచి తరలిస్తూ తనిఖీలలో పట్టుబడ్డాడు.

విదేశీ సిగరెట్లు సీజ్

విదేశాల నుండి అక్రమంగా తరలిస్తున్న విదేశీ సిగరెట్లను బెంగళూరు కెంపేగౌడ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు సీజ్ చేసారు. తనిఖీ చేస్తుండగా విదేశీ సిగరెట్లను తరలిస్తున్న ప్రయణికుడు పట్టుబడ్డాడు. 260 సిగరెట్ ప్యాక్‌లను స్వాధీనం చేసుకున్నారు.

తుపాకీతో భార్య కాల్చివేత



నిందితుడు బోపణ్ణ , శిల్పా సీతమ్మ (ఫైల్)

మండ్య: ఓ మహిళను ఆమె భర్త తుపాకీతో కాల్చి చంపిన ఘటన కొడగు జిల్లా విరాజపేటె సమీపంలోని బేటోళి గ్రామంలో జరిగింది. బేటోళి గ్రామ పంచాయతీ మాజీ సభ్యురాలు శిల్పా సీతమ్మ (40) అనే మహిళను ఆమె భర్త సి. నాయకండ బోపణ్ణ తుపాకీతో కాల్చి హత్య చేశాడు. భార్యాభర్తల మధ్య చాలా రోజులుగా కుటుంబ కలహాలు జరుగుతున్నాయి. శుక్రవారం రాత్రి శిల్పా వేరొకరితో ఫోన్‌లో మాట్లాడుతుండగా, బోపణ్ణ అడ్డు చెప్పాడు. ఈ విషయమై గొడవ జరగడంతో కసితో రగిలిపోయిన బోపణ్ణ శనివారం ఉదయం ఇంట్లోని సింగిల్ బ్యారెల్ తుపాకీతో భార్య శిల్పాపై కాల్పులు జరపడంతో అక్కడికక్కడే మరణించింది. శిల్పా సీతమ్మ 2012 నుంచి 2017 వరకు బేటోళి గ్రామ పంచాయతీ సభ్యురాలిగా పనిచేశారు. జిల్లా ఎస్పీ కే.రామరాజన్, విరాజపేటె గ్రామీణ పోలీసు అధికారులు గ్రామానికి వెళ్లి పరిశీలించి నిందితున్ని అరెస్టు చేశారు. కొడగు జిల్లాలో ఇళ్లలో తుపాకులు ఉంచుకోవడం సాధారణం. దీని వల్ల అప్పుడప్పుడు తుపాకీ కాల్పుల ఘటనలు జరుగుతూ ఉంటాయి.

మైసూరు దసరాకు సన్నాహాలు

- గజరాజుల ఎంపిక పూర్తి?
- ఆగస్టు 9న గజ పయనం!



అందరూ ఎదురుచూసే దసరా ఉత్సవాలు (ఫైల్)



అడవుల నుంచి సర్వాంగ సుందరంగా మైసూరుకు వస్తున్న గజరాజులు (ఫైల్)

మైసూరు: మైసూరు దసరా అనగానే అందరికీ ఆనందంతో మనసు పులకరిస్తుంది. ప్రపంచ ప్రసిద్ధ నాడ హబ్బ మైసూరు దసరా మహోత్సవాలకు ఏర్పాట్లు షురూ అయ్యాయి. ఈ ఏడాది అక్టోబరు 12న దసరా పండుగ జరగనుంది. గతేడాది కంటే 12 రోజులు ముందుగానే ఈసారి పండుగ వస్తున్నందున మైసూరులో వేడుకల ఏర్పాట్లకు ప్యాలెస్, జిల్లా అధికారులు నడుం బిగించారు. 9 రోజుల పాటు నవరాత్రి ఉత్సవాలతో మైసూరు శోభాయమానం కానుంది.

దసరా వేడుకలలో గజరాజులు ప్రధాన పాత్ర పోషిస్తాయి. అడవులలోని అటవీశాఖ శిబిరాలలో ఉండే ఏనుగులను మైసూరుకు తీసుకు రావాల్సి ఉంది. ఇందుకోసం ఉత్సవం మాదిరిగా గజ పయనం నిర్వహిస్తారు. 14 ఏనుగులతో పాటు అదనంగా మరో నాలుగు కలిసి 18 ఏనుగులను ఎంపిక చేస్తారు. వాటిని ఆగస్టు 9వ తేదీ లేదా 11వ తేదీన మైసూరు ప్యాలెస్‌కు ఊరేగింపుగా తీసుకొస్తారు. ఇందులో మొదటి దశలో 9 ఏనుగులను తరలిస్తారు. మరో వారం తరువాత మిగతా గజరాజులను రప్పిస్తారు.

ఈసారి వైభవంగా

అక్టోబరు 12న దసరా రోజున జంబూ సవారీ వేడుకలను జరుపుతారు. రాష్ట్రంలో ఈదఫా మంచి వర్షాలు పడుతుండటంతో పాటు కేఆర్ఎస్, ఆల్మట్టి, కబిని వంటి జలాశయాలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో ఎలాంటి సంశయం లేకుండా భారీ ఎత్తున దసరా మహోత్సవాలను జరపాలని ఏర్పాట్లు చేస్తున్నారు. గత ఏడాది తీవ్రమైన దుర్భిక్షం వల్ల వేడుకలను తక్కువ ఆర్భాటంతో నిర్వహించారు.

శిబిరాలలో ఏనుగుల ఎంపిక

ఏనుగులను 60 రోజులు ముందుగానే మైసూరుకు తీసుకొస్తారు. ఇప్పటికే మైసూరు జిల్లాలోని హుణసూరు తాలూకాలోని నాగరహొళె అడవిలోని మత్తిగోడు, భీమనకట్టి, దొడ్డహరవె, కొడగు జిల్లాలోని దుబారె, బండీపురలోని రాంపుర ఏనుగుల శిబిరానికి మైసూరు వన్యజీవుల విభాగం డీసీఎఫ్ బీఎం శరణబసప్ప ఆధ్వర్యంలో అటవీ అధికారులు వెళ్లారు. పశు వైద్యులతో కలిసి సుమారు 22 ఏనుగులను పరిశీలించారు. వాటిలో 18 ఏనుగుల జాబితాను తయారు చేసి అందులో 14 ఏనుగులను జంబూసవారి కోసం ఎంపిక చేస్తారు. మిగిలిన 4 ఏనుగులను అవసరానికి అందుబాటులో ఉంచుతారు.

కెప్టెన్ అభిమన్యు..

మొదటి బృందంలో మత్తిగోడు క్యాంప్ నుంచి సీనియర్ ఏనుగు కెప్టెన్ అభిమన్యు (58), భీమ, ఏకలవ్య (39), భీమనకట్టి క్యాంప్ నుంచి వరలక్ష్మి (68), దుబారె నుంచి ధనుంజయ (41), గోపి (42), కంజన్ (25), రామాపుర క్యాంప్ నుంచి రోహిత (22), లక్ష్మి (23) అనే ఏనుగులను తీసుకురావాలని నిర్ణయించారు. రెండవ బృందంలో దుబారె క్యాంప్ నుంచి ప్రశాంత్ (51), సుగ్రీవ (42), మత్తిగోడు నుంచి మహేంద్ర (41), దొడ్డహరవె నుంచి లక్ష్మి (53), రాంపుర నుంచి హిరణ్య (37)లను తరలిస్తారు. అదనంగా దుబారె క్యాంప్ నుంచి ప్రశాంత (49), అయ్యప్ప (13), రాంపుర నుంచి పార్థసారథి (19), మాలాదేవి (37)లను ఎంపిక చేశారు.



కనువిందు చేయనున్న ఉత్సవాలు

నాటుబాంబు పేలి ఎలుగుబంటి మృతి

మైసూరు: రెండు వేర్వేరు ప్రమాదాల్లో అరుదైన వన్యజీవులు దుర్మరణం చెందాయి. చామరాజనగర జిల్లాలోని గుండ్లుపేటె తాలూకాలోని బండీపుర అభయారణ్యంలోని హొరెయల గ్రామంలో చెరుకు తోటలో నాటుబాంబు పేలి ఏడాది వయసున్న ఎలుగుబంటి మరణించింది. మహాదేవస్వామి అనే రైతు చెరుకు తోటలోకి అడవి పందులు వచ్చి పంటను పాడుచేయకుండా అక్కడక్కడా నాటు బాంబులను ఉంచాడు. శనివారం ఓ ఎలుగుబంటి వచ్చి దానిని తొక్కడంతో పేలి దుర్మరణం చెందింది. అటవీ సిబ్బంది చేరుకుని కేసు నమోదు చేశారు. రైతు పరారీలో ఉన్నాడు.

మరో చోట చిరుత..

గుండ్లుపేటె తాలూకాలోనే శీగెవాడి గ్రామంలో ఓ పొలంలోని కరెంటు స్థంభం నుంచి వైరు తెగి పడి ఉంది. దానిని తాకి ఆరు నెలల వయసున్న చిరుతపులి అక్కడే మృతి చెందింది. అటవీ సిబ్బంది పరిశీలించి చిరుత కళేబరాన్ని తరలించారు.

ఆవును చంపిన పులి

మైసూరు: అడవిలో నుంచి ఆహారం కోసం వచ్చిన పెద్ద పులి ఓ గ్రామంలో దాడి చేసి ఆవును హతమార్చింది. జిల్లాలోని హెచ్‌డి కోటె తాలూకాలోని కృష్ణాపుర గ్రామంలో ఈ సంఘటన జరిగింది. పులి దాడితో పల్లె ప్రజల్లో భయం అలముకొంది. శనివారం తెల్లవారుజామున రామస్వామి అనే రైతుకు చెందిన ఇంటి వద్ద కట్టివేసిన ఆవును పులి చంపి కొంత భక్షించింది. ఈ పశువుల కొట్టం వెనుక పులి అడుగులు కనిపించాయి. గ్రామస్తుల ఫిర్యాదు మేరకు అటవీ సిబ్బంది చేరుకుని పులి కోసం గాలింపు చేపట్టారు.

పవిత్రకు అందని పెట్టె

దొడ్డబళ్లాపురం: రేణుకాస్వామి హత్య కేసులో ఏ1 నిందితురాలిగా ఉన్న నటి పవిత్రగౌడ ప్రస్తుతం పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో రిమాండు ఖైదీగా ఉంది. శనివారంనాడు పవిత్రగౌడను చూడడానికి ఆమె తల్లి వచ్చారు. కూతురికి ఒక బాక్స్‌ను ఇవ్వగా జైలు సిబ్బంది నిరాకరించారు. ఇంటి నుండి తెచ్చిన తినుబండారాలను పెట్టుకోవడానికి పవిత్రగౌడ ఒక పెట్టెను తీసుకురమ్మని తల్లిని కోరిందట. అందువల్ల పవిత్ర తల్లి బాక్స్‌ను తీసుకువచ్చింది. అయితే బయటి నుండి తీసుకువచ్చే పాత్రలను లోపలకు అనుమతించబోమని, అది జైలు నిబంధన అని సిబ్బంది అడ్డుకున్నారు.

దాడి దృశ్యాలు వీడియో?

రేణుకాస్వామిపై దాడిని హీరో దర్శన్, అనుచరులు ఐఫోన్‌లో రికార్డు చేసినట్టు తెలిసింది. దాడిలో తీవ్రంగా గాయపడ్డ రేణుకాస్వామి స్పృహతప్పి పడిపోగానే ఒక నిందితుడు తన ఐఫోన్‌లో వీడియో తీశాడు. నిందితులకు 5 సిమ్‌కార్డులు అందజేసిన వారిని పోలీసులు విచారణ జరిపి వాంగ్మూలాన్ని రికార్డు చేసారు. దర్శన్, పవిత్ర గౌడలు తలా ఒక సిమ్‌కార్డు తీసుకున్నారు.



నటి పవిత్ర గౌడ (ఫైల్)

సీఎంతో రేణుకాచార్య తల్లిదండ్రుల భేటీ

శివాజీనగర: రేణుకాస్వామి తల్లిదండ్రులు ముఖ్యమంత్రి సిద్దరామయ్యను కలిసి రేణుకాస్వామి భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని విన్నవించారు. రేణుకాస్వామి హత్య కేసులో నటుడు దర్శన్, పవిత్ర, మరో 15 మంది అరెస్టు కావడం తెలిసిందే. సీఎంను కృష్ణా నివాసంలో కలిసి తల్లిదండ్రులు తమ బాధను వెలిబుచ్చారు. అనాథగా మారిన తమ కోడలికి ఉద్యోగం ఇచ్చి ఆదుకోవాలన్నారు. సిద్దరామయ్య సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

సౌధ గుమ్మంలో బీటలు

శివాజీనగర: రాజధాని బెంగళూరులో పలు చారిత్రక భవనాలలో విధానసౌధ ప్రముఖమైనది. అయితే విధానసౌధ గుమ్మంలో బీటలు కనిపించడం ఆందోళనకు కారణమైంది. శనివారం స్పీకర్ యూ.టీ.ఖాదర్ అధికారులతో కలసి పరిశీలించారు. విధానసౌధ తూర్పు దిక్కులోని గుమ్మంలో బీటలు కనిపించాయి. వర్షం నీటితో బీటలు వాలి స్థలం నుండి నీరు కారుతోంది. చాలా ఏళ్ల భవనం కావటంతో కొన్ని లోపదోషాలు ఉండవచ్చు. ముఖ్యమంత్రి దృష్టికి తీసుకొస్తాను. డీపీఆర్ ప్రజాపనుల శాఖ అధికారులకు మరమ్మతులకు ఆదేశిస్తానని తెలిపారు.

కష్టపడకుంటే.. కనపడరు

- పార్టీ నేతలకు డీకేశి హెచ్చరిక

శివాజీనగర: రానున్న జిల్లా పంచాయితీ, తాలూకా పంచాయితీ, బీబీఎంపీ ఎన్నికలను ఎదుర్కోవడంపై కేపీసీసీ అధ్యక్షుడు, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ శనివారం జిల్లా నేతలతో కేపీసీసీ కార్యాలయంలో సమావేశం జరిపారు. ఎన్నికలకు నేటి నుండే పార్టీని సన్నద్ధం చేయాలని సూచించారు. గతంలో అసెంబ్లీ, లోక్‌సభా ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడిన అందరిని గుర్తించి బోర్డు, కార్పొరేషన్‌ల పదవులను కట్టబెడతామని ఊరడించారు. రాబోయే స్థానిక ఎన్నికలు పార్టీకి అగ్ని పరీక్ష వంటివని, అందుచేత ఈ ఎన్నికలకు ప్రతి ఒక్కరు శ్రమించాలని సూచించారు. పనిచేయని జిల్లా, బ్లాక్ అధ్యక్షులను తక్షణమే మారుస్తామని హెచ్చరించారు. ప్రతి జిల్లాలో కూడా సమావేశాలు జరిపి సమస్యలపై చర్చించాలని చెప్పారు. ఈ సమావేశంలో సీనియర్ నేతలు పాల్గొన్నారు.



ఆషాడ శనివారం సందర్భంగా చామరాజనగరలో చామరాజేశ్వర తేరు వేడుక సంభ్రమం

రింగ్‌రోడ్డుపై కుంగిన భూమి

మైసూరు: మైసూరు నగరంలోని దట్టగళ్లి రింగ్ రోడ్డులో ఉన్నట్లుండి రోడ్డుపై గుంత ఏర్పడింది. అది సుమారు 5 అడుగుల వెడల్పుతో 20 అడుగల లోతుగా ఉంది. మైసూరు విశ్వ విద్యానిలయం లేఔట్ తరువాత మారెమ్మ గుడికి కూతవేటు దూరంలో రోడ్డుపై నేల కుంగిపోయింది. కొన్నిరోజులుగా కురుస్తున్న భారీ వర్షాలే కారణమని భావిస్తున్నారు. అధికారులు చేరుకుని గుంత చుట్టూ బారికేడ్లు పెట్టారు. 15 సంవత్సరాల క్రితం ఈ రింగ్ రోడ్డు నిర్మాణమైంది.



ఏర్పడిన పెద్ద గుంత

ఊపిరి పోయినా ఉత్తుత్తి వైద్యం

- పేద కుటుంబానికి రూ.8 లక్షల బిల్లు
- కలబుర్గిలో ప్రైవేటు ఆస్పత్రి ధనదాహం



ఆస్పత్రి వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

రాయచూరురూరల్: రోగులకు వైద్యం చేసి ప్రాణం నిలపాల్సిన వైద్యులు డబ్బు కోసం కక్కుర్తితో పక్కదారి పట్టడం సినిమాల్లోను, నిజ జీవితంలోనూ చూస్తుంటాం. చిన్న చిన్న జ్వరాలకు కూడా అనేక టెస్టులు చేసి వేలాది రూపాయల బిల్లులు వేయడం నేటిరోజుల్లో సాధారణమైంది. ఇక కలబుర్గిలో మరణించిన వ్యక్తికి వైద్యం చేసి రూ.8 లక్షలు బిల్లులు చేసిన యునైటెడ్ ఆస్పత్రి వైద్యుల నిర్వాకం ఆలస్యంగా బయటపడింది.

పొట్టకు శస్త్రచికిత్స చేసి

వివరాలు.. జేవర్గి తాలుకా జైనాపూర్‌కు చెందిన నాగన్న (50), ఈ నెల 3న ఇంటిలో కిందపడ్డాడు, పొట్టకు చిన్న గాయం కావడంతో కలబుర్గిలోని యునైటెడ్ అస్పత్రిలో చేరారు. 4వ తేదీన యంఆర్‌ఐ స్కానింగ్ చేసిన వైద్యులు కడుపులో రక్తం గడ్డ కట్టిందని శస్త్రచికిత్స చేశారు. అయితే పరిస్థితి విషమించి నాగన్న చనిపోయాడు. కానీ విషయాన్ని దాచిపెట్టిన వైద్యులు ఐసీయూలో ఉంచి సీటీ స్కాన్, ఇతరత్రా వైద్య సేవలు అందిస్తున్నట్లు కుటుంబ సభ్యులకు తెలిపారు. ఆపరేషన్ చేస్తున్న సమయంలో రోగికి గుండెపోటు రావడంతో పాటు మరణించాడని వైద్యులు రెండురోజుల తరువాత తీరిగ్గా తెలిపారు. కుటుంబసభ్యుల నుంచి రూ.8 లక్షలు డబ్బులు వసూలు చేశారు. చనిపోయిన వ్యక్తికి వైద్యం పేరుతో తమను దోచుకున్నారని కుటుంబ సభ్యులు ఆస్పత్రిపై దుమ్మెత్తిపోశారు. ఇంత జరిగినా జిల్లా మంత్రులు ప్రియాంక్ ఖర్గే, శరణు ప్రకాష పాటిల్‌లు మౌనం వహించడాన్ని తప్పు బట్టారు.

తీరంలో కుమ్మేస్తున్న కుండపోత




శనివారం కొడగు జిల్లాలో లక్ష్మణ తీర్థ నది పరవళ్లను తిలకిస్తున్న జనం



మండ్య జిల్లాలో కృష్ణరాజ సాగర జలాశయం నుంచి కావేరి నది దూకుడు

- కరావళి, మలెనాడులో భారీ వర్షాలు
- జన జీవనానికి ఆటంకం
- ఆరు జిల్లాల్లో విద్యాలయాలకు సెలవు
- ఉప్పొంగి ప్రవహిస్తున్న నదులు
- నిండుకుండలా కేఆర్ఎస్ డ్యాం



ఉడుపి వద్ద నివాసాలు జలమయం

బనశంకరి: గతేడాది కరువును తీరుస్తూ ఈదఫా పుష్కలంగా వర్షాలు కురుస్తున్నాయి. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా పలు చోట్ల భారీ వర్షాలు కురుస్తున్నాయి. కుంభవృష్టి వర్షాల వల్ల దక్షిణ కన్నడ, ఉత్తర కన్నడ, ఉడుపి, శివమొగ్గ, కొడగు, హాసన్ జిల్లాల్లో జనజీవనం అస్తవ్యస్తమైంది. ఈ జిల్లాల్లో శనివారం విద్యాలయాలకు సెలవు ప్రకటించారు. వానలతో ఉత్తర కన్నడ జిల్లా అంకోలా వద్ద జాతీయ రహదారి- 66లో కొండచరియ తొలగింపు పనులకు ఆటంకం ఏర్పడింది. బండరాళ్ల కింద ఇంకా ఎవరైనా ఉన్నారా అనేది మిస్టరీగా మారింది. ఉత్తర కన్నడ జిల్లాలో విద్యాలయాలకు సెలవు ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ లక్ష్మీప్రియా తెలిపారు రాష్ట్రంలో మరో మూడు నాలుగురోజుల పాటు వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది. ఉడుపి జిల్లాలో కుండపోత వర్షాల వల్ల అనేక ఊళ్లలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. సహాయక చర్యలు చేపట్టినట్లు జిల్లా కలెక్టర్ విద్యాకుమారి తెలిపారు.

నదులు, జలపాతాల జోరు

- కరావళి, దక్షిణ ఒళనాడు జిల్లాల్లో వర్షాలు ఎడతెరపిలేకుండా కురుస్తుండటంతో రెడ్‌అలర్ట్ ప్రకటించారు. గత వారం రోజులుగా కరావళి ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో కొండచరియలు, ఇళ్లు కూలిన ఘటనలు పెరిగాయి.



కొండచరియలు కూడిన చోట తనిఖీ

- కొడగు జిల్లాలో భారీ గాలులతో కూడిన వర్షాలు కురుస్తుండటంతో జనజీవనం అస్తవ్యస్తమైంది. లక్ష్మణ తీర్థ నది ఉధృతంగా ప్రవహిస్తోంది. ప్రఖ్యాత అబ్బే ఫాల్స్ ఉరకలెత్తుతోంది. ఇక్కడ కావేరినది పాయ 20 అడుగుల ఎత్తు నుంచి దూకుతుంది.
- వర్షాలతో బెంగళూరు-మంగళూరు మధ్య సంచారంలో ఇబ్బందులు తలెత్తాయి. కాళి, గంగావళి, అఘనాశిని, నేత్రావతి, కుమారధారతో పాటు 10కి పైగా నదులు ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తున్నాయి.

నేడు నిండనున్న కేఆర్ఎస్

కావేరి నదీ ప్రాంతంలో కురుస్తున్న వర్షాలతో మండ్య జిల్లాలో కేఆర్ఎస్ డ్యాంలోకి 5 రోజుల్లో 15 టీఎంసీల నీరు చేరింది. ఆదివారం సాయంత్రంలోగా కేఆర్ఎస్ పూర్తిగా భర్తీ కానుంది. 124.80 అడుగులు గరిష్ఠ నీటిమట్టం కలిగిన కేఆర్ఎస్ 120 అడుగులకు చేరింది. ముందుజాగ్రత్త చర్యగా 10 గేట్ల నుంచి 10 వేల క్యూసెక్కులు నీటిని విడుదల చేశారు. దీంతో కావేరి నది ఉప్పొంగే ప్రమాదం ఉన్నందున పరీవాహక ప్రజలు జాగ్రత్తగా ఉండాలని అధికారులు ప్రకటించారు.

- అరేబియా సముద్రంలో అలలు ఇంతెత్తున ఎగిసిపడుతున్నాయి, దీంతో చేపల వేటను నిషేధించారు. ఉడుపిలో సముద్రపు అలలకు తీరంలో ఉన్న కొబ్బరిచెట్లు కొట్టుకుపోయాయి. తీరాన్ని ఆనుకుని ఉన్న ఇళ్లలోకి నీరు చేరింది.

క్లుప్తంగా

నైతిక విలువలు కలిగి ఉండాలి



జ్యోతి వెలిగిస్తున్న నేతలు

రాయచూరు రూరల్: సమాజంలో విద్యార్థులు నైతిక విలువలను కలిగి ఉండాలని రాయచూరు తారనాథ్ విద్యా సంస్థ అధ్యక్షుడు సుఖాని పేర్కొన్నారు. శనివారం మూన్నూరు కాపు సమాజం కళ్యాణ భవనంలో మూన్నూరు కాపు సమాజం ఆధ్వర్యంలో ఉత్తమ శ్రేణిలో పాసైన పది, ఇంటర్ విద్యార్థుల సన్మాన కార్యక్రమంలో ఆయన జ్యోతి వెలిగించి మాట్లాడారు. విద్యార్థులు పర్యావరణానికి ప్రాధాన్యత ఇవ్వాలని, ప్లాస్టిక్ నిర్మూలనకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో మాజీ శాసన సభ్యుడు పాపారెడ్డి, శ్రీనివాస రెడ్డి, వెంకట రెడ్డి, నరస రెడ్డి, శంకర్ రెడ్డి, మహేంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీకాం ఉత్తమమైన డిగ్రీ కోర్సు



అధ్యాపకురాలు ఉమాను సన్మానిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: భవిష్యత్తులో బీకాం డిగ్రీ ఉత్తమమైన కోర్సుగా ఉపయోగ పడుతుందని కర్ణాటక విద్యా సంస్థ వీరమ్మ గంగ సిరి జూనియర్ కళాశాల కామర్స్ అధ్యాపకురాలు ఉమా పేర్కొన్నారు. శనివారం కలబుర్గిలో వీరమ్మ గంగ సిరి జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. నేడు వాణిజ్య రంగం అన్ని రంగాలకు విస్తరించిందని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మోహన్ రాజ్ పత్తార్, రశ్మీ, కాశీబాయి, ప్రియా, బసవ రాజ్, జాతీయ సేవా యోజనాధికారి మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌ఏపీఎంసీ అధ్యక్షుడిగా జయంత రావ్



అధ్యక్షుడు జయంత రావ్



ఉపాధ్యక్షుడు శశి

రాయచూరు రూరల్: రాయచూరు వ్యవసాయ ఉత్పన్న మార్కెట్ కమిటీ (ఆర్‌ఏపీఎంసీ) అధ్యక్షుడిగా జయంత రావ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం ఆర్‌ఏపీఎంసీ కార్యాలయంలో జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా శశిధర్, సభ్యులుగా మల్లన గౌడ, శరబణ్ణ, శరణప్ప, మల్లప్పగౌడ, విజయ్ కుమార్, రామణ్ణ, భీమన్న, శంకర రెడ్డిలు గెలిచారు. జయంత రావ్ పతంగ్ ఏడవ సారి అధ్యక్ష పదవిని చేపట్టారు.

బాధితులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

- కేంద్ర మంత్రి కుమారస్వామి



ఘటన స్థలంలో కేంద్ర మంత్రి కుమార

హుబ్లీ: ఉత్తర కన్నడ జిల్లా హైవే సిరియూరు గ్రామం వద్ద కొండచరియలు విరిగిపడిన ప్రాంతాన్ని శనివారం కేంద్రమంత్రి కుమారస్వామి పరిశీలించారు. ఈ ఘటనలో ఏడుగురు మృతి చెందిన విషయం తెల్సిందే. ఆయన హుబ్లీ నుంచి రోడ్డు మార్గంలో సిరియూరు గుట్ట చేరుకొని అధికారులతో వివరాలను తెలుసుకున్నారు. బాధితులను రాష్ట్ర ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకోవాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం సహాయక చర్యల్లో చురుగ్గా పాల్గొనిందని, అదే విధంగా రాష్ట్ర ప్రభుత్వం ఎటువంటి రాజకీయాలు చేయకుండా బాధిత కుటుంబాలకు పెద్ద ఎత్తున పరిహారం ఇచ్చి ఇళ్లు కోల్పోయిన వారికి పునర్వసతి కల్పించాలని డిమాండ్ చేశారు.

ముగ్గురు దొంగలు అరెస్ట్

హుబ్లీ: ఓ వ్యక్తిపై దాడి చేసి బంగారు చైన్‌తో పాటు మొబైల్‌ను దోచుకున్న ఘటనలో ముగ్గురిని ధార్వాడ తాలూకా గరగ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. నిందితులు ధార్వాడ శంకర, దీపక్, రవిగా గుర్తించారు. వీరు ఫిబ్రవరి 3న రాత్రి సమయంలో కల్లూరు గ్రామంలో జిలాని మబూబ్ అలీ అనే వ్యక్తిని అడ్డగించి అతని వద్ద ఉన్న 15 గ్రాముల బంగారు చైన్, మొబైల్ దోచుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు నిందితులను అరెస్ట్ చేసి కోర్టుకు హాజరు పరిచారు.

రైల్వే స్టేషన్‌లో చోరీ

హుబ్లీ రైల్వే స్టేషన్‌లో ఓ మహిళకు చెందిన రూ. లక్ష విలువ చేసే నెక్లెస్, రూ.50 వేల నగదు చోరీ చేసిన ఘటన శనివారం వెలుగు చూసింది. వీటిని పోగొట్టుకున్న బాధితురాలు రేణుక చవాన్, నగరానికి చెందిన ఈమె బెంగళూరు నుంచి హుబ్లీకి రాణిచెన్నమ్మ ఎక్స్‌ప్రెస్ రైల్లో ప్రయాణించారు. ఆమెతో పాటు నాలుగు లగేజ్ బ్యాగ్‌లు, ఓ వ్యానిటీ బ్యాగ్‌ను తీసుకుని హుబ్లీ రైల్వే స్టేషన్ 1వ ప్లాట్‌ఫారంలో కూర్చున్నారు. ఈ క్రమంలో ఈ చోరీ జరిగిందని ఆమె హుబ్లీ రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

మట్టి గాజులు కేరాఫ్ బెళగావి



బెళగావి జిల్లాలో గాజుల తయారీలో నిమగ్నమైన కార్మికులు



మట్టి గాజులను తయారుచేస్తున్న దృశ్యం



గాజుల తయారీలో మరో కుటుంబం

- కనుమరుగవుతున్న చేతిగాజుల పరిశ్రమలు
- సన్నగిల్లుతున్న ఆదరణ
- చేయూత కరువైందని కార్మికుల ఆవేదన

సాక్షి,బళ్లారి: గాజులు సౌభాగ్యానికి చిహ్నం..గాజులు అంటే ఇష్టపడని మహిళలు ఉండరు. ఆర్థిక స్థితిగతులను బట్టి బంగారు, వజ్రాలతో గాజులు చేయించుకుంటారు. అయితే మట్టి గాజులు అందరికీ అందుబాటులో ఉంటాయి. డబ్బుతో సంబంధం లేకుండా అందరూ మట్టి గాజులను ఇష్టపడుతారు. అటువంటి మట్టి గాజులకు బెళగావి ప్రసిద్ధి చెందింది. కోటీశ్వరుల నుంచి సాధారణ కుటుంబాలకు చెందిన నారీమణులు ఎంత ఖరీదైన చీరలు కట్టిన వారి చేతికి రంగు, రంగుల గాజులు వేసుకుని మరింత మురిసిపోతుంటారు. అలాంటి గాజులు అందరి మహిళలకు అందంగానే కాకుండా మన సంస్కృతి వారసత్వాలను కాపాడుకునేందుకు ఉపయోగిస్తున్న మట్టి గాజులు తయారీ కర్ణాటకలో పేరు ప్రఖ్యాతలు గడించింది. ఉత్తర కర్ణాటక పరిధిలోని బెళగావి జిల్లాలో కేవలం కుందాకే, పాలకోవకే ప్రసిద్ధి చెందడమే కాకుండా మహిళలకు ఇష్టమైన గాజులు తయారీ చేస్తున్న బెళగావి అంతే పేరు ప్రఖ్యాతలు పొందింది. చాలా సంవత్సరాలు నుంచి కొన్ని వందల కుటుంబాలు బెళగావి జిల్లాలో గాజులు తయారు చేసి ఉపాధి పొందుతున్నారు.



మహిళల మదిని దోచే మట్టి గాజులు,



మహిళలు గాజులు ధరించడం సనాతన సంప్రదాయం

అంతా ఫ్యాన్సీ గాజుల మయం :

ప్రస్తుతం మార్కెట్ అంతా ఫ్యాన్సీ గాజుల మయమైంది. అయితే పెళ్లిళ్లు ఇతర అధ్యాత్మిక కార్యక్రమాలకు మట్టి గాజులే శ్రేష్టమైనవి. ఎటువంటి ముక్కలేని, ఈ అఖండ గాజులు అంటేనే ఎంతో ప్రాధాన్యత ఉండేవి. బెళగావి నుంచి బాగల్‌కోట మార్గంలో అలతి క్రాస్‌కు వెళ్లి కుడివైపు తిరిగి రెండు మైళ్లు దూరంలో ఓ ఊరు కనిపిస్తుంది. రెవెన్యూ అధికారులు ప్రకారం మురగోడ దీనిపేరు. కాగా ప్రజలు నోళ్లలో మాత్రం కన్నడలో బళగల ఊరు (గాజులు ఊరు) అని పిలుచుకుంటారు. ఇక్కడ అఖండ గాజులనే తయారు చేసేందుకు సుమారు 15 బట్టీలు ఉన్నాయి. వీటిపైనే వందలాది కుటుంబాలు ఆధారపడ్డాయి. హైటెక్ ఫ్యాన్సీ గాజులు జోరు మధ్య కూడా అఖండ గాజులు తమ మనుగడను కాపాడుకుంటున్నాయి. ఈ క్రమంలో బెళగావి జిల్లాలో ఎక్కువగా బట్టీలు చెన్నమ్మ కిత్తూరులో ఉన్నాయి. ఇక్కడే కాదు సవదత్తి, అలాగే ధార్వాడ జిల్లా అణ్ణావర తాలూకాలో అరవటిగి, కుంభారకుప్పలో కూడా మట్టి గాజులు తయారు అవుతాయి. వీటిని ప్రారంభంలో లింగాయత్ సామాజిక వర్గం మాత్రమే తయారు చేసేవారు. ప్రస్తుతం మైనార్టీలతో పాటు అన్ని వర్గాలకు చెందిన వారు బట్టీలు నిర్మించుకుని ఈ వృత్తిలో జీవనోపాధి పొందుతున్నారు.

గాజులు తయారీకి ముడిసరుకు

గాజులు తయారీ చేసేందుకు మహారాష్ట్రలోని మీరజ్, పూణె, సతారా, కరాడా నుంచి వీటి ముడిసరుకుని తెప్పించుకుంటారు. ప్రతి క్వింటాళు గాజు ముక్కల ధర రూ.220 ఉంటుంది. ఇక్కడ తయారు చేసిన గాజులను బెళగావి, ధార్వాడ, దావణగెరె నగరాలతో రాష్ట్ర వ్యాప్తంగానే కాకుండా మహారాష్ట్రలో పలు ప్రాంతాల్లో విక్రయిస్తారు. పచ్చ గాజులు కొనుగోళ్లు కోసమే నిర్దిష్టమైన వినియోగదారులు ఉన్నారు.

అంతంత మాత్రంగానే కూలి

నేటి ఆధునిక యుగంలో ఇంటింటికి తిరిగి గాజులు అమ్మేవారు కనుమరుగయ్యారు. కుటీర పరిశ్రమలుగా వెలసిన గాజులు తయారీ చేసే వారికి ప్రభుత్వం నుంచి ఎలాంటి సౌకర్యాలు లభించడం లేదని గాజులు తయారీ చేసే కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గాజులు తయారు చేసే ప్రతి ఇద్దరికి కలిసి రూ.1000లు కూలీ ముట్టచెబుతారు. కార్మికులు అంతంత మాత్రమే చదివిన వారే. మురుగోడు బట్టీలో 30 సంవత్సరాలుగా ఇదే వృత్తిని నమ్ముకున్న వారు ఎంతో మంది ఉన్నారు. వీటినే నమ్ముకున్న వృత్తిపర కార్మికులు చాలా వేడిమి భరించాల్సి వస్తుందని, ఆరోగ్యాలు దెబ్బతింటాయని, దీనిని నమ్ముకున్నాము కాబట్టి, వేరే పని తెలియదు దీంతో జీవనం వెళ్లదీస్తున్నట్లు కార్మికులు చెబుతున్నారు.

కృష్ణమ్మ పరవళ్లు



హువిన హడగలి వంతెన వద్ద జోరుగా ప్రవహిస్తున్న కృష్ణమ్మ



నీటిలో మునిగిపోతున్న గుడ్డ గోళ బసవేశ్వర ఆలయం

- ఆల్మట్టికి భారీ ఇన్‌ఫ్లో
- మునగనున్న ఆలయాలు

రాయచూరు రూరల్: మహారాష్ట్రలో విస్తారంగా వర్షాలు కురుస్తుండటంతో కృష్ణానదికి వరద పోటెత్తుతోంది. దీంతో ఆల్మట్టి డ్యామ్‌కు భారీగా వరద నీరు చేరడంతో డ్యామ్ నుంచి 75 వేల క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. శనివారం యాదగిరి జిల్లా హుణషిగి తాలూకా నారాయణపుర జలాశయం నుంచి 55,150 క్యూసెక్కుల నీటిని నదికి వదిలారు. మహారాష్ట్ర రాజాపూర్ నుండి లక్ష 10 వేల క్యూసెక్కులు, దూద్‌గంగా నది నుండి 40 కూస్యెక్కుల నీరు కృష్ణానదికి వదిలారు. బెళగావి జిల్లా సవదత్తి నవీల్ తీర్థ నుండి 30 వేల కూస్యెక్కుల నీరు, మలప్రభా నుండి 40 వేల కూస్యెక్కుల నీరు వదిలారు. రాయచూరు జిల్లా లింగ సూగురు తాలూకా శీలహళ్లి,హంచినాళ,కడదర గడ్డి,యలగుంది, యరగోడ, జలదుర్గ, దేవదుర్గ తాలూకా కోళూరు, జోళదడగి, గలగ, అణమల్లేశ్వర్, గూగల్, మదరకల్, హువిన హడగలివద్ద వంతెనను ఆనుకుని ప్రవహిస్తున్నాయి. పక్కనే ఉన్న గుడ్డ గోళ బసవేశ్వర ఆలయం మునగనుంది. రాయచూరు తాలుకా అరిషిణగి, గుర్జాపూర్, కాడ్లూరు, కరేకల్, అత్కూరు, డొంగరాంపూర్, నారదగడ్డ, కుర్తకుంద, కురువ కుల, మంగిగడ్డ ప్రాంతాలు నీట మునిగే అవకాశాలున్నాయి. బాగల్‌కోట, విజయపుర, యాదగిరి, రాయచూరు జిల్లా అధికార యంత్రాంగం ముందస్తు చర్యలు చేపట్టింది.

భూ స్వాధీనాన్ని వ్యతిరేకిస్తూ ధర్నా



మాలూరు: గత 40 ఏళ్లుగా సాగు చేస్తున్న భూమిని స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తుండటంతో గ్రామానికి చెందిన రైతులు సర్వే పనులను అడ్డుకుని ధర్నా నిర్వహించారు. మాలూరు తాలూకా రాంపుర గ్రామం వద్ద సర్వే నెంబర్ 89లో తహసీల్దార్, సర్వే అధికారులు వచ్చి సర్వే చేయడాన్ని గ్రామస్తులు తీవ్రంగా ఖండించారు. కెఐఏడీబీకి భూమి స్వాధీనం అయిందని తెలిపి అధికారులు సర్వేకి రావడం సరికాదన్నారు. ఈ సమయంలో రైతులు, అధికారుల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. సర్వే నెంబర్ 89లోని 53 ఎకరాలలో సుమారు వంద మందికి పైగా రైతులు జీవనం సాగిస్తున్నారు. 30 సంవత్సరాల క్రితమే తమకు పట్టా చేసి ఇవ్వాలని దరఖాస్తు చేసుకోవడం జరిగింది. పట్టాల కోసం గతంలో కలెక్టర్ కార్యాలయం వరకు పాదయాత్ర చేశారు. కలెక్టర్‌కు విన్నవించినా ఫలితం కనిపించలేదు. 53 ఎకరాల భూమిని కెఐఏడీబీ స్వాధీనం చేసుకోరాదని రైతులు డిమాండ్ చేశారు.

తుంగభద్ర కళకళ



హొసపేటె: భారీగా వరద నీరు చేరుతుండటంతో తుంగభద్ర కళకళలాడుతోంది. శనివారం డ్యామ్‌కు 1,07198 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరింది. జలాశయం ఎగువన కురుస్తున్న భారీ వర్షాలతో డ్యామ్‌కు వరద పోటెత్తుతోంది. శివమొగ్గ, మొరాళ్లు, తీర్థహళ్లి, శృంగేరి, ఆగుంబే, మంగళూరు తదితర ఉత్తర కన్నడ, దక్షిణ కన్నడ పలు ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వానలకు వరద నీరు వచ్చి చేరుతోంది. ప్రస్తుతం డ్యాంలోకి నీటి మట్టం 1621.32 అడుగులకు చేరుకుంది. ఇక డ్యామ్ నిండేందుకు కేవలం రెండు అడుగులు మాత్రమే ఉంది. నీటినిల్వ 65.110 టీఎంసీలకు చేరుకోగా ఔట్‌ఫ్లో 1267 క్యూసెక్కులు ఉందని మండలి అధికారులు తెలిపారు. ఎగువ నుంచి వరద మరింత పెరిగే సూచనలు ఉన్నాయని, ఏ సమయంలో అయినా డ్యాంకు సంబంధించిన క్రస్ట్ గేట్లను పైకెత్తి దిగువకు నీటిని విడుదల చేసే అవకాశం ఉండటంతో లోతట్టు ప్రాంతాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మండలి అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. డ్యాంకు భారీగా ఆశించిన మేరకు వరద చేరుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

వాల్మీకి మండలి నిధులు లోక్‌సభ ఎన్నికలకా?

- నండూరు ఉప ఎన్నికలో బీజేపీ జెండా ఎగురవేయాలి
- రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై విజయేంద్ర

సాక్షి,బళ్లారి: పేదల సంక్షేమ కోసం ఏర్పాటు చేసిన వాల్మీకి అభివృద్ధి నిగమ మండలి నిధులను కాంగ్రెస్ పార్టీ బళ్లారి లోక్‌సభ ఎన్నికలకు ఖర్చు చేసి గెలవడం సిగ్గు చేటని, అలాంటి కాంగ్రెస్ సర్కార్ తగిన బుద్ధి చెప్పాలని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బీ.వై విజయేంద్ర పేర్కొన్నారు. ఆయన శనివారం జిల్లాలోని సండూరు వండర్ వ్యాలీ రిసార్టులో ఏర్పాటు చేసిన బీజేపీ కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ సర్కార్ జనం సొమ్ముతో సోకులు చేసుకుంటూ లూటీ చేస్తోందని దుయ్యబెట్టారు. ప్రజలు సంక్షేమం కోసం, అభివృద్ధి కోసం కేటాయించిన నిధులను పక్కదారి పట్టించి తమ జేబుల్లోకి నింపుకుంటున్నారని మండిపడ్డారు. అలాంటి కాంగ్రెస్ పార్టీని జనం తిరస్కరించాలన్నారు. సండూరు అభివృద్ధి జరిగిందంటే అది బీజేపీ హయాంలోనే అన్నారు. త్వరలో సండూరు శాసనసభకు ఉప ఎన్నికలు జరిగే అవకాశాలు ఉన్నాయని, బీజేపీ తరపున ఎవరిని అభ్యర్థిగా ప్రకటించినా, కలిసికట్టుగా పనిచేసి విజయం సాధించాలని సూచించారు. కార్యక్రమంలో చిత్రదుర్గం లోక్‌సభ సభ్యుడు గోవింద కారజోళ, మాజీ ఎమ్మెల్యే గాలి సోమశేఖరరెడ్డి, మాజీ ఎంపీ దేవేంద్రప్ప, విధానపరిషత్ సభ్యుడు రవికుమార్, మాజీ ఎమ్మెల్యే సురేష్ బాబు, జిల్లా బీజేపీ అధ్యక్షుడు అనిల్‌కుమార్ మోకా, సండూరు బీజేపీ ఇన్‌ఛార్జి కే.ఎస్ దివాకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మిక, రైతు వ్యతిరేక విధానాలు తగదు

రాయచూరు రూరల్: కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను అనుసరించడం తగదని సంయుక్త పోరాట నేతలు పేర్కొన్నారు. శనివారం టిప్పు సుల్తాన్ ఉద్యానవనంలో ఆందోళన చేపట్టిన సంచాలకులు వీరేష్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ రాష్ట్రంలోని కాంగ్రెస్ సర్కార్ రైతులకు లాభదాయక పంటలకు మద్దతు ధరలు ప్రకటించాలన్నారు. రైతుల వ్యవసాయ రంగంలో వినియోగించే పరికరాలకు జీఎస్టీ నుంచి మినహాయింపు ఇవ్వాలన్నారు. 60 ఏళ్లు పైబడిన రైతులు, కార్మికులకు నెలకు రూ. 10 వేల పెన్షన్ ఇవ్వాలని వినతిపత్రం అందజేశారు.

మహిళా సంక్షేమమే పరమావధి

బళ్లారి రూరల్ : జనాభా నియంత్రణ, మహిళా సంక్షేమమే పరమావధిగా ఫ్యామిలీ ప్లానింగ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఎఫ్.పి.ఏ.ఐ) పనిచేస్తోందని బళ్లారి ఎఫ్.పి.ఏ.ఐ అధ్యక్షుడు టి.జి.విఠల్ తెలిపారు. శనివారం ఉదయం బళ్లారి శాఖలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో మాట్లాడారు. 75 ఏళ్లుగా ఎఫ్‌పీఏఐ సంస్థ దేశవ్యాప్తంగా 46 కేంద్రాల్లో లాభనష్టాల పరిమితి లేకుండా అనేక ప్రయోజిత కార్యక్రమాలను చేపట్టినట్లు తెలిపారు. జనాభా నియంత్రణ, మానవ జీవన ప్రమాణ పెంపు తదితర కార్యక్రమాలను చేపడుతున్నట్లు తెలిపారు. కరోనా సమయంలో అన్ని సంస్థల్లో సేవలు స్తంభించినా ఎఫ్‌పీఏఐ కేంద్రాలు మాత్రం సేవా నిర్వహణ కొనసాగించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా మూడు జై ఎఫ్‌పీఏఐ ఉపాధ్యక్షుడు సిఖని ఎస్ విజయ సింహ మాట్లాడుతూ... ఎఫ్‌పీఏఐ ఇండియా సంస్థను 1949లో ప్రారంభించారని తెలిపారు. నగర,



మాట్లాడుతున్న విజయసింహ

గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలు స్వయం సేవాసంఘాల ద్వారా సబలీకరణ, ఆర్థికాభివృద్ధి లక్ష్యంగా కార్యక్రమాలు చేపట్టినట్లు తెలిపారు.సంస్థ 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా లక్ష మంది మహిళలను గర్భకోశ కేన్సర్ నుంచి రక్షించాలని లక్ష్యంగా పెట్టుకొన్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ చందన ఉపాధ్యక్షురాలు నాగలక్ష్మి మహిళలకు తరచూ వచ్చే గర్భకోశ కేన్సర్‌పై ఉపన్యసించారు. సమావేశంలో విశ్రాంత ప్రాంశుపాలుడు అహరాజ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

తప్పు కప్పిపుచ్చుకోవడానికి దర్యాప్తు సాకు

హుబ్లీ: కాంగ్రెస్ ప్రభుత్వం చేసిన కుంభకోణాలను మూసిపెట్టడానికి సీఎం సిద్దరామయ్య ప్రతిపక్ష నేతలపై దర్యాప్తు సాకుగా చూపుతున్నారని కేంద్రమంత్రి హెచ్‌డీ కుమారస్వామి మండిపడ్డారు. నగరంలో ఆయన మీడియాతో మాట్లాడారు. 2012లో జరిగిన స్కామ్‌ల గురించి సిద్దరామయ్య ప్రస్తుతం మాట్లాడుతున్నారు. 21 కేసుల దర్యాప్తు జరిపి అందరిని జైలుకు పంపిస్తానంటున్న సిద్దరామయ్య ఇంతకు ముందు ఐదేళ్లు అధికారంలో ఉన్నారు. ప్రస్తుతం తిరిగి సీఎంగా పదవి చేపట్టి ఏడాది గడిచింది. ఏడాది నుంచి సిద్దరామయ్య ఏం చేస్తున్నారు. పాలక పక్షం చేసిన తప్పులను మూసిపెట్టడానికి విపక్షాలపై దర్యాప్తు పేరుతో భయపెడుతున్నారన్నారు. వాల్మీకి కార్పొరేషన్ అక్రమాలలో ఆత్మహత్య చేసుకున్న చంద్రశేఖర్ డెత్‌నోట్‌లో మంత్రులు మౌకికంగా ఆదేశం ఇచ్చారని ఆయన ఆ లేఖలో పేర్కొన్నారన్నారు. ఈ విషయం గురించి మంత్రులకు తెలియదా సీఎం ఈ విధంగా దాటవేత సమాధానాలు ఇవ్వడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఈ విధమైనటువంటి పాలనను తాను గాని, ప్రజలను గాని చూడలేదన్నారు.

శాశ్వత నీటి పారుదల సౌకర్యాలను కల్పించాలి

కోలారు: కోలారు, చిక్కబళ్లాపురం జిల్లాల్లో శాశ్వత నీటి పారుదల సౌలభ్యాలను కల్పించడానికి అసెంబ్లీ సమావేశాలలో ఉభయ జిల్లాలకు చెందిన ప్రజాప్రతినిధులు గళం ఎత్తాలని డిమాండ్ చేస్తూ శనివారం శాశ్వత నీటిపారుదల పోరాట సమితి సభ్యులు నగరంలోని బస్టాండు సర్కిల్లో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆందోళకారులు మాట్లాడుతూ... ఉభయ జిల్లాలకు శాశ్వత నీటి పారుదల సౌలభ్యాల కోసం 40 ఏళ్లుగా పోరాటాలు చేస్తున్నామని, ఇంతవరకు నీటి సౌలభ్యాలను అందలేదన్నారు. రెండు జిల్లాలో వందల చెరువులు ఉన్నా ప్రజలకు మాత్రం నీటి సమస్య తప్పలేదన్నారు. అంతర్జల నీటిమట్టం దిగజారి పోయిందని, బోర్లు తోడుతున్నారు. ప్రభుత్వాలు కేసీ వ్యాలీ, హెచ్ఎన్ వ్యాలీ, ఎత్తినహొళె పథకాలను ఏర్పాటుచేసి శాశ్వత నీటిపారుదల సౌలభ్యాలను పూర్తిగా విస్మరించాయని ఆరోపించారు. బయలుసీమ జిల్లాలకు నీటి పారుదల సౌలభ్యాలను కల్పిస్తే జిల్లాలో వంద శాతం నిరుద్యోగ సమస్య పరిష్కార మవుతుందన్నారు. ధర్నాలో ప్రముఖులు ఆర్ ఆంజనేయరెడ్డి, హోళలి ప్రకాష్, కె నారాయణగౌడ, ఈకంబళ్లి మంజునాథ్, జి నారాయణస్వామి, వంబరిజేష్, కోటిగానహళ్లి గణేష్‌గౌడ తదితరులు పాల్గొన్నారు.



ధర్నా నిర్వహిస్తున్న దృశ్యం

నేడు వీరశైవ మహాసభ జిల్లా శాఖ ఎన్నికలు

- హోరాహోరీ ప్రచారం

సాక్షి,బళ్లారి: అఖిల భారత వీరశైవ మహాసభ జిల్లా సమితి సభ్యులు, అధ్యక్ష ఎన్నికలు నేడు ఆదివారం జరగనున్నాయి. మూడు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ ఎన్నికలు ఈసారి రసవత్తరంగా మారాయి. అఖిల భారత వీరశైవ జిల్లా అధ్యక్ష స్థానానికి రెండు బృందాలు పోటీ పడుతున్నాయి. శ్రీ హానగల్ కుమారస్వామి వచన బృందం తరుపున చానాల్ శేఖర్‌తో పాటు మరో 30 మంది సభ్యులు పోటీ పడుతుండగా, సిద్ధగంగ శివకుమార్ స్వామి బృందం తరపున పంచాక్షరప్పలతో పాటు వారి బృందం 30 మంది పోటీ పడుతున్నారు. గత మూడు సంవత్సరాలుగా అధ్యక్ష స్థానంలో కొనసాగుతున్న చానాల్ శేఖర్ ఈసారి కూడా ఆయన అధ్యక్ష రేసులో ఉండగా, పంచాక్షరప్ప బృందం గట్టిగా పోటీ పడుతుండటంతో ఎన్నికలు ఆసక్తిగా తిలకిస్తున్నారు. గత వారం రోజులుగా ఎన్నికల ప్రచారంలో ఇరువురు బృందాలు తీవ్ర ప్రచారం చేసుకున్నారు. జిల్లా సమితికి బళ్లారి తాలూకాలో 4458, కంప్లి తాలూకాలో 534, కురుగోడు 542, సండూరులో 60, సిరుగుప్ప 1554లు మొత్తం జిల్లా వ్యాప్తంగా 7791 మంది ఓటర్లు ఉండగా, బళ్లారితో కంప్లి, కురుగోడు, సండూరు తదితర ప్రాంతాల్లో పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత వెంటనే ఫలితాలు లెక్కింపు చేపట్టనున్నారు.

రిమ్స్ పాలనాధికారిగా దురుగేష్



రాయచూరు రూరల్: రాయచూరు ప్రభుత్వ వైద్యకీయ కళాశాల పరిశోధన సంస్థ (రిమ్స్) పరిపాలనాధికారిగా అదనపు జిల్లాధికారి దురుగేష్‌ను నియమిస్తూ శుక్రవారం రాష్ట్ర సర్కార్ ఉత్తర్వులు జారీ చేసింది. ఆయన స్థానంలో హుబ్లీ–ధార్వాడ బీఆర్టీఎస్ కంపెనీ ఎండీ శివప్పను నియమించింది.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య



యమనూరప్ప

రాయచూరు రూరల్: అప్పుల బాధతో రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన సింధనూరు తాలూకాలో చోటు చేసుకుంది. తాలూకాలోని వెంకటేశ్వర క్యాంప్‌లో యమనూరప్ప (35) క్రిమిసంహారక మందు తాగి మరణించినట్లు పోలీసులు తెలిపారు. శుక్రవారం మధ్యాహ్నం ఈ ఘటన జరిగింది. ఇతనికి ఒక ఎకరాకు పైగా పొలం ఉంది. అందులో పంటలు సాగు చేయడానికి బ్యాంకులతో పాటు ప్రైవేట్ వ్యక్తుల వద్ద అప్పులు లక్షల్లో అప్పులు చేశాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక ఆత్మహత్య చేసుకున్నట్లు తుర్విహాళ పోలీసులు తెలిపారు.

యువకుడిపై హత్యాయత్నం

రాయచూరు రూరల్: పాతకక్షలతో యువకుడిపై మరో యువకుడు హత్యాయత్నం చేసిన ఘటన లింగసుగూరులో చోటు చేసుకుంది. మొహర్రం పండుగ సమయంలో జరిగిన చిన్నపాటి ఘర్షణను మనసులో ఉంచుకుని అమరేశ్ (26)పై సంతోశ్ చాకుతో దాడి చేశాడు. గొంతు, వెన్నెముకకు తీవ్ర గాయాలు కావడంతో అతన్ని ఆస్పత్రికి తరలించారు. మరో వైపు అమరేష్, సంతోష్‌ల మధ్య మూడు నెలల క్రితం గొడవ జరిగి కేసులు నమోదు చేసుకున్నారు.

విద్యార్థులచే వనమహోత్సవం

హొసపేటె: తాలూకాలోని కుడుటినమగ్గి, అంబలి గ్రామ పంచాయతీలలో వనమహోత్సవంలో భాగంగా కొట్టూరేశ్వర్ మహావిద్యాలయం, కన్నడ సంఘం బృందం సహకారంతో 5 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని మహావిద్యాలయం ఎన్‌సీసీ కెడిఐటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని కొట్టూరేశ్వర్ మహావిద్యాలయానికి చెందిన ఎన్‌సీసీ అధికారి బసవరాజ్ మాట్లాడారు. పర్యావరణ సంరక్షణకు విద్యార్థులు పాత్ర ముఖ్యమని తెలిపారు. మొక్కలను నాటడంతో పాటు సంరక్షించాలన్నారు.

వివాహిత అదృశ్యం



రేణుక (ఫైల్)

హొసపేటె: తన కుమార్తె రేణుక ఈనెల 9న అదృశ్యమైనట్లు కూడ్లిగి తాలూకాకు చెందిన నాగరత్నమ్మ అనే మహిళ హొస్పేట్ టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గంగావతిలోని దానాపూర్ హెబ్బాలు గ్రామానికి చెందిన ధర్మపాల్‌తో రేణుకకు 14 ఏళ్ల క్రితం వివాహమైంది. 20 రోజుల క్రితం భర్త ఇంటికి వెళ్లేందుకు హొస్పేట కేఎస్‌ఆర్‌టీసీ బస్టాండ్‌కు వచ్చిన సమయంలో ఆమె అదృశ్యమైందని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

కుమారుని చేతిలో తండ్రి హత్య

హుబ్లీ: చిన్నపాటి విషయానికి తండ్రిని కుమారుడు కర్కశంగా హత్య చేసిన ఘటన హుబ్లీ తాలూకా గిరియాళ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. ఉమేష్ మహదేవప్ప (58), హనుమంతప్ప తండ్రి కొడుకులు. వీరిద్దరు ఉదయం ఇంటి వెనుక పశువుల దొడ్డిలో పనిచేసే విషయమై వాగ్వాదం జరిగింది. ఈ క్రమంలో తండ్రి కుమారుడిని అసభ్యంగా తిట్టాడు. దీంతో తీవ్ర ఆగ్రహంతో హనుమంతప్ప రాడ్‌తో కొట్టడంతో ఉమేశ్ మహదేవప్ప అక్కడికక్కడే మృతి చెందినట్లు హుబ్లీ రూరల్ సీఐ మురుగేశ్ తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

జల్లి క్రషర్‌కు అనుమతి వద్దు

శ్రీనివాసపురం: తాలూకాలోని ఎలవంకి ఫిర్కా బాసాలహళ్లి గ్రామానికి చెందిన సర్వే నెంబర్ 8లో గోమాళంలో కొన్నేళ్లుగా 60 మందికి పైగా రైతులు వ్యవసాయం చేసుకుంటున్నారు. ఈ భూమినే నమ్ముకుని ఎంతో మంది రైతులు ఉన్నారు. అయితే ప్రస్తుతం ఈ స్థలంలో జల్లి క్రషర్‌ను నిర్వహించడానికి కొంతమంది జిల్లా యంత్రాంగానికి దరఖాస్తు చేసుకున్నట్లు తెలిసింది. ఎట్టి పరిస్థితిలోనే ఇక్కడ జల్లి క్రషర్ నిర్వహణకు అనుమతి ఇవ్వరాదని విన్నవించారు.